

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

పేజీలు: 18 + 20 + 32
పేజీల ఆదివారం అనుబంధం



ఆదివారం | 25-2-2018 | వెల: రూ. 6.00 | సంపుటి: 58 సంచిక: 311 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 8.10 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర ఉ. 9.54 తదుపరి ఆరుద్ర; వర్జ్యం: సా. 5.39-7.08; దుర్ముహూర్తం: సా. 4.44-5.31; అమృతఘడియలు: రా. 10.49-12.17; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



నలభై ఏళ్లక్రితం సరిగ్గా నేడు భావినేతకు ఓటేసిన 'చంద్ర'గిరి

ఒక యువకుడు! అతని చుట్టూ మరికొందరు యువకులు! 'అమ్మా... మీ ఓటు నాకే వేయాలమ్మా!' అని ఇంటి ముంగిటకు వచ్చి అడిగారు! 'సరేనయ్యా! ఇంతకీ అభ్యర్థి ఎవరు?' అన్నట్లుగా చూశారు! ఎందుకంటే... అప్పటిదాకా ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరూ అలా ఇంటింటికీ వచ్చి ఓటు అడిగింది లేదు! ఊళ్లో ఓ పెద్ద మనిషి ఇంటికి వెళ్లి... మరో నలుగురు పెద్ద మనుషులను పిలిచి 'మనమే గెలిచేలా చూడండి' అని ఆదేశించడమే! అలాంటిది... స్వయంగా అభ్యర్థే వచ్చి ఓటు అడగడంతో ప్రజలు ఆశ్చర్యపోయారు! మరోరకంగా ఆనందించారు! నలభై ఏళ్ల క్రితం, 1978 ఫిబ్రవరి 25వ తేదీన బ్యాలెట్ బాక్స్‌లో తమ ఓటును నిక్షిప్తం చేశారు. ఆ ఓటర్లు... చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన వారు! ఆ అభ్యర్థి.. చంద్రబాబు నాయుడు! ఆనాటి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడుతున్నపుడు తీసిన ఫొటో ఇది.

నాయకుడు@40

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

యావత్ భారతదేశం నిర్బంధంలో నలిగిపోయిన రోజులవి! ఏడాదిన్నరపాటు కేంద్రం విధించిన 'ఎమర్జెన్సీ' ఉక్కుపాదాల కింద నలిగిన ప్రజాస్వామ్యపు ఆర్తనాదాలవి! రాజకీయ అవసరాలకోసం ఇంత పని చేసిన నాటి ప్రధాని... అనివార్యమైన పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లారు. 1977 మార్చిలో లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. జనతా ప్రభంజనంలో ఇందిరాగాంధీ పార్టీ కొట్టుకుపోయింది. కానీ... విచిత్రంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 42 స్థానాలకుగాను 41 ఎంపీ సీట్లు కాంగ్రెస్ వశమయ్యాయి. జనతా పార్టీ ఒకేఒక్క చోట నెగ్గింది. మరో 11 నెలల్లో... శాసనసభ ఎన్నికలు ఎదుర్కోవాల్సినప్పటికి ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి మారింది. జాతీయ స్థాయిలో ఇందిరాగాంధీ ప్రాబల్యం పడిపోయింది. దేశవ్యాప్తంగా అనేక చోట్ల 'సొంత కుంపట్లు' వెలిగాయి. కాంగ్రెస్ నిలువునా

మిగతా 5వ పేజీలో...

మెగా ఆరంభం

తొలి రోజు 77 ఎంవోయూలు 31 వేల కోట్ల పెట్టుబడులు

- మెగా ప్రాజెక్టులే లక్ష్యంగా భాగస్వామ్య సదస్సు
- పెట్టుబడుల సంబరానికి ఘనంగా శ్రీకారం
- 5 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యం
- వివిధ సంస్థల అధిపతులతో సీఎం వరుస భేటీలు
- తొలి రోజు ఒప్పందాలతో 98 వేల మందికి ఉపాధి
- ఆటోమొబైల్, పర్యాటకంలో కీలక ఒప్పందాలు



భాగస్వామ్య సదస్సు సందర్భంగా లులూ కన్వెన్షన్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య, చంద్రబాబు, సురేశ్ ప్రభు తదితరులు

(విశాఖ సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలో మెగా, భారీ ప్రాజెక్టుల స్థాపనే లక్ష్యంగా.. విశాఖ హార్బర్ పార్కులో సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు శనివారం అట్టహాసంగా మొదలైంది. వరుసగా ముచ్చటగా మూడో ఏడాది పెట్టుబడుల సంబరం మొదలైంది. తొలి రోజే 77 అవగాహన ఒప్పందాల(ఎంవోయూలు)పై ఆయా కంపెనీలు, రాష్ట్రప్రభుత్వం సంతకాలు చేశాయి. వీటి విలువ రూ.31,546 కోట్లు కాగా.. 98,291 మందికి ఉపాధి లభిస్తుందని

మిగతా 15వ పేజీలో...

ఒక్క కాల్ చాలు!

- ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తాం
- నీరు, భూమి, కరెంటిస్తాం
- నిపుణులైన సిబ్బందినీ అందిస్తాం
- సింగిల్ డెస్క్‌తో అనుమతులు
- పెట్టుబడులకు ఏపీనే ఉత్తమం
- ఎంక్వయిరీ చేసుకున్నాకే రండి
- సదస్సులో సీఎం ఉద్ఘాటన 14,15

పరిశ్రమలకు అనుమతుల కోసం..

లైన్‌లో అక్కర్లేదు.. అన్నీ ఆన్‌లైన్‌లోనే!

- వ్యాపారానికి ఆంధ్రా అనుకూలం
- తెలివైనవారు ఇక్కడే ఇన్వెస్ట్ చేస్తారు
- పెట్టుబడిదారులకు వెంకయ్య భరోసా

రాష్ట్ర ప్రతినిధిగా వచ్చా.. ఏపీ తరఫునే సభలో నా ప్రాతినిధ్యం: సురేశ్ ప్రభు

సీమ బిడ్డను కానా?

నేనుండగా అన్యాయమా?

- ఎన్నడూ లేని అభివృద్ధి జరుగుతోంది
- కనీవినీ ఎరుగని రీతిలో నీరిచ్చాం
- అనంతకు కియ కార్ల ఫ్యాక్టరీ తెచ్చాం
- చిత్తూరు జిల్లాకు ఫాక్స్‌కాన్ వచ్చింది
- టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు వ్యాఖ్యలు
- సీమ డిక్లరేషన్ పేరిట బీజేపీ నాటకాలు
- నాలుగేళ్ల తర్వాత గుర్తుకొచ్చిందా?
- కర్నూలులో సుప్రీం బెంచ్, దేశ రెండో రాజధానిగా అమరావతి సాధించండి
- కమలనాథులపై టీడీపీ నేతల విసుర్లు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'రాయలసీమకు అన్యాయం జరుగుతోందని కొందరు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారు. నేను ఉండగా ఎందుకు అన్యాయం జరుగుతుంది? నేను రాయలసీమ బిడ్డను కాదా' అని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రశ్నించారు. శనివారం ఉదయం ఆయన తమ పార్టీ ముఖ్యులు, ఎంపీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో బీజేపీ నేతలు పెట్టిన కర్నూలు డిక్లరేషన్‌ను కొందరు టీడీపీ నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా

మిగతా 5వ పేజీలో...

టాలెంట్ ఉందా గురూ!

ఒక్క చాన్స్ కాదు.. అనేక చాన్స్‌లు రెడీ



- షార్ట్ ఫిలిమ్స్‌తో సత్తా చాటుతున్న యువత
- ప్రతిభ ఉన్నవారికి సినీ పరిశ్రమ రెడ్ కార్పెట్
- కొత్తగా ఆలోచిస్తే అద్భుతమైన భవిష్యత్తు

2

క్రికెట్‌లో మరో చరిత్ర!

మహిళా, పురుష సిరీస్‌ల్లో డబుల్ ధమాకా 17



దుఃఖంలోనూ సుఖం వెతుక్కోవడమే..



లోకంలో చెప్పడం, వినడానికి సంబంధించి మూడు ప్రధాన అంశాలున్నాయి. అవి.. వ్యాకరణం, కవిత్వం, వేదాంతం. వ్యాకరణం.. చెప్పేవాడికీ వినేవాడికీ ఇద్దరికీ కష్టం. కవిత్వం.. చెప్పేవాడికి కష్టం. వినేవాడు సుఖంగా కూర్చుని విని బాగుందనో, బాగాలేదనో చెప్పి వెళ్లిపోతాడు. వేదాంతం ఇద్దరికీ సుఖమే. ఏదైనా చెప్పొచ్చు. ఎక్కడైనా మొదలుపెట్టొచ్చు, ఆపేయొచ్చు. ఎప్పుడైనా వెళ్లిపోవచ్చు. అలా వదిలేయకుండా వేదాంతాన్ని జీవితంలో ఆచరణలో పెట్టినవాడికన్నా సుఖజీవి మరొకడుండడు. అందుకు ముందుగా మన మనసును మన ఆధీనంలోకి తెచ్చుకోవాలి. సుఖానికి పొంగి బోర్లా పడటం, దుఃఖానికి కుంగి కృశించి పోవడం మనసుకు సహజం. అందుకే నిజమైన సుఖం ఎక్కడుందో దానికి తెలియజేయాలి. సుఖాలు, సంతోషాలు సీతాకోకచిలకల్లాంటివి. మనం వాటివెనుక పరుగెత్తినంతసేపూ మరింత దూరంగా ఎగిరిపోతుంటాయి. ఆ పరుగు మాని కూర్చుంటే వచ్చి మనమీద వాలుతాయి. కష్టం సంగతి మరో రకం. నిజానికి మనం కష్టం అనుకునే ప్రతిదాంట్లో ఏదో ఒక సుఖం ఉంటుంది. ఉదాహరణకు ఏదో ప్రమాదంలో కాలు విరిగిందనుకుందాం. ఆస్పత్రిలో చేర్చి ఆపరేషన్ చేశారు. 3 నెలలు విశ్రాంతి అవసరమన్నారు. ఆ మూణ్నెల్లూ.. 'నాకు కాలు విరిగింది.. కాలు విరిగింది' అని ఏడుస్తూ కూర్చోవడం వల్ల అది అతుక్కోదు. కానీ, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుని.. అదివరకు చదవలేకపోయిన పుస్తకాలు చదవచ్చు. కావలసిన వాళ్లతో హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు. కష్టంలో సుఖం వెతుక్కోవడమంటే ఇదే. ఇలా ఆలోచించగలిగితే మనిషి నిత్యమూ సుఖంగానే ఉంటాడు. ఉన్నది ఉన్నట్లు ఒప్పుకోగలిగే మానసిక పరిపక్వత సాధించగలగడమే వేదాంతం నేర్చుకొన్నందుకు నిజమైన ఫలం. అప్పుడు జీవితమంతా వేదాంతభావనా మధురమై జీవన్ముక్తులం అవుతాం.

-గరికిపాటి నరసింహారావు

Paramjyothi పరంజ్యోతి

టాలెంటు ఉందా గురూ!

ఒక్క చాన్స్.. ఒకే ఒక్క చాన్స్ ప్లీజ్' ..అంటూ సినీ పరిశ్రమ చుట్టూ తిరిగే రోజులు పోయాయ్!

'అ!' అనిపించే టాలెంట్ ఉంటే.. వెండి తెర వేల్పులు యువతకు బంగారుపీట వేసి మరీ అవకాశాలిచ్చే రోజులొచ్చాయ్!!

డైరెక్టర్ల చుట్టూ కాళ్లరిగేలా తిరగక్కర్లేదు! అసిస్టెంట్ డైరెక్టర్లను కాకా పట్టక్కర్లేదు!! అదిరిపోయే షార్ట్ ఫిల్మ్ ఒక్కటి తీసి నెట్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు. థ్రిల్లర్ తీస్తే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అవ్వాలి! లవ్ స్టోరీ అయితే 'అరె.. భలే కొత్తగా తీశాడ్రా' అనిపించాలి!! మెలో డ్రామాలో గుండెలు పిండే డైలాగులు.. మొత్తంగా కథలో కొత్తదనం.. ఉంటే చాలు అవకాశం తన్నుకుంటూ దానంతటదే వస్తుంది. ఏం డౌటా? అక్కర్లేదు. హీరో రాజ్‌తరుణ్ నుంచి 'ఘాజీ' సంకల్ప్ రెడ్డి దాకా.. 'పెళ్లి చూపులు' తరుణ్ భాస్కర్ నుంచి 'నిన్ను కోరి' శివ నిర్వాణ, 'సైలెంట్ మెలొడీ' ప్రశాంత్ వర్మ దాకా.. సినీ పరిశ్రమలోకి వెల్లువెత్తిన కొత్త నీరంతా అలాంటి ప్రవాహమే!! ఇదే ప్రశాంత్ వర్మ ఒక 20 ఏళ్ల ముందు పుట్టి ఉంటే.. ఇంత టాలెంట్ ఉన్నా బహుశా ఏ కృష్ణానగర్‌లోనో, ఇందిరానగర్‌లోనో మకాం వేసి చాన్సుల కోసం తిరుగుతూ ఉండేవాడేమో. కానీ, ఇప్పుడున్న టెక్నాలజీ అతడి టాలెంట్‌కి రాచబాట వేసింది. ఇలా సెలబ్రిటీలే కాదు.. సామన్యులు సైతం కాస్తంత టాలెంట్ ఉంటే యూట్యూబ్‌లో పాపులర్ అవుతున్నారు. అద్భుతమైన టాలెంట్ ఉన్నవారు సెలబ్రిటీలూ అయిపోతున్నారు!

నలుగురు కలిస్తే ఓ షార్ట్ ఫిల్మ్



ఇద్దరు కుర్రాళ్లు కలిస్తే మొన్నటి వరకూ ఏ సినిమా చూశావని మాట్లాడుకునేవారు! ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. యూ-ట్యూబ్‌లో ఏ షార్ట్ ఫిల్మ్ చూశావ్? నెట్‌ఫ్లిక్స్‌లో ఏ వెబ్ సిరీస్ చూశావని మాట్లాడుకుంటున్నారు. అంతే కాదు.. నలుగురు కలిసి ఓ షార్ట్ ఫిల్మ్ తీసేస్తున్నారు. ఒకరు స్క్రిప్ట్, మరో ఫ్రెండు డైరెక్టర్, ఇంకో దోస్త్ కెమెరా మ్యాన్! నాలుగోవాడు హీరో! తమ బ్యాచ్‌లోని అమ్మాయే హీరోయిన్! రోజుకి రూ.1500 పెడితే 5డీ కెమెరా అద్దెకు దొరుకుతుంది. ఎంత రోడ్డుమీద షూటింగ్ చేసినా.. కేవలం డైలాగులు మాత్రమే రికార్డు అయ్యే టెక్నాలజీ వచ్చేసింది. ల్యాప్‌టాప్‌లోనే ఎడిటింగ్! కంటెంట్‌లో ఏమాత్రం దమ్మున్నా..యూ-ట్యూబ్‌లో లక్షల వ్యూస్! కొందరు చాలా ప్రొఫెషనల్ షార్ట్ ఫిల్మ్స్ తీస్తున్నారు. విభిన్న కథాంశాలతో తక్కువ బడ్జెట్‌లోనే అద్భుతమైన క్వాలిటీతో పొట్టి సినిమాలు రూపొందిస్తున్నారు. తెలుగు షార్ట్ ఫిల్మ్స్‌లో ప్రేమకథలు మిలియన్ వ్యూస్ దాటడం సర్వసాధారణంగా మారింది. తెలుగులో వెబ్ సిరీస్‌లకు ఆదరణ పెరుగుతోంది. గీతా సుబ్రమణ్యం, ముద్దపప్పు అవకాయ్, హమ్‌తుమ్, మన ముగ్గురి లవ్‌స్టోరీలకు మంచి స్పందన వచ్చింది. తండ్రి నాగబాబు -కూతురు నిహారిక నటించిన నాన్న కూచి వెబ్ సిరీస్ ట్రైలర్‌కే ఎంతో రెస్పాన్స్ వచ్చింది. ఇక వర్మ అంతటి క్రియేటివ్ డైరెక్టరే యూ-ట్యూబ్‌ని నమ్ముకున్నాడు. మొన్నటి సన్నిలియోన్ దగ్గర్నుంచి 'జీఎస్టీ' వరకూ డిజిటల్ టెక్నాలజీకే జయహో అంటున్నాడు.

'అ!'లా మొదలైంది



ఇంజినీరింగ్ చదువుతూ సరదాగా మ్యూజిక్ వీడియోలు తీసిన నేను.. టాలీవుడ్ డైరెక్టర్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదు. ఎనిమిదేళ్ల క్రితం 'దీనమ్మ జీవితం' అనే షార్ట్ ఫిల్మ్ తీశాను. ఆర్కుట్ రోజుల్లోనే దానికి 10 లక్షల వ్యూస్ వచ్చాయి. ఓరోజు కథ చెప్పడానికి కాఫీ షాప్‌కి వెళ్లాను. అక్కడ మాటలురాని యువకుడు చేతి వేళ్లను కదుపుతూ భార్యతో మాట్లాడుతున్నాడు. ఆ సందర్భంలోంచి పుట్టిందే 'ఏ సైలెంట్ మెలొడీ' షార్ట్ ఫిల్మ్! హీరో సందీప్ కిషన్ ఈ షార్ట్ ఫిల్మ్‌ను నిర్మించారు. అది నన్ను వెస్టిండీస్ క్రికెట్ లిజెండ్ బ్రియాన్ లారాకు చేరువ చేసింది. అలాగే.. నేను తీసిన 'డైలాగ్ ఇన్ ద డార్క్' షార్ట్ ఫిల్మ్ చూసి హీరో నాని ఫోన్ చేసి మాట్లాడారు. తర్వాత కొద్ది రోజులకు 'అ' సినిమా కథ ఆయనకు చెప్పాను. తానే నిర్మాతగా మారి దర్శకుడిగా నాకు అవకాశమిచ్చారు. ఇలా సినీ పరిశ్రమలో మంచి అవకాశానికి షార్ట్ ఫిల్మ్స్ నాకెంతో ఉపయోగపడ్డాయి. ఎన్నేళ్లు ఎవరి దగ్గర పనిచేశావని ఇప్పుడు ఎవ్వరూ అడగడం లేదు. నీ లేటెస్ట్ షార్ట్ ఫిల్మ్ ఏమిటని అడుగుతున్నారు. కొత్త టాలెంట్‌ని గుర్తించడానికి ఈ బుల్లి సినిమాలు ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు ప్రతి నిర్మాణ సంస్థా.. షార్ట్ ఫిల్మ్స్ చూసి కొత్తవారిని ప్రోత్సహించడానికి ఓ వ్యవస్థను ఏర్పాటుచేస్తోంది. సిల్వర్ స్క్రీన్‌కు షార్ట్ ఫిల్మ్స్ రహదారిగా మారాయి.

-ప్రశాంత్ వర్మ, 'అ!' దర్శకుడు



అటెన్షన్ ఈజీ అయింది

సినిమా తీయాలంటే కొన్ని ప్రత్యేకమైన స్కిల్స్ కావాలనీ..కొందరికే అవి ఉంటాయనుకుంటూ చాలామంది ఇండస్ట్రీలోకి వచ్చేవారు కాదు. ఇప్పుడా అపోహలు తొలగిపోయాయి. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే టాలెంట్ ఉంటే ఎవ్వరైనా అవకాశాలను అందుకోగలరు. సరైన మార్గంలో ప్రతిభను ప్రదర్శిస్తే ప్రపంచం దృష్టిని ఆకర్షించడం కష్టం కాదు! మలయాళీ టీనేజర్ ప్రియా ప్రకాష్ కన్నుగీటే వీడియో మిలియన్ల వ్యూస్‌తో ఎలా దుమ్మురేపుతోందో మనం చూస్తున్నాం! 'వై దిస్ కొలవరి' పాట ఇలాగే వైరల్ అయింది. సోషల్ మీడియా వచ్చిన తర్వాత అటెన్షన్ డ్రా చేయడం తేలికయింది. షార్ట్ ఫిల్మ్‌లతో దర్శకులుగా మారిన వారు టాలీవుడ్‌లో చాలామంది ఉన్నారు. తరుణ్ భాస్కర్, శివ.. షార్ట్ ఫిల్మ్స్ నుంచి వెండి తెరకు వచ్చినవారే! దర్శకులు, రచయితలు, నటీనటులు ఇలా 2011 నుంచి యంగ్ టాలెంట్ పెరుగుతోంది. అయితే నిలదొక్కుకోవాలంటే మాత్రం కంటెంట్ ఉండాల్సిందే!

-సందీప్‌రెడ్డి వంగా, అర్జున్‌రెడ్డి దర్శకుడు

రోజుకు సగటున 200 షార్ట్ ఫిల్మ్స్

యూట్యూబ్‌లో సగటున రోజుకి 200 తెలుగు షార్ట్ ఫిల్మ్ లు అప్‌లోడ్ అవుతున్నాయంటే.. కొత్త టాలెంట్‌కు సోషల్ మీడియా ఎలా లాంచింగ్ ప్యాడ్‌గా మారుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఎవ్వరి చుట్టూ ఫైళ్లు పట్టుకుని తిరగక్కర్లేదు.. గాడ్ ఫాదర్లు అక్కర్లేదు. ఒక్క షార్ట్ ఫిల్మ్‌తో ఫిల్మ్ ఇండస్ట్రీ మీ కోసం వెతుక్కుంటూ వస్తుంది. యూట్యూబ్‌లో ఒక్క వీడియో వైరల్ అయితే.. ప్రపంచమంతా మీ కోసం గూగుల్‌లో వెతుకుతుంది. రిలీజ్‌కు థియేటర్ల సమస్య లేదు.. నిమిషాల్లో ప్రపంచమంతా షేర్ అయిపోతుంది. ఇప్పుడు ఏ దర్శకుడైనా.. షార్ట్ ఫిల్మ్‌లోని ప్రతిభ ఆధారంగానే అసిస్టెంట్‌గా అవకాశం ఇస్తున్నారు. అందుకే కాలేజ్ నుంచే కుర్రాళ్లు కెమెరాలు ఎక్కుపెడుతున్నారు. గిరిజన తండాలోని గంగవ్వ, అంజవ్వ 'మై విలేజ్ షో' వంటి వెబ్ సిరీస్‌లతో దుమ్మురేపుతున్నారు. అర్థమైందిగా..ఇప్పుడు మిమ్మల్ని తొక్కేసేవాడు లేడు! మీకు మీరే పోటీ! మీలోని క్రియేటివిటీయే పెట్టుబడి! 'బిజినెస్ మ్యాన్'లో మహేష్ బాబు చెప్పినట్టు.. మీ కంటే తోపులు ఎవరూ లేరిక్కడ! కొడ్తే దిమ్మ తిరిగి పోవాలంతే!!

షార్ట్ ఫిల్మ్స్‌తో సినీ అవకాశాలు

ఇటీవల 'మహర్షి' అనే షార్ట్ ఫిల్మ్ తీశాను. సినీ పెద్దల అభినందనలు అందుకున్నాను. డిఫరెంట్ కథాంశంతో త్వరలో 'మల్లెపువ్వు' అనే మరో షార్ట్ ఫిల్మ్ విడుదల చేస్తున్నాను. సినీ పరిశ్రమలో అవకాశాలకు షార్ట్ ఫిల్మ్స్ ఉపయోగపడతాయి. అందుకే ఇష్టమొచ్చినట్టు తీయకూడదు. యూ-ట్యూబ్‌లో వ్యూస్ మాత్రమేకాదు.. క్వాలిటీ కూడా చాలా ముఖ్యం!

-స్వరూప్, షార్ట్ ఫిల్మ్ మేకర్

షార్ట్ ఫిల్మ్ పంపమని అడుగుతా

ఆస్ట్రేలియాలో ఫిల్మ్ స్కూల్లో చదువుకున్నప్పుడు ఐఫోన్‌తో కొన్ని షార్ట్ ఫిల్మ్స్ తీశాను. వాటిని చూసి నా తప్పొప్పులు బేరీజు వేసుకునేవాడిని! 'ఘాజీ' సక్సెస్ తర్వాత.. చాలామంది టెక్నీషియన్లు నా దగ్గరకు అవకాశాల కోసం వస్తున్నారు. అంతవరకూ వాళ్లు ఎవరి దగ్గర పనిచేశారు? ఎన్నేళ్ల అనుభవం ఉందో నేను పట్టించుకోను. మీరు తీసిన షార్ట్ ఫిల్మ్ పంపమని అడుగుతాను. కథను ఎలా నడిపించారు..నేరేషన్, క్వాలిటీ, ఎలాంటి షాట్స్ తీశారో చూస్తాను. వాటి ఆధారంగానే నా దగ్గర పనిచేసే అవకాశం ఇస్తాను. నేనే కాదు ఇప్పుడు చాలామంది డైరెక్టర్లు ఇలాగే చాన్సులు ఇస్తున్నారు. తెలిసినవాడని ఎవ్వరూ అవకాశాలు ఇవ్వడం లేదు.

-'ఘాజీ' ఫేమ్ సంకల్ప్ రెడ్డి, దర్శకుడు



'సినివారం'.. ఇట్స్ ఏ బ్రాండ్

రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ఆడిటోరియం ప్రతి శనివారం కొత్త టాలెంట్‌తో కళకళలాడుతూ ఉంటుంది. తెలంగాణ భాషా-సాంస్కృతికశాఖ చేపట్టిన 'సినివారం' కార్యక్రమం ఎంతోమంది ఔత్సాహిక దర్శకులు, టెక్నీషియన్లు, నటీనటులకు వేదికవుతోంది. తెలంగాణ సంస్కృతి, మానవీయ విలువలు, సామాజికాంశాలతో రూపొందిన షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలను ఇక్కడ ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. 'పెళ్లి చూపులు' చిత్ర దర్శకుడు తరుణ్ భాస్కర్ తొలి షార్ట్ ఫిల్మ్ 'సైన్మా' ఇక్కడే ప్రదర్శితమయింది. ఘాజి దర్శకుడు సంకల్ప్ రెడ్డి, 'అప్పట్లో ఒకడుండేవాడు' చిత్ర దర్శకుడు సాగర్ చంద్ర, నిన్ను కోరి దర్శకుడు శివ నిర్వాణ తదితరుల చిట్టి చిత్రాల స్క్రీనింగ్ 'సినివారం'లో జరిగింది. మామిడి హరికృష్ణ నేతృత్వంలో 'సినివారం' స్క్రీనింగ్ అంతర్జాతీయ ప్రమాణాలతో జరుగుతోంది. ఆన్‌లైన్‌లో అందిన షార్ట్ ఫిల్మ్‌లను కమిటీ పరిశీలించి వైవిధ్యంతో కూడిన చిత్రాలను ఎంపిక చేస్తుంది. ప్రతి శనివారం ఉచితంగా 3 షార్ట్ ఫిల్మ్స్ స్క్రీనింగ్‌తోబాటు.. వాటి దర్శక నిర్మాతలు టెక్నీషియన్లను తెలంగాణ భాషా-సాంస్కృతికశాఖ సత్కరిస్తుంది. అనంతరం ఆ చిత్రంపై చర్చ జరుగుతుంది. ఫిల్మ్ ఇండస్ట్రీకి షార్ట్ ఫిల్మ్ 'గేట్ వే'లా మారిన నేపథ్యంలో.. ప్రతి రెండో శనివారం 'టాక్ ఎట్ సినివారం' పేరుతో సినీ ప్రముఖులతో ఔత్సాహిక దర్శకులు మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. శేఖర్ కమ్ముల, సందీప్‌రెడ్డి, మహిళా గీత రచయిత శ్రేష్ఠ తదితరులు తమ అనుభవాలను షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌తో పంచుకుంటున్నారు.




ఏడాదిలో 15 మంది దర్శకులు

ప్రజలను ప్రభావితం చేసేది ఏదైనా కళే! సంగీతం, నృత్యం, నాటకం, కవిత్వం మాదిరిగానే సినిమా కూడా సంస్కృతిలో భాగమని నమ్ముతున్నాం. సినిమా సంస్కృతిలో భాగమని భావిస్తేనే దర్శక నిర్మాతలు బాధ్యతతో ఆలోచింపజేసే సినిమాలు తీస్తారు. తెలంగాణలో యువ ప్రతిభను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో 2015లో బతుకమ్మ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాం. రవీంద్రభారతిలో పాతికేళ్లుగా బూజుపట్టి ఉన్న ఫిల్మ్ స్క్రీనింగ్ రూమ్‌ను అత్యాధునిక ఆడిటోరియంగా తీర్చిదిద్దాం! ఇక్కడే రెండేళ్ల క్రితం ప్రారంభమైన 'సినివారం' యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు వేదికయింది. వారి షార్ట్ ఫిల్మ్స్ ఉచితంగా ప్రదర్శించడంతోబాటు.. తమ టాలెంట్‌పై వారికి నమ్మకం కల్గించింది. మరో ఏడాదిలో 'సినివారం' నుంచి కనీసం 15 మంది దర్శకులు సినీ పరిశ్రమకు పరిచయం అయ్యే అవకాశముంది. సినిమా లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉండాలో.. ఎలాంటి కథలను ఎంచుకోవాలో వివరిస్తూ..ప్రతి ఆదివారం 'సండే సినిమా' పేరుతో విదేశీ సినిమాలను ప్రదర్శిస్తున్నాం. ఔత్సాహిక సినీ టెక్నీషియన్లకు ప్రపంచ సినిమాను పరిచయం చేయడం కోసం ఫిబ్రవరిలో 5 రోజులపాటు ఇరాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం. బాలల చిత్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

-మామిడి హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర భాషా-సాంస్కృతిక శాఖ సంచాలకులు





త్వరగా గుర్తింపు

ఫిల్మ్ ఇండస్ట్రీలో సహాయ దర్శకులుగా ఏళ్లకు ఏళ్లు పనిచేసినా అవకాశం వస్తుందన్న నమ్మకం లేదు. కానీ షార్ట్ ఫిల్మ్ మేకర్‌గా మూడేళ్లు కష్టపడితే ఇండస్ట్రీ గుర్తిస్తుంది. ఇందులో మనం నష్టపోయేది పెద్దగా లేదు. కాబట్టి, సమాజానికి ఉపయోగపడే కథలతో షార్ట్ ఫిల్మ్స్ తీయాలని భావిస్తున్నాను.

- గంగాధర్ అద్వైత, షార్ట్ ఫిల్మ్ మేకర్

రొటీన్ కథలు వద్దు

రవీంద్రభారతిలోని 'సినివారం'లో నా షార్ట్ ఫిల్మ్ 'కాకి పడగల కథ' ప్రదర్శించారు. ఆ తర్వాత 'నీది నాది ఒకే కథ', 'అప్పట్లో ఒకడుండేవాడు' సినిమాల్లో అసోసియేట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చింది. చాలామంది రొటీన్ కథలతో షార్ట్ ఫిల్మ్స్ తీస్తున్నారు. కమర్షియల్‌గా హిట్ అయినా వాటివల్ల అవకాశాలు రావు. విభిన్నంగా ఆలోచించినప్పుడే సినీ పరిశ్రమ గుర్తిస్తుంది.

-అక్షరకుమార్, షార్ట్ ఫిల్మ్ మేకర్

సండే స్పెషల్


లోకం తీరు



ఊడ్చటానికి లేకుండా ఇంట్లో ఉన్న చీపుర్లు అన్నీ పట్టుకెళ్లారండి!!

పగలు ఎండ, రాత్రి చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావంతో వాయువ్య గాలులు వీస్తున్నాయి. దీంతో కోస్తా, రాయలసీమల్లో చలి వాతావరణం నెలకొంది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 15 డిగ్రీలు నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో రాత్రి ఉష్ణోగ్రతలు ఇదే మాదిరిగా నమోదుకానున్నాయి. అదే సమయంలో పగటి పూట ఎండ తీవ్రత పెరిగింది. ఆకాశం నిర్మలంగా వుండడంతో మధ్యాహ్నానికి కొన్నిచోట్ల ఎండ ప్రభావం ఎక్కువగా వుంది. కర్నూలులో 36 డిగ్రీలు నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణశాఖ తెలిపింది.



పారిస్ ఒప్పందంతో భారత్, చైనాలకే మేలు

పారిస్ ఒప్పందంలో భారత్, చైనాలే ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయి. ఈ ఒప్పందం నుంచి వైదొలగాలనే తన నిర్ణయానికి ఆ రెండూ దేశాలే కారణం. ఇందులో కొనసాగితే అమెరికాకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



నన్ను ఎన్‌కౌంటర్ చేసేందుకు కుట్ర

నా ప్రాణాలకు ముప్పు ఉంది. నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారేమో? నన్ను ఎలా చంపాలనే అంశంపై గుజరాత్ సీనియర్ పోలీసు అధికారులు కుట్ర పన్నుతున్నారు.

- దళిత ఉద్యమకారుడు, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ

పచ్చదనంతో పిల్లల మెదడుకు హాయి

లండన్, ఫిబ్రవరి 24: పిల్లల్ని పచ్చదనం ఎక్కువగా ఉండే పార్కుల్లో తిప్పడం వల్ల వారు చురుగ్గా ఉండటం గమనిస్తూనే ఉంటాం. ఇంటి చుట్టూ చెట్లు, పచ్చని వాతావరణం ఉంటే వాళ్ల మెదడు ఎదుగుదలకు మంచిదట. ఇది స్పెయిన్‌లోని బార్సెలోనా ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ శాస్త్రవేత్తలు అంటున్న మాట. పచ్చదనం వల్ల మెదడులో ఉండే తెల్లని, బూడిద రంగు పదార్థం ఎక్కువగా అవుతుందని, దానితో పిల్లల మెదడు ప్రశాంతంగా ఉండి, జ్ఞాపకశక్తి పెరగడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు. 253 మంది పాఠశాల విద్యార్థులను ఎమ్మారై స్కానింగ్‌తో పరీక్షించగా పచ్చదనంలో నివసించేవాళ్లలో మెదడు ఎదుగుదల బాగుందని గుర్తించామని తెలిపారు.



సంతానోత్పత్తి కాలాన్ని పెంచే ఔషధం

వాషింగ్టన్, ఫిబ్రవరి 24: మహిళలు 30 ఏళ్లు దాటినప్పటి నుంచి మెల్లిగా అండాల ఉత్పత్తి తగ్గుతుంది. దానివల్ల పిల్లల్ని కనడం కొందరికి సాధ్యం కాదు. గర్భస్రావం, పిల్లలు జన్యు లోపాలతో పుట్టడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. దీనికి అండం అనారోగ్యంగా ఉండడమే కారణం. అయితే, అండాశయంలో అండాన్ని మూడు నుంచి ఆరేళ్ల పాటు ఆరోగ్యంగా ఉంచి, సంతానం కలగడానికి ఉపయోగపడే ఔషధాన్ని అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ మందుతో ఎలుకల్లో సంతానోత్పత్తి కాలం పెరిగినట్లు గుర్తించామని, మనుషుల్లోనూ ఫలితం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



తిరుమలలో సుప్రీం న్యాయమూర్తి
జస్టిస్ అభయ్‌మనోహర్

తిరుమల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్‌మనోహర్ శనివారం తిరుమల చేరుకున్నారు. పద్మావతినగర్ వద్ద రిసెప్షన్ అధికారులు శ్రీధర్, లక్ష్మీనారాయణయాదవ్ న్యాయమూర్తికి స్వాగతం పలికి వసతి ఏర్పాట్లు చేశారు. జస్టిస్ అభయ్‌మనోహర్ రాత్రికి తిరుమలలోనే బసచేసి ఆదివారం ఉదయం స్వామివారి సేవలో పాల్గొననున్నారు. కాగా, మారిషస్ ఉపాధ్యక్షుడు పరమశివపిళ్లై కూడా ఆదివారం స్వామిని సేవించుకునేందుకు శనివారం తిరుమల చేరుకున్నారు.

అప్పన్న సన్నిధిలో జస్టిస్ నాగార్జునరెడ్డి



సింహాచలం, ఫిబ్రవరి 24: సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం రాత్రి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు ఆశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

రెవెన్యూలో సర్వే విలీనం!

కసరత్తు మొదలు.. వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పునర్‌వ్యవస్థీకరణ మొదలైంది. రెవెన్యూ, దాని అనుబంధ విభాగాలను విలీనం చేసి ఒకే గొడుకు కిందకు తీసుకువచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. తొలుత సర్వే విభాగాన్ని పునర్‌వ్యవస్థీకరించి దాన్ని పూర్తిగా రెవెన్యూలోనే విలీనం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి ఏయే అంశాలను ప్రాతిపదికగా తీసుకోవాలన్నదానిపై నివేదికను రూపొందించారు. అయితే, ఈ విషయం తెలిసి ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. రెవెన్యూలో చేరేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయమై ఆందోళనలకు దిగుతున్నారు. సర్వే శాఖకు స్వయం ప్రతిపత్తిని కల్పించి మరింతగా బలోపేతం చేయాలని కోరుతున్నారు.



ఇలా మొదలైంది..

గత ఏడాది అక్టోబరులో ప్రభుత్వం జీవో 2432 జారీ చేసింది. ప్రభుత్వంలో ఆయా శాఖలను 7 కేటగిరీల కింద విభజించి వాటిని పునర్ వ్యవస్థీకరించేందుకు కసరత్తు చేపట్టాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు 23న జరిగిన 7 సెక్టార్ల సమన్వయ సమావేశంలో రెవెన్యూ అంశాలపై చర్చ జరిగింది. సర్వేను రెవెన్యూలో విలీనం చేయాలని, విపత్తు నిర్వహణ శాఖ వ్యవహారాలు పూర్తిగా భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) ద్వారానే నడిచే చూడాలని ప్రతిపాదనలు రూపొందించారు. వీటిపై ఆ సమావేశంలో ఉన్నతాధికారులనుంచి ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఈ నిర్ణయంపై సర్వే ఉద్యోగుల సంఘం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 1977, నవంబరు 4న 1438 జీఓ ద్వారా సర్వేను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు అది రెవెన్యూలో అతర్భాగంగానే ఉంది. దానికి ప్రత్యేక డైరెక్టర్, పాలనా సిబ్బంది ఉన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి సిబ్బంది ఉన్నారు. అయితే, ఈ శాఖను బలోపేతం చేయాలని, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేపట్టాలన్న సిఫారసులు బుట్టదాఖలయ్యాయి. సర్వే శాఖపై సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కూడా ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. సర్వేలో కనీసం 3500 మంది సర్వేయర్లు ఉండాలని, మండల స్థాయి నుంచే ఈ శాఖను బలోపేతం చేయాలని ఐదేళ్ల కిందటే సిఫారసులు చేసింది. వాటిని కూడా అమలు చేయలేదు. పైగా, సర్వేలో 773 పోస్టులు భర్తీచేయాలన్న ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత వాటిని సమీక్ష పేరిట 270కి కుదించారు. దీనిపై సర్వే ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాష్ట్ర విభజన అనంతరం సర్వేలోని 2 జాయింట్ డైరెక్టర్ పోస్టులు తెలంగాణకే వెళ్లాయి. ప్రస్తుతం 713 మంది సర్వేయర్లు పనిచేస్తున్నారు. తమ శాఖను బలోపేతం చేయాలని ఉద్యోగులు కోరుతుండగా.. ఇప్పుడు సమీక్ష పేరిట వారిని రెవెన్యూలో విలీనం చేయాలన్న కసరత్తు మొదలయ్యేసరికి సర్వేలో అగ్గిరాజుకుంది. ఉద్యోగులు ఆందోళకు సిద్ధమవుతున్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబను కలిసి తమ శాఖను రెవెన్యూలో విలీనం చేయవద్దని, స్వయంప్రతిపత్తిని కొనసాగించి బలోపేతం చేయాలని కోరారు. విలీనానికి ఓకే చెబుతున్న రెవెన్యూ అధికారి నేతృత్వం వహిస్తున్న ఉద్యోగుల జేఏసీ నుంచి సర్వే ఉద్యోగుల సంఘం బయటకొచ్చింది. విలీనానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని సంఘం నేతలు చెబుతున్నారు.

హైడ్రోజన్ రైలు తయారీకి ఒప్పందం

అమరావతి ఎస్‌ఆర్‌ఎం, ఐసీఎఫ్ మధ్య సంతకాలు

- వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తి
- ఒక ఇంజను రెండు బోగీలు
- గంటకు 75 కి.మీ. వేగం లక్ష్యం

నీరుకొండ (మంగళగిరి రూరల్), ఫిబ్రవరి 24: దేశంలోనే మొదటిసారిగా హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలు తయారీపై తొలి అడుగు పడింది. ఏపీ అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, చెన్నై ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్) మధ్య శనివారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ఏపీ అమరావతి ఎస్ఆర్ఎం ప్రొ వైస్‌చాన్సలర్ డాక్టర్ నారాయణరావు, ఐసీఎఫ్ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ చంద్రశేఖర్‌లు సంతకాలు చేశారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో ఐసీఎఫ్ ఇంజనీర్లు, ఎస్ఆర్ఎం గ్రూపు విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలు తయారీ ప్రాజెక్టులో పాలుపంచుకుంటారని ప్రొఫెసరు నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రాజెక్టులో ఒక ఇంజన్‌తో పాటు రెండు బోగీలు ఉంటాయి. ఒక్కో బోగీలో 65 మంది ప్రయాణించే సదుపాయం ఉంటుంది. గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి లేక ఏప్రిల్ నాటికి పూర్తిచేసి, ప్రయోగాత్మకంగా ఐసీఎఫ్‌లో నడుపుతారు. వచ్చే ఏడాది డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తారు. రైలింజను అడుగుభాగాన కంప్రెస్ చేయబడిన హైడ్రోజన్‌తో కూడిన 6 ట్యాంకుల ఏర్పాటు చేస్తారు. ఒక్కో ట్యాంకు 0.4 వ్యాసంతో 4 మీటర్ల పొడవు, 60 కిలోల హైడ్రోజన్ ఉంటుంది. డీజిల్, విద్యుత్‌తో నడిచే రైళ్ల నిర్వహణ కన్నా హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలు నిర్వహణ చాలా తక్కువగా ఉంటుందని, ఏ విధమైన కాలుష్య కారక కార్బన్ డైఆక్సైడ్ విడుదల కాదని నారాయణరావు వివరించారు.


ఎంవోయూపై సంతకాలు చేస్తున్న నారాయణరావు, చంద్రశేఖర్

త్రికోటేశ్వరునికి భువనేశ్వరి ప్రత్యేక పూజలు



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24 : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండను ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా త్రికోటేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణ అధికారి బైరాగి ఆమెకు సాదర స్వాగతం పలికారు. పూజల అనంతరం పర్యాటక కేంద్రంలో ఉన్న అక్వేరియం, జింకల పార్కు, మార్గమధ్యంలో ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను భువనేశ్వరి తిలకించారు. శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు కూడా త్రికోటేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



ఓరా.. దేవెగౌడ!

85 ఏళ్ల వయస్సులోనూ..
708 మెట్లెక్కిన మాజీ ప్రధాని

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ వయసు 85 ఏళ్లు.. కొంతకాలంగా క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటూ.. విశ్రాంతికే పరిమితమయ్యారు. అయితే తన సొంత ప్రాంతంలో జరుగుతున్న మహామస్తకాభిషేకానికి మాత్రం ఏకంగా 708 మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్నారు. డోలీ ఎక్కాలని సూచించినా తిరస్కరించి, ఎనిమిది పదుల వయసులోనూ.. ఏ మాత్రం అలుపు లేకుండా ఏడువందలకు పైగా మెట్లు ఎక్కి అందరినీ ఆశ్చర్యపరిచారు. హాసన్ జిల్లా శ్రావణబెళగొళలో జరుగుతున్న బాహుబలి మహామస్తకాభిషేకంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు హాసన్ జిల్లాకు చెందిన జేడీఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. దేవేగౌడ సతీమణి చెన్నమ్మ డోలీ ద్వారా వింధ్యగిరిపైకి చేరారు. దేవెగౌడ దంపతులు జలాభిషేకంతో పాటు ఇతర అభిషేకాలు జరిపించారు.


అసోసియేషన్ నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు తెల్లకార్డులు

విజయవాడ(బస్‌స్టేషన్), ఫిబ్రవరి 24 : ఏపీఎస్ ఆర్టీసీలో విశ్రాంత ఉద్యోగులకు తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్టు ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరుపల్లి ప్రసాదరావు తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై శనివారం అసోసియేషన్ నాయకులు సీఎంను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత ఉద్యోగులందరికీ తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని గత ఏడాది హామీ ఇచ్చారని, త్వరగా జీవోను విడుదల చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి తెల్లరేషన్‌కార్డుల మంజూరుకు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు ప్రసాదరావు తెలిపారు.

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా రెడ్డి శేఖరరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా రెడ్డి శేఖరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనతో పాటు కోచైర్మన్‌గా జి.సుధీర్, కోశాధికారిగా కొండ్రెడ్డి వెంకటరెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లా శాఖల చైర్మన్‌లుగా... గిరిధర్ రెడ్డి (అనంతపురం), రమణారెడ్డి (కడప), రెడ్డి శేఖరరెడ్డి (చిత్తూరు), జి.మోహన్ (నెల్లూరు), వెంకటరెడ్డి (ప్రకాశం), ఫ్రాన్సిస్ కిషోర్ (గుంటూరు), పూర్ణచంద్రరావు (కృష్ణా), జి.సుధీర్ (పశ్చిమగోదావరి), టి.గోవిందరాజులు, బి.రమేష్, వై.రాంబాబు, జె.సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు.

రూ.1.95 కోట్ల రద్దయిన నోట్లు స్వాధీనం

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రద్దయిన కరెన్సీ నోట్లను మార్పిడి చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. రద్దయిన రూ.1000, రూ.500 నోట్ల మార్పిడికి ప్రయత్నిస్తున్నారని శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొత్తనూరు పోలీసులు గోల్డెన్‌ఫాం అపార్ట్‌మెంట్స్‌కు చేరుకుని మారతహళ్లికి చెందిన జైమారుతి(32), హొస్కోటె శశి (26), మంగళూరు శరత్(28)లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.95 కోట్ల రద్దయిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీగా పాత కరెన్సీని ఎక్కడ నుంచి తెచ్చారనే కోణంలో విచారిస్తున్నట్టు డీసీపీ గిరీశ్ తెలిపారు.

కుమార్తె పెళ్లికి నిరాకరించిందని...
రైలు కింద పడి తండ్రి ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 24 : పెళ్లి పత్రికలు పంచేందుకు సిద్ధపడుతున్న సమయంలో.. పెళ్లికుమార్తె నో చెప్పిందన్న కారణంతో, అవమానం భరించలేక ఓ తండ్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కడప సమీపంలోని రైల్వేమార్గంలో శుక్రవారం ఈ దారుణం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు మండలం పాళెంపల్లె గ్రామానికి చెందిన చిలమకూరు రాముడు(45) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండవ కుమార్తెకు పెళ్లి నిశ్చయించారు. ఆమె పెళ్లికి ససేమిరా అనడంతో... తీవ్ర మనస్తాపం చెందిన రాముడు గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కడప- కనుమలోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు కింద పడి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరెడ్డి తెలిపారు.

వర్సిటీగా ఒంగోలు పీజీ సెంటర్!

- ఉన్నత విద్యా మండలి వినతికి సానుకూలత
- 'రూసా' పథకం కింద మంజూరు
- డీపీఆర్ తయారీపై నిపుణుల కమిటీ
- త్వరలో కేంద్రానికి ప్రతిపాదన



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఒక్క యూనివర్సిటీ కూడా లేని ప్రకాశం జిల్లాలో ఎట్టకేలకు విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్(రూసా) పథకం కింద క్లస్టర్ వర్సిటీ పేరిట ఈ విశ్వవిద్యాలయం మంజూరుకు మార్గం సుగమమవుతోంది. ఆచార్య నాగార్జున వర్సిటీకి అనుబంధంగా ఒంగోలులో నడుస్తున్న పీజీ సెంటర్‌ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాల్సిందిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చేసిన వినతికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సానుకూలత వ్యక్తం చేయడంతో.. దీనికి సంబంధించిన కసరత్తు మొదలైంది. ఈ క్రమంలో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను తయారు చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒంగోలులోని పీజీ సెంటర్‌లో వర్సిటీ స్థాయికి తగిన మౌలిక సదుపాయాలు ఉన్నందున.. ఆర్థిక భారం ఉండదు. నాగార్జున వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఈ పీజీ సెంటర్‌కు వర్సిటీకి ఉండాల్సిన అన్ని హంగులూ ఉన్నాయని ఉన్నత విద్యామండలి చైర్మన్ విజయరాజు, వైస్‌చైర్మన్ పెమ్మసాని నరసింహారావులు ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో ఎంహెచ్ఆర్‌డీ జాయింట్ సెక్రటరీ ఇషారాయ్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా క్లస్టర్ వర్సిటీలను మంజూరు చేయడం వల్ల ఒరిగిందేమీ లేదని వివరించారు. ప్రభుత్వ అభిమతానికి విరుద్ధంగా వర్సిటీలను ఏర్పాటు చేయరాదని, డిమాండ్ ఉన్న ఒంగోలు వంటి చోట వర్సిటీలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని వారు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఆమె స్పందిస్తూ.. తక్షణమే ఒంగోలు పీజీ సెంటర్‌ను వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలను పంపాలని, రూసా కింద మంజూరు చేస్తామని చెప్పడం గమనార్హం. ఈ పీజీ సెంటర్‌ను వర్సిటీగా మారిస్తే రూ.50 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా. 'రూసా' నిబంధనల ప్రకారం.. వర్సిటీ ఏర్పాటుకు అవసరమయ్యే మొత్తంలో 60% రూసా భరించవలసి ఉండగా.. మిగిలిన 40% రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. రూసా సెక్రెటరీ నుంచి తాజాగా వచ్చిన హామీతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వేగం పెంచింది. వర్సిటీల ఏర్పాటు విషయాల్లో అనుభవం ఉన్న నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి 'రూసా'కు పంపేందుకు కసరత్తు చేస్తోంది. ఎట్టకేలకు ఒంగోలులోని పీజీ సెంటర్ స్థాయిని వర్సిటీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసేందుకు అడుగులు పడడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉసురు తీసిన విద్యుత్ కంచె


- ఇద్దరు రైతుల దుర్మరణం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 24: అటవీ జంతువుల నుంచి రక్షణకు పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె ఇద్దరు రైతుల ఉసురు తీసింది. చిత్తూరుజిల్లా తంబళ్లపల్లె మండలం అక్కిమిరెడ్డిగారిపల్లెకు చెందిన మేకల రామలింగారెడ్డి(45), అక్కిమి రాజారెడ్డి(45), దొడ్డకాడపల్లెకు చెందిన దయ్యాల వెంకటరమణారెడ్డి(53) వ్యవసాయంపై ఆధారపడి జీవ నం సాగిస్తున్నారు. దిగువపల్లెకు చెందిన భూమిరెడ్డి, మద్దిరెడ్డి తమ పొలంలో వేరుశనగ సాగు చేస్తున్నారు. ఇటీవల పంట పొలాలపై అడవి పందుల దాడులు పెరిగాయి. వీటి రక్షణకు తమ పొలం వద్ద కాపలా ఉండాలని రామలింగారెడ్డి, రాజారెడ్డి, వెంకటరమణారెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నారు. వారమైనా ముగ్గురూ రాకపోవడంతో.. పొలంలో తాత్కాలికంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, ముందస్తు ఒప్పందం మేరకు.. ముగ్గురు రైతులు శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పొలం వద్దకు వెళ్లారు. తొలుత ఓ కుక్క అక్కడున్న విద్యుత్ ఉచ్చుకు తగులుకోవడంతో మంటలు రేగాయి. భయాందోళన చెందిన రాజారెడ్డి గట్టిగా అరవడంతో ఎం.రామలింగారెడ్డి చీకటిలో పరుగులు తీస్తూ, ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలపై పడ్డాడు. వెనుక వస్తున్న డి.వెంకటరమణారెడ్డిని కూడా తాకడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

సమాజ హిత విద్య అవసరం

- ఇతర దేశాలపై మోజు తగదు
- 50 ఏళ్ల విశ్వభారతికి అభినందనలు
- విశ్వభారతి విద్యాసంస్థల స్వర్ణోత్సవ వేడుకలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్

గుడివాడ, ఫిబ్రవరి 24: "సమాజం గురించి ఆలోచించడం ప్రతి వ్యక్తి బాధ్యత. సంఘానికి ఉపయోగపడే విద్య దేశ భవిష్యత్తును మార్చేస్తుంది. ఇతర దేశాలపై మోజు.. అక్కడ సుఖం, శుభ్రత ఉన్నందునే. అక్కడి పరిస్థితులు మన దేశంలో ఎందుకు లేవని ప్రతి పౌరుడు ఆలోచిస్తే దేశం నుంచి వెళ్లే పరిస్థితి రాదు" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. శనివారం కృష్ణా జిల్లా వానపాములలోని విశ్వభారతి విద్యాసంస్థల స్వర్ణోత్సవ, విశ్వభారతి వైజ్ ఉడ్స్ పాఠశాల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఆయన.. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరేందుకు ఆసక్తి కనబర్చటం లేదని, ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్తున్నారని ఈ విషయాన్ని పాలకులు గుర్తిస్తే లోపాలను ప్రక్షాళన చేసుకోవచ్చని సూచించారు. చిన్న సమస్యగా కనబడే ప్లాస్టిక్ వాడకం పెద్ద ప్రమాదాన్ని తెస్తోందన్నారు. దీనికి పూర్తిగా ప్రజలే కారణం కాదా? అని ప్రశ్నించారు. తల్లిదండ్రులు పిల్లలకు మన దేశచరిత్ర, ఔన్నత్యం, సాంప్రదాయం గురించి చెప్పడం లేదని, ఫలితంగా పిల్లలు విదేశీ సంస్కృతిని ఇష్టపడుతున్నారని అన్నారు. విశ్వభారతి విద్యాసంస్థలు 50 ఏళ్లుగా విలువలను పాటిస్తుండడం ప్రశంసనీయమని కొనియాడారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్యచౌదరి మాట్లాడుతూ, చైతన్యం ఉన్న వ్యక్తి.. విద్య ద్వారా సమాజంలో శక్తిగా మారగలడన్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, ముక్కు, మొహం కూడా సరిగ్గా లేని సినీ హీరోల పోస్టర్లను నెత్తిన పెట్టుకోవడం కంటే వీరజవాన్లను మన హీరోలుగా భావించినప్పుడు సమాజం వికసిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు టీడీ ప్రసాద్ రచించిన విశ్వభారతి విద్యాసంస్థల స్వర్ణోత్సవ సంచికను ఆవిష్కరించారు. విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణను పేరెంట్స్ అసోసియేషన్ సన్మానించింది.


వైజ్ ఉడ్స్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ జాస్తి, కేవీ చౌదరి, యార్లగడ్డ

పోలవరం పనులపై మంత్రి దేవినేని సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులను శనివారం మంత్రి దేవినేని సమీక్షించారు. స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులను పూర్తి చేసే బాధ్యతను నవయుగ తీసుకున్నాక కాంక్రీట్ పనుల్లో వేగాన్ని పెంచే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో సమయంలో కాంక్రీట్ పనులు ఏ స్థాయిలో జరుగుతున్నాయో మంత్రి తెలుసుకున్నారు. రోజుకు ఎంత మేరకు పనులు జరుగుతున్నాయి, ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా? వంటి అంశాలపై చర్చించారు. ఆదివారం ఉదయం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కార్యక్రమం పనులను పర్యవేక్షించాక.. విశాఖలో ఉత్తరాంధ్ర పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించనున్నారు.



ఆర్కే RK

కొత్తపలుకు

చివరకు మిగిలేది!

"మేం కొండకు వెంట్రుక కట్టాం. వస్తే కొండ, పోతే వెంట్రుక– అయితే తెలుగుదేశం పార్టీకి మాత్రం బోడిగుండే మిగులుతుంది" ఇదీ ఆంధ్రప్రదేశ్ మంత్రి, భారతీయ జనతా పార్టీ నాయకుడు పి.మాణిక్యాలరావు ఇటీవల చేసిన ప్రకటన. ఆ వెంటనే బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ కల్పించుకుని 'మాణిక్యాలరావు అలా ఎందుకు అన్నారో తెలియదు– మా పార్టీ వెంట్రుకతో సమానం కాదు' అని జవాబు ఇచ్చారు. మాణిక్యాలరావు కొంచెం ఓపెన్‌గా మాట్లాడతారు. అందుకే రాష్ట్రంలో తమ పార్టీ పరిస్థితిపై మనస్సులో ఉన్నదే చెప్పి ఉంటారు. ఏదైతేనేమి, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న రాజకీయ రచ్చ చూస్తుంటే రాష్ట్ర ప్రజల మీద జాలేస్తోంది. ఒక్కో పార్టీ ఒక్కో ఎజెండాతో మొత్తం వ్యవహారాన్ని గందరగోళపరిచాయి. దీంతో కేంద్రం నుంచి సహాయం పొందే విషయం అలా ఉంచితే రాష్ట్ర ప్రజలకు చివరకు వెంట్రుకే మిగిలేట్టు ఉంది. రచ్చ రాజకీయాలు ఇలాగే కొనసాగితే చివరకు వెంట్రుక కూడా పోయి బోడిగుండే మిగలవచ్చు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని అధికార తెలుగుదేశం పార్టీ స్వరమెత్తగానే స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు కౌంటర్లు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో అధికార, ప్రతిపక్షాలకు మాత్రమే పరిమితం కావలసిన పోరు మిత్రపక్షాల మధ్య కేంద్రీకృతమైంది. నా పుట్టలో వేలు పెడితే నేను ఊరుకుంటానా? అన్నట్టుగా రాష్ట్రంలో తమను అప్రతిష్ఠపాలు చేయాలనుకుంటున్న తెలుగుదేశం పార్టీని కూడా అంతే స్థాయిలో డ్యామేజీ చేయడానికి బీజేపీ నాయకులు పూనుకున్నారు. ఈ క్రమంలోనే రాయలసీమ డిక్లరేషన్ తెరపైకి వచ్చింది. విభజిత ఆంధ్రప్రదేశ్ ఇంకా కాలు–చేయి కూడదీసుకోకముందే మరో ప్రాంతీయ ఉద్యమానికి తెర తీశారు. రాష్ట్ర విభజన జరిగిన కొద్ది రోజులకే రాయలసీమకు అన్యాయం అంటూ కొన్ని సంస్థలు, కొంతమంది వ్యక్తులు, కమ్యూనిస్టులు ఆందోళన గట్రా చేశారు. అవి చల్లారి పరిస్థితులు సద్దుమణిగాయని భావిస్తున్న తరుణంలో ఇప్పుడు భారతీయ జనతాపార్టీ మళ్లీ అదే పాట అందుకుంది. తెలుగుదేశం పార్టీ నాలుగేళ్ల పాలనలో రాయలసీమకు తీరని అన్యాయం జరిగిందని బీజేపీ నాయకులు శుక్రవారంనాడు విమర్శించారు. కర్నూలు జిల్లాలో హైకోర్టు, శాసనసభ, సచివాలయం ఏర్పాటుచేయాలని కూడా కోరారు. రాజధానిగా అమరావతి నిర్ణయం అయిన ఇన్నేళ్లకు ఈ డిమాండ్లు ఏమిటో తెలియదు. ఇదంతా చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏ పాపం చేశారా? అని అనిపిస్తోంది. సందర్భం దొరికినప్పుడల్లా ప్రజల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయి. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్–బీజేపీ కలిసి రాష్ట్రప్రజలకు అన్యాయం చేశాయి. జరిగిన అన్యాయాన్ని చక్కదిద్ది న్యాయం చేయమని అడుగుతున్న పాపానికి ఇప్పుడు మళ్లీ ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక హోదా అంటే ఏమిటో, దాని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో తెలియని ప్రజలను కూడా ప్రత్యేక హోదా కావాలని నినదించేలా చేశారు. జరుగుతున్న పరిణామాలను క్యాష్ చేసుకోవడానికి రాజకీయ పార్టీలతో పాటు కొన్ని చానెళ్లు కూడా ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఈ మొత్తం క్రీడలో ఎవరి స్వార్థం ఎంతో తెలియని ప్రజలు అమాయక పావులుగా మారి భావోద్వేగాలకు లోనవుతున్నారు. ఇస్తామన్న ప్యాకేజీ విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉలుకు–పలుకు లేకుండా ఉండిపోవడంతో మరుగున పడిపోయిన ప్రత్యేక హోదా అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరూ అమాయకంగా ప్రత్యేక హోదా, ప్రత్యేక హోదా అని కలవరిస్తున్నారు. వడ్డించిన విస్తరిలా ఏర్పాటైన తెలంగాణలో పరిస్థితులు ప్రశాంతంగా ఉండగా, ఏ దిక్కూలేని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రకరకాల అలజడులు. ఎవరికి వారు చలి మంటలు వేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారే గానీ ప్రజలకు మేలు జరగాలంటే ఏమి కావాలన్న విషయంలో నిర్దిష్ట ప్రతిపాదనలు చేయలేకపోతున్నారు. ప్రత్యేక హోదా వస్తే జీవితాలే మారిపోతాయని ప్రజలను భ్రమల్లోకి నెడుతున్నవారు హోదా సాధనకు పూచీ ఇవ్వగలరా? కేంద్ర ప్రభుత్వం హోదా ఇవ్వకపోతే వారి ముందున్న ప్రత్యామ్నాయం ఏమిటో తెలియదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్న ఆవేదనతో మొదలైన ఆందోళనలు, ఎన్నో మలుపులు తిరుగుతున్నాయి. కేంద్ర బడ్జెట్ భేషుగ్గా ఉందని ప్రశంసించిన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని పరిస్థితులను గమనించి న్యాయం జరగకపోతే ఏప్రిల్ ఆరున తమ పార్టీ ఎంపీలు రాజీనామాలు చేస్తారని ప్రకటించింది. దీంతో తెలుగుదేశం పార్టీ ఎంపీలు కూడా రాజీనామాలు చేయాలన్న ప్రకటనలు కొన్ని రోజులు వినిపించాయి. న్యాయం కోసం పార్లమెంట్‌లో పోరాటం చేయవలసినవారు రాజీనామాలు చేసి వెళ్లిపోతే ఏమి జరుగుతుందని ఆలోచించలేదు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నట్టుగా ఎంపీలు కూడా లేకపోతే అడిగేవారు ఎవరుంటారు? విభజన సందర్భంగా ఎంపీలు ఆందోళన చేయడం వల్లనే తలుపులు మూసి విభజన బిల్లుకు ఆమోదం పొందారనీ, ఎంపీలు ఉండి ఉండకపోతే తలుపులు తెరిచే బిల్లుకు ఆమోదం పొంది ఉండేవారన్న అరుణ్‌కుమార్ వ్యాఖ్యలు అక్షరసత్యం. అప్పుడేమో రాష్ట్ర విభజన ఆగదని తెలిసి కూడా సమైక్య ఉద్యమం నడిపించారు. విభజన చట్టం చెల్లనే చెల్లదని నమ్మబలికారు. ఇప్పుడేమో ఏ మాత్రం అవకాశం లేని ప్రత్యేక హోదాను మళ్లీ తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో చాలామంది బిజీ అయిపోగా, ఎవరి మాటలు నమ్మాలో తెలియని అయోమయ స్థితిలో ప్రజలు ఉన్నారు.

పవన్ కల్యాణ్ చొరవ మేరకు రాష్ట్రానికి ఏదో చేశామని అనిపించి ఎన్నికలలో ఆయన పార్టీతో పొత్తుపెట్టుకుంటే ఎలా ఉంటుందన్న అంశం కేంద్ర నాయకత్వం పరిశీలనలో ఉందని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. గవర్నర్ నరసింహన్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు గైడెన్స్ ఇస్తున్నారా? లేదా? అన్నది చెప్పాల్సింది వారిద్దరే! అప్పటిదాకా ఈ ప్రచారం ఇలాగే సాగుతుంటుంది. ఎవరు ఎవరిని గైడ్ చేసినా, ఏయే పార్టీలు పొత్తులు పెట్టుకున్నా పర్వాలేదు గానీ చివరకు ఏపీ ప్రజలకు గుండు గీయకుండా ఉంటే అదే పది వేలు!

..కాదంటే ఏమిటి?

ఎంపీల రాజీనామాల ప్రకటన తెర మీదకు వచ్చిన కొద్ది రోజులకే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశం ముందుకొచ్చింది. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ఈ డిమాండ్‌ను ప్రస్తావించగానే ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి సై అన్నారు. అయితే తెలుగుదేశం పార్టీతో కూడా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదింపజేయండి అని పవన్ కల్యాణ్‌ను డిమాండ్ చేశారు. ఏపీ రాజకీయాలలో జగన్మోహన్ రెడ్డి– పవన్ కల్యాణ్ మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఒక పిట్టకథలా మారిపోయింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రంగంలో ఉండటం వల్ల తెలుగుదేశం పార్టీకి లాభం కలిగి తనకు నష్టం జరుగుతుందన్న ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి ఆయనను టార్గెట్ చేసుకున్నారు. ఈ కారణంగానే జగన్ సొంత మీడియాలో పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా కథనాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు మధ్య రహస్య ఒప్పందం ఉందని ప్రజలను నమ్మించడానికి జగన్మోహన్‌రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఈ రాజకీయ మర్మాలు తెలియని పవన్ కల్యాణ్ తనదైన శైలిలో పయనిస్తున్నారు. కొన్ని విషయాలలో ఆచితూచి వ్యవహరించాలన్న విషయం కూడా పవన్ కల్యాణ్‌కు తెలియదు. ఆ కారణంగానే ఇటీవల తనను కలిసిన మత్స్యకారులతో మాట్లాడుతూ వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వీలులేదని ఆదివాసీలు అప్పటికే ఆందోళన చేస్తున్న విషయం ఆయన గమనించలేదు. మత్స్యకారుల తరఫున శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో ఆయన పర్యటనను అడ్డుకుంటామని గిరిపుత్రులు ప్రకటించారు. దీంతో సమస్య తీవ్రత గమనించిన పవన్ కల్యాణ్, తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. సున్నితమైన అంశాలలో ఆచితూచి వ్యవహరించకపోతే ఏమి జరుగుతుందో ఆయనకు ఇప్పుడు బోధపడి ఉంటుంది. ఈ విషయం అలా ఉంచితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు సముద్రాలలో ఏర్పడే వాయుగుండాల వలె ఏ దిశలో పయనిస్తాయో తెలియకుండా ఉన్నాయి. కొన్ని రోజులు పవన్ కల్యాణ్ మీద, మరికొన్ని రోజులు కేంద్ర ప్రభుత్వం మీద కేంద్రీకృతమైన విమర్శలు– ప్రతివిమర్శలు ఇప్పుడు తెలుగుదేశం–భారతీయ జనతా పార్టీల మధ్య కేంద్రీకృతమయ్యాయి. ఎంపీల రాజీనామాలు, అవిశ్వాసం అంశాలను పక్కనపెట్టి ప్రత్యేక హోదాను తెర మీదకు తీసుకురావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వ్యూహం మార్చుకున్నారు. హోదా అనుభవిస్తున్న రాష్ట్రాలకు 2018 తర్వాత పొడిగించేది లేదని చెప్పినందునే ప్యాకేజీకి ఒప్పుకొన్నామనీ, ఇప్పుడు ఆ రాష్ట్రాలకు హోదా పొడిగిస్తున్నందున ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు ఇవ్వరని మెలికపెట్టారు. దీంతో భారతీయ జనతా పార్టీ నాయకులకు చిరాకు పుట్టినట్టు ఉంది.. 'ఓహో అలాగా అయితే నీ సంగతి చెబుతాం..' అని రాయలసీమ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొదలైన రాజకీయ క్రీడ జగన్మోహన్‌రెడ్డి– పవన్ కల్యాణ్, తెలుగుదేశం–బీజేపీ మధ్య కేంద్రీకృతమైంది. ఈ మధ్యలో అలల వలె కొన్ని సంస్థలు, చిన్నా చితక పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశాలు వగైరా నిర్వహిస్తూ ప్రత్యేక హోదా అని నినదిస్తున్నాయి. ఇవన్నీ బాగానే ఉన్నాయి గానీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఏమి చేయాలన్న ఆలోచన ఎవరైనా చేస్తున్నారో లేదో తెలియదు. యుద్ధం చేసేవారు రిట్రీట్ అనే వ్యూహాన్ని కూడా అమలు చేస్తుంటారు. అంటే పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఒక అడుగు వెనక్కు వేయడం అన్నమాట! కేంద్ర ప్రభుత్వంపై మొదలైన పోరాటం ఎంత కాలం? ముగింపు ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానం లేదు. కేంద్రం మొండికేస్తే ఏమి చేయాలో తెలియని పరిస్థితి! మంత్రి మాణిక్యాలరావు అన్నట్టు రాష్ట్రప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నా భారతీయ జనతా పార్టీకి పోయేది వెంట్రుకే! ఆంధ్రప్రదేశ్‌లో గెలిచిన ఎంపీలపై ఆధారపడి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఉత్తరాది రాష్ట్రాలలో లభించిన బలంతో ఆయన ప్రధానమంత్రి అయ్యారు. అందుచేత ఏపీ ప్రజల మనోభావాలు భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వాన్ని ప్రభావితం చేయడం లేదని భావించవచ్చు. అది కాని పక్షంలో ఢిల్లీ పెద్దలు ఈపాటికి కల్పించుకుని ఉండేవారు కదా! రాజ్యసభ సమావేశాలు వాయిదాపడిన రోజు రాష్ట్రానికి న్యాయం జరిపించే విషయంలో చొరవ తీసుకున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఇప్పుడు కాడిపారేసినట్టు ఉన్నారు. అటు ప్రభుత్వ పెద్దలలో చలనం లేకపోవడం, ఇటు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు చాలా దూరం వెళ్లడంతో తాను మాత్రం చేయగలిగింది ఏమి ఉందన్న నిర్వేదంలోకి ఆయన జారుకున్నారని చెబుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొండివాడు. కక్ష మనిషి! అలాంటి వ్యక్తితో ఎందుకు పెట్టుకుంటున్నారు? అని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొంతమంది సలహాలు కూడా ఇస్తున్నారు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారికి ముఖ్యం కనుక చంద్రబాబునాయుడు ఇప్పుడు ఒక అడుగు వెనకకు వేసినా తీవ్రంగా నష్టపోతారు. అందుకే ఆయన అడుగులన్నీ బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగానే సాగుతున్నాయి. అది ఎప్పుడు జరుగుతుందనేది ప్రశ్న! మరో పది రోజుల్లో కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రజలకు సంతృప్తి కలిగేలా సహాయం ప్రకటించని పక్షంలో రెండు పార్టీల మైత్రీబంధం మార్చి చివరి నాటికే ముగియవచ్చు. బీజేపీకి తెలుగుదేశంపార్టీ దూరమైనంత మాత్రాన రాష్ట్రానికి న్యాయం జరగదు. కాకపోతే ప్రజల ఆగ్రహం తెలుగుదేశం పార్టీ వైపు మళ్లకుండా జాగ్రత్తపడినట్టు అవుతుంది. పార్లమెంట్ సమావేశాలు పునఃప్రారంభం కావడానికి మరో ఎనిమిది రోజులే గడువు ఉన్నందున ఈలోపు కేంద్రం స్పందిస్తుందో లేదో వేచి చూద్దాం.

తెలుగుదేశం పార్టీతో మీరు స్నేహాన్ని కాంక్షిస్తున్నారా లేదా అన్నది ప్రజలకు అనవసరం. జరిగిన నష్టాన్ని భర్తీ చేయవలసిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్నందున బీజేపీపైనే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ముందుకు రానిపక్షంలో ప్రత్యామ్నాయం ఏమిటన్నదే ఇప్పుడు ప్రశ్న! తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు గానీ, రాహుల్‌గాంధీ నోటి నుంచి ఆ మాట రావడం లేదు. తమిళనాడు, ఒడిసా, కర్ణాటక వంటి రాష్ట్రాల ఎంపీల మద్దతుతో రాహుల్‌గాంధీ ప్రభుత్వం ఏర్పాటుచేసినా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి వారు అభ్యంతరపెడతారు. జయలలిత జీవించి ఉన్నప్పుడే ప్రత్యేక హోదాపై అభ్యంతరం వ్యక్తంచేశారు.



ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారికి ముఖ్యం కనుక చంద్రబాబునాయుడు ఇప్పుడు ఒక అడుగు వెనకకు వేసినా తీవ్రంగా నష్టపోతారు. అందుకే ఆయన అడుగులన్నీ బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగానే సాగుతున్నాయి. అది ఎప్పుడు జరుగుతుందనేది ప్రశ్న! మరో పది రోజుల్లో కేంద్ర ప్రభుత్వం స్పందించి రాష్ట్ర ప్రజలకు సంతృప్తి కలిగేలా సహాయం ప్రకటించని పక్షంలో రెండు పార్టీల మైత్రీబంధం మార్చి చివరి నాటికే ముగియవచ్చు. బీజేపీకి తెలుగుదేశంపార్టీ దూరమైనంత మాత్రాన రాష్ట్రానికి న్యాయం జరగదు.

కాంగ్రెస్–దేశం దోస్తీ?

తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ముఖచిత్రం విభిన్నమైంది. తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ. భారతీయ జనతా పార్టీతో తన అధికారానికి వచ్చిన ముప్పు ఏమీ లేదని ఆయన భావిస్తున్నారు. ఈ కారణంగానే సాధారణ ఎన్నికల తర్వాత కూడా కేంద్రంలో ఆయన కాంగ్రెస్ పార్టీని బలపరచలేకపోవచ్చు. కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడినా కేసీఆర్‌కు రాజకీయంగా కలిగే నష్టం ఏమీ ఉండదు. అందుకే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కూడా న్యాయం జరగకపోయినా ఆయన పెద్దగా స్పందించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థి కాదు. ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ బలపడకూడదనే ఆయన కోరుకుంటారు. అయితే కాంగ్రెస్‌తో పాటు భారతీయ జనతా పార్టీ కూడా తమకు అన్యాయం చేసిందని ప్రజలు భావిస్తున్నందున, ఇద్దరికీ సమాన దూరం పాటించవలసిన పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల తర్వాత పరిస్థితి ఏమిటన్నదే తెలుగుదేశం పార్టీని వేధిస్తున్న ప్రశ్న! కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడినా ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకోవాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. ఒకరకంగా చెప్పాలంటే ఈశాన్య రాష్ట్రాల్లాంటి పరిస్థితిలోనే ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. కేంద్ర సహకారం లేనిదే ఈశాన్య రాష్ట్రాలు మనుగడ సాగించలేవు. అందుకే అక్కడ ఉన్న రాజకీయ నాయకులతో పాటు ప్రజలు కూడా కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే అటే దూకుతారు. ఇప్పుడు ఈశాన్య రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ గెలవడానికి కూడా ఇదే కారణమని అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక అధికారి విశ్లేషించారు. ఎన్నికల తర్వాత కేంద్రంలో నరేంద్ర మోదీకి సొంతంగా మెజారిటీ సమకూరని పక్షంలో ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలా? లేదా? అన్న మీమాంసలో తెలుగుదేశంపార్టీ ఉంది. ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉంటే రాష్ట్ర ప్రయోజనాలను ఏకరువు పెట్టి మద్దతు ఇవ్వడానికి తెలుగుదేశం వెనుకాడకపోవచ్చు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు పన్ను రాయితీలు ఇస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు లిఖితపూర్వక హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి కూడా తెలుగుదేశం పార్టీకి అభ్యంతరం ఉండకపోవచ్చు. అదే జరిగితే తెలంగాణలో కూడా రాజకీయ సమీకరణాలు మారతాయి. కాంగ్రెస్–తెలుగుదేశం మధ్య పొత్తు కుదరవచ్చు. అలా జరిగితే ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పుడు మళ్లీ ఏపీ విషయానికి వద్దాం. అక్కడ తెలుగుదేశం–బీజేపీకి చెందిన నాయకుల మధ్య మాటల యుద్ధం ఉధృతమైనందున ఉభయుల మధ్య బంధం బెడిసికొట్టినట్టేనని భావించవచ్చు. స్థానిక బీజేపీ నాయకులు కూడా చంద్రబాబు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోయారన్న ప్రచారం ఉంది. ఇటీవల పార్టీ అధినేత అమిత్ షా సమక్షంలో జరిగిన సమావేశంలో స్థానిక పార్టీ అధ్యక్షుడు హరిబాబుపై కొంతమంది పరోక్షంగా విమర్శలు చేశారు. ఇటీవలే పార్టీలో చేరిన చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సి.కె.బాబుకు గన్‌మెన్‌ను కూడా ఇప్పించుకోలేకపోతున్నామని కొంతమంది అమిత్ షా దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన హరిబాబు వైపు చూశారట! దీంతో హరిబాబు కల్పించుకుని సి.కె.బాబుకు గన్‌మెన్ కావాలని కోరిన విషయమే తనకు తెలియదనీ, అలాంటప్పుడు అది తన వైఫల్యం ఎలా అవుతుందనీ ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది. ఇలాంటి అనేక అంశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో స్థానిక బీజేపీ నాయకులకు విభేదాలు ఉన్నాయి. బీజేపీకి చెందిన ఒక నాయకుడు ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందడానికి తరచుగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తాను కోరుకున్న పనులు జరిగితే ప్రభుత్వాన్ని ప్రశంసిస్తారు. కానప్పుడు విమర్శిస్తుంటారు. ఇలాంటివన్నీ కూడా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇవన్నీ తెలియని ప్రజలు రాజకీయ నాయకుల మాటలు నమ్మి ఆవేశపడిపోతున్నారు. రాష్ట్రానికి న్యాయం జరగాలంటే జాతీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలతోనే సాధ్యం. లేదంటే తృతీయ ఫ్రంట్ ఏర్పడాలి. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టాలన్న డిమాండ్ తాజాగా అందిపుచ్చుకున్నారు కనుక ఆ పని చేయాలన్నా కాంగ్రెస్ పార్టీ మద్దతు అవసరం. విభజన చట్టం లోపాలమయంగా ఉన్నందునే తాము ఏమీ చేయలేకపోతున్నామని బీజేపీ నాయకులు చెప్పడం సమర్థనీయం కాదు. లోపాలను సరిదిద్దుతూ విభజన చట్టానికి సవరణలు చేయడానికి బీజేపీకి కావలసినంత బలం ఉంది కదా! అందుకు సహకరిస్తామని కాంగ్రెస్ పార్టీ కూడా అంటోంది కదా! ఈ విషయం గురించి మాట్లాడకుండా ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకోవడం వల్ల రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనం ఏమిటన్నదే ప్రశ్న. వ్యవహారం రాజకీయం అయ్యింది కనుక సమస్య అంత త్వరగా పరిష్కారం కాదు. తటస్థంగా ఉండి ప్రజలలో విశ్వసనీయత ఉన్నవారు మధ్యవర్తిత్వం వహిస్తే రాష్ట్రానికి ఎంతో కొంత న్యాయం జరగవచ్చు. ఇప్పుడు ప్రత్యేక హోదా అడుగుతున్నారు కనుక అది ఇస్తారో లేదో కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయాలి. ఇవ్వలేని పక్షంలో ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన ప్యాకేజీని అయినా అమలుచేస్తామని హామీ ఇవ్వాలి కదా! ఏమీ చెప్పకుండా బెల్లం కొట్టిన రాయిలా ఉండిపోవడం ఏమిటి? తెలుగుదేశం పార్టీతో మీరు స్నేహాన్ని కాంక్షిస్తున్నారా లేదా అన్నది ప్రజలకు అనవసరం. జరిగిన నష్టాన్ని భర్తీ చేయవలసిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్నందున బీజేపీపైనే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ముందుకు రానిపక్షంలో ప్రత్యామ్నాయం ఏమిటన్నదే ఇప్పుడు ప్రశ్న! తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు గానీ, రాహుల్‌గాంధీ నోటి నుంచి ఆ మాట రావడం లేదు. ఒకవేళ ఆయన కూడా హామీ ఇచ్చినా ఎన్నికల తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న గ్యారంటీ లేదు. ఒకవేళ వస్తుందనుకున్నా ఇతర పార్టీల సహకారంతోనే అది సాధ్యం. తమిళనాడు, ఒడిసా, కర్ణాటక వంటి రాష్ట్రాల ఎంపీల మద్దతుతో రాహుల్‌గాంధీ ప్రభుత్వం ఏర్పాటుచేసినా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి వారు అభ్యంతరపెడతారు. జయలలిత జీవించి ఉన్నప్పుడే ప్రత్యేక హోదాపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా పొందడం ఆషామాషీ కాదు. అది జరగనప్పుడు ప్రత్యామ్నాయంగా ఏమి కోరుకోవాలో ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారు నిర్దేశించుకోవాలి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనుకుంటే ఇవ్వగలిగే పరిస్థితిలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉంది. దక్షిణాది రాష్ట్రాల మద్దతుపై ఆధారపడి ఆయన ప్రభుత్వం లేకపోవడమే ఇందుకు కారణం!

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు పన్ను రాయితీలు ఇస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు లిఖితపూర్వక హామీ ఇస్తే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి కూడా తెలుగుదేశం పార్టీకి అభ్యంతరం ఉండకపోవచ్చు. అదే జరిగితే తెలంగాణలో కూడా రాజకీయ సమీకరణాలు మారతాయి.


పవన్‌కు బీజేపీ గేలం?

ఇదిలాఉండగా, తెలుగుదేశం పార్టీ ఎలాగూ దూరమైపోతున్నందున ప్రత్యామ్నాయంగా పవన్ కల్యాణ్‌ను తమవైపు తిప్పుకొంటే ఎలా ఉంటుందన్న ప్రతిపాదనను బీజేపీ నాయకత్వం పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ చొరవ మేరకు రాష్ట్రానికి ఏదో చేశామని అనిపించి ఎన్నికలలో ఆయన పార్టీతో పొత్తుపెట్టుకుంటే ఎలా ఉంటుందన్న అంశం కేంద్ర నాయకత్వం పరిశీలనలో ఉందని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే పవన్ కల్యాణ్‌తో మధ్యవర్తిత్వం వహించే బాధ్యతను గవర్నర్ నరసింహన్‌కు అప్పగించారని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే పవన్ కల్యాణ్‌ను గవర్నర్ తన వద్దకు పిలిపించుకుంటున్నారనీ, ఫోన్‌లో కూడా తరచుగా మాట్లాడుతున్నారనీ చెబుతున్నారు. గవర్నర్ నరసింహన్ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు గైడెన్స్ ఇస్తున్నారా? లేదా? అన్నది చెప్పాల్సింది వారిద్దరే! అప్పటిదాకా ఈ ప్రచారం ఇలాగే సాగుతుంటుంది. ఎవరు ఎవరిని గైడ్ చేసినా, ఏయే పార్టీలు పొత్తులు పెట్టుకున్నా పర్వాలేదు గానీ చివరకు ఏపీ ప్రజలకు గుండు గీయకుండా ఉంటే అదే పది వేలు!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం
http://www.youtube.com/abntelugutv

చెవిలో చిన్నమాట

బానిస బతుకుల కిరాయి చదువులు!



ఫో..

చదువుకో ఫో!
బయట కనిపించావో ప్రాణం తీస్తా...
ఏమనుకుంటున్నావో! నా గురించి నీకు పూర్తిగా తెల్వదు.
ప్రీ బోర్డులో ఎన్ని మార్కులొచ్చాయేంటి?
ఫస్టు గ్రేడ్ రాలేదా.. నాకు తెలుసు నువ్వు పరమ వేస్టుగాడివి.
నిన్ను నమ్మి పెద్ద (?) బడిలో వేసాను చూడూ...
అదీ నా తప్పు. ఉత్తపుణ్యానికి పైసలన్నీ ఖరాబైపోయాయి.
నువ్వేదో ఉద్ధరిస్తావనుకున్నా.. చేతికి చిప్పే గతి! బిచ్చమెత్తుకోవడం ఖాయం.

అన్నిచోట్లా కాకున్నా, అనేక ఇళ్లలో, ఇబ్బడిముబ్బడిగా, ఇంటి బయటదాకా వినిపించే కాలమిది. ఇలాగే కాకున్నా.. కాస్త నయగారంగానో, గార్వంగానో.. 'బాగా చదువుకోవాలి బిడ్డా. చదువుకుని ఫస్టు ర్యాంకు తెచ్చుకోవాలి. మిగతావాళ్లతో నీకు సంబంధం లేదు. ఏం చేసైనా సరే నువ్వు మాత్రం ఫస్టు రావాలి. అమెరికాకు పోవాలి' అంటూ చెవిలో పోరే కాలం. ఇది విషమ 'పరీక్షా'కాలం! పరీక్షలకు 'బలి పశువుల్ని' సిద్ధం చేసే ప్రవేశాల కాలం!

ముడ్డి కడుక్కోలేని, ముక్కు చీదుకోలేని ముక్కుపచ్చలారని పిల్లాడిని.. పుట్టిన రెండున్నరేళ్లకే.. న్యాపీ ప్యాడ్ కట్టేసి... నర్సరీలో పెట్టేసింది మొదలు... చదువు.. చదువు.. చదువు! చదువే లోకం.. చదువే తూకం... పీకి పాకం పెట్టే చదువే శోకం! రెండున్నరేళ్లకే బడేమిటి? చదువేమిటి? అన్న చిన్న ఇంగితజ్ఞానం చదువుకున్న ఒక్కడికీ రానంత జ్ఞానవంతులం మనం!

ఏం చదివిస్తున్నాం, ఎందుకు చదివిస్తున్నాం, ఎవరికోసం చదివిస్తున్నామో కూడా తెలియనంత బ్రహ్మాండమైన అజ్ఞానంతో, పిల్లలకు మనం అర్థంపర్థం లేని జ్ఞానభిక్ష పెడుతున్నాం. 'అ అంటే అమ్మ' అనడాన్ని ఏనాడో ఆపేసిన మనం... ఎ– ఫర్ యాపిల్ అనిపిస్తున్నాం. యాపిల్ పండు కన్నా యాపిల్ ఫోన్‌ను ఆదర్శంగా చూపిస్తున్నాం!

వాన నీళ్ల కోసం కళ్లు కాయలు కాచేలా కన్నీళ్లతో ఎదురు చూసే ఈ వ్యవసాయ దేశంలో... పిల్లాడి చదువు... 'రెయిన్ రెయిన్ గో గో' అనే రైమ్‌తో మొదలవుతుంది. పరాయి, కిరాయి పద్యాలు వల్లె వేసీ వేసీ... పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచే పుట్టిన దేశం పరాయిదైపోతుంది. వాడు ఈ దేశం నాది కానే కాదనుకునేంత వి–దేశభక్తిని నూరిపోస్తుంది. చివరికి ఆర్మీ వాడు, దేశాన్ని కాపాడేందుకు సైన్యంలో చేరండిరా బాబూ అని అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చుకునే పరిస్థితి తెచ్చింది మన చదువు!

మన జన్యు పరంపరకు మలి విత్తనాలైన పిల్లలు.. ఎవరికి వారే ఎంతో ప్రత్యేకం. ఒక్కొక్కరూ ఒక్కో విశిష్ట సృజనాత్మక సందేశం. కానీ మనం వారి ఆటలను అపహరించి, మాటలను మరిపించి, ఊహల్ని ఉత్తరించి, ఊసుల్ని కత్తిరించి, మూసలో దించి శాసిస్తాం. అందుకే పౌల్ట్రీఫారాల్లాంటి కార్పొరేట్ బడుల ఖరీదైన కాసుల చదువుల్లో, తెల్లతెల్లటి ఫారం కోళ్లు తయారవుతున్నాయే తప్ప... అందంగా ఆటాడే, అలరిస్తూ తిరుగాడే, అంగరంగ సుందరంగా ఎగిరిదుమికే రంగురంగుల పోరగాళ్లు ఏరీ?

మన జన్యు పరంపరకు మలి విత్తనాలైన పిల్లలు.. ఎవరికి వారే ఎంతో ప్రత్యేకం. ఒక్కొక్కరూ ఒక్కో విశిష్ట సృజనాత్మక సందేశం. కానీ మనం వారి ఆటలను అపహరించి, మాటలను మరిపించి, ఊహల్ని ఉత్తరించి, ఊసుల్ని కత్తిరించి, మూసలో దించి శాసిస్తాం. అందుకే పౌల్ట్రీఫారాల్లాంటి కార్పొరేట్ బడుల ఖరీదైన కాసుల చదువుల్లో, తెల్లతెల్లటి ఫారం కోళ్లు తయారవుతున్నాయే తప్ప...అందంగా ఆటాడే, అలరిస్తూ తిరుగాడే, అంగరంగ సుందరంగా ఎగిరిదుమికే రంగురంగుల పోరగాళ్లు ఏరీ?

మా ఊరు ధూలిమిట్టలో మహా స్ట్రిక్టు బాలమల్లయ్య సారు, ఏడో తరగతిలో తాడుకు జిలేబీలు వేలాడదీసి, నోటితో అందుకొమ్మని ఎండలో ఎగిరించి... అంక గణితాన్ని పొంకంగా నేర్చుకోరా బాగుపడతావ్ అంటూ మనోహర్ సారు మహా ప్రేమగా తిట్టి... ఒక్క తెలుగు పద్యమైనా గట్టిగా బట్టీపట్టరా, ఉద్యోగానికి ఉపయోగపడుతుందని సుధాకరంసారు కొట్టకుండానే కొట్టినంత భయం పెట్టి... రోగాలకూ చికిత్స చేసే ఆగమల్లయ్యసారు రాగాలతో పాఠం చెప్పి.. కొండలాంటి ఇంగ్లిషును కొండల్‌రావుసారు తేలిక చేసి చూపించి... ఇలా మారుమూల పల్లెల్లో చదువు నేర్చుకున్న మాలాంటివాళ్లంతా, ఇప్పటి మాయదారి చదువులు చదువుకున్న వాళ్లకన్నా మంచి స్థాయిలోనే ఉన్నాం. ఏ కార్పొరేట్– విదేశీ విద్యా లేని కాలంలో ఎందరో మేధావులు, నోబెల్ విజేతలు పుట్టిన ఈ దేశంలో... 70 ఏళ్ల స్వాతంత్ర్యానంతర శకంలో...ఎందరు సక్కనోళ్లు లెక్క తేలారేం?!

ఈ దేశం ఎవడి చేతిలో ఎన్ని సార్లు ఓడిపోయింది? ఈ దేశంలో జరిగిన దుర్మార్గాలు ఏమిటి? ఈ దేశం ఎంత బలహీనమైనది? అంటూ పరాయివాడు రాసిన పాపిష్టి చరితనే పాఠశాలల్లో పారాయణం చేయిస్తున్న కాలమిది. మన పురాతన చరిత్రను, మన ఘనతను, మన సంస్కృతిని మన పిల్లలకు నేర్పే స్వాతంత్ర్యం దక్కని దరిద్రం మనది. పంచతంత్రం కథల పరిజ్ఞానం లేదు. భర్తృహరి సుభాషితం లేదు. పోతన భాగవతం లేదు. వేమన పద్యం లేదు. రామాయణ గాథ లేదు. మహాభారత కథ లేదు. మహాకవుల రచనలకు కూడా కులాలు అంటగట్టిన కుత్సిత మేధావులున్న సమాజం ఇది. చదువును మతమయం చేస్తున్నారని యాగీ చేసే ఛాందసవాద, బానిస భావజాలాల ఎర్రచొక్కాల వెర్రివాళ్లున్న దేశం మనది, వాళ్ల ఆదేశాలకు లొంగిపోయే సమాజం మనది!

పాశ్చాత్య ప్రపంచం నుంచి అవలక్షణాలను మాత్రమే అందిపుచ్చుకునే అపురూపమైన అలవాటున్న మనం.. అమలు చేసిన అద్భుత అసంబద్ధ విద్యావిధానమే మార్కు, ర్యాంకు, గ్రేడు! నేనే ముందుండాలి... నాకు మాత్రమే దక్కాలి... బాగా డబ్బులొచ్చే ఉద్యోగం సంపాదించాలి... అనే స్వార్థపరత్వాన్ని ఒకటో క్లాసు నుంచే నూరిపోసే ఈ విద్యావిధానం.. మన దేశాన్ని స్వార్థ సమాజంగా తయారుచేసింది. తల్లిదండ్రులను మేడమీదికి తీసుకెళ్లి, కిందకు తోసి చంపేసి, వదిలించుకునేంత త్యాగశీలురను తయారు చేసింది. ఏడో తరగతిలోనే టీచర్‌ను రేప్ చేస్తానని మెయిల్ పెట్టేంత టెక్నికల్ నాలెడ్జ్‌ను ఇచ్చింది. 'ఇక్కడైతేనే నీ భవిష్యత్తు బాగుంటుంది అంటూ ఏడుస్తున్న పిల్లాడిని చిన్నప్పుడే హాస్టల్లో వదిలేస్తారు తల్లిదండ్రులు. ఇక్కడైతేనే మీ భవిష్యత్తు బాగుంటుంది అంటూ ఏడుస్తున్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు పెద్దయ్యాక కొడుకు. ఇది మనం నేర్పిన విద్యే కదా. చర్యకు ప్రతిచర్య సహజమూ, సమానమే కదా' అంటూ యూటీఎఫ్ సభల్లో ఓ ఉపాధ్యాయుడు చేసినప్రసంగం వాట్సాప్‌లో దొరికితే వినండి ఒకసారి!

సృజనాత్మకతకు పుట్టినిల్లైన దేశంలో... ఆకాశమంత ఆశయాలుండే సృజనశీలురైన పిల్లల్లో.... ఆలోచనలను చంపేసి, తర్కాన్ని తుడిచేసి, ఇంగ్లిషును నింపేసి, మెదడును కార్పొరేట్ మ్యాపింగ్ చేసి, సెల్ఫిష్‌నెస్ అనే కోడ్ రాసి, సంపాదన అనే ప్రోగ్రామింగ్ ఇచ్చి, చివరికి మనం తయారు చేస్తున్నది ఎవరినీ అంటే.. కంపెనీలకు నిలువు జీతగాళ్లుగా పనిచేసే బానిసలను! డబ్బే సర్వస్వంగా చదివిన చదువుతో సంపాదించే సొమ్మును ఖర్చుపెడుతున్నది ఎవరికీ అంటే... కార్పొరేట్ కంపెనీల గాడ్జెట్లకు, లేదా కార్పొరేట్ ఆసుపత్రులకు!!

గనిలో రంగు రాయి ఉంటుంది. దాన్ని వజ్రమని గుర్తించాలి. అతి జాగ్రత్తగా సానబట్టాలి. అత్యంత నైపుణ్యంతో కట్ చేయాలి. తరుగు పోకుండానే మెరుగులద్దాలి. అప్పుడే అది జాతి రత్నంగా బయటకు వస్తుంది. తరతరాలు చరితలో నిలిచిపోతుంది. పిల్లలూ వజ్రాల్లాంటివాళ్లే! వాళ్లు జాతి రత్నాలు కావాలన్నా అంతే! దీన్ని గుర్తించకుండా, అడ్డగోలుగా కట్ చేస్తే, అదే పనిగా అరగదీస్తే ఆనవాలే లేకుండా కరిగిపోతారు. 'ఆత్మహత్య'గా మిగిలిపోతారు. ఇప్పుడు జరుగుతున్నది అదే. తస్మాత్ జాగ్రత్త!

చివరాఖరు: గాఢమైన నమ్మకాలే ఆలోచనలవుతాయి. ఆలోచనలే ఆచరణలవుతాయి. ఆచరణలే అలవాట్లవుతాయి. అలవాట్లే వ్యక్తిత్వంగా మారతాయి. వ్యక్తిత్వమే గమ్యాన్ని చేరుస్తుంది. గమ్యాన్ని చేర్చేది నమ్మకమే అన్నాడు వివేకానంద స్వామి. పిల్లల్ని నచ్చింది నమ్మనివ్వండి. తామేం కావాలో కలలు కనాల్సింది పిల్లలు. మనం కాదు!

■ కృ.తి.
kruthi1972@gmail.com



నాయకుడు @ 40

(మొదటి పేజీ తరువాయి)

చీలిపోయింది. ఆవు దూడ కాంగ్రెస్ అలా ఉండిపోగా... హస్తం గుర్తుతో 'ఇందిరా కాంగ్రెస్' ఏర్పాటయింది. రాష్ట్రంలో అప్పటికే దిగ్గజాలు అనుకున్న నేతలు తలా ఒక వైపు వెళ్లిపోయారు. కొందరు జనతాకు జై కొట్టారు. మరి కొందరు పాత కాంగ్రెస్‌లో ఉండిపోయారు. కొందరు మాత్రమే సాహసించి ఇందిరా కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఒక వైపు ఎమర్జెన్సీ, మరోవైపు పార్టీలో చీలికలు, ఇంకో వైపు కేంద్రంలో అధికార పార్టీగా జనతా! ఇలాంటి పరిణామాల మధ్య.. 1978 ఫిబ్రవరి 25న అంటే.... సరిగ్గా నేటికి 40 ఏళ్ల కిందట రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ఇందిరా కాంగ్రెస్‌కు అభ్యర్థులు దొరుకుతారా? ప్రత్యర్థుల అవహేళన! స్వయంగా ఆ పార్టీలోనే సందేహాందోళనలు! తనకు కంచుకోటలాంటి ఆంధ్రప్రదేశ్‌ను వదులుకోవడానికి ఇందిరా గాంధీ ఏమాత్రం సిద్ధంగా లేరు. కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు! సరికొత్త మంత్రం జపించారు. అదే... 'యువ'! అప్పటిదాకా రాజకీయం ఎరుగని, ఉత్సాహవంతులైన నవ యువతకు 20 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారు. అయినా సరే... కొందరు భయపడ్డారు. మరి కొందరు భవిష్యత్తు ఉండదనుకున్నారు. 'ఇందిర పార్టీ తరఫున పోటీకి రాము బాబోయ్' అని అభ్యర్థులు భయపడిన నియోజకవర్గాల్లో... చిత్తూరు జిల్లా చంద్రగిరి ఒక్కటి! అలాంటి చోట...

నేనున్నానంటూ...

'1978 ఎన్నికల్లో పోటీ చేయాలి! గెలవాలి'.... అంటూ అంతకు రెండేళ్ల ముందు నుంచి వ్యూహాత్మక అడుగులు వేస్తున్న నవ యువకుడు! ఇందిర ప్రకటించిన '20 శాతం కోటా'కు సరిజోడు! 'నేను పోటీ చేస్తాను' అంటూ ముందుకొచ్చాడు! ఇందిరా కాంగ్రెస్‌కు అంతకు మించిన మంచి ప్రత్యామ్నాయం లేదు! ఆ పార్టీ తరఫున ఆయనే... అభ్యర్థి అయ్యారు! ఆయనే... నారా చంద్రబాబు నాయుడు! జిల్లాకు... ఆ మాటకొస్తే ఆ నియోజకవర్గానికే కొత్తముఖం! ఎస్వీ యూనివర్సిటీలో మాత్రమే వినిపించిన పేరు! మరోవైపు... జనతాపార్టీ తరఫున బలమైన ప్రత్యర్థి పట్టాభిరామ చౌదరి! చిత్తూరు జిల్లాలోనే పేరున్న నాయకుడు! పెద్దమనిషిగా అందరికీ సుపరిచితుడు! ఇక... నియోజకవర్గంలో బలాబలాలు చూస్తే! అంతకు 11నెలల ముందు చిత్తూరు ఎంపీగా ఇందిరా కాంగ్రెస్ తరఫున రాజగోపాల్‌నాయుడు 10వేల మెజారిటీతో గెలిచారు. అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆయనదే ఆధిపత్యం. ఒక్క చంద్రగిరిలో మాత్రం... ఇందిరా కాంగ్రెస్‌కు ఆరువేలకు పైగా ఓట్ల 'మైనస్'! అలాంటి చోట... పట్టాభిలాంటి నాయకుడితో ఒక నవ యువకుడు చంద్రబాబు పోటీ! పెద్ద పెద్ద నాయకులెవరూ ప్రచారానికి రాలేదు! అలా ఎవరో వస్తారని, ఏదో చేస్తారని చంద్రబాబు కూడా ఆశించలేదు. తన యువ మిత్రులు, అనుచరులతో జన క్షేత్రంలోకి దిగారు. ఇంటింటికి తిరిగారు. జనతా ప్రభంజనాన్ని పట్టించుకోకుండా సాగారు. గెలుపే లక్ష్యంగా సూటిగా అడుగులు వేశారు. 40 ఏళ్ల క్రితం ఇదే రోజున పోలింగ్ జరిగింది. జనం తీర్పు బ్యాలెట్ బాక్సులో నిక్షిప్తమైంది.

రెండు రోజుల తర్వాత..

చంద్రగిరి ఓటరు మాట ఏమిటి? వారు ఎవరికి జై కొట్టారు? పాతతరం రాజకీయానికా? సరికొత్త నవ యువ తరానికా? అంతటా ఉత్కంఠ! 40 ఏళ్ల క్రితం బ్యాలెట్ పెట్టెల్లో 'స్వస్తిక్' ముద్ర రూపంలో నిక్షిప్తమైన జనం మాట! రెండు రోజుల తర్వాత... అంటే 1978 ఫిబ్రవరి 27న బయటపడింది. చంద్రగిరి నియోజకవర్గం చంద్రబాబుకు జై కొట్టింది. అంతకు 11నెలల ముందు ఇందిరా కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఆరు వేలకుపైగా ఉన్న లోటును అధిగమించి... 2494 ఓట్ల మెజారిటీతో చంద్రబాబు గెలిచారు. ఆ ఎన్నికల్లో ఈ ఫలితం ఇందుకు భిన్నంగా వస్తే ఏం జరిగేది? చంద్రబాబు భవిష్యత్తు ఎలా ఉండేది? ఇది చరిత్రకు సంబంధించిన ఊహాత్మక ప్రశ్న! కానీ... చంద్రబాబును గెలిపించి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు రాష్ట్రానికి ఒక నాయకుడిని ఇచ్చారు! అదే చంద్రబాబు ఇంతింతై ఎదుగుతారని వారూ ఊహించి ఉండరు! వ్యక్తిగా చంద్రబాబు వయసు 66 సంవత్సరాలు! జన నాయకుడిగా ఆయన వయసు నలభై సంవత్సరాలు!



ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన సభలో మాట్లాడుతున్న జగన్

రేషన్‌కు చంద్రబాబు కోత

▸▸ మేమొస్తే టైమ్ స్కేల్‌తో 'కాంట్రాక్టు'కు పర్మినెంట్: జగన్

కనిగిరి, ఫిబ్రవరి 24: "చంద్రబాబు పాలన అవినీతిమయంగా మారింది. అవినీతి సొమ్ముతో మా పార్టీ ఎమ్మెల్యేలను పశువుల్లా కొంటూ, చట్టాలను, వ్యవస్థలను దిగజారుస్తున్నారు. మోసాలు, అధికార దుర్వినియోగం, బూటకపు ఎన్నికల హామీలతో ఆయన నాలుగేళ్ళపాలన కొనసాగింది" అని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం ప్రకాశం జిల్లాలో ప్రజా సంకల్పయాత్రలో భాగంగా కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. "వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రేషన్‌షాపుల్లో రూ. 185కు పది రకాల సరుకులు దొరికేవి. చంద్రబాబు పాలనలో మాత్రం బియ్యం ఒక్కటే ఇస్తూ, వేలిముద్రల పేరుతో ఆ సరుకుకీ కోతలు పెడుతున్నారు. రైతుల రుణాలు మాఫీ చేస్తామన్న హామీని పూర్తిగా అమలు చేయలేదు" అని జగన్ అన్నారు.

ఏపీ కోసం బడ్జెట్‌లో సవరణలు: రఘువీరా



మడకశిర/అమరావతి, ఫిబ్రవరి 24: కేంద్ర బడ్జెట్‌లో సవరణలు తీసుకొచ్చి ప్రత్యేక హోదాతో పాటు, విభజన చట్టంలోని అంశాలన్నిటికీ నిధులు కేటాయించాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశానని అనంతపురం జిల్లా నీలకంఠాపురంలో శనివారం తెలిపారు. ఏపీకి కేంద్రం రూ.5 లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ రూ.12 వేల కోట్లే ఇచ్చారని.. ఇది అత్యంత దారుణమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి అడుగూ రాజకీయ లబ్ధి కోసమే వేస్తారని ఆరోపించారు. బీజేపీ నుంచి విడాకులు తీసుకునేందుకు ఆయనకో సహేతుకమైన కార ణం కావాలని.. నిధులు రాకపోవడాన్ని సాకుగా వాడుకుంటున్నారని అన్నారు. ప్రత్యేక హోదా కావాలనే నిజాయితీ ఆయనకు లేదని.. అది ఉండి ఉంటే నాలుగేళ్ల వ్యతిరేకించి.. ఇప్పుడు ఒక్కసారిగా హోదా మా హక్కు అంటుంటే చిన్న పిల్లలు సైతం నవ్వుతున్నారని ఎద్దేవాచేశారు.

విజయసాయి ఆరోపణలు దుర్మార్గం: సునీత



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారులపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేయడం దుర్మార్గపు చర్యగా మంత్రి సునీత వ్యాఖ్యానించారు. శనివారం అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారులు తమ ధర్మాన్ని పాటిస్తుంటారని, రాష్ట్రాభివృద్ధిలో కీలక బాధ్యతలు చేపడుతుంటే వారిపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. 'వైఎస్ పాలనలో మీరు చేసిన అవినీతి, అక్రమాల వల్ల పలువురు ఐఏఎస్‌లు జైలుబాట పట్టారు. అలాంటి మీరు అధికారులను విమర్శించడమా?' అని ప్రశ్నించారు. ఎన్ని జన్మలెత్తినా జగన్ సీఎం కాలేడని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే వైసీపీకి పడుతుందని సునీత అన్నారు. కాగా, వైసీపీ అధికారంలోకి వచ్చేది లేదు.. మా అంతు చూసేదీ లేదు... అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలన్నారు. వైసీపీని కూకటివేళ్లతో పెకిలించివేస్తామన్నారు. ఎమ్మెల్యేలను హవాలా పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తా ము అధికారంలో ఉన్న సంగతి మరచిపోతున్నారని ఎమ్మెల్యే హెచ్చరించారు. కాగా, ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై అవిశ్వాసం పెడతానని ప్రకటించిన జగన్ ఓ పెద్ద డ్రామాకు తెరలేపారని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ మండిపడ్డారు.

గుంతకల్ రైల్వేజోన్ ఏర్పాటు చేయండి: పిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే డివిజన్‌ను ప్రత్యేక రైల్వేజోన్‌గా ప్రకటించాలని కోరుతూ గుంతకల్‌కు చెదిన కె. శ్రీనివాస చౌదరి శనివారం హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషన్‌లో రైల్వే మంత్రిత్వశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో అనంతపురం ఒకటని పేర్కొన్నారు. గుంతకల్ రైల్వే స్టేషన్‌ను 140 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారని, రైల్వే డివిజన్ ఏర్పడి 60 ఏళ్లు గడిచిందని వెల్లడించారు. గుంటూరు, విజయవాడ నగరాలు అభివృద్ధి చెందాయని, అక్కడ ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటుకు కావాల్సిన భూములు కూడా లేవని పేర్కొన్నారు. గుంతకల్ డివిజన్‌లో తక్కువ ధరకే కావాల్సినంత భూమి లభిస్తుందని, రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం గుంతకల్‌లో రైల్వే జోన్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందే అవకాశముందని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశముంది.

కేంద్రంతో తేల్చుకుంటాం: అంబికా కృష్ణ



విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదంటూ ప్యాకేజీ ఇస్తామన్న కేంద్రం.. ఇప్పుడు దాన్నీ ఇవ్వడం లేదని రాష్ట్ర చలన చిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ అన్నారు. విజయవాడలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ప్రత్యేక హోదా లేదని చెప్పిన కేంద్రం... మళ్లీ రెండు రాష్ట్రాలకు హోదా పొడిగించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఇప్పటికీ ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలపై నమ్మకం ఉందన్నారు. పార్లమెంటు సెషన్లలో రాష్ట్రానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు కల్పించకపోతే పోరాటానికి సిద్ధమవుతామన్నారు.

నేనుండగా అన్యాయమా?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పై వ్యాఖ్య చేశారు. 'గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు రాయలసీమలో జరుగుతోంది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కంపెనీ కియా కార్ల ఫ్యాక్టరీని అనంతపురంకు తెచ్చాం. సెల్ ఫోన్ల తయారీలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్న ఫాక్స్‌కాన్ కంపెనీని చిత్తూరు జిల్లాకు తెచ్చాం. ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో రాయలసీమకు నీళ్లిచ్చాం. ఇవన్నీ ప్రజలు చూస్తూనే ఉన్నారు' అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీ పోరాడుతుంటే రాయలసీమ పేరుతో బీజేపీ నాటకాలు ఆడుతోందని ఈ సందర్భంగా టీడీపీ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించారు. నాలుగేళ్లుగా మౌనంగా ఉన్న బీజేపీకి ఇప్పుడు హఠాత్తుగా రాయలసీమ గుర్తుకొచ్చిందన్నారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని టీడీపీ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తడంతో ఆ సమస్యను పక్కదారి పట్టించడానికి ఈ అంశాన్ని లేవనెత్తినట్లు కనిపిస్తోందని మరో ఎంపీ విమర్శించారు.

రాయలసీమపై నిజంగా బీజేపీ నేతలకు ప్రేమ ఉంటే సుప్రీం కోర్టు బెంచ్‌ను కర్నూలులో పెట్టించాలని ఒక నేత సూచించారు. 'కేంద్రంలో ఆ పార్టీకి పూర్తి మెజారిటీ ఉంది. మరెవరి మద్దతూ అక్కర్లేదు. దక్షిణాదిలో సుప్రీం కోర్టు బెంచ్ కావాలని అన్ని దక్షిణాది రాష్ట్రాలు ఎంతో కాలంగా కోరుతున్నాయి. దానిని కర్నూలులో పెట్టించండి. దేశ రెండో రాజధానిని అమరావతిలో పెట్టించండి. మీ చేతిలో ఉన్నవి మీరు చేసి.. తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తే బాగుంటుంది' అని ఆయన హితవు పలికారు.

23 ఏళ్లు వాళ్లే..: రాష్ట్రంలో పాలనాధికారంపై కూడా టెలికాన్ఫరెన్స్‌లో ప్రస్తావన వచ్చింది. 'ఉమ్మడి రాష్ట్రంలోనూ.. నవ్యాంధ్రలోనూ రాజకీయ అధికారం రాయలసీమ వాసుల చేతుల్లోనే ఉంది. 1995 నుంచి ఇప్పటి వరకూ ఈ 23 ఏళ్లలో కొన్ని నెలల పాటు రోశయ్య మినహా అందరు సీఎంలూ రాయలసీమకు చెందిన వారే. సర్వాధికారంతో వారు పని చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి.. ప్రతిపక్ష నేత ఇద్దరూ రాయలసీమ వాళ్లే. బాధపడితే ఇతర ప్రాంతాలవారు బాధపడాలి తప్ప సీమలో ఉన్న నేతలు ఎలా మాట్లాడతారు' అని ఉత్తరాంధ్రకు చెందిన ఒక నేత ప్రశ్నించారు.

వ్యక్తిగత విమర్శలు చేయొద్దు

ఏదైనా అంశంపై సమాధానమివ్వాలి తప్ప బీజేపీ నేతలపై వ్యక్తిగత విమర్శలు చేయవద్దని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. విభజన హామీల అమలు విషయంలో పార్టీ వైఖరి ఎలా ఉండాలో కొన్ని సూచనలు చేశారు. 'రాష్ట్ర ప్రయోజనాలే మనకు ప్రధాన ఎజెండా. కేంద్రంపై ఒత్తిడైనా.. పోరాటమైనా అందుకోసమే. రాజకీయ ప్రయోజనాలకు తావు లేదు. విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా చూస్తామన్న కేంద్రం తన మాట నిలబెట్టుకోకపోవడం వల్లే మనకు పోరాటం తప్పడం లేదు. ఇవే విషయాలను ప్రజలకు వివరించండి. ఈ పరిమితుల్లోనే మీరు మాట్లాడండి. న్యాయం చేయాలనే కేంద్రాన్ని కోరుతున్నాం తప్ప మనకు వేరే డిమాండ్లు లేవు. ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నదే మన ప్రధాన డిమాండ్' అని ఆయన పేర్కొన్నారు.

హైకోర్టు బెంచ్‌కు సీఎం సానుకూలం: కాల్వ



కర్నూలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు 35 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. వారి కోరిక న్యాయమైనది. ఇక్కడ హైకోర్టు లేదా హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారు' అని సమాచార, గ్రామీణ గృహనిర్మాణ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కర్నూలు టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'రాజధాని, హైకోర్టు, రాజ్‌భవన్ ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు. సీమలో హైకోర్టు ఏర్పాటుపై సీఎం ఇప్పటికే చర్చించారు. న్యాయవాదులు విధులకు హాజరు కావాలి' అని కోరారు. సీమ అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. 'అనంతపురంలో ప్రపంచంలోనే కియో కార్ల పరిశ్రమ తెచ్చిన ఘనత చంద్రబాబుదే. పట్టిసీమ ప్రాజెక్టు వల్ల గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు ఇచ్చి.. కృష్ణా జలాలను ఈ ఏడాది 160 టీఎంసీలు రాయలసీమ కు ఇచ్చాం.' అని పేర్కొన్నారు.

అమరావతికే నిధులివ్వలేదు..

రెండో రాజధానా?

▸▸ బీజేపీ తీరు హాస్యాస్పదం: మంత్రి ఆనందబాబు


▸▸ వైసీపీ బడి నుంచి వీర్రాజు బయటకు రావాలి: ఎమ్మెల్సీ ఆదిరెడ్డి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): అమరావతికే నిధులు ఇవ్వని బీజేపీ... రాయలసీమలో రెండో రాజధాని అనడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి నక్కా ఆనందబాబు ఎద్దేవా చేశారు. గుంటూరులో టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ పార్టీగా ఉండి ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే ధోరణి మానుకోవాలని రాష్ట్ర బీజేపీ నాయకులకు హితవు పలికారు. సీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో ఉంటే ఇప్పటి వరకూ కేంద్రం రూ.50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొందని మండిపడ్డారు. రాయలసీమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, మూడున్నరేళ్లలో అనేక పరిశ్రమలు సీమలో ఏర్పాటు చేశామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ఇరిగేషన్ ప్రాజెక్టులను మూడు నెలల్లో ప్రారంభించి జాతికి అంకితం చేస్తామన్నారు. వీటిలో సీమ ప్రాజెక్టులు 18 ఉన్నాయని తెలిపారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని సోము వీర్రాజును మిత్రధర్మం పాటించి ఎమ్మెల్సీని చేస్తే ఆయన వైసీపీ ఏజెంట్‌గా పని చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలి కొత్తపేటలోని ట్రావెలర్స్ బంగ్లాలోనూ మంత్రి మీడియాతో మాట్లాడారు. తెలుగు ప్రజల పౌరుషాన్ని ఢిల్లీ వీధుల్లో చూపిస్తామని, హోదా కోసం ఏ త్యాగానికైనా, ఎలాంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. కాగా, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు వైసీపీ బడి నుంచి బయటకు వచ్చి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మాట్లాడారు. ధర్మాన్ని స్థాపించాలని సోము అంటున్నారని... అయనేమైనా శ్రీకృష్ణ పరమాత్ముడా లేక కేంద్రంలో అధర్మం జరుగుతోందా అని ప్రశ్నించారు. వీర్రాజు తీరు చూస్తుంటే భవిష్యత్తులో వైసీపీతో అంటకాగే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకరన్ కూడా కూడా వీర్రాజుపై ఆరోపణలు చేశారు. వీర్రాజు వైసీపీకి కోవర్టులా, పెయిడ్ ఆర్టిస్టులా పనిచేస్తున్నారన్న అనుమానం కలుగుతోందన్నారు.

కుంభకోణాల కాలం!

బ్యాంకు లూటీ



▸▸ తాజాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వంతు

▸▸ ఢిల్లీ వ్యాపారి రూ.9.5 కోట్లకు ముంచాడు

▸▸ సీబీఐకి ఫిర్యాదు చేసిన బ్యాంకు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: మొన్న పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల కుంభకోణం.. నిన్న ఓబీసీలో రూ.390 కోట్లు.. నేడు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.9.50 కోట్లు.. దేశంలో కుంభకోణాల కాలం నడుస్తోంది! వరసగా ఒక్కో బ్యాంకులో భారీ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. పీఎన్‌బీ కుంభకోణం మరవకముందే.. ఢిల్లీకి చెందిన ద్వారకాదాస్ సేథ్ ఇంటర్నేషనల్ అనే వజ్రాల సంస్థ తమను రూ.390 కోట్లకు ముంచేసిందని ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు చేసింది. దీనిపై సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రనూ ఢిల్లీకి చెందిన వ్యాపారే మోసగించడం గమనార్హం. ఆశీర్వాద్ చైన్ సహ యజమాని అమిత్ సింగ్లా నకిలీ పత్రాలతో తమను మోసగించి రూ.9.5 కోట్ల రుణం తీసుకున్నాడని సీబీఐకి ఫిర్యాదు చేసింది. సింగ్లా మూడు ఆస్తులకు సంబంధించిన ఫోర్జరీ పత్రాలను సమర్పించడంతో పాటు ఆస్తుల విలువను పెంచి రూ.18 కోట్లుగా చూపి కుట్రపూరితంగా రుణం పొందారని ఆరోపించింది. తమ విచారణలో వాటి వాస్తవ మార్కెట్ విలువ రూ.2.5కోట్లని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

నీరవ్, చోక్సీ పాస్‌పోర్టులు రద్దు

▸▸ రూ.523 కోట్ల నీరవ్ స్థిరాస్తుల జప్తు

▸▸ వర్లీ పెంట్‌హౌస్ విలువ రూ.81 కోట్లు

▸▸ పీఎన్‌బీ ఎండీని ప్రశ్నించిన సీబీఐ



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 24: నీరవ్ మోదీ, చోక్సీల పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం రద్దు చేసింది. ఈడీ సూచనతో ఫిబ్రవరి 16న వారిద్దరి పాస్‌పోర్టులను తాత్కాలికంగా సస్పెండ్ చేసి, వారంలో వివరణ ఇవ్వాలని కోరడం తెలిసిందే. ఆ గడువు తీరడంతో పీఎన్‌బీ కుంభకోణం సూత్రధారులైన నీరవ్, చోక్సీల పాస్‌పోర్టులను రద్దు చేసింది. నీరవ్, అతని గ్రూపునకు చెందిన 21 స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది. వీటి విలువ రూ.523 కోట్ల పైమాటే. తాజా చర్యలతో నీరవ్ రూ.11,400 కోట్ల కుంభకోణం కేసులో ఈడీ జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.6,393 కోట్లకు చేరింది. శనివారం పీఎన్‌బీ ఎండీ సునీల్ మెహతా, ఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను సీబీఐ ప్రశ్నించింది. ఈ కుంభకోణంలో ప్రమేయమున్న 64 మంది ఆస్తులను జప్తు చేసేందుకు కార్పొరేట్ మంత్రిత్వ వ్యవహారాల శాఖ.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. చోక్సీ ప్రమోటర్‌గా ఉన్న గీతాంజలి జెమ్స్‌కు చెందిన 144 బ్యాంకు ఖాతాలను, రోటొమ్యాక్ గ్రూపునకు చెందిన 14 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. రోటొమ్యాక్ అధిపతి విక్రమ్ కొఠారీ, ఆయన తనయుడు రాహుల్‌ను సీబీఐ అధికారులు లఖనవ్‌లోని స్పెషల్ జడ్జి కోర్టులో హాజరుపరచారు. తండ్రీకొడుకులను 11 రోజుల సీబీఐ కస్టడీకి అప్పగించింది. కాగా, పీఎన్‌బీ కుంభకోణంలో నిందితుడు మెహుల్ చోక్సీ కూడా ఉద్యోగులను వేరే ఉపాధి చూసుకోమన్నాడు.

వజ్రాల తరలింపునకు ఏర్పాట్లు

మహేశ్వరం, ఫిబ్రవరి 24: నీరవ్ మోదీ కేసు దర్యాప్తులో భాగంగా రావిర్యాల గీతాంజలి గ్రూపు డైమండ్ జువెలరీ యూనిట్‌లో స్వాధీనం చేసుకున్న వజ్రాభరణాల విలువ లెక్కింపు కొనసాగుతోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని రాజీవ్ జెమ్స్ పార్కులో ఈ యూనిట్ ఉంది. పహడీషరీఫ్ పోలీసుల సహకారంతో ఈడీ అధికారులు శనివారం ఇక్కడ వజ్రాభరణాల విలువ అంచనా ప్రక్రియ చేపట్టారు.



అథణి సభలో అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ

కర్ణాటక నుంచే ముక్త బీజేపీ

మోదీ పాలనలో అన్నీ స్కాంలే: రాహుల్

▸▸ ఖరీదైన 'కాపలాదారు' స్కాంలు పసిగట్టలేదే: సిబల్

బెంగళూరు/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మరోసారి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా 'బీజేపీ ముక్త'కు శ్రీకారం చుడదామని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. బెళగావి జిల్లా అథణి నుంచి రెండో విడత జనాశీర్వాద యాత్రకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. అన్నదాతలకు రుణమాఫీ సాధ్యం కాదని ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. విజయ్‌మాల్యా, లలిత్ మోదీ, నీరవ్ మోదీ, కొఠారీ లాంటి వారు వేలకోట్లు మోసం చేసి దేశం విడిచి పరారవ్వడానికి కారణమైందని మండిపడ్డారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. ప్రధాని బృందం ఎన్ని వ్యూహాలు పన్నినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు రాహుల్ 'మోదీ పాలనలో జన్‌ధన్ లూట్ యోజన కింద మరో స్కాం బయటపడింది' అని ట్విటర్‌లో ఆరోపించారు. కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. 'దేశానికి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాపలాదారు(ప్రధాని) ఉండగా ఇన్ని బ్యాంకు కుంభకోణాలు ఎలా జరుగుతున్నాయో?' అని వ్యాఖ్యానించారు.

తమిళనాడుకు అండగా ఉన్నాం!

▸▸ ఇప్పటివరకూ రూ.1.80 లక్షల కోట్లు ఇచ్చాం: మోదీ



చెన్నై, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు కేంద్రం అండగా ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు తమిళనాడుకు రూ.1.80 లక్షల కోట్లు ఇచ్చామని, ఇది యూపీఏ ప్రభుత్వం కంటే 110 శాతం అధికమని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత 70వ జయంతిని పురస్కరించుకుని రూ.25వేల సబ్సిడీతో తమిళనాడ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అమ్మ స్కూటీ' పథకాన్ని ప్రధానమంత్రి శనివారం చెన్నైలో లాంఛనంగా ప్రారంభించారు. 70 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోలార్ పవర్, జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామీణాభివృద్ధి పథకాల కోసం రూ.24వేల కోట్లు కేటాయించామన్నారు కాగా, సుప్రీంకోర్టు తీర్పు మేరకు కావేరి మేనేజ్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం పళనిస్వామి... ప్రధాన మంత్రిని కోరారు. దేశాన్ని ఎంతో ధైర్యంతో ప్రధాని ముందుకు తీసుకెళ్తున్నా ఉప ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం కొనియాడారు. కాగా ప్రధాని మోదీ శనివారం కేంద్ర పాలిత ప్రాంతమైన డామన్‌లో పర్యటించారు.

ఆధార్‌పై గడువు పొడిగించలేం: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: బ్యాంకు ఖాతాలు, మొబైల్ ఫోన్లు, ఇతర సేవలకు ఆధార్ అనుసంధానం గడువును పెంచడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆధార్ అనుసంధానం గడువు మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో మరోసారి గడువు పెంచాలని న్యాయవాది శ్యాం దివాన్ పిటిషన్ దాఖలు చేశారు. గడువులోపు అన్ని సేవలకు ఆధార్ అనుసంధానం సాధ్యం కాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది.



ఈమె ఎవరో చెప్పుకోండి చూద్దాం..!

తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతిని పురస్కరించుకొని చెన్నైలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం వెలుపల ఆమె కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కానీ ఆ విగ్రహంలో జయ పోలికలు అస్సలు లేవు. కేవలం చీర చెంగు పట్టుకొన్న తీరు చూసి ఆమెను జయ అనుకోవాలి. విగ్రహంలో 'అమ్మ' పోలికలు లేకపోవడం వివాదాస్పదమయ్యింది.

కరెంట్ అఫైర్స్

యుద్ధ విమానాన్ని నడిపిన తొలి భారత మహిళ

జాతీయం

భారత పర్యటనలో..

ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ



భారత పర్యటనకు వచ్చిన ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఫిబ్రవరి 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలోని హైదరబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరాన్‌లో ఆగ్నేయ ప్రాంతం చాబహార్‌లోని షాహిద్ బెహెష్తి పోర్టులోని కొంత భాగాన్ని 18 నెలల పాటు భారత్‌కు లీజుకు ఇవ్వడం, ద్వంద్వ పన్నుల నివారణ, వీసాలు, ఖైదీల అప్పగింత, సంప్రదాయ వైద్యం, ఆరోగ్య రంగం, వాణిజ్యం, వ్యవసాయ, అనుబంధ రంగాలు, పోస్టల్ సహకారం వంటి రంగాలకు సంబంధించి ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి.

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్ ఫిబ్రవరి 17 నుంచి భారత్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో ఆగ్రా, అహ్మదాబాద్, ముంబై, అమృత్‌సర్, ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో ట్రూడ్ పాలొన్నారు. ఫిబ్రవరి 23న ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరూ రక్షణ విభాగం, భద్రత, ఉగ్రవాద నిరోధక సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

కావేరీ జల్లాల్లో కర్ణాటక వాటా పెంపు

కావేరీ జలాల పంపకంపై సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. కావేరీ జల వివాదాల ట్రైబ్యునల్ కర్ణాటకకు కేటాయించిన నీటి వాటాను అదనంగా 14.75 టీఎంసీలు పెంచింది. ఆ మేరకు తమిళనాడుకు కేటాయింపుల్లో కోత విధిస్తూ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్‌ల ధర్మాసనం ఫిబ్రవరి 16న తీర్పు వెలువరించింది. కావేరీ ట్రైబ్యునల్ 2007లో ఆ నదీజలాలను తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి మధ్య పంచింది. మొత్తం 740 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అంచనా వేసి.. తమిళనాడుకు 419 టీఎంసీలు, కర్ణాటకకు 270, కేరళకు 30, పుదుచ్చేరికి 7 టీఎంసీల చొప్పున కేటాయిస్తూ.. 2013 ఫిబ్రవరి 19న గెజిట్‌లో నోటిఫై చేసింది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కర్ణాటక సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఐటీ పరిశ్రమకు ఆలవాలమైన బెంగళూరు తాగునీటి అవసరాలను తీర్చాల్సిన అవసరం ఉందని 465 పేజీల తీర్పులో బెంచ్ అభిప్రాయపడింది. తమిళనాడుకు 404.25 టీఎంసీలు, కర్ణాటకకు 284.75, కేరళకు 30, పుదుచ్చేరికి 7 టీఎంసీలను వాటాలుగా ఖరారుచేసింది. ట్రైబ్యునల్ అవార్డును సవరిస్తూ.. తన తీర్పు 15 ఏళ్ల అమల్లో ఉంటుందని పేర్కొంది.

అవినీతిలో 81వ స్థానంలో భారత్

ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ప్రపంచ అవినీతి సూచిలో భారత్ 81వ స్థానంలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 180 దేశాల్లో అవినీతి గురించి అధ్యయనం చేసిన ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఆయా దేశాలకు 0 నుంచి 100 వరకూ స్కోర్ ఇచ్చి ర్యాంకులు కేటాయించింది. ఇందులో భారత్ 40 పాయింట్లతో 81 వ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది జాబితాలో భారత్ 79వ స్థానంలో ఉంది. తాజా ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్, డెన్మార్క్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. చైనా 77వ స్థానంలో, పాకిస్థాన్ 117వ స్థానంలో ఉన్నాయి. సోమాలియా చివరి స్థానంలో నిలిచింది.

అంతరించిపోతున్న 40 భారతీయ భాషలు

దాదాపు 40 భారతీయ భాషలు, మాండలికాలు అంతరించి పోయే దశలో ఉన్నాయని జన గణన నివేదికలో వెల్లడైంది. ప్రస్తుతం 22 అధికారిక భాషలతో పాటు మరో వంద భారతీయ భాషలను లక్ష కంటే ఎక్కువ మంది మాట్లాడుతున్నారని, 42 భాషలను మాత్రం పది వేల కంటే తక్కువ మంది మాట్లాడుతున్నారని హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. వీటిలో అత్యధికంగా అండమాన్ నికోబార్ దీవుల్లోని 11 భాషలు, మణిపూర్‌లో 7, హిమాచల్ ప్రదేశ్‌లో 4, ఒడిశాలో 3, కర్ణాటక, ఏపీ, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, అసోంలో 2 భాషల చొప్పున, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మేఘాలయా, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కో భాష చొప్పున అంతరించి పోయే దశలో ఉన్నట్లు గుర్తించారు. యునెస్కో జాబితాలోనూ ఈ భాషలు ఉన్నాయని పేర్కొన్నారు.

ముంబై - పుణె మధ్య హైపర్‌లూప్ రైలు

2021 వరకు ముంబై - పుణె మధ్య ఈ హైపర్‌లూప్ రైలు అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ముంబై నుంచి పుణె మధ్య ఉన్న 150 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 20 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అమెరికాకు చెందిన వర్జిన్ హైపర్‌లూప్ సంస్థ, మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య ఫిబ్రవరి 18న ఒప్పందం కుదిరింది. పుణె నుంచి నవీ ముంబై ఎయిర్‌పోర్టు మార్గంలో ఈ రైలు ముంబైకి చేరుకునేలా రూపకల్పన చేశారు. ఇందు కోసం దాదాపు రూ.20వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. పూర్తి స్థాయి విద్యుత్‌తో నడిచే ఈ హైపర్ లూప్ రైలు.. ఏడాదికి 15కోట్ల మంది ప్రయాణికులను గమ్యాస్థానాలకు చేర్చాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. గంటకు 1,223 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలుతో 9 కోట్ల గంటల సమయం ఆదా కావడంతో పాటు 30 ఏళ్లలో రూ.3.5లక్షల కోట్ల లబ్ధి చేకూరుతుందట.

ఆస్తులతోపాటు ఆదాయ మార్గాలను కూడా వెల్లడించాలి



ఎన్నికల్లో పోటీచేసే నేతలు ఇక నుంచి తమ ప్రమాణ పత్రంలో కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతోపాటు ఆదాయ మార్గాలను కూడా వెల్లడించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫిబ్రవరి 16న ఇచ్చిన ఈ తీర్పులో జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పలు చర్యలను సూచించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారి భార్యాపిల్లల ఆస్తుల వివరాలను క్రమం తప్పకుండా సేకరించే యంత్రాంగాన్ని నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదాయ వనరులకు మించిన ఆస్తులు ఉన్నట్లు యంత్రాంగం పరిశీలనలో తేలితే తగిన చర్యలను సిఫార్సు చేయాలని, అభ్యర్థి కుటుంబ సభ్యుల ఆస్తులు, ఆదాయ వనరులు వెల్లడించకపోవడం ప్రజాప్రాతినిధ్య చట్టం - 1951లోని అవినీతి వ్యవహారాల కిందకు వస్తుందని తెలిపింది.

బొగ్గు రంగంలో భారీ సంస్కరణ

ప్రభుత్వం బొగ్గు రంగంలో మరో భారీ సంస్కరణను తీసుకువచ్చింది. వాణిజ్య అవసరాలకు బొగ్గును తవ్వుకునేందుకు ప్రైవేటు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 20న అనుమతినిచ్చింది. 1973లో బొగ్గు రంగాన్ని జాతీయికరణ చేసిన తరవాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియాకు మాత్రమే వాణిజ్య అవసరాలకు బొగ్గును విక్రయించుకునే అనుమతి ఉంది. ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలకు తమ సిమెంట్, ఉక్కు, విద్యుత్, అల్యూమినియం కర్మాగారాల్లో ఉపయోగించుకోడానికి మాత్రమే బొగ్గును తవ్వుకోడానికి అనుమతిస్తున్నారు.

జేఎన్‌పీటీలో 4వ టెర్మినల్ ప్రారంభం

ముంబై జవహర్‌లాల్ నెహ్రూ నౌకాశ్రయంలో రూ.7,900 కోట్లతో నిర్మించిన నాలుగో టెర్మినల్ ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 18న జాతికి అంకితం చేశారు. ఇది సరుకు రవాణా సామర్థ్యాన్ని 50 శాతం పెంచుతుంది. అదేరోజు నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు.

పెరిగిన ఆయుః ప్రమాణం

దేశంలో సగటు మనిషి ఆయుః ప్రమాణం పెరుగుతోంది. 1990తో పోల్చితే స్త్రీల జీవితకాలం 70.3 ఏళ్లు, పురుషుల జీవితకాలం 66.9 ఏళ్లకు పెరిగింది. భారత వైద్య పరిశోధన మండలి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యూయేషన్ సంస్థలు సంయుక్తంగా చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 1990లో దేశవ్యాప్తంగా మహిళల సగటు జీవితకాలం 59.7 ఏళ్లుగా, పురుషుల జీవితకాలం 58.3 ఏళ్లుగా ఉంది. దేశవ్యాప్తంగా కొన్నేళ్లలో శిశు మరణాల రేటు బాగా తగ్గిందని ఈ నివేదిక వెల్లడించింది. 1990లో ప్రతి 1,000 మంది శిశువుల్లో 100 మంది వరకు మరణించగా.. ఇది 2016-17 నాటికి 39కి తగ్గినట్లు నివేదిక పేర్కొంది.

ఉత్తరాదిలో తొలి మహిళా రైల్వేస్టేషన్

రాజస్థాన్‌లోని జైపుర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్‌లో పోర్టర్ మొదలుకొని స్టేషన్ మాస్టర్ వరకు.. మొత్తం 40 మంది సిబ్బంది స్త్రీలే. దేశంలోనే పూర్తిగా మహిళా సిబ్బందితో నడుస్తున్న రెండో స్టేషన్‌గా ఇది ఘనత సాధించింది. ఫిబ్రవరి 19 నుంచే పూర్తిగా మహిళా ఉద్యోగులతో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించింది. ముంబయిలోని మాటుంగా స్టేషన్.. దేశంలోనే తొలి మహిళా రైల్వేస్టేషన్.

రాత్రి వేళల్లోనూ పృథ్వీ-2 పరీక్ష విజయవంతం

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వీ-2 క్షిపణి రాత్రి సమయాల్లోనూ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. ఫిబ్రవరి 21 రాత్రి 8.30 గంటల సమయంలో ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక (ఐటీఆర్) నుంచి దీన్ని ప్రయోగించినట్లు డీఆర్‌డీవో వర్గాలు వెల్లడించాయి.

ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సు

దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం, నాస్కామ్, విట్సా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ప్రపంచ ఐటీ కాంగ్రెస్ 22వ సదస్సును నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ వీడియో లింకేజీ ద్వారా ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల మంత్రులు, ఐటీ దిగ్గజాలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు.. మొత్తం 40 దేశాల నుంచి మూడువేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. సౌదీ అరేబియా పౌరసత్వం పొందిన రోబో సోఫియాఈ సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చే ఏడాది అక్టోబర్ 6వ తేదీ నుంచి 9 వరకు అర్మేనియాలో ప్రపంచ ఐటీ కాంగ్రెస్ 23వ సదస్సును నిర్వహిస్తారు. పరిశ్రమల ఒలంపిక్స్‌గా పేరుగాంచిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌కు 40 ఏళ్ల చరిత్ర ఉంది.

అగ్ని-2 పరీక్ష విజయవంతం

అణ్వస్త్ర సామర్థ్యమున్న మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను భారత్ ఫిబ్రవరి 20న విజయవంతంగా పరీక్షించింది. రెండు వేల కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అస్త్రాన్ని ఒడిశా తీరానికి చేరువలోని అబ్దుల్ కలాం దీవిలోని సమీకృత పరీక్ష వేదిక (ఐటీఆర్) నుంచి ప్రయోగించారు. అగ్ని-2లో అధునాతన దిక్సూచి వ్యవస్థ ఉంది. ప్రత్యేక ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ సాయంతో దీని పయనం సాగుతుంది. తాజా పరీక్షలో క్షిపణి గమనం మొత్తాన్ని అధునాతన రాడార్లు, టెలిమెట్రీ పరిశీలన కేంద్రాలు, ఎలక్ట్రో ఆప్టిక్ పరికరాలు, బంగాళాఖాతంలో నిర్దేశిత లక్ష్యం వద్ద మోహరించిన యుద్ధ నౌకలు పరిశీలించాయి. అగ్ని-2ను హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో అడ్వాన్స్ సిస్టమ్స్ లేబొరేటరీ అభివృద్ధి చేసింది.



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

సింగపూర్ ప్రజలకు బోనస్



సింగపూర్ ప్రభుత్వం ఆ దేశ ప్రజలకు బోనస్ ఇవ్వనుంది. 21 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరికీ మిగులు బడ్జెట్ నుంచి బోనస్ ఇవ్వనున్నట్లు ఆ దేశ ఆర్థికశాఖ మంత్రి హెంగ్ స్వీ కీట్ ఫిబ్రవరి 19న పార్లమెంటులో ప్రకటించారు. ఇలా ఒక్కొక్కరి ఖాతాలో బోనస్ రూపంలో ఈ ఏడాది చివరి నాటికి 300 సింగపూర్ డాలర్లు (దాదాపు రూ.14 వేలు) జమచేయనున్నట్లు తెలిపారు. 2017లో 7.60 బిలియన్ డాలర్ల మిగులు బడ్జెట్ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కీట్ వెల్లడించారు. 27లక్షల మందికి 'ఎస్‌జీ బోనస్'ల రూపంలో దాదాపు రూ.3400 కోట్లు ఖర్చు చేయనున్నారు.

చైనా భాషకు పాక్‌లో అధికారిక గుర్తింపు

చైనా భాష అయిన మాండరీన్‌కు పాక్ తమ దేశంలో అధికారిక హోదా ఇచ్చింది. మాండరీన్ భాషను అధికారిక భాషగా గుర్తించేందుకు పాకిస్థాన్ సెనేట్ అంగీకరించింది. గత 70ఏళ్లలో పాకిస్థాన్ నాలుగు భాషలకు అధికారిక గుర్తింపు ఇచ్చింది. స్థానిక భాషలను పక్కనబెట్టి ఉర్దూ, అరబిక్, ఇంగ్లీష్.. ఇప్పుడు చైనీస్ భాషను అధికారిక భాషగా గుర్తించింది. పాకిస్థాన్‌లో 44 శాతం మంది మాతృభాష పంజాబీ, 15.32శాతం మంది మాతృభాష పాష్తో, 14.5 శాతం ప్రజలు సింధి, 4 శాతం మంది ప్రజలు బలోచి మాట్లాడుతారు.

సౌదీలో అరుణ్‌జైట్లీ పర్యటన



ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 18, 19 తేదీల్లో సౌదీ అరేబియాలో పర్యటించారు. అందులో భాగంగా రియాద్‌లో సౌదీ రాజు సాల్మన్ బిన్ అబ్దుల్ అజీజ్‌తో సమావేశం అయ్యారు. ఇండియా సౌదీ అరేబియా జాయింట్ కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

వార్తల్లో వ్యక్తులు

యుద్ధ విమానాన్ని నడిపిన అవనీ



యుద్ధ విమానాన్ని నడిపిన తొలి భారతీయ మహిళగా అవనీ చతుర్వేది ప్రత్యేకత సాధించారు. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాన్ని ఆమె ఫిబ్రవరి 19న జామ్‌నగర్ స్థావరం నుంచి నడిపారు. భావనా కాంత్, మోహనా సింగ్ అనే మరో ఇద్దరు యువతులతో కలిసి అవనీ చతుర్వేది యుద్ధ విమానాల శిక్షణకు ఎంపికై తొలుత నడిపిన ఖ్యాతి దక్కించుకొంది. హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోనే శిక్షణ పొందింది.

తెలుగు యువకుడికి వర్జీనియా సైంటిస్ట్ అవార్డు



భారత సంతతికి చెందిన ఇద్దరు ఇండో - అమెరికన్లు పార్థిక్ నాయుడు, అరుణ్ జె సన్యాల్ ప్రతిష్ఠాత్మక వర్జీనియా సైంటిస్ట్ అవార్డు దక్కించుకున్నారు. పార్థిక్ నాయుడు 17 ఏళ్ల ప్రాయంలోనే కేన్సర్ వ్యాధిపై అధ్యయనం చేసేందుకు మెషీన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌ను రూపొంచినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. మానవ ఆరోగ్య మెరుగుదలకు విశేష పరిశోధనలు చేసిన వారిలో ఆరుగురిని 2018 ఔట్‌స్టాండింగ్ స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మాథ్స్) అవార్డుకు ఎంపిక చేసినట్టు వర్జీనియా గవర్నర్ రాల్ఫ్ నార్తమ్ తెలిపారు.

కామన్వెల్త్ యువ అవార్డుల జాబితాలో భారతీయులు

కామన్వెల్త్ యువ అవార్డులు - 2018 కోసం 20 మందితో రూపొందించిన అంతిమ జాబితాలో ఇద్దరు భారతీయులు చోటు దక్కించుకున్నారు. వారు మృణాళిని దయాళ్, యోగేష్‌కుమార్. ఢిల్లీ కేంద్రంగా 'హైయ్యా' పేరిట ప్రచార కార్యక్రమం చేపట్టే సంస్థను మృణాళిని స్థాపించారు. అవివాహితులైన మహిళలకు లైంగిక ఆరోగ్య సేవలందించడానికి కృషి చేస్తున్నారు. 'ఈవెన్ కార్గో' పేరిట యోగేశ్‌కుమార్ ఓ సామాజిక కంపెనీని స్థాపించారు. వాహనాలు నడపడానికి డ్రైవర్లుగా మహిళలకు శిక్షణ ఇప్పిస్తున్నారు. వీరిద్దరూ లింగ సమానత్వం కోసం పాటుపడుతున్నవారే కావడం విశేషం. ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, కరీబియన్, అమెరికా, పసిఫిక్ ప్రాంతాలతో పాటు కామన్వెల్త్ దేశాల నుంచి వచ్చిన 400 దరఖాస్తులను వడపోసి అంతిమంగా 20 మందిని ఎంపిక చేశారు. తమ సృజనాత్మక ప్రాజెక్టుల ద్వారా ఆయా జాతుల్లో చెప్పుకోదగ్గ ప్రభావవంతమైన మార్పునకు కారణమయ్యే 15 నుంచి 29 ఏళ్ల యువతకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు.

రాష్ట్రీయం

తెలంగాణ తొలి సీఈవోగా రజత్‌కుమార్



తెలంగాణ రాష్ట్ర తొలి ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో)గా రజత్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 19న ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన గతంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేశారు.

ఫైబర్ గ్రిడ్ ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన టీ ఫైబర్‌గ్రిడ్ ఇంటర్నెట్ సేవలు ఫిబ్రవరి 19న ప్రారంభమయ్యాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ సేవలను కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో కలిసి ఐటీ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

తెలంగాణలో పెరిగిన ఆయుః ప్రమాణం

తెలంగాణలో సగటు మనిషి ఆయుః ప్రమాణం స్త్రీల జీవితకాలం 73.2 ఏళ్లకు, పురుషుల జీవితకాలం 69.4 ఏళ్లకు పెరిగింది. భారత వైద్య పరిశోధన మండలి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యూయేషన్ సంస్థలు సంయుక్తంగా చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. తెలంగాణలో 1990లో సగటు జీవితకాలం మహిళల్లో 61.8 ఏళ్లు, పురుషులకు 60.2 ఏళ్లుగా ఉండగా.. 2016 - 17లో స్త్రీలలో 73.2 ఏళ్లకు, పురుషుల్లో 69.4 ఏళ్లకు పెరిగినట్లు ఈ నివేదిక తేల్చింది. శిశు మరణాల రేటు ప్రతి 1,000 మంది శిశువుల్లో 30కి తగ్గింది.

క్రీడలు

ఈఎస్‌పీఎన్ అవార్డులు



ఈఎస్‌పీఎన్ - క్రిక్ ఇన్ఫో ప్రకటించిన మొత్తం పది వార్షిక అవార్డుల్లో మూడింటిని భారత క్రికెటర్లు దక్కించుకున్నారు. గత ప్రపంచకప్ సందర్భంగా ఆస్ట్రేలియాపై తన కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ (171నాటౌట్) ఆడిన మహిళల టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ 'ఉమెన్స్ బ్యాటింగ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికైంది. ఇక పురుషుల విభాగంలో స్పిన్ ద్వయం కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్‌ను అవార్డులు వరించాయి. గతేడాది బెంగళూరులో మూడో టీ20 సందర్భంగా ఆస్ట్రేలియాపై 25 పరుగులకే 6 వికెట్లు పడగొట్టినందుకుగాను చాహల్ 'టీ20 బౌలింగ్ ఫెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్నాడు. ఇక ధర్మశాలలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్‌తో అరంగేట్రం చేసిన కుల్దీప్ యాదవ్ ఏడాదిలో మూడు ఫార్మాట్లలో 43 వికెట్లు పడగొట్టి 'డెబ్యూటెంట్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికయ్యాడు.

వన్డే సిరీస్ విజేత భారత్



భారత్ - దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫిబ్రవరి 16న ముగిసిన ఆరు వన్డే మ్యాచ్‌ల క్రికెట్ సిరీస్‌ను భారత్ 5-1 అధిక్యంతో గెలుచుకుంది. తొలి సారి భారత్ దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్‌ను నెగ్గింది.

రోటెర్‌డామ్ టోర్నీ విజేత ఫెడరర్

రోటెర్‌డామ్ ఏబీఎన్ అమ్రో వరల్డ్ టోర్నమెంట్‌లో రోజర్ ఫెడరర్ విజేతగా నిలిచాడు. ఫిబ్రవరి 18న జరిగిన ఫైనల్లో గ్రిగర్ దిమిత్రోవ్‌ను ఓడించి ఫెడరర్ మూడోసారి విజేతగా నిలిచాడు. ఓవరాల్‌గా అతనికిది 97వ టైటిల్.

కౌన్సెలింగ్

ఫిజిక్స్‌లో స్పెషలైజేషన్స్

ప్ర: ఇంటర్మీడియెట్ (ఎంపిసి) పూర్తి చేశాను. ఫిజిక్స్ అంటే ఆసక్తి. ఏ సంస్థ నుంచి ఎటువంటి కోర్సు చేస్తే మంచిదో తెలపండి?

- అడుసుమిల్లి రాజశేఖర్, గుంటూరు

జ: ఫిజిక్స్‌లో ఆసక్తి ఉండడమనేది మంచి విషయం. ఫిజిక్స్ ప్రధానాంశంగా చాలా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ ప్రధానంగా రెండు మార్గాలను సూచిస్తున్నా. ఫిజిక్స్‌లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సును ఎంచుకోవచ్చు. లేదంటే బీఎస్సీ చేసి తరవాత ఏదైనా యూనివర్సిటీ నుంచి పీజీ చేయవచ్చు.

- తెలుగు రాష్ట్రాల్లోని అన్ని యూనివర్సిటీలు యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిల్లో ఫిజిక్స్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి.
- పాండిచ్చేరి యూనివర్సిటీ - ఫిజిక్స్ విభాగం అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ (ఫిజిక్స్) కోర్సును అందిస్తోంది. ఈ కోర్సును సీబీసీఎస్ (ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్) విధానంలో నిర్వహిస్తారు. ఇక్కడ అత్యాధునికమైన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. ఈ యూనివర్సిటీలో రెండేళ్ల (నాలుగు సెమిస్టర్లు) ఎమ్మెస్సీ కోర్సు కూడా ఉంది. ఇందులో ఆప్టిక్స్, కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఒక దాన్ని ప్రధానాంశంగా ఎంచుకొనే వీలుంది.
- పరిశోధనా రంగం (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) మీద ఆసక్తి ఉంటే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సును ఎంచుకోవడం మంచిది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐఎస్ఇఆర్), యూనివర్సిటీ ఆఫ్ ముంబై, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) సంస్థలు ప్రధానంగా ఈ కోర్సును అందిస్తున్నాయి.
- ఫిజిక్స్‌లో పలు స్పెషలైజేషన్స్ ఉంటాయి. ఆసక్తికి అనుగుణంగా వాటిలో ఒక దాన్ని ఎంచుకోవచ్చు. ఫిజిక్స్‌లో కొన్ని ముఖ్యమైన స్పెషలైజేషన్స్.. యాక్సిలేటర్ ఫిజిక్స్, అట్మాస్ఫియరిక్ అండ్ స్పేస్ ఫిజిక్స్, ఆటమిక్ అండ్ మాలిక్యులర్ కొలిజన్ ఫిజిక్స్, కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్, ఫైబర్ ఆప్టిక్స్ అండ్ ఫోటోనిక్స్, హై ఎనర్జీ ఫిజిక్స్, లేజర్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, నానో టెక్నాలజీ, స్మార్ట్ మెటీరియల్స్.

- డాక్టర్ యు.ఎస్.ఎన్. మూర్తి, సీనియర్ సైంటిస్ట్.

జాబ్ కార్నర్

అప్రెంటీస్‌లు

ఖాళీలు 300

కల్పక్కంలోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఆటమిక్ రీసెర్చ్ (ఐజీసీఏఆర్) - అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **ట్రేడ్స్:** ఫిట్టర్ / టర్నర్ / మెషినిస్ట్ / ఎలక్ట్రీషియన్ / వెల్డర్ (జి అండ్ ఇ) / ఎలక్ట్రానిక్ మెకానిక్ / ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ / డ్రాఫ్ట్స్‌మన్ (మెకానికల్) / మెకానిక్ ఆర్ అండ్ ఏసీ / కార్పెంటర్ / ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ / గార్డెనర్ / హార్టికల్చర్ అసిస్టెంట్.
- **అర్హత:** 10వ తరగతి / తత్సమానంతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ఇంటర్వ్యూ నాటికి 14 నుంచి 22 ఏళ్లు. రిజర్వుడు వర్గాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా
- **ఇంటర్వ్యూలు:** మార్చి 13 నుంచి 15 వరకు
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 1, 2018.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.igcar.gov.in

రాష్ట్రీయ్ కెమికల్స్‌లో అప్రెంటీస్‌లు

ఖాళీలు 154

రాష్ట్రీయ్ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్)- ట్రేడ్ అప్రెంటీస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- రీజియనల్ డైరెక్టర్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ (ఆర్‌డీఏటి) కింద 87 పోస్టులు, బోర్డ్ ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ (బీఓఏటీ) కింద 67 పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఆర్‌డీఏటీలో ట్రేడ్స్ వారీగా ఖాళీలు:** వెల్డర్ 2, మెషినిస్ట్ 3, ఎలక్ట్రీషియన్ 10, మెయింటెనెన్స్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ 12, బాయిలర్ అటెండెంట్ 4, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్ 30, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ కెమికల్ ప్లాంట్ 10, లేబొరేటరీ అటెండెంట్ కెమికల్ ప్లాంట్ 4, మెడికల్ లేబొరేటరీ టెక్ (పాథాలజీ 2, రేడియాలజీ 1), లైబ్రరీ అసిస్టెంట్ 1, స్టెనోగ్రాఫర్ (ఇంగ్లీష్) 8
- **బీఓఏటీలో ట్రేడ్స్ వారీగా ఖాళీలు:** కెమికల్ 19, మెకానికల్ 18, ఎలక్ట్రికల్ 12, ఇన్‌స్ట్రుమెంటేషన్ 8, సివిల్ 3, మెడికల్ ల్యాబ్ టెక్ 5, కంప్యూటర్/ ఐటి 2
- **అర్హత:** ఆర్‌డీఏటీ పోస్టులకు విభాగాన్ని అనుసరించి ఇంటర్ (ఎంపీసీ) / బీఎస్సీ (కెమిస్ట్రీ - ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. బీఓఏటీ పోస్టులకు సంబంధిత విభాగంలో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
- **వయసు:** 2017 నవంబరు 1 నాటికి 21 -25 ఏళ్లు.
- **ట్రైనింగ్ వ్యవధి:** ఏడాది/ 15 నెలలు/ రెండేళ్లు
- **స్టయిపెండ్:** ఆర్‌డీఏటీ పోస్టులకు మొదటి ఏడాది నెలకు రూ.6,381, తరవాత రూ.7,292 ఇస్తారు. ఏఓసీపీ / ఐఎంసీపీ / ఎల్ఏసీపీ పోస్టులకు రూ.8,204 చెల్లిస్తారు. బీఓఏటీ పోస్టులకు రూ.5,000 ఇస్తారు.
- **శిక్షణా ప్రదేశం:** ట్రాంబే, ముంబై
- **ఎంపిక:** అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. వీరికి ఆర్‌సీఎఫ్ ఆసుపత్రిలో ఫిట్‌నెస్ మెడికల్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. వైద్య ప్రమాణాల ప్రకారం అర్హులైన అభ్యర్థులను మాత్రమే అప్రెంటీస్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు.
- **ఆర్‌సీఎఫ్ అందించే సౌకర్యాలు:** ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా సమయంలో ఉచిత వైద్య సౌకర్యాలతోపాటు యూనిఫామ్, సేఫ్టీ పరికరాలు అందిస్తారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడాఅందుబాటులో ఉంచుతారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 8, 2018.
- **వెబ్‌సైట్:** www.rcfltd.com

నిత్యా మీనన్...
ఇమేజ్ చట్రంలో ఇమడని హీరోయిన్.
మనసు చెప్పిందే చేసే అమ్మాయి.
కథ నచ్చితేనే నటిస్తాననే... నిర్మొహమాటి.
నటనే కాదు... జీవితంలో చాలా ఉన్నాయనే ఆలోచనాశీలి.
చేసే పాత్రలే కాదు.. ఆమె జీవితమూ డిఫరెంటే!
ఇప్పటికీ స్టార్ హోదా, సినిమా సంస్కృతి అంటలేదు గనకే...
మాటల్లో... సత్య మీనన్. భావాల్లో... స్వచ్ఛ మీనన్.
ఆమె ఆలోచన... ఆచరణ... ఈ ఆదివారం నవ్య స్పెషల్.

డాక్టర్ రెంటాల జయదేవ

నిత్య సత్యా మీనన్



నా జీవితంలో చాలా ఉన్నాయి.
నా లోపల చాలా ఉంది. అవే డిస్కస్ చేస్తా.
ఎవరితోనైనా రిలేట్ అయ్యేది... మనిషిగానే! నటిగా కాదు!!

మనసులో మాట

మై లైఫ్ ఈజ్ నాట్ వెరీ స్మూత్

నా జీవితం ఏమంత సాఫీగా సాగలేదు. ఎన్నోఎగుడుదిగుళ్ళున్నాయి. నేను నటిని కావడం సహా ఎన్నో ఊహించని విషయాలు జరిగాయి. ఇదో రోలర్ కోస్టర్ రైడ్. అందుకే, జీవితం పట్ల తాత్త్విక దృష్టిని అలవరచుకున్నా.

అలా మాట్లాడడం ఇష్టం!



ఏ భాషైనా నేను ఇట్టే పట్టేస్తా. బెంగళూరులో పుట్టి పెరగడం వల్ల నేను కన్నడం చదువుకున్నా. అక్కడ తమిళులు కూడా ఎక్కువ కాబట్టి, తమిళం బాగా వచ్చు. బేసిగ్గా మేము మలయాళీలమైనా, బెంగళూరు వాసులం కావడంతో నా మలయాళం కొద్దిగా వేరేగా ఉంటుంది. అయితే, మలయాళ సినిమాల్లో చేయడం మొదలెట్టాక భాష బాగా వచ్చేసింది. 'అలా మొదలైంది'తో తెలుగు నేర్చుకున్నా. అలా నాలుగు దక్షిణాది భాషలూ వచ్చేశాయి. ఎప్పుడూ అవతలివాళ్ళతో వాళ్ళ మాతృభాషలోనే మాట్లాడడం నాకిష్టం.

నాకేం భయం లేదు!

నేను సినిమా రంగంలోకి కావాలనుకొని రాలేదు. కానీ, వచ్చిన తరువాత, 'ఇది నా డెస్టినీ' అని అర్థమైంది. తరువాత ఏది చేసినా మనస్ఫూర్తిగా చేశా. 'తెర మీద నేనెలా కనిపిస్తా, నా పాత్రకు ఎంత నిడివి ఉంది, జనం నన్ను చూసి ఏమనుకుంటారు' లాంటి సంకెళ్ళేమీ పెట్టుకోను. చాలామంది పేరు కోసమో, డబ్బు కోసమో, మంచి పాత్ర చేశామనే సంతృప్తి కోసమో సినిమాల్లోకి వస్తారు. నాకు అలాంటిదేమీ లేదు. నాలో ఉన్నదేదో ఈ రంగానికి ఇవ్వాలనుకుంటా. ప్రత్యేకించి నాకు వచ్చేదీ లేదు, పోయేదీ లేదు. అందుకే, నాకు దేని గురించీ భయం లేదు.

సూపర్ స్టార్లకే 'నో' చెప్పా! లేదంటేనా...




నేనెప్పుడూ నాకు పాత్ర నచ్చితేనే సినిమా చేస్తా. నా మనసుకు నచ్చితే, అప్పటికప్పుడు ఓకె చెప్పేస్తా. నా కెరీర్ మొదటి నుంచీ అంతే! పేరున్న దర్శకులు, పెద్ద హీరోలతో చేస్తున్న సినిమా ఛాన్సులకైనా సరే ముందు కథ చెప్పమని అడుగుతా. ఆ మాటకొస్తే 'అలా మొదలైంది' సినిమాకు ముందు కూడా నాకు మలయాళంలోని బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్‌తో అవకాశాలు వచ్చాయి. కానీ, నేను 'నో' చెప్పేశా. వాటికి ఓకె చెప్పి ఉంటే, నా కెరీర్ గ్రాఫే వేరే రకంగా ఉండేది. అయితే, నాకేమీ బాధ లేదు. నేను నమ్మింది, నచ్చిందే చేశా! చేస్తా!

హీరోయినంటే కేవలం బాడీయేనా?

తెర మీద కనిపిస్తాం కాబట్టి కెమేరా ముందు అందుకు తగ్గట్లుగా ఉండాలి. అది నాకూ తెలుసు. కాబట్టి, అవసరాన్ని బట్టి, పాత్రకు అది కీలకం అనుకుంటే బరువు తగ్గుతా. పాత్ర కోసం మారతా. అంతేకానీ నటి అంటే కేవలం ఫిజికల్, బాడీ, లుక్స్, కొలతలు అనుకుంటే నేను వ్యతిరేకం. నటన లాంటి మిగతావీ చాలా ముఖ్యం అని నా వాదన. వట్టి బ్యూటీ కాదు, టాలెంట్ కూడా చాలా ఇంపార్టెంట్. మిగతాచోట్ల ఎలా ఉన్నా మలయాళంలో ఈ గ్లామర్ స్పృహ చాలా తక్కువనే చెప్పాలి. కేవలం గ్లామర్‌తో అయితే అక్కడ ఒకటి, రెండు సినిమాలు మించి చేయలేరు. బేసిగ్గా మంచి యాక్టర్ అయితేనే అక్కడ మనగలుగుతారు.

ఇప్పుడు లౌక్యం నేర్చుకుంటున్నా!



'రుద్రమదేవి'లో...

స్క్రిప్టు ఎవరైనా వినిపించినప్పుడు మాత్రం కథ నచ్చకపోతే నచ్చలేదనే చెప్పేస్తుంటా. అంతేతప్ప, డేట్లు లేవు అని తప్పించుకుంటూ చెప్పడం నాకు చేత కాదు. అలాగని నేను చేయనన్న సినిమాలన్నిటికీ కథ నచ్చలేదన్నదొక్కటే కారణం కాదు. ఆ కథ వినే క్షణానికి నా మనసుకు అనిపించినదాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటా. నా ముక్కుసూటితనం, నిర్మొహమాటం వల్ల చాలా ఇబ్బందులు ఉంటాయి. వచ్చాయి కూడా. (నవ్వేస్తూ...) ఇప్పుడిప్పుడే కాస్తంత లౌక్యంగా చెప్పడం నేర్చుకుంటున్నా.

ఆ పాత్ర కోసం వెయిటింగ్..!

నాకు బాగా క్రేజ్, పేరు తెచ్చింది తెలుగు సినిమాలే. కాబట్టి, ఈ పరిశ్రమ, ఇక్కడి వాళ్ళంటే నాకు ప్రత్యేక అభిమానం. నాకు నేనుగా తక్కువ సినిమాలు చేస్తున్నానే తప్ప, ఇప్పటికీ ఇక్కడి సినిమాల్లో నటించమంటూ చాలామంది అడుగుతూనే ఉంటారు. నాకు నచ్చిన మంచి కథలు, పాత్రలతో వస్తే నేనెప్పుడూ రెడీ. కెరీర్ పరంగా చూస్తే నా జర్నీ ఇప్పుడిప్పుడే మొదలైందనిపిస్తోంది. ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. రోజూ చాలా కథలు వింటూ ఉంటా. బోర్ కొట్టిన సందర్భాలు అనేకం. ఇప్పటికి ఓ 200 పైగా కథలు వింటే, వాటిలో ఏడెనిమిది మాత్రమే ఎంచుకొన్నా. 'కాంచన 2' లోని గంగ పాత్ర, అలాగే 'గుండె జారి గల్లంతయ్యిందే' లోని బలమైన పాత్ర లాంటి కొన్ని పాత్రలు నటిగా నాకు ఛాలెంజింగ్‌గా అనిపించాయి. అయితే, ఇప్పటికీ నాలోని నటిని తట్టి లేపే సినిమా కోసం, పాత్ర కోసం ఎదురుచూస్తున్నా. ఇప్పటి దాకా నేను చేసినవన్నీ నన్ను పై పైన స్పృశించాయే తప్ప, సానబట్టలేదు.

కెరీర్ కబుర్లు

★ చాలా రోజుల తరువాత మళ్ళీ కనిపించారు

(నవ్వేస్తూ...) అవును. ఒక సినిమాలో ఒక తరహా పాత్ర చేస్తే, ఆ ఆర్టిస్టుపై ఆ ముద్ర వేసేసి, వరుసగా అదే తరహా పాత్రలు ఇవ్వడం జరుగుతుంటుంది. 'అ!' లాంటి కొత్త చిత్రాలు, అందులోని కొత్త తరహా పాత్రలొచ్చినప్పుడే ఎగ్జైట్ అయి, చేస్తున్నా. ఒక్క మాటలో నేను ఏ సినిమానూ అంత తేలికగా ఒప్పుకోను.

★ నటి సావిత్రి జీవితంపై తీస్తున్న 'మహానటి'కీ, బాలకృష్ణ 'ఎన్టీయార్' సినిమాకూ నో చెప్పారట!

'మహానటి' పాత్రకు ముందుగా నన్ను అప్రోచ్ అయ్యారు. డేట్లు, పారితోషికం కాదు కానీ, ఇతర అంశాల వల్ల నో చెప్పా. ఇక, 'ఎన్టీయార్' బయోపిక్‌లో నేను భాగం కాదు. అంతకు మించి నేనేమీ చెప్పలేను.

★ ఎన్టీయార్ భార్య పాత్రకు మిమ్మల్ని అడిగారట...

నో కామెంట్.

★ సినిమా ఒప్పుకోవాలంటే దేనికి విలువ ఇస్తారు?

నా పాత్ర నిడివి ఎంత, ఎన్ని పాటలు, డ్యాన్సులున్నాయి లాంటివి పట్టించుకోను. 'రుద్రమదేవి' లాంటి సినిమాలో దర్శకుడు గుణశేఖర్ అడిగినప్పుడు చిన్న వేషం వేశాను కదా. నేను చేసే చిత్రం ప్రేక్షకులపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందనేదే ముందుగా ఆలోచిస్తా. తర్వాత ఆ పాత్ర, సినిమా ద్వారా ఎలాంటి సందేశం ఇస్తున్నా అనేది చూస్తా. ఆ తర్వాత... రచన ఎలా ఉంది? దర్శకుడు ఏ ఉద్దేశంతో చేయాలనుకుంటున్నాడు? అనేవి పట్టించుకుంటా. పారితోషికం, నిర్మాణ సంస్థ, నటులు వంటివన్నీ చివరిలో వస్తాయి.

★ కానీ, ఇన్ని పెట్టుకుంటే కుదురుతుందా?

నేను అలా ఉన్నా ఈ రోజు నాకింత పేరు వచ్చింది కదా! చాలామంది నన్ను ప్రశంసించేవాళ్ళు ఉన్నారు. సో.... ఐ ఫీల్ ఇట్స్ వర్కింగ్. బహుశా... ఇది భగవంతుడి ప్లాన్ అనుకుంటా! దేనికైనా కారణం ఉంటుందనుకుంటా. అది నెరవేర్చడానికే భూమి మీదకు వచ్చా.

దేవుడు... జ్యోతిషం... ఆధ్యాత్మికత

★ పుట్టించడానికి కారణం ఉంటుందంటున్నారా?

తప్పకుండా! ఐ థింక్ సో. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక కారణం ఉంటుంది. బహుశా, నేనిలా ఎందుకు ఉన్నా, ఎందుకు నటిస్తున్నా అనే దానికి తప్పకుండా ఏదో ఒక కారణం ఉంటుంది. నాకనే కాదు... అందరికీ అలా ఉంటుంది. నా వల్ల ఇందులో ఏదో మంచి జరగాలని దేవుడు అనుకుంటున్నాడేమో!



★ మీలో ఆధ్యాత్మిక భావన, భక్తి ఎక్కువా?

అవును. నేను స్పిరిచ్యువల్! బహుశా, స్పిరిచ్యువాలిటీ ఈజ్ ద ఓన్లీ థింగ్ ఇన్ మై లైఫ్! సినిమాలు, నటిగా నా ప్రయాణం... ఏదైనా ఆధ్యాత్మిక ద్వారానే! జీవితంలో ప్రతిదాన్నీ ఆధ్యాత్మిక కోణంలో చూస్తా.

★ మీ దృష్టిలో ఆధ్యాత్మికత అంటే ఏంటి?

ఏ సందర్భంలోనైనా ఉన్నతంగా ఆలోచించడమే ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికత అంటే... ఏదీ నాది కాదు. ఏదీ నాది అనుకోను. ఇది నా ఘనత అని చెప్పుకోను. పెద్దగా డబ్బులు సంపాదించాలనే ఆశా లేదు. ప్రతిదీ భగవంతుడి లీల అనుకుంటా! చాలామంది పైకి చూడడానికి సంతోషంగా ఉంటారు. కానీ, వాళ్ళు నిజంగా లోపల సంతోషంగా లేరు. మిమ్మల్ని మీరు తెలుసుకోవడం, సంతోషంగా ఉండడమే ఆధ్యాత్మికత.

★ ఇదంతా వచ్చింది పెరిగిన వాతావరణం వల్లనా?

నేను పెరిగింది నాస్తిక కుటుంబంలో. ఎవరో నేర్పించారని నేనేదీ చేయను. ఎవరో నేర్పించడం వల్ల నాలో ఈ ఆధ్యాత్మికత రాలేదు. అది నాలో నుంచి, నాకు ఎదురైన బలమైన అనుభవాల్లో నుంచి వచ్చింది. అలాగని జీవితంలో బ్యాడ్ ఇన్సిడెంట్స్ ఏమీ లేవు.

★ నమ్మకానికి ఏదో ట్రిగ్గర్ పాయింట్ ఉంటుంది?

వెరీ బిగ్ ట్రిగ్గర్ పాయింట్ వజ్ మై యాక్టింగ్ కెరీర్. నాకు ఎప్పుడూ ఇంట్రెస్ట్ లేని రంగం ఇది. అసలు ఈ రంగం నాది కాదనీ, నాకిది మ్యాచ్ కాదనీ అనిపిస్తుండేది. చెప్పాలంటే... నిజం కూడా అదే. కానీ, నాకు మరో ఛాయిస్ లేదు. సినిమాల్లోకి రావడానికి నేనెంత రిజెక్ట్ చేయడానికి ప్రయత్నించినా... ఎంత వద్దనుకున్నా, రాక తప్పలేదు. సినిమాలు చేయక తప్పడం లేదు. ఈ జీవిత ప్రయాణంలో నా చేతిలో ఏమీ లేదని కొన్నేళ్ళుగా అర్థమవుతోంది. సిన్మాలే నా దారి అని దేవుడు డిసైడ్ చేశాడు. అందుకని, నేను ఇతరుల లాగా 'ఫస్ట్ రావాలి.. సెకండ్ రావాలి..' అని ఆలోచించను. దేవుడు డిసైడ్ చేసిన తర్వాత మనం ఎందుకు భయపడాలి?

★ ఇంత నమ్మకం వెనుక ఏదైనా సంఘటన?

జీవితం వెళ్ళేదారి చూస్తుంటే అలా ఉంది. అయినా, కొన్ని విషయాలను వ్యక్తిగతంగా ఉంచాలనుకుంటా!

★ మీరు జ్యోతిషాన్ని నమ్ముతారా?

(నవ్వుతూ...) కొంత మేరకు! అంటే... పూర్తిగా జ్యోతిషం వెనకాలే ఎక్కువ వెళ్ళి, ఏవేవో చేయను. అయితే, జీవితంలో తప్పకుండా జ్యోతిష ప్రభావం ఉంటుంది. మనం చేసేది యూనివర్స్‌పైన... యూనివర్స్ చేసేది మనపైన ఎఫెక్ట్ చూపిస్తుంది.

★ మీరెప్పుడైనా మీ జాతకం చూపించుకున్నారా?

(నవ్వేస్తూ...) నేను పర్సనల్‌గా వెళ్ళి చూపించుకోలేదు. మా అమ్మ అప్పుడప్పుడూ వెళ్ళి చూపిస్తుంటుంది. (గట్టిగా నవ్వుతూ...) 'పెళ్ళి ఎప్పుడు అవుతుంది? పెళ్ళి ఎప్పుడు అవుతుంది?' అని!



అమ్మతో..

★ జోస్యులు ఏం చెప్పారు?

(నవ్వుతూ...) అది నేను చెప్పనుగా! వాళ్ళు ఏదేదో చెబుతుంటారు. నా జీవితం నాకు తెలుసు!

★ మీ అమ్మగారు వచ్చి, మీకు చెబుతుంటారా?

అమ్మ కొన్ని విషయాలు చెబుతుంది. కొన్ని చెప్పదు.

★ కేరళ వెళ్ళి జోస్యులకు చూపిస్తుంటారా?

కేరళ కాదు... బెంగుళూరులోనే చూపిస్తుంది. మేము మలయాళీలమైనా, మా ఫ్యామిలీ బెంగుళూరులో ఉంటుంది. కొన్ని తరాలుగా మేము అక్కడే స్థిరపడ్డాం. అందువల్ల, మాపై కేరళ ప్రభావం ఎక్కువ లేదు.

జర్నలిజమ్... గాసిప్స్!

★ జర్నలిస్టు కావాలనుకొని, మానుకున్నట్లున్నారు. ఇపుడు ఆ డెసిషన్ కరెక్ట్ అనిపిస్తోందా?

(నవ్వుతూ...) చాలా! అబ్బో... అందరినీ చూస్తుంటే, 'మై గాడ్' అనిపిస్తుంది. జర్నలిజంలోకి వస్తే అది నాకు రాంగ్ ఛాయిస్ అయ్యుండేది. జర్నలిజంలో ఉంటే ప్రతి అంశంలోనూ, రంగంలోనూ ఎప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకోవాలి. ఐ డోంట్ వాంట్ టు బి ఇన్వాల్వ్‌డ్. ఇట్స్ టూ నాయిస్ ఫర్ మి.

★ జర్నలిజం వల్ల మంచి జరగడం లేదంటారా?

అలా అనడం లేదు. జర్నలిజంలో ఉంటే వ్యక్తిగతంగా హ్యాపీగా ఉండలేనని చెబుతున్నా. నేను ఎక్కువ సృజనశీలిని. రచన చేయడం, కొత్తగా ఏదైనా చేయడం లాంటివి నాకిష్టం. నేను వార్తలు చదవను, చూడను.

★ అంటే, టీవీ కూడా చూడరా?

అరుదుగా చూస్తా. మూడు నాలుగు నెలలకు ఒకసారి ఎప్పుడో చూస్తా. కేబుల్ బిల్ వచ్చినప్పుడు 'ఇదేంటి? నాలుగు నెలలుగా కేబుల్ బిల్ కడుతున్నాను. టీవీనే చూడట్లేదు' అని టీవీ ఆన్ చేస్తా. ఒక అరగంట చూసి వదిలేస్తా (నవ్వులు).

★ మరి మీ గురించి కూడా చాలా రాస్తారు కదా?

అవన్నీ తెలియాలనేది కంపల్సరీ కాదు. గాసిప్ రాస్తే, రాయనివ్వండి! నా జీవితంలో అది భాగం కాదు. జీవితంలో నాకంటూ లక్ష్యం ఉంది. చేరాల్సిన తీరం ఉంది. దాని నుంచి పక్కకు జరగదలుచుకోలేదు.



'కోటి గొబ్బ-2'లో.. సుదీప్‌తో..

★ 'ఈగ' సినిమా ఫేమ్ హీరో సుదీప్‌కూ, మీకూ లింకు పెడుతూ, కన్నడ మీడియా గత ఏడాది విపరీతంగా గాసిప్స్ రాసింది. మీకు ఏమనిపించింది?

దట్ వజ్ వెరీ రాంగ్ థింగ్. సినిమా ('కోటి గొబ్బ-2') విడుదలకు ముందు ఆ గాసిప్ వచ్చింది. పబ్లిసిటీ కోసం చేశారు. దురదృష్టవశాత్తూ ఇలాంటి వాటికి నటీనటులు బలిపశువులు అవుతుంటారు. వేరే ఎవరో చేసిన తప్పులకు నిందలు పడాల్సి వస్తుంది. అప్పటి ఆ గాసిప్‌లో నిజం ఉండి ఉంటే... ఇప్పటికీ మీకు వినిపించేది కదా! సినిమా విడుదల ముందు పబ్లిసిటీ కోసం అలా చేస్తారని కొన్ని రోజులకు తెలిసింది.

★ దీనివల్ల వ్యక్తిగత జీవితం ఎఫెక్ట్ అవుతుంది కదా!

నిజమే. ఆ పుకార్లు వచ్చిప్పుడు నాకు చాలా కోపం వచ్చింది. ఎవరి గురించైనా అలా చెప్పడం తప్పే. అవతల వేరేవాళ్ళ (హీరో సుదీప్‌ను అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ...) జీవితంలో ఏదేదో జరుగుతుంటుంది. అందుకు నన్ను దోషిని చేసి, బయటకు తీసుకురావడం చాలా బాధ కలిగించింది. కోపం వచ్చింది. అయితే ప్రజలకు అర్థం అవుతుంది... వాటిలో నిజం లేదని! ఏమీ లేకుండానే సినిమా విడుదలకు ముందు పెద్ద ఇష్యూ కింద చేసి, తర్వాత వదిలేస్తారని!

★ అప్పుడు హీరో సుదీప్ ఏమన్నారు?

అందరూ అప్‌సెట్ అయ్యారు. బలిపశువులం మేమే కదా! వాళ్ళ స్వలాభం కోసం ఆలోచించారు. కానీ, బలయ్యింది మేమే కదా! 'ఏం జరిగింది? ఎందుకిలా వార్తలు' అని సుదీప్‌ని అడిగా. 'దిస్ ఈజ్ హౌ ద ఫిల్మ్ వర్క్స్' అని ఓదార్పు మాటలు చెప్పాడు.

★ ఇవన్నీ చూశాక, ఈ రంగం నుంచి వెళ్ళిపోదామని ఎప్పుడైనా అనిపించిందా?

(గట్టిగా నవ్వుతూ) అంతకు ముందు కూడా చాలా సార్లు నాకు అలా అనిపించింది. నాకు పెద్ద లక్ష్యం ఉంది. అందుకని, ఇవన్నీ లైట్ అనుకుని వదిలేస్తా. ఎవరు చేసిన పనులకు వాళ్ళు ఖర్మ అనుభవిస్తారు.

ప్రకృతి... జీవితం

★ ఖాళీ దొరికితే బయటకు ట్రావెలింగ్ చేస్తారా?

అది మాత్రమే కాదు. ఇంట్లో ఉన్నా... ఎక్కడ ఉన్నా... చుట్టుపక్కల ప్రకృతితో మమేకం అవుతా. పెద్ద బంగ్లా కొనాలి లాంటి ఆశలు లేవు. నా చుట్టూ, ఇంటి చుట్టూ ఉన్నదంతా సహజంగా ఉండాలి. ఎక్కువ శబ్దాలు, కాలుష్యం, జనాల హంగామా లేకుండా నిశ్శబ్దంగా ఉండాలనుకుంటా. మా ఇల్లు ఎలా ఉంటుందంటే... రెండు పక్కలా పెద్ద పెద్ద చెట్లు ఉంటాయి. వాటి మీద చాలా పక్షులు వచ్చి వాలతాయి. బెంగుళూరులో వేరే చోట ఎక్కడా కనిపించని పక్షులు మా ఇంటి దగ్గర కనిపిస్తాయి. వాటిని చూస్తూ సమయం గడిపేస్తుంటా. నేను చాలా సైలెంట్‌గా ఉంటా. మా ఇంట్లో కూడా అంతే. నో టీవీ... నో పీపుల్... నో నాయిస్!

★ ఇంట్లో మీరు, మీ అమ్మగారు.. అంతేనా?

మి అండ్ మై నేచర్. అంతే.

★ అదేంటి? ఎవరూ లేరు. బోర్ కొట్టదా?

లేదు. బోర్ కొట్టదు. ఇంకా చెప్పాలంటే, అందరితో మాట్లాడుతూ ఉంటేనే నాకు బోర్ కొడుతుంది. పని లేకుండా, అనవసరంగా అందరితో కలవాలంటే నాకు బోర్ కొడుతుంది. అంత మాత్రాన నా లైఫ్‌లో ఎవరూ లేరని కాదు. స్నేహితులున్నారు. అమ్మ, నాన్న... ఓ కుటుంబం ఉంది. ఐయామ్ క్లోజ్ టు మై ఫ్యామిలీ.

★ స్నేహితులంటే... మీ కాలేజీ రోజుల ఫ్రెండ్సా?

కాదు. సినిమాల్లోకి వచ్చాక ఏర్పడ్డ ఫ్రెండ్స్. కానీ, వాళ్ళంతా చాలా డిఫరెంట్ పీపుల్. నేను పార్టీలు, పబ్బులకు వెళ్ళను. నా స్నేహితులు కూడా అంతే. సినిమాల్లో స్టార్‌నైనా, బయట నేనెప్పుడూ నార్మల్‌గానే ఉంటా. (నవ్వుతూ...) మీతోనూ (మీడియాతోనూ) నార్మల్‌గానే ఉంటాను కదా!


మిగతా 'దృశ్యం' పేజీలో...

• మీరు చేసిన సినిమాల్లో మీకు నచ్చిన మూడు చిత్రాలు?

'ఉస్తాద్ హోటల్' (మలయాళం). 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' (తెలుగు). 'ఓకే కన్మణి' (తమిళం.. తెలుగులో 'ఓకే బంగారం')



'ఉస్తాద్ హోటల్'లో..




• మీకు నచ్చిన దర్శకులు?

మణిరత్నం మొదలు చాలామందే ఉన్నారు. నేను పని చేసిన దర్శకులు అందరితోనూ నాకు మంచి రిలేషన్‌షిప్ ఉంది. ఆచితూచి ఎంచుకొని, నాకు నచ్చిన దర్శకులతోనే నేను పని చేస్తా. త్వరలో టీకే రాజీవ్ మీనన్ దర్శకత్వంలో ఒక మలయాళ చిత్రం చేస్తున్నా. ఆయనతో అంతకు ముందు ఒక మలయాళ చిత్రం 'తల్ సమయమ్ ఒరు పెణ్ కుట్టి' చేశా. ఆయన చాలా మంచి వ్యక్తి. ఏదో ఒకటి విభిన్నంగా చేస్తారు. ఆయనతో ఫెస్టివల్ లాంటి సినిమా చేయనున్నా.



తప్పులు చేశా!

గత ఏడెనిమిదేళ్ళ కెరీర్‌లో నేనూ కొన్ని తప్పులు చేశా. కొన్ని పాత్రలు చేయకుండా ఉండాల్సింది, చేశా. అవేమిటో మీకే తెలుసు. అయితే, నేనెప్పుడూ నా కెరీర్ ఏమవుతుందని భయపడలేదు. బాగుంటే, నా వయసుకు మించిన పాత్రలూ చేశా. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు'లో టీనేజ్ అమ్మాయి తల్లిగా చేశా. 25 ఏళ్ల వయసులోనే 23 ఏళ్ల హీరోయిన్‌కు తల్లిగా నటించా. ఈ మధ్య 'అదిరింది' (విజయ్ నటించిన తమిళ 'మెర్సల్'కు అనువాదం)లో విజయ్ భార్యగా పిల్లల తల్లిగా చేశా.



ఈ సినిమాలకు అంత అవసరం లేదు!


వాస్తవం చెప్పాలంటే, ఇవాళ మనం చేసే సినిమాల్లో నటించడానికి పెద్ద ప్రిపరేషన్, హోమ్ వర్క్ అవసరం లేదు. అంత గొప్ప సినిమాలు మనవాళ్ళు చేయడం లేదు. నేను ఏ పాత్ర చేసినా, నా జీవితంలో చూసినదీ, పరిచయం ఉన్న వ్యక్తులు, సందర్భాల నుంచి ఆ పాత్ర చేయడానికి కావాల్సింది తీసుకుంటా. కాస్ట్యూమ్స్ వేసుకొని ఒక్కసారి కెమేరా ముందుకు వెళితే, నటిగా మారిపోతా. ఏ పాత్ర చేస్తున్నా దాని మీద నా నూటికి నూరుపాళ్ళ ఫోకస్ పెడతా. మరేదీ నా మనసులోకి రాదు. నటిస్తున్నప్పుడు యాక్షన్, కట్ అనే డైరెక్టర్ ఆదేశాల మధ్య కెమేరా ముందు పూర్తిగా ధ్యానంలో ఉన్నట్లుంటా.

అంతా నా చుట్టూనే!

నా రాబోయే సినిమా 'ప్రాణ' ఓ వినూత్న ప్రయత్నం. ఒకే ఒక్క పాత్రతో కథంతా నడుస్తుంది. అంటే, సినిమాలో నేనొక్కదాన్నే. సినిమా అంతా ప్రధానంగా కేరళలోని హిల్ స్టేషన్ కుమ్లీలో తీశారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళ నాలుగు భాషల్లో ఏకకాలంలో, విడివిడిగా షూట్ చేశారు. పైగా, డబ్బింగ్ లేకుండా డైలాగ్, చుట్టుపక్కల యాంబియన్స్, సౌండ్, అన్నీ... మనం నటిస్తూ, షూటింగ్ చేస్తున్నప్పుడే ఏకంగా రికార్డు చేసే 'సరౌండ్ సింక్' పద్ధతిలో ఈ సినిమా తీశారు. ఇండియాలో ఈ పద్ధతిలో సినిమా తీయడం ఇదే తొలిసారి. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న మన భారతీయుడు రసూల్ పూకుట్టి దీనికి సౌండ్ డిజైన్ చేయడం విశేషం. ఒకేసారి నాలుగు భాషల్లో తీయడంతో ఒకే షాట్ నాలుగు సార్లు చేయాల్సి వచ్చేది. మామూలుగా ఒక్క టేక్‌లో షాట్ ఓకె చేసేసే నాకు ఒకసారి చేసినది మళ్ళీ చేయడమంటేనే విసుగు. అలాంటిది ఒక్కోటీ నాలుగుసార్లు, అందులోనూ పక్కనే అక్కర్లేని ఏ కాకి అరుపో వచ్చిందంటే మళ్ళీ రీటేక్... ఇలా చేసే సరికి నీరసం వచ్చేసేది. వీటన్నిటి మధ్య కేవలం ఇరవై మూడు రోజుల్లో షూటింగ్ పూర్తి చేయడం విశేషం. ఆ యూనిట్‌లో నాలుగు దక్షిణాది భాషలూ బాగా వచ్చింది నాకే. అందుకే, ఆ సినిమా స్క్రిప్టులో మా రచనా బృందంలో నా వంతుగా పాలు పంచుకొన్నా. రచన చేశా.



'ప్రాణ' సెట్స్‌లో రసూల్ పూకుట్టితో..



అలాంటి సినిమాలు తీస్తా!

చిన్నప్పుడు కవితలు రాసేదాన్ని. ఇప్పటికీ ఎప్పుడూ కథో, ఏదో ఒకటి రాస్తూనే ఉంటా. డబ్బులు, ప్లానింగ్ లాంటివి చేత కాదు కానీ, క్రియేటివ్ పర్సన్‌ను కాబట్టి సరైన టైమ్ వచ్చినప్పుడు దర్శకత్వం వహిస్తా. అది ఎప్పుడన్నది నాకూ తెలీదు. బేసిగ్గా వాస్తవికతకు దగ్గరగా ఉండేలా, జీవితం గురించి, మానవ సంబంధాల గురించి సినిమాలు తీయాలని ఉంది.

స్టార్‌హోమ్

కంఫర్ట్.. కంఫర్ట్.. కంఫర్ట్... సినిమా పరిశ్రమలో తరచూ వినిపించే పదమిది. 'కంఫర్ట్ మిస్ అయితే నరాలు తెంచి గిటార్ వాయిస్తా' అంటాడు 'కిక్' సినిమాలో హీరో. బయటి జనాలూ అంతే! చేసే ప్రతి పనిలోనూ 'కంఫర్ట్' కోరుకుంటూ ఆ 'కిక్'ను ఆస్వాదిస్తున్నారు. సినిమా కథానాయికలూ అంతే. కంఫర్ట్ లేకపోతే ఒక్క అడుగు ముందుకు వెయ్యరు! ధరించే దుస్తులు, తిరిగే కారు.. నివసించే ఇల్లు ఇలా ప్రతి విషయంలోనూ కంఫర్ట్ ముఖ్యమంటారు. అందుకే సకల సదుపాయాలూ ఉన్న 'సర్వీస్ అపార్ట్‌మెంట్'లను తమ నివాసాలుగా మార్చేసుకుంటున్నారు. తెలుగు సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్‌గా చలామణీ అవుతున్న కాజల్, తమన్నా, రకుల్, రెజీనా, రాశీఖన్నా, లావణ్యా త్రిపాఠీ, ప్రజ్ఞా జైస్వాల్ ఇదే బాటలో పయనిస్తున్నారు. 'సర్వీస్ అపార్ట్‌మెంట్' అంటే ఇల్లు కాని ఇల్లు. ఒక మాటలో చెప్పాలంటే ఇంటికి మించి. మన కథానాయికలు ఇటువైపు దృష్టి సారించడానికి కారణమూ, కంఫర్టూ ఏంటి?



'సర్వీస్' సూపర్.. హీరోయిన్లు బేఫికర్!

అక్కడ దొరికే సౌకర్యాలు...

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో దిగడం కాస్త వ్యయంతో కూడినదే. ఖర్చుకి తగ్గట్టే సౌకర్యాలూ ఉంటాయి. మనకు సొంత అపార్ట్‌మెంట్ ఉంటే ఎలా ఉంటుందో.. అది కూడా అలాగే ఉంటుంది. దేశ విదేశీ ఆహారపదార్థాలు వండి వడ్డించే చెఫ్, చేతికింద ఇద్దరు సర్వెంట్లు, లాండ్రీ, జిమ్, స్పా, స్విమ్మింగ్ పూల్, టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్, ఫుల్లీ ఫర్నిష్డ్ రూమ్స్ ఇలా సకల సదుపాయాలూ ఉంటాయి. ఇంట్లో అయితే షూటింగ్ చేసి అలసిపోయి వచ్చిన కథానాయికలకు వండి వండించుకు తినే ఓపిక ఉండపోవచ్చు. ఇక్కడైతే ఏ వేళలో వెళ్లినా నచ్చింది తినొచ్చు.. నచ్చినట్లు ఉండొచ్చు. ఓ మనిషి అంతకు మించి ఇంకేం కోరుకుంటారు! సుఖ నిద్ర, పంచభక్ష్య పరమాన్నాలు, భద్రత, రక్షణ- ఇవన్నీ అందిస్తున్న సర్వీస్ అపార్ట్‌మెంట్ల వైపు సినిమా తారలు మొగ్గు చూపడం పెద్ద విషయం ఏమీ కాదు. ఒకప్పటి నాయకానాయికలు 'ఇల్లే కదా స్వర్గసీమ' అనేవారు. ఇప్పుడు 'సర్వీస్ అపార్ట్‌మెంట్లే కదా స్వర్గసీమ' అంటున్నారు. ఆ సౌకర్యాల గురించి పలువురు హీరోయిన్లు ఏమంటున్నారంటే...

సులభంగా జరుగుతున్నాయి
కాజల్ అగర్వాల్

అందం, ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది కాజల్ అగర్వాల్. టైమ్‌కి నిద్రలేవడం, వ్యాయామం చెయ్యడం, కొలత ప్రకారం తినడం తనకున్న అలవాటు. ఖాళీ దొరికితే గరిటె తిప్పుతూ, నచ్చిన ఆహారపదార్థాలను వండుకు తింటుంది. ఎవరితోనైనా సులభంగా కలిసిపోయే తత్వం గల ఆమె తను నివసించే అపార్ట్‌మెంట్ సిబ్బందితో కలివిడిగా ఉంటుంది. వాళ్లతో ఉన్న సాన్నిహిత్యంతో అప్పుడప్పుడూ కిచెన్‌లోకి వెళ్లి తనకొచ్చిన వంటకాలు కూడా వండుతుంది. సర్వీస్ అపార్ట్‌మెంట్లు అందుబాటులో ఉండటం వల్లే నిత్యం తను చేసే పనులు సులభంగా జరుగుతున్నాయనీ కాజల్ చెబుతోంది.

స్వేచ్ఛ కోసం
రకుల్, రాశీఖన్నా

రకుల్, రాశీఖన్నా ఉత్తరాదికి చెందిన తారలు అయినప్పటికీ తెలుగు అమ్మాయిలుగా మారి ఇక్కడి కల్చర్‌కి అలవాటుపడిపోయారు. అతి తక్కువ సమయంలో వీరిద్దరూ హైదరాబాద్‌లో సొంత ఇళ్లు కొనుక్కున్నారు. రకుల్ అయితే తను బసచేసిన స్టార్ సర్వీస్ అపార్ట్‌మెంట్ మాదిరి తను కొనుక్కున్న ఇంట్లో బెడ్‌రూమ్‌ను డిజైన్ చేయించుకుందట! ఆమె ఫ్రెండ్ సర్కిల్ చాలా పెద్దది. వారాంతంలో విందులూ, చిందులూ అంటూ ఇల్లంతా స్నేహితులతో నిండి, సందడిగా ఉంటుంది. కానీ ప్రస్తుతం తను నివసించేది రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో కాబట్టి స్నేహితులు వచ్చిపోవడం ఇరుగుపొరుగువారికి కాస్త ఇబ్బంది అనిపించడంతో తన వారాంతం కార్యక్రమాలన్నీ గతంలో తను నివసించిన సర్వీస్ అపార్ట్‌మెంట్‌లోనే కానిస్తోందని సమాచారం. స్వేచ్ఛగా ఉండటానికి సర్వీస్ అపార్ట్‌మెంట్స్ సౌకర్యంగా ఉన్నాయని చెబుతోంది రకుల్. ఎక్కడైనా సౌకర్యంగా ఉండగలననీ రాశీఖన్నా అంటోంది.

ప్రైవసీ, సెక్యూరిటీ
రెజీనా

రెజీనాకు నైట్‌లైఫ్ అంటే చాలా ఇష్టం. సినిమాల్లోకి రాక ముందు తన స్నేహితులతో కలిసి రాత్రిపూట బయట విహరించి ఇంటికి చేరుకునేదట. సినిమా పరిశ్రమలోకి వచ్చాక తనకు స్నేహితుల బృందం రెట్టింపు అయిందనొచ్చు. తెలుగు చిత్రసీమలో రకుల్, రెజీనా, రాశీఖన్నా మంచి ఫ్రెండ్స్ అన్నది అందరికీ తెలిసిందే. ఈ ముగ్గురూ ఓ చోట చేరారంటే అక్కడ సందడే సందడి. రెజీనా అడుగుబయట పెట్టాలంటే ప్రైవసీ, సెక్యూరిటీ గురించి మొదట ఆలోచిస్తుంది. "షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పుడు అమ్మ నాతోనే హైదరాబాద్‌లో ఉంటుంది. బయటి అపార్ట్‌మెంట్ల కన్నా సర్వీస్ అపార్ట్‌మెంట్ అయితే సుఖవంతంగా, భద్రతగా ఉంటుందని ఇక్కడ ఉంటున్నా. నేను లేట్‌గా వచ్చినా అమ్మ నిశ్చింతగా ఉంటుంది. నాకూ కంఫర్ట్‌గా ఉంటుంది. ఇక్కడ సెక్యూరిటీ, సర్వెంట్లు చూపించే అభిమానం నాకు ఎంతో ఆనందం కలిగిస్తుంది. ముఖ్యంగా కథా చర్చలకు ఇక్కడ అనువుగా ఉంటుంది" అని చెప్పుకొచ్చింది.

ఆ సేఫ్టీ ఎక్కువ
లావణ్యా త్రిపాఠీ

కెరీర్ విషయంలో చాలా ప్లాన్‌గా ఉంటుంది లావణ్యా త్రిపాఠీ. ఆమెకు జాగ్రత్త కూడా కాస్త ఎక్కువే. సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న సేఫ్టీ మరెక్కడా ఉండదని ఆమె అభిప్రాయం. "సర్వీస్ అపార్ట్‌మెంట్ అంటే వాళ్లు వండి పెట్టడమే కాకుండా మనకు నచ్చింది వండుకు తినే అవకాశం కూడా ఉంటుంది. నాకు వంట చెయ్యడం కొద్దిగా వచ్చినా షూటింగ్ నుంచి అలసిపోయి రావడం వల్ల వండటం పక్కనపెట్టి నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేస్తా. అది ఎంత అర్ధరాత్రి అయినా కావలసిన ఆహారం అందుబాటులో ఉంటుంది. హోటల్ ఫుడ్ బోర్ కొడితే.. బయట ఆర్డర్ చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇక్కడ ఉన్న సేఫ్టీ మరెక్కడా ఉండదని నా అభిప్రాయం. అక్కడి సిబ్బందితో మంచి స్నేహ సంబంధాలు మెయిన్‌టెన్ చేస్తే మనకు సంబంధించిన ప్రతి పనిలోనూ జాగ్రత్త వహిస్తారు" అని లావణ్యా త్రిపాఠీ తెలిపింది.

అదే ఖర్చుతో
ప్రజ్ఞా జైస్వాల్

పని పూర్తయ్యాక కడుపునిండా తిని, ప్రశాంతంగా నిద్రించాలనుకునే అమ్మాయి ప్రజ్ఞా జైస్వాల్ నలుగురితో కూర్చొని మాట్లాడటమంటే ఆమెకు చాలా ఇష్టం. ఎక్కడికెళ్లినా మనసారా మాట్లాడే నలుగురు మనుషులు ఉండాలని కోరుకునే తత్వం ఆమెది. "వృత్తిపరంగా నేను చాలా యాక్టివ్‌గా ఉంటా. షూట్ లేనిరోజు మాత్రం ఎక్కడలేని బద్ధకం నా దగ్గరే ఉంటుంది. నాకు వంట చేతకాదు. ఇంట్లో ఏవో చిన్న చిన్న పనులు చేస్తానంతే! నాలాంటి అమ్మాయిలకు సర్వీస్ అపార్ట్‌మెంట్లు చాలా కంఫర్ట్‌గా ఉంటాయి. ఇక్కడ ఉండే జిమ్, స్విమ్మింగ్ పూల్‌కి వెళ్తే తోటి తారలు కూడా కనిపిస్తారు. కాస్త రి-ఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఇక్కడ నిరంతరం కారు, సెక్యూరిటీ ఉంటాయి. బయట అపార్ట్‌మెంట్ తీసుకుంటే.. దానికి నెలకి మెయింటెనెన్స్, వాటర్, కరెంట్ బిల్స్, వాచ్‌మెన్, ఇతరత్రా ఖర్చులు కూడా అంతే అవుతాయి. అదే ఖర్చు సర్వీస్ అపార్ట్‌మెంట్‌కి పెడితే.. ఏ టైమ్‌లో వచ్చినా నచ్చిన తిండి, కంటి నిండా నిద్ర దొరుకుతాయి" అని ప్రజ్ఞా జైస్వాల్ తెలిపారు.

వీరే కాకుండా తమన్నా, అనూ ఇమాన్యుయేల్, హన్సిక, ప్రణీత, పూజాహెగ్డే, మెహరీన్ వంటి తారలు కూడా ఈ వైపే దృష్టి సారిస్తున్నారు. స్టార్ హోటళ్లలోని అపార్ట్‌మెంట్ల సర్వీస్‌కు అలవాటు పడిన తారలంతా 'సర్వీస్' సూపర్, బేఫికర్ అని చెబుతున్నారు.

● ఆలపాటి మధు
ఫొటోలు: గోపి

అప్పుడలా.. ఇప్పుడిలా

పాత రోజుల్లో ఒక హీరోయిన్ సినిమాకు సైన్ చేసిందంటే నెలల తరబడి నిర్మాతలే బస ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం కాల్షీట్లు ఉన్న రోజుల్లోనే హీరోయిన్‌లకు పలు స్టార్ హోటళ్లలో సూట్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. అది కూడా తక్కువ ఖర్చుతో అయ్యే పనేం కాదు. హైదరాబాద్‌లో ఓ స్టార్‌హోటల్‌లో సూట్ రూమ్‌లో దిగాలంటే రోజుకి సుమారుగా రూ.14 నుంచి 15 వేలు చెల్లించాల్సిందే. ఇప్పుడు కొన్ని హోటల్స్‌లో సర్వీస్ అపార్ట్‌మెంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. నేటితరం నాయికలంతా ఖర్చు గురించి ఆలోచించకుండా కంఫర్ట్ కోసం సర్వీస్ అపార్ట్‌మెంట్‌లలో దిగుతున్నారు.

నెలకు లక్షల్లో...

హైదరాబాద్‌లో సర్వీస్ అపార్ట్‌మెంట్ వసతిగల స్టార్ హోటళ్లు చాలానే ఉన్నాయి. సింగిల్ బెడ్‌రూమ్ సూట్స్ అయితే నెలకు మూడు నుంచి నాలుగు లక్షలు, డబుల్ బెడ్‌రూమ్ అయితే ఐదు నుంచి ఆరు లక్షల రూపాయిలు ఛార్జ్ చేస్తారని సమాచారం. రోజువారీగా అయితే రూ.15-16 వేలు ఉంటుంది. రెగ్యులర్‌గా ఒకే హోటల్ ఉపయోగించే ప్రొడక్షన్ హౌస్‌లకు రోజుకు రూ. 10 నుంచి 11 వేలు బిల్ చేస్తారట.

ప్రముఖ దర్శకులు కూడా...

రాంగోపాల్ వర్మ, పూరీ జగన్నాథ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ వంటి స్టార్ డైరెక్టర్లు కథాచర్చలన్నీ సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లోనే జరుపుతున్నారు. తమన్, జిబ్రాన్ లాంటి సంగీత దర్శకులు కూడా మ్యూజిక్ సిట్టింగ్స్ ఇక్కడే జరుపుతున్నారు. "జన సమూహం ఉన్న ప్రాంతంలో రికార్డింగ్ స్టూడియో నడపడం కష్టం. ఇక్కడైతే సౌండ్ ప్రూఫ్ రూమ్స్ అందుబాటులో ఉంటాయి. మాటిమాటికీ కరెంట్ పోతే ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ పాడవుతాయి. సర్వీస్ రూమ్స్‌లో 24 గంటలూ కరెంట్ సౌకర్యం ఉండటంతో ఆ సమస్య ఉండదు" అని వారు చెబుతున్నారు.


సీరియల్ నిర్మాతగా!



కన్నడ నాట ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు. ఆయన గురించి రెండు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. శివరాజ్‌కుమార్ తొలిసారిగా ఓ సీరియల్‌ని నిర్మించడమే కాదు, దానికి వాయిస్ ఓవర్ కూడా ఇచ్చారు. 36 ఏళ్ల క్రితం విడుదలైన 'మానస సరోవర' అనే సినిమా కన్నడ సినీ చరిత్రలో ఓ సంచలనం. విమర్శకులతో పాటు ప్రేక్షకులూ బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడీ సినిమా సీక్వెల్ అదే పేరుతో బుల్లితెరపై ధారావాహికగా రానుంది. శివరాజ్‌కుమార్ కుమార్తె నివేదిత నిర్మిస్తున్న ఈ సీరియల్‌లో అప్పటి సినిమా ప్రధాన తారాగణం కూడా కనిపించనున్నారు. ఇప్పటికే 10 ఎపిసోడ్లకు వాయిస్ ఓవర్ ఇవ్వడం పూర్తి చేశారు. ఈ నెల 26 నుంచి ఉదయ్ టీవీ ఛానల్‌లో రాత్రి 9:30 గంటలకు ఈ సీరియల్ ప్రసారం కానుంది. ఇదిలా ఉండగా, చాలా కాలం తర్వాత శివరాజ్ ఓ రీమేక్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. కెరీర్‌లో రీమేక్స్‌తోనే ఎక్కువ విజయాలు సాధించిన శివరాజ్ ఎందుకనో హఠాత్తుగా వాటికి కొంతకాలం ఫుల్‌స్టాప్ పెట్టారు. అయితే, ఓ మలయాళ సినిమా ఆయన మనసు మార్చిందట. దాని పేరే 'ఒప్పమ్'. (తెలుగులో 'కనుపాప'గా విడుదలైంది). ఓ హంతకుడి నుంచి చిన్న పాపను కాపాడే అంధుడిగా మోహన్‌లాల్ నటన అందరినీ ఆకట్టుకుంది. ఆ పాత్ర శివరాజ్‌కు బాగా నచ్చేయడంతో ఈ రీమేక్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో తొలిసారి అంధుడిగా నటించనున్న ఈ సినిమా పేరు 'కవచ'.

టీవీ దృశ్యం

ఇంటర్నేషనల్ టీవీషోలో...!



'డాక్టర్ అనిల్‌కపూర్' అనే పేరు విషయమై బాలీవుడ్ నటులు అనుపమ్‌ఖేర్, అనిల్‌కపూర్ల మధ్య ట్విటర్‌లో కొంత కాలం క్రితం సరదా సంభాషణ నడిచింది. సోషల్ మీడియాలో ఇది హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. తన పేరు వాడుకుంటున్నందుకు అనుపమ్ రాయల్టీ కూడా ఇవ్వాలని సరదాగా ట్వీటారు అనిల్‌కపూర్. 'అసలీ డాక్టర్ అనిల్‌కపూర్ గొడవ ఏంటా?' అని మీకు సందేహం రావచ్చు. అనుపమ్‌ఖేర్ నటించనున్న పాత్ర పేరిది. అదీ సినిమాలో కాదు. ఓ ఇంటర్నేషనల్ టీవీ షోలో! ఈ మధ్య కాలంలో అనుపమ్‌ఖేర్, అనిల్‌కపూర్, ప్రియాంకాచోప్రా, ఇర్ఫాన్‌ఖాన్... ఇలా ఎంతో మంది బాలీవుడ్ నటులు హాలీవుడ్ చిత్రాల్లో కూడా నటిస్తూ, ఇప్పటికే ఇంటర్నేషనల్ స్టార్స్‌గా మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో చేరిపోయారు. సీనియర్ నటుడు అనుపమ్‌ఖేర్ కొన్నేళ్ల క్రితమే 'బిగ్ సిక్', 'సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్' వంటి హాలీవుడ్ చిత్రాల్లో కనిపించారు. అయితే తొలిసారిగా ఆయనకు ఓ టీవీ సిరీస్‌లో ఓ వైద్యుని పాత్రలో నటించే అవకాశం దక్కింది.. ఇంతకీ ఈ టీవీ సిరీస్ పేరు 'బెల్‌వ్యూ'. అమెరికాలోని బెల్‌వ్యూ నగరంలోని 'బెల్‌వ్యూ హాస్పిటల్'లో డాక్టర్‌గా విధులు నిర్వర్తించిన ఎరిక్ మ్యాన్‌హైమర్ కొంతకాలం క్రితం ఓ పుస్తకం రాశారు. దాని పేరు 'ట్వల్వ్ పేషెంట్స్: లైఫ్ అండ్ డెత్ ఎట్ బెల్‌వ్యూ'. 12 మంది పేషంట్ల జీవితంలో జరిగిన సంఘటనలు, వారితో ఎరిక్ అనుభవాలే దీని ఇతివృత్తం. ఈ నవలనే ఇప్పుడు 'బెల్‌వ్యూ'గా బుల్లితెరపైకి తీసుకురానున్నారు.

మీలో అంత దమ్ముందా?



అని సవాల్ విసురుతున్నారు కండలవీరుడు సల్మాన్‌ఖాన్. సినిమాలో విలన్‌కి కాదు.. బుల్లితెర ప్రేక్షకులకు! అరె అదేంటి? అనుకుంటున్నారా? కావాలంటే మీరూ కరెక్ట్ ఆన్సర్ చెప్పేసి 'నాకూ దమ్ముంది' అంటూ నిరూపించవచ్చు. ఇదే సల్మాన్ లేటెస్ట్ రియాలిటీ షో 'దస్ కా దమ్' కాన్సెప్ట్. 'బిగ్‌బాస్-11'కి అంత క్రేజ్ వచ్చిందంటే కేవలం దానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన సల్మాన్ అని వేరేగా చెప్పనక్కర్లేదు. మరి ఆ తర్వాత బుల్లితెర మీద సల్మాన్ ఎప్పుడు కనబడతారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు ఆయన అభిమానులకు 'దస్ కా దమ్' ఓ సర్‌ప్రైజ్. ఇటీవలే దీని ప్రోమో చిత్రీకరణలో పాల్గొన్నారు సల్మాన్‌ఖాన్. ఆ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇది 'కౌన్ బనేగా కరోడ్‌పతి'కి దగ్గరగా ఉన్నట్టు మీకు అనిపించవచ్చు. అయితే కేవలం జాతీయ సర్వేలపై ప్రశ్నలు అడుగుతారట సల్మాన్. అయితే కంటెస్టెంట్స్ మాత్రం శాతాల్లో చెప్పాల్సి ఉంటుంది. దీని ప్రైజ్ మనీ పది వేల నుంచి పది కోట్ల వరకూ ఉంటుందట. మరి ట్రై చేస్తారా?

కారు టైర్ పంక్చర్... సినిమా ఆఫర్!

ఫ్లాష్‌బ్యాక్



స్టార్ హీరోయిన్‌గా..




విజయశాంతి తొలి మేకప్ స్టిల్

తన పిన్ని, నటి విజయ లలిత సహకారంతో విజయశాంతి సినిమాల్లో అవకాశాల కోసం ఎదురుచూస్తున్న సమయమది. కొంతమంది నిర్మాతల్ని కలసినా 'మరీ చిన్నపిల్లలా కనిపిస్తున్నావ్.. కొన్ని రోజులు ఆగు' అనే సమాధానం వారి నుంచి వచ్చేది. విశ్వశాంతి అధినేత యు. విశ్వేశ్వరరావు (ఎన్టీఆర్ వియ్యంకుడు) మాత్రం ఆమెతో ఫొటో సెషన్ చేయించారు. కోడంబాకంలో ఉండే రవి స్టూడియో ఓనరు ఆ ఫొటోలు తీశాడు. అందులో కొన్ని ఫొటోలు పెద్దవి చేసి తన స్టూడియోలో డిస్‌ప్లే చేశాడు. దర్శకుడు భారతీరాజా ఆ సమయంలోనే 'కల్లుక్కుల్ ఈరం' సినిమా తీసే సన్నాహాల్లో ఉన్నారు. ఓ సినిమా షూటింగ్ కోసం దర్శకుడు, హీరో, ఇతర యూనిట్ సభ్యులు ఓ గ్రామానికి వెళతారు. ఆ షూటింగ్ చూడటానికి వచ్చిన ఇద్దరు అమాయక గ్రామీణ యువతులు దర్శకుణ్ణి, హీరోని చూసి మనసు పారేసుకుంటారు. వాళ్లనే పెళ్లి చేసుకుంటామని మొండికేస్తారు. ఆ తర్వాత జరిగే ఆసక్తికర సంఘటనలతో 'కల్లుక్కుల్ ఈరం' సినిమా ఉంటుంది. ఇందులో దర్శకునిగా భారతీరాజా, హీరోగా సుధాకర్ నటించారు. హీరోయిన్లు కొత్త వాళ్లయితే బాగుంటుందని ఆ అన్వేషణలో ఉన్నారు భారతీరాజా. ఒక రోజు ఆయన కారులో ఎక్కడికో వెళుతుండగా సరిగ్గా రవి ఫొటో స్టూడియో ఎదురుగా కారు పంక్చర్ అయింది. టైర్ మార్చడానికి కొంత సమయం పడుతుందని డ్రైవర్ చెప్పడంతో కారులో ఎందుకని రవి స్టూడియో దగ్గరకు వచ్చారు భారతీరాజా. ఎదురుగా పెద్ద సైజులో ఉన్న విజయశాంతి ఫొటోలు ఆయన్ని ఆకర్షించాయి. ఆమె ఎవరని స్టూడియో ఓనర్ని అడిగారు. ఆమె ఎవరో తనకు తెలీదనీ, 'విశ్వశాంతి' అధినేత విశ్వేశ్వరరావు ఆ ఫొటోలు తీయించారనీ చెప్పాడు స్టూడియో ఓనర్. ఆ యువతి ఫొటోలు తనకు కావాలని భారతీరాజా అడిగితే, ఇవ్వడానికి స్టూడియో ఓనర్ ఒప్పుకోలేదు. పక్కనే ఉన్న భారతీరాజా అసోసియేట్ డైరెక్టర్ అంబి విజయశాంతిని గుర్తు పట్టాడు. 'ఈ అమ్మాయి నాన్న నాకు ఫ్రెండ్. వాళ్ల ఇంటికి వెళదాం పదండి' అని భారతీరాజాను విజయశాంతి ఇంటికి తీసుకెళ్లాడు. విజయశాంతి తండ్రి శ్రీనివాస్, అంబి మంచి స్నేహితులు కావడంతో భారతీ రాజా చిత్రంలో ఆమె నటించడానికి అంగీకరించారు. అప్పటివరకూ హీరోయిన్ పాత్ర కోసం దాదాపు 300 ఫొటోలు చూశారు భారతీరాజా. కానీ ఎవరూ ఆయనకు నచ్చలేదు. విజయశాంతి ఫొటోలు చూడగానే 'ఈమే నా హీరోయిన్' అని ఆయన ఫిక్స్ అయ్యారు. అయినా ఒకసారి మేకప్ టెస్ట్ చేశారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉండటంతో విజయశాంతిని హీరోయిన్‌గా బుక్ చేశారు. ఆమె అలా తన 14 ఏళ్ల వయసులో హీరోయిన్ అయ్యారు. తొలి సినిమాకు ఆమెకు ఇచ్చిన పారితోషికం ఎంతో తెలుసా... వంద రూపాయలు! మరో కథానాయికగా ముచ్చర్ల అరుణ ఎంపికయ్యారు. ఇక తెలుగులో ఆమె తొలి సినిమా 'కిలాడీ కృష్ణుడు'. ఇందులో హీరో కృష్ణ సరసన నటించారు. ఆ సినిమా అంతగా ఆడక పోయినా విజయశాంతి అచిరకాలంలోనే అగ్ర కథానాయిక కాగలిగారు. హీరోలతో సమానమైన ఇమేజ్ ఏర్పరచుకొని 'లేడీ అమితాబ్'గా పేరు తెచ్చుకొన్నారు.

● వినాయకరావు









('నవ్య' మొదటి పేజీ తరువాయి..)

అబద్ధం చెప్పలేదు..! చెప్పను..!

సమాజం... దృక్పథం

★ **మలయాళంలో మంచి చిత్రాలు వస్తున్నాయన్నారు. చిత్రం ఏమిటంటే, మహిళా సినీ వర్కర్స్ కోసం ఆ మధ్య ఒక సంఘం పెట్టిందీ అక్కడే. అంత చైతన్యమున్న చోటే నటి భావనపై లైంగిక అత్యాచారమనే తీరని చేదు అనుభవమూ ఎదురైంది. విరుద్ధమైన ఈ రెండు అంశాలను ఎలా చూడాలి?**

మహిళా సంఘమనే అంశాన్ని నేను ఆధ్యాత్మిక కోణంలోనే చూస్తా. ఫస్టాఫ్ ఆల్... 'మనం ఇది ఛేంజ్ చేయాలి. మనం ఫైట్ చేయాలి' అనేవి నేను నమ్మను. ఐ డోంట్ బిలీవ్ ఇన్ ఫైటింగ్... ప్రొటెస్టింగ్ అండ్ ఆల్. ఈ ప్రపంచాన్ని మనం మార్చాలి అనుకుంటే... మన కంటే మూర్ఖులు ఎవరూ ఉండరు. యు కెనాట్ ఛేంజ్ ఎవ్రిబడీ. మనం చేసేది మనం చేయాలి.

★ **మరి మీరేం చేస్తున్నారు?**

నేను ఫైట్ చేయాలంటే వర్కవుట్ కాదు. దాని బదులు ప్రజల మనసులు మార్చాలని నమ్ముతా. ప్రజల మనసులను మార్చాలంటే అది నీ దారిలో చెయ్. నా దారి సినిమాలు. సినిమాల ద్వారా నేనేం చేయగలనో... అది చేస్తున్నా. మహిళలను (సినిమాల్లో) ఒక దృష్టితో చూస్తున్నారు. నాకు ఎంత కష్టమైనా మహిళను మంచిగా చూపించే చిత్రాలే చేస్తున్నా. దానివల్ల ఇతరుల లాగా నాకు కమర్షియల్ సక్సెస్ లేకపోవచ్చు. ఎక్కువ డబ్బులు రాకపోవచ్చు. లేకపోవచ్చు. అయినా 'నేను నమ్మేది ఇదే. మహిళలను ఇలా చూడాలి' అని ప్రపంచానికి చెప్పడానికి చేస్తున్నా. సినిమాల ద్వారా నా సందేశం వెళుతోంది.

★ **ఫైట్ చేయకున్నా, గట్టిగా గొంతు వినిపిస్తే ప్రజల్లో అవగాహన వస్తుందిగా!**

ఇందాక నేను పైన చెప్పింది కేరళలో మలయాళ మహిళా సినీ నిపుణుల సంఘానికి సంబంధించి! భావన ఘటన విషయానికి వస్తే... ఆమె నాకు వ్యక్తిగతంగా బాగా తెలుసు. జరిగిన దారుణంపై ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా స్పందించడం కన్నా నేరుగా మాట్లాడడమే నయం అనిపించింది. కలిశా. మాట్లాడా.

★ **కాస్టింగ్ కౌచ్ (అవకాశాలిస్తామంటూ లైంగికంగా వాడుకోవడం)పై పెద్ద చర్చే జరుగుతోంది. అలాంటి అనుభవాలు ఎదురయ్యాయా?**

నాకెప్పుడూ నాకు అలాంటి ఘటనలు ఎదురుకాలేదు. నన్నెవరూ తప్పుడు దృష్టితో చూడలేదు. నాతో తప్పుగా ప్రవర్తించలేదు. నేనెప్పుడూ హుందాగా ఉంటా. అందుకని, నా దగ్గర తోక జాడించలేరు. అంతేకాక, నేను ఏదో ఆశించి చిత్రాలు చేయడం లేదు. చిత్రపరిశ్రమ నుంచి ఏదో కావాలనీ, దాని కోసం ఏదైనా చేయడానికి సిద్ధమనీ సంకేతాలు పంపితే... నాతో తప్పుగా ఉండేవారేమో! నాకు నచ్చితే సినిమా చేస్తా. లేదంటే చేయను.

★ **పోనీ ఇలాంటి ఇన్సిడెంట్స్ జరుగుతున్నాయని విన్నారా?**

నో! నేనెప్పుడూ అటువంటి ఘటనల గురించి వినలేదు. అయితే, నా చెవిన పడనంత మాత్రాన అలాంటివేవీ జరగడం లేదని చెప్పలేను. తప్పకుండా కొన్ని జరిగి ఉండొచ్చు. కానీ, ఎక్కువ ప్రచారంలోకి వచ్చినట్లు లేవు.

★ **సమకాలీన దేశ రాజకీయాలపై మీ దృక్పథం?**

రాజకీయాల గురించి అస్సలు అవగాహన లేదు. వాటిలో తలదూర్చను!

★ **జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్యలాంటివి విన్నప్పుడు ఏమనిపిస్తుంది?**

ఐ ఫీల్ శాడ్. మనిషిగా బాధపడతా. ప్రపంచంలో అందరూ శాంతియుతంగా ఉంటే... చెడు ఘటనలకు చోటు ఎక్కడుంటుంది?


★ **లైంగికవేధింపులు తగ్గాలంటే పిల్లల పెంపకంలో మార్పు రావాలా?**

పిల్లల్ని సరిగా పెంచడమనే కాదు. ప్రజలు మారాలి. ప్రతి ఒక్కరూ మారాలి. ఎవరికి వారు మారితే... ప్రపంచం మారుతుంది. మీరు పెళ్ళి చేసుకున్నారు అంటే... సహేతుకమైన కారణాలతో, మంచి ఆలోచనలతో పెళ్ళి చేసుకోవాలి. అలాగే, 'ఎందుకు మనకు పిల్లలు కావాలి?' అనేది ఆలోచించుకోవాలి. తల్లిదండ్రులు కావాలంటే మనకు ఒక మెచ్యూరిటీ రావాలి.

★ **మీలో ఆ మెచ్యూరిటీ రావడానికి టైమ్...?**

(నవ్వేస్తూ...) ఓహ్... 'నా పెళ్ళి ఎప్పుడు?' అని మీరు అన్యాపదేశంగా అడుగుతున్నారా! పిల్లల్ని కనే ఆ మెచ్యూరిటీ నాకొస్తుందా? లేదా? అన్నది తెలీదు.





వ్యక్తిగతం...

★ **యాభై ఏళ్ళ వయసొచ్చే సరికి మీరెక్కడ, ఎలా ఉండాలనుకుంటున్నారు?**

(సాలోచనగా...) ప్రపంచానికి ఎంతో కొంత సేవ చేసిన వ్యక్తిగా ఉండాలనుకుంటున్నా. నా వల్ల ఎంత (చిత్రాల ద్వారా) మంచి జరుగుతుంతో.. అంతా చేయాలనుకుంటున్నా. నేను చేసిన వర్క్ (సినిమాలు) చూసి ప్రేక్షకులు ప్రభావితమైతే, అప్పుడు నా పని పూర్తయిందనుకుంటా. నా లక్ష్యం నెరవేరిందనుకుంటా. ప్రజలపై నా ప్రభావం ఉండాలనుకుంటున్నా. అది సినిమాల ద్వారా కావొచ్చు, లేదా నా ప్రవర్తన వల్ల కావొచ్చు. సమాజానికి ఏదో ఒక మంచి చేసిన సంతోషకరమైన వ్యక్తి నన్ను నేను చూడాలనుకుంటున్నా. నేను చేరుకోవలసిన గమ్యం ఇంకా చాలా దూరంలో ఉంది.

★ **అనుభవాలకు పుస్తకరూపమిచ్చే ఆలోచన?**

(నవ్వుతూ...) నాతో చాలామంది 'ఏదో ఒక రోజు నువ్వు నీ ఆత్మకథ రాస్తావ్' అన్నారు. రాస్తానేమో. తెలీదు! జీవితంతో చాలానే జరిగాయి.

★ **కానీ, మీరు వాటినెప్పుడూ మాతో పంచుకోరు!**

ఎందుకంటే... అవన్నీ వెరీ వెరీ పర్సనల్.

★ **మీరెలాంటి రచనలు చదువుతుంటారు?**

మొదట్లో చాలా పుస్తకాలు చదివేదాన్ని. ఇప్పుడు చదవడం తగ్గించేశా. పుస్తకాలంటే ఏంటి? ఎవరో ఒకరి ఊహ, వ్యాఖ్యానం, దృక్కోణం. వారి ఊహల్లోకి నేను వెళ్ళలేను. మరొకరి దృక్కోణంలో వ్యాఖ్యానం కన్నా నాదైన దృక్కోణం ఏర్పరచుకోవాలనుకుంటా.

★ **ఆధ్యాత్మికత వైపు మిమ్మల్ని మళ్ళించిన పుస్తకం?**

పుస్తకం కాదు. జీవితం నాకు ఎంతో నేర్పింది.

★ **మీపై ప్రభావం చూపిన వ్యక్తి ఎవరైనా ఉన్నారా?**

(బ్యాగ్‌లో నుంచి చిన్న పటం చూపిస్తూ...) 'అమ్మా భగవాన్' ప్రభావం నాపై, నా జీవితంపై చాలా ఉంది. చిత్తూరు జిల్లా సరిహద్దుల్లో ఉండే అమ్మా భగవాన్ ఆశ్రమం 'సత్యలోకానికి' రెగ్యులర్‌గా వెళుతుంటా. వీలు కుదిరినప్పుడల్లా అక్కడి క్లాసులకు హాజరవుతుంటా.



తండ్రితో..

★ **మీరు అక్కడ ఉన్నప్పటి ఫొటో ఒక్కటీ బయటకు రాలేదు!**

అది ఆధ్యాత్మిక మందిరం. పబ్లిక్ ప్లేస్ కాదు. వెళ్ళినప్పుడు నాకు కూడా ప్రైవసీ కావాలి కదా. అక్కడ ఉండే వారందరూ వాళ్ళ ఆధ్యాత్మిక ప్రయాణంపై దృష్టి పెడతారు. వాళ్ళు నన్ను మరొక వ్యక్తిగానే చూస్తారు. నాకది నచ్చుతుంది. అయితే, ఇప్పుడు అంత ఎక్కువ వెళ్ళడానికి తీరిక ఉండడం లేదు.

★ **షాపింగ్ చేయాలన్నా మీకు ఇబ్బందే!**

నేను ఎక్కువ షాపింగ్ చేయను. నాకెప్పుడూ సీదాసాదాగా ఉండడం చాలా ఇష్టం. రోడ్డు మీద సరదాగా నడుచుకుంటూ వెళ్ళాలని ఉంటుంది. కానీ, నేను ఇప్పుడు అలా చేయలేనన్న బాధ ఉంటుంది. నాదంతా ఆన్‌లైన్ షాపింగ్! (నవ్వుతూ..) నాకు కావలసినవన్నీ ఇంటికి వచ్చేస్తాయి.

★ **మీరు భోజనప్రియులా? వంట చేస్తారా?**

లేదండీ! ఫుడ్‌తో నాకు అంత ఎటాచ్‌మెంట్ లేదు. (నవ్వుతూ) వంట అస్సలు చేయను. ఏదో తినాలి కాబట్టి తింటా. ఎక్కువ తినను. ఏం ఇచ్చినా తినేస్తా. మా వంటమనిషి, 'మీరు ఉప్పు ఎక్కువ అయ్యిందనీ చెప్పరు. తక్కువనీ చెప్పరు. ఏం ఇచ్చినా తినేస్తారు. ఎలాగమ్మా' అంటుంటుంది.

★ **మీ ఫ్యామిలీ గురించి?**

అమ్మానాన్నలతో చాలా క్లోజ్‌గా ఉంటా. వాళ్ళకు నేను ఒక్కదాన్నే. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. నాన్న సుకుమార్ నాయర్ డిఫెన్స్ సెక్టార్‌లో ఉద్యోగం చేసి, రిటైర్ అయ్యారు. అమ్మ నళినీ మీనన్. బ్యాంక్ ఉద్యోగి. ఆ మధ్యనే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. అమ్మానాన్నలకు నేనొక్కతినే సంతానం.

★ **ఎప్పుడైనా అబద్ధం చెబుతుంటారా?**

(గంభీరంగా మారి, దృఢమైన స్వరంతో...) లేనే లేదు. నా గురించి నాకు బాగా తెలుసు. నా వ్యక్తిగత విషయాలు కొన్ని బయటవాళ్ళకు తెలియాల్సిన అవసరం లేదు. అందుకని, వాటి గురించి మాట్లాడను. అంతే తప్ప, నేనెప్పుడూ అబద్ధం చెప్పలేదు. చెప్పను.



డైలీ సుడోకు - 115

1	6				2	7	4	5
				1	4		6	2
3					7	9		
9	7		2	8	5		3	
2								9
	5		9	4	6		2	7
		2	7					4
6	8		4	5				
4	3	7	6				5	1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-114 సమాధానం


[illegible]

దీపావళికి దోచేవారెవరు?


ఆమిర్‌ఖాన్

థియేటర్లలోకి దీపావళినాడు ఎవరు వస్తారు?! రజనీకాంతా...? ఆమిర్‌ఖానా...? ఇద్దరిలో ప్రేక్షకుల మనసు దోచేవారు ఎవరు? ముంబయ్‌లో ఇప్పుడిదే హాట్ డిస్కషన్! అమితాబ్ బచ్చన్, ఆమిర్‌ఖాన్ హీరోలుగా నటిస్తున్న హిందీ చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'. 'ధూమ్ 3' ఫేమ్ విజయ్‌కృష్ణ ఆచార్య దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా నవంబర్ 7న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పుడదే తేదీకి రజనీకాంత్ హీరోగా శంకర్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న '2.0'ను విడుదల చేయాలని అనుకోవడంతో సమస్య మొదలైంది. ముంబయ్ నుంచి అందుతున్న సమాచారం ప్రకారం... రెండు భారీ చిత్రాలు ఒకే రోజున విడుదలయితే థియేటర్ల సమస్య వస్తుంది కనుక లైకా సంస్థ 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్' విడుదలను వాయిదా వేయమని ఆమిర్‌ను కోరింది. కొన్ని వారాలు చర్చలు కూడా జరిగాయి. అయితే... అందుకు ఆమిర్ అంగీకరించలేదు. దాంతో స్వయంగా రజనీయే ఆమిర్‌కి ఫోన్ చేయడంతో చర్చలు మళ్ళీ మొదటికి వచ్చాయట! నిజం చెప్పాలంటే... గతేడాది దీపావళికి '2.0'ను విడుదల చేయాలనుకున్నారు. గ్రాఫిక్స్ వర్క్ సకాలంలో పూర్తికాకపోవడంతో విడుదల చేయలేదు. '2.0' అనుకున్న తేదీకి ఆమిర్ తన 'సీక్రెట్ సూపర్‌స్టార్'ను విడుదల చేశారు. తర్వాత జనవరి 26న అనుకుంటే... పలు పరిణామాల మధ్య దీపికా పడుకొనే 'పద్మావత్' వచ్చింది. తర్వాత ఏప్రిల్ 27న '2.0'ను విడుదల చేయాలని ప్లాన్ చేసుకున్నారు. మళ్ళీ గ్రాఫిక్స్ పూర్తి కాలేదు. దాంతో 'కాలా'ను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. మరి, '2.0' ఎప్పుడు వస్తుంది? అంటే... దీపావళికి అంటున్నారు. అందుకనే రజనీ స్వయంగా ఆమిర్‌కి ఫోన్ చేశారట! రజనీ కోసం ఆమిర్ తన చిత్రాన్ని వాయిదా వేస్తారా? లేదా? అనేది చూడాలి.




'కాలా'లో రజనీకాంత్

కాలా... రజనీ నిర్ణయం అదిరిపోలా!

రాజకీయాలు రాజకీయాలే... సినిమాలు సినిమాలే! రాజకీయ రంగ ప్రవేశం సినిమా ప్రయాణానికి అడ్డు కాబోదని రజనీ తన నిర్ణయాల ద్వారా స్పష్టం చేసినట్టయ్యింది. రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు కనుక రజనీ ఇక సినిమాలు చేయరని చాలామంది అనుకున్నారు. వాళ్ళ ఊహలకు చెక్ పెడుతూ... రజనీకాంత్ హీరోగా 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించే సినిమా ప్రకటన వచ్చింది. అలాగే, 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటించిన 'కాలా' టీజర్ మార్చి 1న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.


ఎన్టీఆర్

కిక్కు... మ్యూజిక్కు!

ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న సినిమా చిత్రీకరణ వచ్చే నెల మార్చిలో మొదలుకానుంది. మ్యూజిక్ సిట్టింగ్స్ మాత్రం ఆల్రెడీ మొదలయ్యాయి. ఎన్టీఆర్ ఇమేజ్, డ్యాన్సులతో పాటు త్రివిక్రమ్ కథ, అందులోని సందర్భాలకు తగ్గట్టు బాణీలు కట్టే పనిలో పడ్డారు తమన్. మొదట ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్‌ని సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. చిత్ర ప్రారంభోత్సవంలో హీరో, దర్శకుడితో కలిసి ఈ తమిళ సంగీత దర్శకుడు సందడి చేశారు కూడా!ఏమైందో ఏమో... కొన్ని రోజులుగా అనిరుధ్ స్థానంలో తమన్‌ని తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. సదరు వార్తలకు బలం చేకూరుస్తూ, ఎన్టీఆర్-త్రివిక్రమ్ చిత్రానికి సంగీతం అందిస్తున్నట్టు తమన్ తెలిపారు. "త్రివిక్రమ్‌గారు అద్భుతమైన కథ సిద్ధం చేశారు. ఎక్స్‌ట్రాడినరీ స్క్రిప్ట్. కథ వినగానే చాలా కిక్ ఇచ్చింది. ఈ కథకు బాణీలు కట్టడం కోసం నేనింక ఆగలేను. ఎన్టీఆర్‌తో ఇంతకు ముందు 'బృందావనం', 'బాద్‌షా', 'రభస' చిత్రాలు చేశా. త్రివిక్రమ్‌గారితో నాకు ఇదే తొలి చిత్రం. ఇద్దరూ నాకెంతో మద్దతు ఇస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. చాలా కంఫర్ట్‌బుల్‌గా, ఎగ్జయిటింగ్‌గా వర్క్ చేస్తున్నా" అని తమన్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి 'ఆన్ సైలెంట్ మోడ్' టైటిల్ పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

ఎన్ అండ్ ఎన్... దిస్ ఈజ్ బిగినింగ్!


మణిశర్మ, అశ్వనీదత్, నాని, శ్రీరామ్ ఆదిత్య

ఎన్ ఫర్ నాగార్జున అక్కినేని! మరి, నెక్స్ట్ ఎన్? నాని! వీళ్ళిద్దరూ హీరోలుగా 'భలే మంచి రోజు', 'శమంతకమణి' చిత్రాల ఫేమ్ టి. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో వైజయంతి మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం నాని పుట్టినరోజు సందర్భంగా మహతి రికార్డింగ్ స్టూడియోలో ఈ చిత్రం పాటల రికార్డింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత అశ్వనీదత్ మాట్లాడుతూ "నాగార్జున, నాని హీరోలుగా ఆసక్తికరమైన కథలో వినోదాత్మకంగా చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా సంస్థలో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారథ్యంతో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. వచ్చే నెలలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. ప్రస్తుతం మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది" అన్నారు. దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ "ఈ రోజు సరికొత్త ప్రయాణం మొదలైంది. మా కింగ్ నాగార్జునగారిని ఇక్కడ మిస్ అవుతున్నాం. నేచురల్ స్టార్ నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు. నాగార్జునగారు, నాని కాంబినేషన్‌లో సినిమా చేయడం, అందులోనూ వైజయంతి మూవీస్ వంటి పెద్ద సంస్థలో ఈ చిత్రం చేయడం చాలా సంతోషంగా ఉంది. దర్శకుడిగా నాకు ప్రతిష్టాత్మక చిత్రమిది" అన్నారు. ఈ చిత్రానికి మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, స్క్రిప్ట్ అడ్వయిజర్: సత్యానంద్, ఛాయాగ్రహణం: శ్యామ్‌దత్.


అనుష్క

కొన్ని అంతే.. తలచుకుని నవ్వుకోవాలి!

కొందరు ఏమాత్రం అవకాశం వచ్చినా మాట్లాడుతూ ఉంటారు. మరికొందరు నోరు విప్పడానికి చాలా ఆలోచిస్తారు. కథానాయిక అనుష్క ఈ రెండో వర్గానికే చెందుతారు. అతిగా మాట్లాడటం ఆమెకు ఇష్టం ఉండదు. చాలా ప్లెజెంట్‌గా ఉండాలని భావిస్తారు. నిజ జీవితంలోనూ ఆమె కోరుకునే చిత్రాలు అలాంటివేనట. వాటి గురించి స్వీటీ చెబుతూ "నాకు వ్యక్తిగతంగా డ్రామాలు, కామెడీలు, రొమాంటిక్ చిత్రాలు ఇష్టం. అలాంటి వాటిల్లో చేయడానికే మొగ్గుచూపుతాను. అయితే అదేంటోగానీ నా వరకు వస్తున్న వాటిల్లో చాలా స్క్రిప్ట్‌లు నా చేత కత్తులు, కటార్లు పట్టించి దుష్టుల తలల్ని నరకమంటున్నాయి" అని నవ్వుతూ అన్నారు. కథలను వినడం గురించి మాట్లాడుతూ "స్క్రిప్ట్‌లు వింటున్నప్పుడు చిన్నపిల్లగా మారిపోతాను. నాకు కథలు వినడం చాలా ఇష్టం. దర్శకులు ఇంటికొచ్చి హీరోయిన్‌కి కథలు వినిపిస్తారనే సంగతి నాకు 'సూపర్' చేసేటప్పుడు తెలియదు. 'సినిమాను అంగీకరించడానికి ముందు కథను ఒకసారి చెప్పమని అడుగు' అని పూరి జగన్నాథ్‌గారు చెప్తే తెలిసింది. అప్పటి నుంచీ కథలు వింటున్నా. ఓ అమ్మాయిని దృష్టిలో పెట్టుకుని కత్తులునూరే స్క్రిప్ట్‌లు రాస్తున్నారని అనుకున్నప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది" అని చెప్పారు అనుష్క.

నేను చెప్పాలనుకున్నదే చెప్తా

-ఇలియానా

ఇలియానాకు కాస్త కోపం ఎక్కువ. ఎన్నో సందర్భాల్లో అది రుజువైంది. ఆమెను ఓ ప్రశ్న అడిగితే జవాబు ఎంత చెప్పాలో.. ఎలా చెప్పాలో కూడా బాగా తెలుసు. కొన్ని సందర్భాల్లో నచ్చని ప్రశ్నలకు రుసరుసలాడుతూ సమాధానాలు కూడా చెప్పింది. ఇటీవల ముంబైలో ఆమె పాల్గొన్న ఓ కార్యక్రమంలో "క్రిస్మస్ సమయంలో నా 'హబ్బీ తీసిన ఫొటో ఇది' అంటూ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోను చూసిన వారంతా ఇలియానా పెళ్లి చేసేసుకుందనే అనుకున్నారు? అన్న ప్రశ్నకు ఇల్లీ బేబీ ఘాటైన సమాధానం ఇచ్చింది. "అదంతా సోషల్ మీడియా మహిమ. దానికి నేను స్పందిస్తే ఆ మాటలు అలా కొనసాగుతూనే ఉంటాయి. నా వ్యక్తిగత విషయాలు బయటి వారికి అనవసరం. కొన్ని విషయాలు ఎంత దాచాలనుకున్నా దాగవు. అలాగని నేను దాచిపెట్టలేను. జరిగిన దాని గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు. ఆండ్రూతో నా రిలేషన్‌షిప్ ఎలా స్టార్ట్ అయింది. ఇప్పుడు మేం ఎలా ఉన్నాం? అనేది నేను చెప్పను. అది నా పర్సనల్. ఎవరు ఎన్ని ప్రశ్నలు అడిగినా నేను చెప్పాలనుకున్నదే చెప్తా. నా నోటి నుంచి ఒక్క జవాబు కూడా రాబట్టలేరు" అని.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లోని సినిమా థియేటర్ల వారికి విజ్ఞప్తి

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారి నుండి ఎదుర్కొనుచున్న సమస్యలను చర్చించుటకు **దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ ఒక సంయుక్త కార్యాచరణ కమిటీ (జాయింట్ యాక్షన్ కమిటీ)**ని ఏర్పాటు చేయడమైనది. **డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్** వారి ఏకపక్ష ధోరణి మరియు వారు అవలంభిస్తున్న నిర్ణయాలను చర్చించుటకై వారితో జాయింట్ యాక్షన్ కమిటీ జరిపిన చర్చలు విఫలం అయినవి.

కాబట్టి ఈ విషయమును దృష్టిలో ఉంచుకొని **థియేటర్ (ఎగ్జిబిటర్స్)** యాజమాన్యం వారు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారితో అగ్రిమెంట్స్ రెన్యువల్స్ చేయించుకొనుట గాని, కొత్త అగ్రిమెంట్లు గాని జరుపవద్దు మరియు **మార్చి 2** నుండి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వారికి స్క్రీనింగ్ నిమిత్తం ఎటువంటి కంటెంట్ ఇవ్వబడదు. ఈ విషయమై జాయింట్ యాక్షన్ కమిటీ వారు తదుపరి సూచనలు తెలియజేసే వరకు థియేటర్ (ఎగ్జిబిటర్స్) యాజమాన్యం వారు జాయింట్ యాక్షన్ కమిటీ వారికి సహకరించవలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు

దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ

మేఘా.. నింగే పాగా!


నితిన్, మేఘా

తెలుగు భాషలో అల్ప ప్రాణాలను, మహా ప్రాణాలను గురించి మాట్లాడేవారే కరవైపోతున్నారనుకునే ఈ తరుణంలో ఓ తెలుగు సినిమా పాట మరలా వాటిని గుర్తు చేసింది. 'గ ఘ మేఘ.. నింగే మనకు నేడు పాగా' అంటూ సాగే పాటలో 'గ కాదు.. ఘ' అని నాయిక నోటి వెంట మాటలు వినిపించాయి. నితిన్, మేఘా జంటగా నటిస్తోన్న 'ఛల్ మోహన్‌రంగ' సినిమాలోనిది ఈ పాట. కృష్ణ చైతన్య దర్శకుడు. నిఖితా రెడ్డి సమర్పిస్తున్నారు. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కుతోంది. ఎన్. సుధాకర్‌రెడ్డి నిర్మాత. తమన్ స్వరపరచగా కె.కె. 'గ ఘ మేఘ' పాటను రాశారు. యు.ఎస్‌లోని కీవెస్ట్, ఆమిష్ విలేజ్‌లో ఈ పాటను చిత్రీకరించారు. నితిన్ నటిస్తోన్న 25వ చిత్రమిది. త్రివిక్రమ్ కథను అందించారు. ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్టు నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి ప్రకటించారు. నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావురమేశ్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశు రెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృతిక, మాస్టర్ జాయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రానికి సంగీతం: తమన్. ఎస్, కెమెరా: ఎన్.నటరాజ సుబ్రమణియన్.

మంత్రం వేసిందెవరు విజయ్?


విజయ్ దేవరకొండ, శివానీసింగ్

గేమ్ నేపథ్యంలో నడిచే ఓ చిత్రంలో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఆ చిత్రానికి తాజాగా 'ఏ మంత్రం వేశావే' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవైట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్నారు. శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. శివానీసింగ్ నాయికగా నటిస్తున్నారు. మార్చి 9న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ "గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'పెళ్లిచూపులు', 'అర్జున్‌రెడ్డి' తరహాలోనే ఆయన కెరీర్‌లో మరపురాని చిత్రంగా మిగులుతుంది. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు హైలైట్‌గా వుంటాయి. మార్చి 9న చిత్రాన్ని విడుదల చేస్తాం" అని తెలిపారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తోన్న ఈ చిత్రానికి సంగీతం: అబ్బత్ సమత్, సినిమాటోగ్రఫీ: శివారెడ్డి.



థియేటర్స్ బంద్‌కు మద్దతు

- ఆర్.కె.గౌడ్


ఆర్.కె గౌడ్, సాయివెంకట్

నిర్మాతలకు, క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డీ డిజిటల్ సర్వీస్ సంస్థలకు మధ్య జరిగిన చర్చ విఫలమైంది. శుక్రవారం బెంగుళూరులో ఈ చర్చ జరిగింది. దీంతో దక్షిణాది నిర్మాతలంతా ఒకే తాటి పైకొచ్చి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ చేస్తూ ఈ మూడు డిజిటల్ సంస్థలకు సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. దీనికి తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ మద్దతు తెలుపుతుందని శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ "గత పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై పోరాటం చేస్తున్నాం. ఇప్పటికైనా కళ్లు తెరచి దక్షిణాది చలనచిత్ర పరిశ్రమలన్నీ పోరాటం చెయ్యడం మంచి పరిణామం. గతంలో డిజిటల్ రేట్లు తగ్గించాలంటూ నిరాహార దీక్ష చేస్తే ఎవరూ పట్టించుకోలేదు. బెంగుళూరు జరిగిన చర్చలో ఆ మూడు డిజిటల్ సర్వీస్ సంస్థలూ 9 శాతానికి మించి తగ్గించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పడం కరెక్ట్ కాదు. అసలు డిజిటల్ ఛార్జీలు ఐదేళ్లకు మించి ఉండకూడదు. పదమూడేళ్లైనా అదే రేట్లు తీసుకుంటూ నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారు. సౌత్‌లో తప్ప మరెక్కడా ఈ విధానం లేదు. రూ.2500కే డిజిటల్ సర్వీస్ అందుబాటులోకి తెస్తామంటూ ముందుకొచ్చిన కొన్ని సంస్థలను రానివ్వకుండా చేశారు కొందరు. ఇప్పటికే అత్యధిక రేట్ల వల్ల ఎన్నో చిత్రాలు రిలీజ్‌కు నోచుకోలేదు. క్యూబ్, యుఎఫ్ఓ, పిఎక్స్‌డీ సంస్థలతో అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకుంటే తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. కాబట్టి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్‌కు అందరూ సహకరించాలి" అని అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్..


శ్రావణి, మారుతి

మారుతి, శ్రావణి, ప్రియ కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'యమ్6'. జై రామ్ వర్మ దర్శకుడు. విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్ నిర్మాతలు. ఇటీవల ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకుడు జై రామ్‌వర్మ మాట్లాడుతూ "సస్పెన్స్ థ్రిలర్ ఇది. కడుపుబ్బ నవ్వించే కామెడీతోపాటు చక్కని సందేశం కూడా ఉంది" అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ "దర్శకుడు కథ చెప్పిన దానికంటే అద్భుతంగా తెరకెక్కించారు. హీరోకి తొలి సినిమా అయినప్పటికీ అనుభవం ఉన్న నటుడిలా యాక్ట్ చేశాడు" అని చెప్పారు. నేపథ్య సంగీతానికి స్కోపున్న చిత్రమిదని సంగీత దర్శకుడు విజయ్ బాలాజి తెలిపారు.

ద్వేషం.. ప్రేమగా...


శ్వేత, అనురాగ్

జనని క్రియేషన్స్ పతాకంపై అనురాగ్ కథానాయకుడిగా 'ఈ క్షణమే' చిత్రం ఇటీవల రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. శ్వేతా కథానాయిక. పోకూరి లక్ష్మణాచారి నిర్మాత. సాయిదేవ రామన్ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి బి.గోపాల్ క్లాప్ ఇచ్చారు. న్యాయమూర్తి రామారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఓ అబ్బాయిని ద్వేషించిన అమ్మాయి మళ్లీ ఆ అబ్బాయి ప్రేమలోనే పడుతుంది. ద్వేషం ప్రేమగ మారడానికి కారణం ఏంటన్నది కథ. కాలేజ్ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది" అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "వచ్చే వారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం" అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సతీశ్, మాటలు: హేమంత్ కార్తీక్.

పారదర్శకంగా గ్రూప్స్ పరీక్షలు: ఉదయభాస్కర్

టెక్కలి, ఫిబ్రవరి 24: ఏపీపీఎస్సీ ద్వారా చేపట్టే అన్ని రకాల గ్రూప్ పరీక్షలనూ పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం కె.కొత్తూరు లోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పారదర్శక విధానంలో భాగంగా అభ్యర్థుల రాతపరీక్ష మార్కులు, రిజర్వేషన్లు, ఎంపిక చేసుకున్న ఉద్యోగం తదితర సమాచారాన్ని 24 గంటల్లో వెబ్‌సైట్‌లో ఉంచుతున్నామన్నారు. గతంలో మాదిరిగా కోర్టు వివాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రూప్ పరీక్షలకు సంబంధించి ఒక పోస్ట్‌కు 50 మంది వరకు రాత పరీక్షలో పాల్గొనేవారని, అది 1:15 శాతానికి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు ఇచ్చిన 36 గ్రూప్స్ నోటిఫికేషన్ల ద్వారా వివిధ కేటగిరీల్లో 4,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. 2011 గ్రూప్-1 పరీక్షలో విజేతలకు మరోవారంలో ధ్రువపత్రాలు ఇవ్వనున్నామన్నారు.

రక్తహీనత కాదు.. ఏ-ప్లాస్టిక్ ఎనీమియా!

» నిశ్శబ్దంగా దాడి చేస్తున్న వ్యాధి.. ప్రాణాపాయం

» రక్తవ్యాధి నిపుణులే గుర్తించే అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏ-ప్లాస్టిక్ ఎనీమియా. వైద్యవర్గాలకు దీని గురించి తెలిసినా చాలా మందికి అవగాహన లేదు. ప్రస్తుతం ప్రజలపై నిశ్శబ్దంగా దాడి చేస్తున్న వ్యా.ధి. మనిషిలోని శక్తిని లాగేస్తుంది. ఏ పనీ చేయలేం. మరి దీనిని గుర్తించడం ఎలా? ఏం చేయాలి? దీనికి కారణం ఏమిటి? ఆరోగ్యంగా ఉన్నవారి ముఖం పాలిపోతుంది. చిగుళ్ల నుంచి అదే పనిగా రక్తం కారుతుంది. శరీరంపై మచ్చలు ఏర్పడతాయి. సత్తువ ఉండదు. ఇవే ఏ-ప్లాస్టిక్ ఎనీమియా లక్షణాలు. ఒక్కోసారి ఊపిరి కూడా సరిగా అందదు. హృదయ స్పందనలోనూ తేడా వస్తుంది. దీనినే రక్తహీనతగా కూడా భావిస్తారు. తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు తగ్గితేనా ఇంత ప్రమాదమా అని అనుకోవచ్చు. ఏ-ప్లాస్టిక్ ఎనీమియా ఇంతటితో ఆగిపోదు. రక్తంలో ప్లేట్‌లెట్స్ కూడా తగ్గిపోతాయి. దీనిని చాలా మంది డాక్టర్లు గుర్తించరు. తగ్గిన రక్త కణాలు తిరిగి పుంజుకునేలా చేశాం కదా అనుకుంటారు. కానీ తెల్ల, ఎర్ర రక్త కణాలను ఎన్నిసార్లు శరీరంలోకి పంపించినా అవి తగ్గిపోతూనే ఉంటాయి. ఏ-ప్లాస్టిక్ ఎనీమియా పరీక్ష చేయించుకుంటే గానీ ఇది బయటపడదు. ప్రస్తుతం దేశంలో ఈ వ్యాధిపై ఎలాంటి పరిశోధనలూ జరగడం లేదనేది కొందరి వైద్యుల ఆందోళన. ఫలితంగా ప్రజలకు, డాక్టర్లకు దీనిపై అవగాహన ఉండటం లేదు. కేవలం రక్తవ్యాధుల నిపుణుల మాత్రమే ఈ వ్యాధి తీవ్రతను గుర్తించే వీలుంది. ఈ వ్యాధి పలానా వయస్సువారిలోనే, పలానా సమయంలోనే వస్తుందనేది ఏమీ లేదు. ఎవరికైనా రావొచ్చు. ఒక్కసారిగా ఆరోగ్య పరిస్థితి విషమిస్తుంది. వ్యాధి లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభిస్తే సరి లేదంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చాలా తక్కువ సందర్భాల్లోనే ఏ-ప్లాస్టిక్ ఎనీమియా లుకేమియాగా మారే ప్రమాదం ఉంది.

విజయవాడలో ఇద్దరికి చికిత్స: డాక్టర్ రవికిరణ్



ఈ వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు రోగులకు తమ హాస్పిటల్‌లో వైద్యం అందించామని రవి అమెరికన్ కేన్సర్ కేర్ హాస్పిటల్ అంకాలజిస్ట్ డాక్టర్ రవికిరణ్ బొబ్బా తెలిపారు. విజయవాడకు చెందిన శ్రీలతకు చికిత్స చేయగా... సమస్య నుంచి పూర్తిగా బయటపడ్డారని చెప్పారు.

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వధువు కావలెను



★ కాపు / 32y / 5'8" / M.S / SWE(USA)/ 4L P/M / వెల్ సెటిల్డ్ వరునికి USAలో జాబ్ చేయు వధువు కావలెను. ఫోన్: 9603059815 AJH-079

★ రెడ్డి / 39y / 5'7" / డిగ్రీ / 2nd మ్యారేజ్ / బిజినెస్ / నెలకి 50K(PM) / గల వరునికి వధువు కావలెను. సంప్రదించండి. ఫోన్: 7799182844 AJH-079

★ కమ్మ / 40y / 5'10" / డైవర్స్ /Hyd.లో సొంత సాఫ్ట్‌వేర్ బిజినెస్ 10L PA 3Cr. ప్రాపర్టీ గల అందమైన వరునకు కమ్మ వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర: 8328151822 AJH-16187

★ కుల పట్టింపులేదు / 44y / 6'1" / ఆదర్శ భావాలు ఉన్న బిజినెస్ మ్యాన్‌కు వధువు కావలెను. సంప్రదించండి. 7207174889 AJH-16187

★ కాపు : 52 సం॥ / స్టేట్ గవర్నమెంట్ సీనియర్ అసిస్టెంట్ తగిన యంగ్ / సెటిల్డ్ వధువు కావలెను. సంప్రదించండి. సెల్: 81211 94912 (డైరెక్ట్) AJB-972

★ గవర కులమునకు చెందిన 2nd Marriage వరుడికి వధువు కావలెను. Age: 28. Contact.: 7036622781 AJV-436093

★ రెడ్డి/ విడోవర్/ 40 సం॥/5.6/రు 53000లు జీతం గల (ఇద్దరు పిల్లలు) ప్రభుత్వ ఉద్యోగికి తగిన వధువు కావలెను. కుల పట్టింపు లేదు. వాట్సాప్ 8074630569 డైరెక్ట్. AJC-446687

★ రెండవ పెళ్లి 32 సం॥ వయస్సు, Height 5'5", Private Job గల వరుడికి వధువు కావలెను. కులం ప్రసక్తి లేదు, ఫోన్: 8885751113 AJD-443993

★ యాదవుల ప్రత్యేకం : 30, 5'10", MBBS, PG, నెల లక్ష, 30, 5'10", B.Tech గ్రూప్-2, ఆఫీసర్ గల వరునకు వధువు కావలెను. K.K. Yadav. Cell : 9849306274. AJG-456771

★ కాపు, 1981, 5'9", అందమైన ఇంజనీరు (అమెరికా) అబ్బాయికి అందమైన వధువు కావలెను. సంప్రదించండి సెల్ : 9030790242. AJG-GNT

★ కమ్మ /42y / విడో / 5'4" / Electrical Departmentలో Engineer / Govt Job / Own House & Lands వధువుకు వరుడు కావలెను. ఫోన్:7674033348 AJH-079

★ వైశ్యుల్, CNB, / 32y / MBA, 30K 50ల. ఆస్తి. రెడ్డి 24 సం. 5.3" /వెరీ ఫెయిర్ 30K గల వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్:9346710899 AJH-079

★ కులపట్టింపు లేదు / విడో 50y / 5'3" /10th క్లాస్ 10 ఎ.వ్యవసాయ భూమి, 30 వేలు PM. సొంత ఇల్లు గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:8978894043 / 8978894173 AJH-079

★ కాపు / విడో / 44y / 5'4" /MBBS (డాక్టర్) / 70,000/- P/M / Hydలో వెల్ సెటిల్డ్ / 3 Cr. ప్రాపర్టీ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9948070006 AJH-079

★ కమ్మ/విడో/48y/ 5'4" /BA /రాజమండ్రిలో ల్యాండ్ (లీజ్) / స్కూల్ అడ్మినిస్ట్రేటర్ / 1L P/M / వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9912753645 AJH-079

★ కమ్మ/విడో/44y/ 5'3" / సొంత ఇల్లు విజయవాడ / Own House (Rents) / 50,000/- P/M / 1 ప్లాట్ వెల్ సెటిల్డ్ / Hydలో SWE కు.లో CEO 50,000/- P/M / వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్:9912038880 AJH-079

★ రెడ్డి/లేట్ మ్యారేజ్/40y/ 5'4" / వైజాగ్‌లో ఫైనాన్స్ బిజినెస్ / Own House (Rents) / 1L P/M / 4 Cr. ప్రాపర్టీ వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. ఫోన్:9912916046 AJH-079

★ గౌడ్స్ / విడో / 31y / 5'5" / H.P. గ్యాస్ డీలర్ / 12 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్:8106499144 AJH-079

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / విడో / ఫెయిర్ / 35y / 5'5" / ఐరన్ & స్టీల్ బిజినెస్ / 6 కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:7893575126 AJH-079

★ యాదవ / విడో / 29y / 5'3" / లేట్ మ్యారేజ్ / గైనకాలజిస్ట్ / 8 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. సెల్: 9121589359. AJH-079

★ బ్రాహ్మణ / 45y / 5'4" / లేట్ మ్యారేజ్ / Govt. Job / 60,000PM/ సొంత ఇల్లు / తల్లి తరుపు ఆస్తి పొలాలు / వధువుకు FC/BC వరుడు కావలెను. సెల్: 9642399013. AJH-079

★ రెడ్డి / 35y / విడో / Govt. Job / సొంత ఇల్లు / వెల్‌సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను డైరెక్ట్ సెల్: 8367013811 AJH-079

★ విడో / 65 / BC / CNB / 5'3 / V. Fair / ఫ్యామిలీ పెన్షనర్ హౌజ్ / రెంట్స్ / 60K / వెల్ సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. 8686310368 AJH-079

★ క్షత్రియ / 49Y / 5'4" / Govt. Job / విడో / పొలాలు తోటలు నెల్లూరు దగ్గర ఇల్లు కల / PM / 1C / గల సాంప్రదాయ వధువుకు తగిన వరుడు కావలెను. 9573380048 AJH-079

★ FC / 60Y / 5'4" / విడో / ఇంటర్ / పెన్షనర్ / సొంత బిజినెస్ / అగ్రికల్చరల్ ఆదాయం / మరియు రెంట్స్ వధువుకు వరుడు కావలెను. 9705349133 AJH-079

★ కమ్మ / 58Y / 5'4" / V.Fair / డాక్టర్ / విడో / రెంట్స్ / 30,000 / వధువుకు వరుడు కావలెను. 8465058052 AJH-079

★ కమ్మ / విడో / 56Y / 5'3" / ఇంటర్ / ఓన్ బిజినెస్ / రెంట్స్ / 1.50LPM / వెల్ సెటిల్డ్ గల వధువుకు వరుడు కావలెను. 9581085453 AJH-079

వరుడు కావలెను




★ కుల ప్రసక్తి లేదు / 24y / 5'5" / MBBS / డాక్టర్ / 50,000/- P/M 8 కోట్ల ప్రాపర్టీగల వెల్ సెటిల్డ్ సాంప్రదాయ కుటుంబ వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్:7893895763 AJH-079

★ కమ్మ / విడో / 43y / 5'5" / M.Com / Accounts Job 5 Cr. ప్రాపర్టీ 40,000/- P/M వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్:8340826530 AJH-079

★ వెలమ / డైవర్స్/ 40y / 5'4" / M.Com / Own Business Hydలో Own House 6 Cr. ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. ఫోన్:7993507466 AJH-079

★ కుల పట్టింపు లేదు (2వ పెళ్ళి) / 40y / 5'4" / ఇంటర్ / RTC కండక్టర్ 25,000/- PM ఓన్ హౌస్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్:8790045436/8978894173 AJH-079

స్నేహ మ్యారేజ్ బ్యూరో
(కమ్మవారికి మాత్రమే)



గత 20 సంవత్సరముల నుండి దేశ విదేశాలలో ఉన్న వేలాది కమ్మ జంటలను కలిపిన అత్యుత్తమ కమ్మ వివాహ వేదిక www.snehamarriage.com. H.O: D.No.11-160, గద్దం రత్తయ్యవీధి, Near Time హాస్పిటల్, అశోక్‌నగర్, VJA-7: 92465 12689, 92461 82689. B.O: పద్మావతి ప్లాజా, 3rd floor, Shop No. 424, Kphb Main Road, కూకట్‌పల్లి, Hyd: 040-48540511, 9951032647, Rjy : 99121 04761, Vsp : 92985 55658, Khm : 98480 79629, 83745 39819 (whatsapp)

వరుడు కావలెను

కమ్మ 29, 5.4, MBBS (US), 100Cr ★ 24, 5.3, MBBS, 20Cr ★ 23, 5.6, MBBS, 6Cr ★ 24, 5.7, MBBS, 4Cr ★ 25, 5.4, MBBS, 10Cr ★ 98480 79629

కమ్మ 30, 5.6, MCH, (న్యూరోసర్జన్), 6Cr ★ 27, 5.8, MS(Gyn), 25Cr ★ 29, 5.7, MS (ఆర్థో), 3Cr ★ 29, 5.4, PG (అనస్తీషియా), 15Cr ★ 24, 5.6, MS(GS), 2Cr ★ 99894 76375

కమ్మ 29, 5.3, MD (రేడియాలజీ), 40Cr ★ 30, 5.9, MD(GM), 30Cr ★ 27, 5.7, MD (రేడియాలజీ), 10Cr ★ 26, 5.5, MS (OBG), ఫెలోషిప్, 20Cr ★ 25, 5.8, MD(GM), 25Cr ★ 98485 79629

కమ్మ Doc (USA): 28, 5.7, MD (Int Med), 35Cr ★ 26, 5.6, MD (Int Med), 10Cr ★ 26, 5.5, MBBS (UK), 15Cr ★ 27, 5.4, MD (Int Med), 1Cr ★ 30, 5.6, MD (Int Med), $210K, 2Cr ★ 99510 32647

కమ్మ 23, 5.2, IIIT, 25Cr ★ 22, 5.3, IIT (కాన్పూర్), 6L/A, 10Cr ★ 24, 5.3, IIT (Ph.D), 15Cr ★ 25, 5.7, IIT (ఢిల్లీ), 17L/A, 6Cr ★ 27, 5.4, IIM, 15L/A, 6Cr ★ 98480 79629

కమ్మ : 28, 5.6, MS, $120K, 100Cr ★ 28, 5.8, MS, $120K, 70Cr ★ 25, 5.8, MS, $90K, 50Cr ★ 27, 5.7, MS, $85K, 25Cr ★ 31, 5.6, MS, $110K, 6Cr ★ 99894 76375

కమ్మ 27, 5.7, MS, $60K, 8Cr ★ 28, 5.4, MS, 45L/A (Sing), 9Cr ★ 24, 5.10, MS, $70K, 4Cr ★ 25, 5.6, MS, $107K, 6Cr ★ 30, 5.1, MS, $110K, 3Cr ★ 98485 79629

కమ్మ 23, 5.2, MS, $65K, 4Cr ★ 24, 5.5, MS, $60K, 4Cr ★ 25, 5.5, MS, $87K, 7Cr ★ 27, 5.8, MS, $90K, 8Cr ★ 29, 5.7, MS, $107K, 2Cr ★ 99510 32647

కమ్మ 32, 5.8, MBA, 36L/A (ముంబాయి), 80Cr ★ 31, 5.8, MBA, 27L/A, 50Cr ★ 24, 5.4, MBA, 19L/A, 8Cr ★ 26, 5.4, MBA, 21L/A, 8Cr ★ 27, 5.5, MBA, 24L/A, 2Cr ★ 98480 79629

కమ్మ 24, 5.5, CA(CS), 10Cr ★ 24, 5.6, CA, 5Cr ★ 25, 5.7, M.Arch(UK), 10Cr ★ 26, 5.1, M.Arch, 10Cr ★ 30, 5.4, B.Arch, 15Cr ★ 33, 5.7, B.Arch, 15L/A, 20Cr ★ 99894 76375

కమ్మ 26, 5.8, MBA (ISB), 10L/A, 15Cr ★ 25, 5.6, MBA, 7L/A, 5Cr ★ 23, 5.8, MBA, 10Cr ★ 26, 5.3, MBA, 9L/A, 4Cr ★ 29, 5.3, MBA, 22L/A, 10Cr ★ 98485 79629

కమ్మ 25, 5.7, M.Tech, 5L/A, 30Cr ★ 26, 5.6, M.Tech, 7L/A, 15Cr ★ 26, 5.1, MBA, 30Cr ★ 27, 5.3, MDS, 40Cr ★ 29, 5.4, BE (డైవర్స్), 50Cr ★ 99510 32647

వరుడు కావలెను

కమ్మ 25, 5.8, M.Tech, 10L/A, 10Cr ★ 23, 5.3, M.Tech, 6Cr ★ 26, 5.5, M.Tech, 5L/A, 10Cr ★ 26, 5.3, MBA (సింగపూర్), 8L/A, 1Cr ★ 33, 5.5, M.Tech, 26L/A, 3Cr ★ 98480 79629

కమ్మ 27, 5.5, M.Pharm, 20Cr ★ 22, 5.7, BDS, 20Cr ★ 23, 5.5, BDS, 15Cr ★ 23, 5.2, BDS, 6Cr ★ 26, 5.4, PharD, 5L/A, 2Cr ★ 23, 5.4, M.Pharm, 10L/A, 1Cr ★ 99894 76375

కమ్మ 21, 5.9, BE, 7Cr ★ 22, 5.5, BE, 8L/A, 10Cr ★ 23, 5.5, BE, 6L/A, 15Cr ★ 24, 5.4, BE, 6L/A, 5Cr ★ 26, 5.4, BE, 7L/A, 5Cr ★ 98485 79629

కమ్మ 24, 5.5, BE, 6L/A, 15Cr ★ 23, 5.6, BE, 4L/A, 15Cr ★ 22, 5.7, BE, 6L/A, 8Cr ★ 27, 5.7, BE, 8L/A, 7Cr ★ 30, 5.4, BE, 10L/A, 2Cr ★ 99510 32647

కమ్మ 22, 5.3, BE, 5L/A, 10Cr ★ 24, 5.2, BE, 5L/A, 3Cr ★ 25, 5.6, MBA, 6L/A, 10Cr ★ 25, 5.4, MBA, 4L/A, 6Cr ★ 31, 5.6, MBA(IIM), 40L/A, 5Cr ★ 98480 79629

కమ్మ : 23, 5.7, MBA, 4Cr ★ 27, 5.3, MBA, 15L/A, 1Cr ★ 27, 5.2, MBA, 5L/A, 6Cr ★ 28, 5.5, MSc (హైదరాబాద్), 15Cr ★ 27, 5.4, MSc, 10L/A, 3Cr ★ 99894 76375

కమ్మ 24, 5.2, B.Com, 6L/A (Govt), 2Cr ★ 25, 5.4, BE, 4L/A (Govt), 2Cr ★ 26, 5.0, M.Com (CA), 1Cr ★ 27, 5.5, BE, 3L/A (Govt), 1Cr ★ 28, 5.2, MCA, 4L/A, 2Cr ★ 98480 79629

కమ్మ (డైవర్స్): 25, 5.3, MBA(US), 2Cr ★ 25, 5.6, MS, $70K, 2Cr ★ 26 , 5.4, MS, $60K, 1Cr ★ 28, 5.4, MD (Int Med), 1Cr ★ 30, 5.6, MS, $110K, 2Cr ★ 99894 76375

కమ్మ(డైవర్స్): 24, 5.6, M.Tech, 1Cr ★ 25, 5.5, M.Tech, 5L/A, 1Cr ★ 28, 5.4, BE, 6L/A, 2Cr ★ 27, 5.4, B.P.T, 4L/A, 1Cr ★ 30, 5.6, PG (అనస్తీషియా),1Cr ★ 98485 79629

కమ్మ (డైవర్స్): 26, 5.8, M.Tech, 1Cr/A, 150Cr ★ 27, 5.7, MS, 100Cr ★ 27, 5.7, MBA, 7L/A, 20Cr ★ 29, 5.6, MS, 10L/A, 20Cr ★ 29, 5.3, MD(GM), 10L/A, 40Cr ★ 99510 32647

కమ్మ(డైవర్స్): 28, 5.6, MS, $65K, 10Cr ★ 29, 5.4, MS, $115K, 10Cr ★ 30, 5.3, MD (Int Med), $200K, 10Cr ★ 31, 5.7, MS, $150K, 5Cr ★ 33, 5.6, MBA, $100K, 5Cr ★ 98480 79629

★ కుల / ఆస్తి ప్రసక్తి లేదు / విడో / 58Y / ఫ్యామిలి పెన్షనర్ మరియు బిజినెస్ / సొంత ఇల్లు మరియు ఆంధ్రాలో పొలాల మీద ఆదాయం గల వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. 8499909096 AJH-079

★ యాదవ / విడో / 42Y / 5'4" / Very Fair / B.Com / ప్రైవేట్ జాబ్ / ఓన్ ఫ్లాట్ / వెల్‌సెటిల్డ్ అందమైన వధువుకు వరుడు కావలెను. 7330865089 AJH-079

★ వైశ్య / 49Y / విడో / 5 / MBA / Central Govt. Job Own Transport Business / 12 Lac Income / 18 కోట్ల ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయ వధువుకు FC/BC వరుడు కావలెను. 9989394054 AJH-079

★ రెడ్డి / విడో /41y / Degree / ఓన్ షాపింగ్ కాంప్లెక్స్ కలిగిన వధువుకి వరుడు కావలెను. నో బ్రోకర్స్ ఫోన్:9985035976 / 8142079654 AJH-427136

★ కాపు / డైవర్స్ /39y / BA / రైస్ మిల్, ఫైనాన్స్ బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 9703238657 AJH-427136

★ రెడ్డి / విడో /45y / 5'5" / Fair / డిగ్రీ / పెన్షనర్ బిజినెస్ / రెంట్స్ / ఆస్తి కలిగిన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 7730915235 / 9515552539 AJH-16187

★ కాపు / విడో /46y / 5'3" / గుంటూరులో ప్రాపర్టీ Hydలో సొంత బిజినెస్ / మంచి ఆస్తిగల వధువుకి బిజినెస్ చూసుకునే వరుడు కావలెను. ఫోన్: 9849435205 / 9177300345 AJH-16187

★ రెడ్డి / విడో /44y / 5'4" /Degree / Gold Shop /PM 4Lks / Own Duplex House / వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 9121954252 AJH-75

★ పద్మశాలి / 48y / విడో/ 5'4" /PG / Readymade Garments Business / Rice Mill / Own House / PM 4Lks / వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 7659864753 AJH-75

★ నాయుడు / 48y / విడో/ 5'4" /MBA / Bank Employee / VRS / PM 35,000/-/ Business / Own House /అందమైన వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 9704442356 AJH-75

శ్రీ పర్వతనేని మ్యారేజ్‌బ్యూరో
కమ్మవారికి మాత్రమే (హైదరాబాద్ -విజయవాడ)

రాజశేఖర్: 8143436464, Hyd: 8143438383, VJA:8143436363, 8143536363, email : spmbhyd@gmail.com, Whats App No.: 8143438383

వరుడు కావలెను

★ కమ్మ (Doctor): 27/5'6"/V.Fair, MD (Radialogy),100Cr. ★ 26/5'5"/ V.Fair, MD (Dermatology) 15Cr. ★ 26/ 5'8"/V.Fair, MD (Pediatrics) 50Cr. Ph: 8143436464

★ కమ్మ (Doctor): 27/5'5"/V.Fair, MS (OBG) 20Cr. ★ 27/ 5'6"/ V.Fair, MD (GM) 25Cr. ★ 25/ 5'5"/V.Fair, MBBS, 20Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 27/5'7"/ V.Fair, MBA $ 80K, Microsoft 15Cr. ★ 25/ 5'4"/ V.Fair, MS $ 75K, 10Cr. ★ 27/ 5'4"/V.Fair, M.Sc (Bits) $ 100K, 10 Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 26/5'8"/ V.Fair, MS $ 90K, 7Cr. ★ 27/ 5'7"/ V.Fair, MS $ 95K, 5Cr. ★ 26/ 5'8"/V.Fair, MS, $ 85K, 5Cr. Ph: 8143438383

★ కమ్మ (USA): 26/5'8"/ V.Fair, MS $ 140K, Green Card, 40Cr. ★ 26/ 5'7"/ M.Tech (IIT) $ 90K, 8Cr. ★ 25/ 5'3"/ MS $ 60K, 20 Cr. Ph: 8143436464

★ కమ్మ (USA): 26/5'8"/ Beautiful MS, $ 100K, 10Cr. ★ 27/ 5'6"/ V.Fair, MS $ 140K, 8Cr. ★ 28/ 5'7"/IIT, MS $ 150K, 5Cr. Ph: 8143436363

★ కమ్మ (INDIA):26/5'8"/V.Fair, IIT,IIM, 15L PA, 25Cr. ★ 27/5'5"/BE, MBA, 7L PA, 3Cr. ★ 25/ 5'6"/V.Fair, BE, MBA, 9LPA, 10Cr. Ph: 8143436464

★ కమ్మ (INDIA): 24/5'8"/ BE, MBA, 7L PA, 5 Cr. ★ 24/ 5'6"/ BE, MBA, 7.5L PA, 3Cr. ★ 22/ 5'3"/ BE, TCS, 15Cr. Ph: 8143536363

★ కమ్మ : 22/5'5"/V.Fair, BE, 7Cr. ★ 24/ 5'4"/V.Fair, BE, MBA, 19L PA, 8Cr. ★ 24/ 5'4"/ BE (IIIT) 18 L PA, 4Cr. B' Lore Ph: 8143438383

★ కమ్మ (INDIA): 23/5'2"/V.Fair, BE, MS, 5L PA, 25Cr. ★ 24/ 5'5"/V.fair, BE, MBA, 20Cr. ★ 24/ 5'5"/M.Tech, IBM 6L PA, 5Cr. Ph: 8143436363

★ కమ్మ (Divorce): 25/5'4"/MS, BUSINESS 40Cr. Hyd. ★ 29/ 5'5"/ MS(OBG) MCH 15Cr. ★ 35/ 5'5"/V.Fair, BE $ 140K, Citizen /USA, 5Cr. Ph: 8143436464

వధువు కావలెను

★ కమ్మ (Business): 27/5'11"/MS, Business, Hyd 40Cr. ★ 26/5'9"/ MBA Business, Hyd, 50Cr. ★ 27/ 5'11"/ MBA, Business 100Cr. Hyd, Ph: 8143438383

★ కమ్మ (USA): 29/5'10"/IIT, IIM, $ 200K, Microsoft 15Cr. ★ 26/ 5'11"/ IIT, MS, $ 100K, IBM, 5Cr. ★ 27/ 6'1"/ MS, $ 140K, Cisco 10Cr. Ph: 8143438484

★ కమ్మ (USA): 26/5'10"/ MS, $ 90K, 25Cr. ★ 27/ 5'8"/ MS $ 120K, 30Cr. ★ 28/ 6'/ MS, $ 105K, 25Cr. Ph: 8143436464

★ కమ్మ (USA): 28/5'11"/ IIT $ 120K, 15Cr. ★ 27/ 6'2"/ MS $ 80K, 20Cr. ★ 25/6'/ MBA (USA) $ 150K, 30Cr. Ph: 8143436363

★ కమ్మ (USA): 27/6'/ MBA (USA) $ 270K, 80Cr. ★ 28/ 5'10"/ MS $ 110K, 50Cr. ★ 27/ 6'/ BE (Bits) MS $ 105K, 50Cr. Ph: 8143438383

★ కమ్మ (Govt): 28/5'9"/MS Dy. E.E. 12 L PA, 4 Cr. ★ 27/ 5'9"/V.Fair, BE, 50K 10Cr. ★ 28/ 5'10"/BE, 6L PA, 2Cr. Ph: 8143438383

★ కమ్మ (INDIA): 28/6'/IIT, IIM, 32LPA, 20Cr. ★ 31/5'11"/IIT, IIM, 36LPA, 10Cr. ★ 28/ 6'/BE (NIT) 60L PA, Hyd. Ph: 8143438383

★ కమ్మ (INDIA): 29/5'8"/MS (JNTU) IIL PA 9Cr. ★ 25/ 5'11"/BE, 8LPA, Hyd, 5Cr. ★ 29/ 6'0"/ B.Tech/IIT/22L PA 10cr, Ph: 8143436464

★ కమ్మ (INDIA):27/6'/ BE, MS, 22LPA, Hyd, 5Cr. ★ 29/ 5'8"/ BE, (Bits) 24L PA, Hyd. ★ 27/ 6'/ BE, MS, 10 LPA, 15Cr. Ph: 8143436363

★ కమ్మ (Doctor): 28/6'2"/V.Fair, MS (GS) 50Cr. ★ 29/ 5'10"/ MD (GM) 40Cr. ★ 31/ 6'1"/MS (ortho), 20Cr. Ph: 8143438383

★ కమ్మ (Divorce): 31/5'11"/MS, (Ortho), V.Fair, 30Cr. ★ 29/ 6'2"/ MBA (Bits) 40L PA, 10Cr. ★ 28/ 5'11"/M.Tech (IIT) 30L PA, 15Cr. Ph: 8143436464

★ చౌదరి / 48y / విడో/ 5'5" /PG / Govt. Employee / VRS / PM 30,000/-/ Furniture Business / Own Duplex House / అందమైన వధువుకి FC/BC వరుడు కావలెను. ఫోన్: 8179390318 AJH-75

★ కాపు / 29y / 5'4" / డైవర్స్ / Fair / కిడ్స్‌వేర్ & మెన్స్‌వేర్ (Menswear) షోరూం. వధువుకు కులపట్టింపులు లేని వరుడు కావలెను. సొంత ఇల్లు ఫోన్: 8686683575 AJH-16422

★ కమ్మ / 31y / 5'5" / డైవర్స్ / Fair / సొంత సిమెంట్ & ఐరన్ బిజినెస్ / 9 Cr. Property / తండ్రిలేని అందమైన వధువుకు కుల పట్టింపులు లేని వరుడు కావలెను. ఫోన్: 7997913167 AJH-16422

★ రెడ్డి / 29y / 5'4" / Late Marriage / Full Fair / సొంత సిమెంట్ & ఐరన్ బిజినెస్ / వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8790527332 AJH-16422

★ రెడ్డి / 32y /విడో / 5'5" / B.Tech/ సాఫ్ట్‌వేర్ 50,000/- PM /Hydలో సొంత ఇల్లు / 15 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7337508942 AJH-16422

★ కుల ఆస్తి పట్టింపు లేదు / విడో / 45y / Hydలో కంపెనీ ఆంధ్రాలో 20 ఎ. పండ్ల తోటలు 18 కోట్ల ప్రాపర్టీ 6 నెలల క్రితం తండ్రిని కోల్పోయిన ఒంటరి వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9032924623 AJH-4896

★ రెడ్డి / విడో / 29y / B.Tech / 22 కోట్ల ప్రాపర్టీ కలిగి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడుకావలెను. (ఆస్తి కుల వయస్సు ప్రసక్తి లేదు) మీ ఫోటో details whatsappలో send చేయండి. ఫోన్: 7207214624 AJH-4896

★ రెడ్డి / 39y / 5'4" / డిగ్రీ / Own బిజినెస్ / 3L PM / Own House / రాజమండ్రి, విజయవాడలో 10 కోట్ల ప్రాపర్టీ. భర్తను కోల్పోయిన ఒంటరి వధువుకు FC/BC 1వ, 2వ వరుడు తోడు కావలెను. (బిజినెస్ చూసుకోవాలి) ఫోన్: 7331120914 AJH-4896

★ SC మాల / 38y / విడో / డిగ్రీ / Govt. Job. / 45,000 PM. HYDలో సొంత ఇల్లు, 8 కోట్ల ప్రాపర్టీ. మెటీరియల్ క్లాత్ షోరూమ్ / వెల్ సెటిల్డ్ వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. ఫోన్: 7093467996 AJH-409677

★ హిందూ మాల: 23Y, B.Tech, SWE, Infosys (Hyd) జాబ్ జీతం : 60వేలు గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ /డాక్టర్ జాబ్ / ఇతర స్టేట్స్‌లో జాబ్ చేస్తున్న హిందూ లేక క్రిస్టియన్ వరుడు కావలెను. డైరెక్ట్ : 9121191105. AJG-456770

★ క్రిస్టియన్, రెండవ మ్యారేజ్, 5'4", పిల్లలు లేరు, HIV+, But Healthy, Age : 31, Cast No Bar. Ph: 8142896598 AJG-448598

★ చౌదరి విడో, 40సం॥, 5'4", ఇంటర్, ఫుల్ ఫెయిర్, 28 కోట్ల ఆస్థి, భర్తను కోల్పోయిన అందమైన వధువుకు 1, 2వ వరుడు కావలెను. Whats app 9441343068 AJG-1770

★ చౌదరి విడో, 32సం॥, 5'3", ఫుల్ ఫెయిర్, MBA, 24 కోట్ల ఆస్థి, పిల్లలు లేరు. అందమైన వధువుకు 1, 2వ వరుడు కావలెను. Whats app 7901548009 AJG-1771

★ చౌదరి విడో, 28సం॥, 5'5", ఫుల్ ఫెయిర్, B.Tech, 18 కోట్ల ఆస్థి, ప్రమాదంలో భర్తను కోల్పోయిన అందమైన వధువుకు 1, 2వ వరుడు కావలెను. Whats app 8331819558 AJG-1772

అన్నపూర్ణ మ్యారేజెస్

● అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును ●

www.annapurnamarriages.com

గుంటూరు హెడ్ ఆఫీస్ - 9397979718, విజయవాడ బ్రాంచ్ ఆఫీస్ - 83673 44466, ఒంగోలు బ్రాంచ్ ఆఫీస్ - 93937 63666, తెనాలి బ్రాంచ్ ఆఫీస్ - 99851 44113, నెల్లూరు బ్రాంచ్ ఆఫీస్-93979 79740

పెళ్ళి కావలసిన వరుడు, వధువు మీ పూర్తి వివరములను FREEగా ఇచ్చి IDగా రిజిష్టర్ చేసుకోగలరు.

వరుడు కావలెను

★ కాపు- (29338); A-32; 5'5"; Ph.D (Commencing) at USA ; ఆదాయం- 15.54 La/pa; ఆస్థి- Lands & Gold; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు MS(Eng) చేసి USA లో జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979750

★ హిందు మాదిగ - (26449); A-35; 5'3"; MBBS, MS (Medical); Manager Informatics in Hospital at USA; ఆదాయం- 55La/Pa వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు హిందువులలో కులపట్టింపు లేని MS (Medical)/ MS (Eng) చదివి USA లో జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979750

★ కాపు- (29366); A-23; 5'5"; B.Tech; Pvt.Job; ఆదాయం- 2.5 La/pa; వున్న సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి Govt.Job చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8367055566

★ కమ్మ- (29713); A-28; 5'1"; M.S (Engg); SWE at USA; ఆదాయం- 45La/pa; ఆస్థి- 1.5 Crores ప్రాపర్టీ కలిగిన సంప్రదాయమైన అందమైన వధువుకి MS(Eng) చేసి USA లో జాబ్ చేసే వరుడు కావలెను. 8886953666

★ కాపు-డైవర్సు-(19484); A-29; 5'4"; B.Sc (Computer Scinence); ఆదాయం- 6.4 La/pa; ఆస్థి- 1 apartment ; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి Govt.Job చేసే వరుడు కావలెను. 8367055566

★ కమ్మ-డైవర్సు-(16075); A-31; 5'3"; MCA; ఆస్థి- 1 acre land & gold; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన వధువుకు B.Tech చదివి SWE/Pvt. Job చేసే వరుడు కావలెను. 8886953666

★ అగ్నికులక్షత్రియులు-(26764); A-30; 5'3"; B.Tech; ఆస్థి- 1 site ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకి B.Tech చదివి SWE జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 8497911555

★ యాదవ-(29739); A-20; 5'5"; Degree (Commencing); ఆస్థి- Land; ప్రాపర్టీ కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువుకు B.Tech చదివి SWE జాబ్ చేసే వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. 9397979718

★ హిందు మాల - (31840); A-32; 5'4"; MS (Eng); SWE at USA; ఆదాయం- 73.60La/Pa ఉన్న సాంప్రదాయమైన అందమైన వధువుకి MS(Eng) చేసి USA లో జాబ్ చేసే కులపట్టింపు లేని వరుడు కావలెను. 8367355577

వధువు కావలెను

★ కమ్మ - (29391); A-29; 5'11"; B.Tech; SWE at USA; ఆదాయం- 76 La/Pa, ఆస్థి- 10 crores ప్రాపర్టీ కలిగిన వెల్‌సెటిల్డ్ వరుడుకు B.Tech చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కమ్మ - (19549); A-28; 5'8"; M. Pharmacy; Pvt. Job; ఆదాయం- 3.84 La/Pa, ఆస్థి- 5 acres land ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివి Pvt. Job చేసే అందమైన వధువు కావలెను. 8886953666

★ కాపు-(30604); A-32; 5'11"; DNB (PG); Orthopedic; ఆదాయం- 6 La/Pa, ఆస్థి- 1 crore ప్రాపర్టీ కలిగిన వరుడుకు MBBS చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ కాపు-(30936); A-25; 6'; BA; Govt. Job; ఆదాయం- 5.4 La/Pa, ఆస్థి- House & Flat ప్రాపర్టీ కలిగిన వరుడుకు చక్కటి చదువు కలిగిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ రెడ్డి-(31231); A-29; 5'6"; B.Com; Govt. Job; ఆదాయం- 2.64 La/Pa, ఆస్థి- 10 acres land & House ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివి Govt.Job చేసే వధువు కావలెను. 8886953666

★ తూర్పు కాపు -(30365); A-29; 5'10"; 10th, Pvt. Job; ఆదాయం- 3.6 La/Pa, వున్న వరుడుకు 10th చదివిన సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 8367022266

★ కమ్మ-డైవర్సు-(31402); A-39; 5'11"; MA; Pvt.Job; ఆదాయం- 2.5 La/Pa; ఆస్థి- 1 House; ప్రాపర్టీ కలిగిన వరుడుకు సాంప్రదాయమైన అందమైన వధువు కావలెను. 9397979718

★ యాదవ -(29748); A-26; 5'8"; B.Tech, SWE; ఆదాయం- 2.64 La/Pa, ఆస్థి- 3 House & 4 acres land; ప్రాపర్టీ కలిగిన వరుడుకు B.Tech చదివి Pvt. Job చేసే వధువు కావలెను. 8367022266

★ మాల - (31550); A-32; 5'9"; B.Tech; Govt. Job; ఆదాయం- 10La/Pa, ఆస్థి- 2 acres land & house ; ప్రాపర్టీ కలిగిన వరుడుకు డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 9397979750

★ CNB, పద్మశాలి, డైవర్స్, 36, 5.3, M.Sc., B.Ed., Govt Job, 40,000 PM. వధువుకు జాబు, బిజినెస్ చేయు వరుడు కావలెను. సెల్: 98851 44375, 83283 88014 AJB-447891

★ Age: 31, ఫెయిర్, 5.5, క్రిస్టియన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వర్క్ చేయుచున్న అందమైన వధువుకు వరుడు కావలెను. కులపట్టింపులేదు. సెల్: 84650 46604 AJB-447921

★ రెడ్డి, లేట్ మ్యారేజ్ 34 సం./5'4"/B.Tech / MBA, మంచి ఆసక్తిగల అందమైన వధువుకి కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 94900 17659. AJT-453962

కళ్యాణ వేదిక

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడో, విడోవర్స్, పెన్షనర్స్‌కు అన్ని కులాల వారికి త్వరగా సంబంధాలు కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ రిజి. ఫోన్: 7416303057 AJH-079

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. ఫోన్: 8555980066 / 8328388014 AJH-079

★ HIV+ve వారికి ప్రత్యేకంగా గోప్యంగా & Disabled Personsకి మంచి సంబంధములు చూడబడును. ముందు డబ్బు తీసుకోము. సత్యదేవ మ్యారేజెస్. సెల్: 79958 24689 AJB-454296

★ మారు మనస్సు, రక్షణ, ప్రార్థన అనుభవము కలిగిన అన్ని కులముల వధూవరులకై వెంటనే సంప్రదించండి. ది కార్నర్ స్టోన్, సెల్: 89777 70727, 83095 47432 AJB-3084

★ సూజిత్ మ్యారేజ్ బ్యూరో / అన్ని కులాల వారికి వయసుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ. ఫ్రీ. పు. సర్వీస్ చార్జ్ ఓన్లీ .ఫోన్:7893688483 AJH-5342

★ Whats app your Photo & Biodata to 9347262769. We will send the suitable matches www.pellisandadi.com. ESTD.1991 AJH-4896

గమనిక: ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీలో షెల్‌కు మెజారిటీ వాటా?

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆయిల్ ట్రేడింగ్ కంపెనీ రాయల్ డచ్ షెల్ పిఎల్‌సి.. హైదరాబాద్‌కు చెందిన రూఫ్‌టాప్ సోలార్ సంస్థ ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసే యోచనలో ఉందని సమాచారం. 2022నాటికి సోలార్, పవన విద్యుత్ వంటి శుద్ధ ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 175 గిగావాట్లకు పెంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 40 గిగావాట్ల ఉత్పత్తిని రూఫ్‌టాప్ సోలార్ ద్వారా సాధించాలనుకుంటోంది. ఈ నేపథ్యంలో రూఫ్‌టాప్ సోలార్ విభాగంలోకి ప్రవేశించాలని ఆసక్తిగా ఉన్న షెల్.. ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీలో మెజారిటీ విభాగ వాటా తీసుకోవాలనుకుంటున్నట్లు ఈ పరిణామంపై అవగాహన ఉన్న ఇద్దరు వ్యక్తులు తెలిపారు.

ఏప్రిల్ నుంచి ఇ-వే బిల్లుల విధానం

రిటర్న్‌ల సరళీకరణపై కుదరని ఏకాభిప్రాయం



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) విధానంలో మరో భారీ మార్పుకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ ఒకటి నుంచి రాష్ట్రాల మధ్య జరిగే వస్తు రవాణాకు ఎలక్ట్రానిక్ రవాణా (ఇ-వే) చలానా తప్పనిసరికానుంది. జిఎస్‌టి నెట్‌వర్క్‌కు సంబంధించి శనివారం జరిగిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల కమిటీ (జిఓఎం) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో చెక్‌పోస్టుల వద్ద జరిగే తనిఖీలకు చెక్ పడి సరుకుల రవాణా వేగంగా జరుగుతుందని భావిస్తున్నారు. ముందు దీన్ని రాష్ట్రాల మధ్య జరిగే వస్తు రవాణాతో ప్రారంభించి, రెండు వారాల తర్వాత దశలవారీగా అంతర్ రాష్ట్ర సరుకుల రవాణాకూ అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో రూ.50,000 కంటే ఎక్కువ విలువైన సరుకుల రవాణాకు ఇ-వే చలానా తప్పనిసరికానుంది. 'ముందుగా రాష్ట్రాల మధ్య జరిగే సరుకుల రవాణాతో ఇ-వే బిల్లు ప్రారంభిస్తున్నాం. ఏప్రిల్ 1 నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుంది' అని రాష్ట్రాల ఆర్థిక మంత్రుల కమిటీకి నాయకత్వం వహిస్తున్న బిహార్ ఉప ముఖ్య మంత్రి సుశీల్ మోదీ చెప్పారు. నిజానికి ఇ-వే చలానాల విధానం ఈ సంవత్సరం ఫిబ్రవరి 1 నుంచే ప్రారంభం కావలసి ఉంది. అయితే భారీ లోడ్‌తో జిఎస్‌టిఎన్ నెట్‌వర్క్ కుప్పకూలడంతో వాయిదా పడింది. ఇపుడు ఆ సాంకేతిక సమస్యలను అధిగమించి ఏప్రిల్ 1 నుంచి అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కుదరని ఏకాభిప్రాయం

జిఎస్‌టి రిటర్న్‌ల సరళీకరణపై మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక మంత్రులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. 'రిటర్న్‌ల సరళీకరణపైనా వివరంగా చర్చించాం. అయితే దీనిపై ఏకాభిప్రాయం కుదరలేదు' అని సుశీల్ మోదీ చెప్పారు. వచ్చే నెల 10న జరిగే జిఎస్‌టి మండలి సమావేశంలో దీనిపై మరింత వివరంగా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పెట్టుబడుల పర్యవేక్షణ కోసం వార్ రూమ్

» కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : దేశంలో పారిశ్రామిక పెట్టుబడులను భారీ స్థాయిలో ప్రోత్సహించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం 'వార్ రూమ్' లాంటి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థ ద్వారా పెట్టుబడి ప్రతిపాదనల అమలు, ప్రాజెక్టుల అమలులో పారిశ్రామికవేత్తలు ఎదుర్కొనే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు వెల్లడించారు. హైదరాబాద్‌లో శనివారం 15వ బయోఏషియా సదస్సు చివరి రోజు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విదేశీ పెట్టుబడులతోపాటు, దేశీయ పెట్టుబడులనూ ఈ వార్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తాం' అన్నారు.



హైదరాబాద్‌లో శనివారం బయోఏషియా సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సురేష్ ప్రభు. చిత్రంలో తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్

భౌగోళిక ఉత్పత్తులకు ప్రోత్సాహం

కొన్ని ప్రత్యేక ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన భౌగోళిక గుర్తింపు (జిఐ) పొందిన ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఉధృతంగా ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్టు సురేష్ ప్రభు చెప్పారు. దీని మూలంగా ఆ ఉత్పత్తులపై వాటిని తయారు చేసే కళాకారులు, ఉత్పత్తిదారులకు మేధో సంపత్తి హక్కు (ఐపిఆర్)లు లభించి మేలు జరుగుతుందన్నారు. భారత ఆటోమొబైల్ ఉత్పత్తుల దిగుమతులపై దిగుమతి సుంకాలు పెంచుతామన్న అమెరికా హెచ్చరికపైనా ఆయన స్పందించారు. పరస్పర మార్కెట్ అవకాశాల కోసం ఇలాంటి డిమాండ్లు ఎప్పుడూ ఉండేవేనన్నారు.

అపార అవకాశాలు


భారత ఔషధ పరిశ్రమ అవకాశాలకు కొదువలేదని సురేష్ ప్రభు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌తోపాటు ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య బీమా పథకం భారత ఔషధ పరిశ్రమకు మరిన్ని నూతన వ్యాపార అవకాశాలు కల్పిస్తుందన్నారు. జనరిక్ ఔషధాలతో జపాన్ సహా అనేక దేశాలకు చౌకగా ఔషధాలు అందిస్తున్న భారత ఔషధ పరిశ్రమ... జినోమిక్స్ మందులపైనా దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఔషధ పరిశ్రమ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులు అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయంలో స్టార్టప్ కంపెనీలు ఆర్థిక వ్యవస్థకు ఊతంగా పని చేస్తాయన్నారు.

అంతా మీవల్లే..!

పిఎన్‌బి స్కామ్‌కు ఆడిటర్లు, రెగ్యులేటర్ల వైఫల్యమే కారణం

» బ్యాంక్ మేనేజ్‌మెంట్ అలసత్వం కూడా..

» అవసరమైతే చట్టాలు కఠినతరం: అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో రూ.11,400 కోట్ల కుంభకోణానికి నియంత్రణ మండళ్లు, ఆడిటర్ల పర్యవేక్షణ లోపంతోపాటు బ్యాంకు మేనేజ్‌మెంట్ అలసత్వమే కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దుయ్యబట్టారు. ఆర్థిక మోసాలకు పాల్పడే వారిని శిక్షించేందుకు అవసరమైతే చట్టాలను కఠినతరం చేస్తామని సంకేతాలిచ్చారు. "మోసగాళ్లను వెతికి పట్టుకోవడంతోపాటు వారిపై అత్యంత కఠిన చర్యలు చేపట్టేందుకోసం అవసరమైతే చట్టాలను మరింత పటిష్ఠం చేస్తాం" అని అన్నారు. పిఎన్‌బి స్కాం విషయంలో ఆడిటర్లు, రెగ్యులేటర్లను జైట్లీ ఎండగట్టడం ఈ వారంలో ఇది రెండోసారి. శనివారం ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో మంత్రి మాట్లాడుతూ.. పిఎన్‌బి కుంభకోణంలో పలు అంచెల ఆడిటింగ్ వ్యవస్థ పక్కదోవ పట్టి ఉండాలి, లేదంటే తూతూమంత్రంగా ఆడిటింగ్ జరిగి ఉండాలి అన్నారు. ఇంతటి భారీ కుంభకోణం జరుగుతుండగా ఏ ఒక్కరూ హెచ్చరిక చేయకపోవడం ఆందోళనకరమన్నారు. అంతేకాదు ఈ విషయంలో యాజమాన్యానికీ బ్యాంక్‌లో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏమాత్రం అవగాహన లేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆడిటర్లలో పర్యవేక్షణ లోపించిందని, కేసు దర్యాప్తులో ఎవరేం చేశారని అందరి గుట్టు బయటపడనుందని ఆయన హెచ్చరించారు.

రెగ్యులేటర్లు కాదా జవాబుదారీ?

ఆర్థిక వ్యవస్థలో నియంత్రణ మండళ్లది కీలక పాత్ర అని అరుణ్ జైట్లీ అన్నారు. ఆర్థిక సేవలకు సంబంధించిన నియమావళిని నిర్ణయించేది, మూడో కంట కనిపెట్టేది రెగ్యులేటర్లేనన్నారు. "దురదృష్టమేమిటంటే.. మన దేశంలో ఏ విషయంలోనైనా రాజకీయ నాయకులే జవాబుదారీ అవుతారే తప్ప నియంత్రణ మండళ్లు కాదు" అని ఆయన పేర్కొన్నారు. రెగ్యులేటర్లకూ జవాబుదారీతనం అవసరమని జైట్లీ చెప్పకనే చెప్పారు.

వొడాఫోన్‌పై రెట్రో టాక్స్.. తప్పుడు నిర్ణయం

యుపిఎ ప్రభుత్వ హయాంలో బ్రిటిష్ టెలికాం దిగ్గజం వొడాఫోన్‌పై రెట్రోస్పెక్టివ్ (పూర్వపు తేదీల నుంచి అమలు) విధానంలో పన్ను విధించడం తప్పుడు నిర్ణయమని జైట్లీ అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వమెప్పుడూ అలాంటి నిర్ణయాలు తీసుకోబోదన్నారు. హచీసన్ ఎస్సార్‌లో వాటా కొనుగోలు ద్వారా ఇండియన్ మార్కెట్లోకి ప్రవేశించిన వొడాఫోన్‌పై పన్ను అధికారులు ఈ కొనుగోలు ఒప్పందానికి సంబంధించి రెట్రోస్పెక్టివ్ విధానంలో రూ.11 వేల కోట్లకు పన్ను నోటీసు పంపారు.

వ్యాపారాల్లో నైతికత పెరగాలి..

దేశీయ వ్యాపారులు నైతికంగా వ్యవహరించడం అలవర్చుకోవాలని ఆర్థిక మంత్రి సూచించారు. వ్యాపారులు పక్కదోవ పడితే అది వాణిజ్యపరంగానేకాకుండా సామాజికపరంగానూ ప్రభావం చూపుతుందన్నారు. రుణదాత-గ్రహీతల మధ్య అనైతిక కార్యకలాపాలకు తెరపడాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వేల కోట్లలో రుణాలు ఎగవేసిన వారి నుంచి బకాయిలు రాబట్టేందుకు దివాలా స్మృతి కోడ్‌ను ప్రయోగిస్తున్నట్లు జైట్లీ చెప్పారు. బ్యాంకింగ్ వ్యవస్థలో మొండిబకాయిల సమస్యకు కేవలం వ్యాపారాల వైఫల్యమే కారణం కాదని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక వ్యవస్థపై మాయని మచ్చ

బ్యాంకింగ్ రంగంలో తరచుగా వెలుగుచూస్తున్న మోసాలను ఆర్థిక వ్యవస్థపై మాయని మచ్చలుగా జైట్లీ అభివర్ణించారు. సంస్కరణలను, వ్యాపార నిర్వహణలో సానుకూలతను పెంచే చర్యలను వెనక్కి నెట్టేస్తాయని, ఆర్థిక వ్యవస్థపై మచ్చలే బాహ్య ప్రపంచానికి కన్పిస్తాయని ఆయన అన్నారు.

పిఎస్‌బిలను ప్రైవేటీకరించం..

ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి)ను ప్రైవేటీకరించబోమని అరుణ్ జైట్లీ స్పష్టతనిచ్చారు. పిఎన్‌బిలో ఘరానా మోసం వెలుగు చూసిన నేపథ్యంలో పిఎస్‌బిలను ప్రైవేటీకరించే దిశగా కేంద్రం అడుగులు వేయవచ్చని మార్కెట్లో ఊహాగానాలు నెలకొన్నాయి. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ.. "ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు రాజకీయపరమైన ఏకాభిప్రాయం అవసరం. బ్యాంకింగ్ నిబంధనల చట్టంలోనూ తగిన సవరణలు చేయాల్సి ఉంటుంది. అసలు ఈ ప్రైవేటీకరణ ఆలోచనకు రాజకీయపరంగా ఏమాత్రం మద్దతు లభించదనేది నా మనోభావం. ఇది అత్యంత సవాలుతో కూడిన నిర్ణయమే అవుతుంది" అని అన్నారు. పిఎస్‌బిల్లో రెండు మూడింటిని మినహాయించి మిగతా వాటన్నింటిని దశలవారీగా ప్రైవేటీకరించాలని శుక్రవారం నాడు ఆర్థిక మంత్రిని కలిసినప్పుడు ఫిక్కీ ప్రెసిడెంట్ రాశేష్ షా కోరారు. ఆది గోద్రేజ్, రాహుల్ బజాజ్ వంటి దేశీయ పారిశ్రామిక దిగ్గజాలు సైతం ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించడమే మేలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

78 శాతం బకాయిలు కార్పొరేట్ సంస్థలవే

» ఎఫ్ఆర్‌డిఐ బిల్లుతో ప్రజాధనానికి ప్రమాదం.. బిఇఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణన్

విజయవాడ (ఆంధ్రజ్యోతి) : దేశంలో బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు తీసుకున్న అప్పులే మొండిబకాయిలుగా ఉంటున్నాయని, ఇప్పటి వరకు 58 కార్పొరేట్ సంస్థలు 78 శాతం బకాయిలు పడ్డాయని ఇండియన్ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణన్ స్పష్టం చేశారు. 1991 నుంచి బ్యాంకులను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఆ ఉద్దేశ్యంతోనే మోదీ ప్రభుత్వం ఎఫ్ఆర్‌డిఐ (ఫైనాన్సియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లును తీసుకొచ్చిందన్నారు. విజయవాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూపొందించిన ఎఫ్ఆర్‌డిఐ బిల్లు వల్ల బ్యాంకింగ్ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దీని ద్వారా ఏర్పాటయ్యే రిజల్యూషన్ కార్పొరేషన్ ఒక బ్యాంకు గానీ, ఆర్థిక సంస్థ గానీ నష్టాల్లో కూరుకుపోతుందని భావిస్తే వాటిని మూసివేసే అధికారం ఉందన్నారు. అంతేగాకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన కాల పరిమితిని పెంచడంతోపాటు, వడ్డీ రేట్లను కుదించే అవకాశం ఉందన్నారు. కఠిన చట్టాలు, వాటి సవరణ ద్వారా మొండి బకాయిలను వసూలు చేయాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పించుకోవాలనుకోవడం దారుణమన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ప్రదీప్ బిస్వాస్, తపన్‌దాస్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఐసిఎస్ఐ ఆడిటింగ్ ప్రమాణాలు

కోల్‌కతా : ప్రాక్టీసింగ్‌లో ఉన్న కంపెనీ సెక్రటరీలు పాటించాల్సిన ఆడిటింగ్ ప్రమాణాలను త్వరలోనే విడుదల చేయనున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ) శనివారం ప్రకటించింది. ఈ ఆడిటింగ్ ప్రమాణాలు స్వభావరీత్యా స్వచ్ఛందమేనని పేర్కొంది. త్వరలోనే నాలుగు ఆడిటింగ్ ప్రమాణాలను ప్రకటించనున్నట్టు ఐసిఎస్ఐ ప్రెసిడెంట్ మకరంద్ లెలె తెలిపారు. నూతన కంపెనీల చట్టం ప్రకారం లిస్టెడ్ కంపెనీలు తప్పనిసరిగా అనుసరించాల్సిన సెక్రటేరియల్ స్టాండర్డ్స్‌కు కొత్తగా తెచ్చే అకౌంటింగ్ ప్రమాణాలను అనుసంధానం చేయనున్నట్టు ఆయన చెప్పారు. రెండు సెక్రటేరియల్ స్టాండర్డ్స్ ప్రకారం.. కంపెనీలు కచ్చితంగా బోర్డు, సర్వసభ్య సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. కంపెనీలు ఇండిపెండెంట్ డైరెక్టర్లను కూడా నియమించుకోవాల్సి ఉంటుందని, ఈ విషయంలో ఐసిఎస్ఐ సహకరిస్తోందని చెప్పారు. చారిటీ గవర్నెన్స్‌కు సంబంధించిన కోడ్‌ను రూపొందించామని, పారదర్శకత, పూర్తి స్థాయిలో వివరాల ప్రకటన కోసం తొమ్మిది మార్గదర్శక సూత్రాలను తెచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. వీటితోపాటు లంచాల వ్యతిరేక కోడ్‌ను కూడా ఐసిఎస్ఐ తీసుకువచ్చింది.

విక్రయాల్లో అరబిందో జోరు

» గత మూడు త్రైమాసికాల్లో రూ.12,240 కోట్ల అమ్మకాలు

» లుపిన్‌ను దాటేసి రెండో స్థానానికి చేరిక

హైదరాబాద్: దేశీయ ఫార్మా ఇండస్ట్రీలో అమ్మకాలు తగ్గి దిగ్గజాలు సైతం సతమతం అవుతుంటే హైదరాబాద్‌కు చెందిన అరబిందో ఫార్మా మాత్రం దూసుకుపోతోంది. విక్రయాలపరంగా లుపిన్‌ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు (ఏప్రిల్-డిసెంబరు) గాను సంస్థ రూ.12,240 కోట్ల అమ్మకాలను నమోదు చేసుకోగలిగింది. అదేకాలానికి లుపిన్ అమ్మకాలు రూ.11,580 కోట్లకు పరిమితం కావడంతో సంస్థ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. సన్‌ఫార్మా మాత్రం రూ.19,350 కోట్ల విక్రయాలతో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగలిగింది. మూడు త్రైమాసికాల విక్రయాల్లో అరబిందో ఫార్మా 8.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా.. లుపిన్ 10.6 శాతం, సన్‌ఫార్మా 17.4 శాతం క్షీణించాయి.

సన్‌ఫార్మాను మించిన లాభాల వృద్ధి

లాభాల విషయానికొస్తే.. అరబిందో వృద్ధి లుపిన్‌తోపాటు సన్‌ఫార్మాను మించి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలకు గాను అరబిందో ఫార్మా లాభం వార్షిక ప్రాతిపదికన 7.1 శాతం పెరిగి రూ.1,770 కోట్లకు చేరుకుంది. సంస్థ ఫార్ములేషన్స్ విభాగ వ్యాపారం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది.

స్విఫ్ట్‌తో సిబిఎస్ అనుసంధానించాలి

» ఏప్రిల్ 30 తుది గడువు : ఆర్‌బిఐ

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో భారీ కుంభకోణం నేపథ్యంలో భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) అప్రమత్తమైంది. అన్ని బ్యాంకులు కూడా తమ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సిబిఎస్)ను సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్స్ (స్విఫ్ట్)తో అనుసంధానించాలని ఆదేశించింది. ఇందుకు ఏప్రిల్ 30 తుది గడువుగా పేర్కొన్నట్టు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (బిఇఎ) చైర్‌పర్సన్, అలహాబాద్ బ్యాంక్ ఎండి, సిఇఒ ఉషా అనంతసుబ్రమణియన్ తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో వేగవంతంగా స్విఫ్ట్-సిబిఎస్ లింకేజ్ చేయడం అత్యవసరమని ఆమె చెప్పారు. తమ బ్యాంక్ కూడా స్విఫ్ట్, సిబిఎస్‌ను అనుసంధానం చేయలేదని ఆమె అన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తమ బ్యాంకు శాఖలను సూచనలు చేసినట్టు ఆమె చెప్పారు. లోపాలను సరిదిద్దుకునేందుకుగాను అన్ని బ్యాంకులు తమ రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పునః పరిశీలన చేయాలని ఆమె అన్నారు.

ఓక్రిడ్జ్ వచ్చింది... ఐటి బూమ్ మొదలైంది

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఐబి కరిక్యులమ్‌తో పాఠశాల విద్యను తెలుగు రాష్ట్రాలకు పరిచయం చేసింది ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్. విశాఖపట్నంలో వికాస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ఐఐటి, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల కోసం ప్రత్యేక్ష శిక్షణతో ప్రస్థానాన్ని ప్రారంభించిన ఇద్దరు మిత్రులైన నాగప్రసాద్ తుమ్మల, యార్లగడ్డ రాజశేఖర్ బాబు.. అత్యున్నత స్థాయి విద్యను అందించాలన్న ఉద్దేశంతో తొలిసారిగా హైదరాబాద్‌లో ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఐఐటి, మెడిసిన్, ఇంజనీరింగ్ కోచింగ్ నుంచి పాఠశాల విద్య వైపు అడుగులు వేసిన వీరు ఎబిఎన్ ఆంధ్రజ్యోతి 'బెస్ట్ ఇన్ ది బిజినెస్'తో తమ అనుభవాలు, ఆలోచనలు పంచుకున్నారు. ఆ వివరాలు..



తెలుగు రాష్ట్రాల్లో అందరు చేసే విద్యా వ్యాపారంతో ప్రస్థానాన్ని ప్రారంభించి...అంతర్జాతీయ కరిక్యులమ్‌తో కూడిన పాఠశాల విద్యలోకి ఎలా వచ్చారు ?

● ఓక్రిడ్జ్ ప్రారంభించే కంటే ముందు అంటే 1993 నుంచి వికాస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా కాంపిటీషన్ ఓరియంటేషన్‌తో శిక్షణ ఇస్తూ వచ్చాం. అయితే ఎక్కడా కూడా విద్యార్థులు సంతోషంగా లేనట్లు గుర్తించాం. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రయత్నిస్తే పాఠశాల స్థాయిలో అందిస్తున్న విద్యలో కొంత తేడా ఉన్నట్లు గుర్తించాం. మార్పులు తీసుకువస్తేనే ఈ పరిస్థితి మారుతుందని ఆశించటమే కాకుండా ఇది మనమే ఎందుకు చేయకూడదని అనిపించింది. మల్టీ డైమెన్షనల్ విధానంలో విద్యను అందిస్తే ఎలా ఉంటుందని ఆలోచనతో ఓక్రిడ్జ్‌ను ప్రారంభించాం.

హైదరాబాద్ గచ్చిబౌలిలో ఓక్రిడ్జ్ ప్రారంభించినప్పుడే ఐటి బూమ్ స్టార్టయింది. ముందే ఊహించి మీరు స్కూల్ అక్కడ ఏర్పాటు చేశారా ?

● ఇది యాదృచ్ఛికంగా జరిగిందే. ఐటి బూమ్‌తో సంబంధం లేకుండానే విద్యలో మార్పులు తీసుకురావాలన్న సదుద్దేశంతోనే ముందుకు సాగాం. అదే సమయంలో హైటెక్ సిటీ పూర్తి కావటం, కొత్త కొత్త ఐటి కంపెనీలు రావటం అనుకోకుండా జరిగింది. వాస్తవానికి మొదట ఓక్రిడ్జ్ స్కూల్‌ను విశాఖపట్నంలో ప్రారంభించాలని అనుకున్నాం. అయితే అప్పట్లో ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబి) విద్యా విధానం గురించి ఎవరికి తెలియదు. 2001-03 లో రూ.6 కోట్లతో తొలుత ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని భావించాం. అయితే అప్పట్లో ఇది రూ.100 కోట్లకు చేరుకుంది. అప్పుడు వాస్తవిక దృక్పథంతో ఆలోచించి ఈ తరహా విద్యను విశాఖలో ఆదరించే వారు లేరనిపించటమే కాకుండా ఆ రోజుల్లో ఇది సరైన చోటు కాదనిపించింది. దీంతో ఈ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించాలని నిర్ణయించాం. అదేసమయంలో హైదరాబాద్‌లో ఐటి విస్తరణ కూడా మొదలైంది.

ఓక్రిడ్జ్‌ను నిలబెడుతున్న అంశాలేమిటి ?

● ఐబి కరిక్యులమ్‌తో మేం స్కూల్‌ను ప్రారంభించినప్పుడు దేశంలో ఈ తరహా స్కూల్స్ పది మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఐబి కరిక్యులమ్‌తో నడుస్తున్న స్కూల్స్ దేశంలో 400కు పైగా ఉన్నాయి. ఓక్రిడ్జ్‌ను ప్రారంభించే ముందు దాదాపు వందకు పైగా స్కూల్స్‌ను పరిశీలించాం. అప్పట్లో డూన్ స్కూల్ ప్రిన్సిపల్‌గా ఉన్న షామీదాస్‌ను కలిసాం. మా ఆలోచనను వివరించాం. ఆయన సలహాలు తీసుకుని దీన్ని ప్రారంభించాం. ఆయన్ డూన్ స్కూల్ ప్రిన్సిపల్‌గా రిటైరయిన తర్వాత ఓక్రిడ్జ్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఓక్రిడ్జ్‌లో విద్యతో ఇతరత్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు అత్యంత ప్రాధాన్యతనిస్తాం. పరీక్షలంటే ఇక్కడ ఏ మాత్రం భయపడాల్సిన పనిలేదు. విద్యార్థులు ఏదైనా సరే నేర్చుకోవాలనేది మా అభిమతం. ఓక్రిడ్జ్‌ను హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం చేయకుండా బెంగళూరు, మొహాలీ, వైజాగ్ నగరాలకు విస్తరించాం.

ఓక్రిడ్జ్ పేరుతో కాకుండా మరికొన్ని స్కూల్స్‌ను నిర్వహిస్తున్నారు. అవి ఎక్కడ ఉన్నాయి ?

● ఓక్రిడ్జ్ కాకుండా వెస్ట్ బెర్రీస్ పేరుతో స్కూల్స్‌ను నిర్వహిస్తున్నాం. వీటిని సిబిఎస్ఇ విద్యా విధానంలో నిర్వహిస్తున్నాం. తృతీయ, నాలుగో శ్రేణి నగరాల కోసం వీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వెస్ట్ బెర్రీస్ స్కూల్స్‌ను తెనాలి, భీమవరంలో నిర్వహిస్తున్నాం. వీటితో పాటు విశాఖలో యధాతథంగా వికాస్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను నిర్వహిస్తున్నాం.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,510	31,450	31,590	31,450	30,670
క్రితం ముగింపు	31,480	31,430	31,500	31,350	30,580
22 క్యారెట్లు	29,180	29,150	29,060	29,090	29,210
క్రితం ముగింపు	29,150	29,150	28,980	29,070	29,120
వెండి (కిలో)	39,600	40,000	39,700	39,600	41,500
క్రితం ముగింపు	39,700	40,000	39,500	39,700	41,600

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	75.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	83.00	అనంతపురం	76.00
గోదావరి	78.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	363.00	నమక్కల్	380.00
గోదావరి	363.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	365.00	ముంబై	400.00

అటు ఇటైతే పొరపాటే!



ఫ్లోర్ మారితే అలారం మోగుతుంది

ఎక్సైజ్ కార్యాలయంలో కొత్త టెక్నాలజీ



అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'మీరు ఎక్కడికెళ్లాలో చెప్పండి. కచ్చితంగా అక్కడకు మాత్రమే వెళ్లాలి' ఇదీ ఓ సందర్శకుడికి ఎక్సైజ్ కార్యాలయం ప్రవేశద్వారం వద్ద సిబ్బంది చేసిన సూచన. అలా చెప్పడమే కాదు.. ఓ ఐడీ కార్డు కూడా ఇచ్చి లోపలికి పంపారు. ఒకసారి లోపలికొచ్చాక ఏం చేస్తారులే అని ఆ సందర్శకుడు చెప్పిన ఫ్లోర్ మాత్రమే కాకుండా మరో ఫ్లోర్‌లోకి ప్రవేశించాడు. వెంటనే కింద అలారం మోగింది. ఫలానా వ్యక్తి అనుమతి లేని పేషీల్లోకి వెళ్తున్నాడని సమాచారం వచ్చింది. ఇది తెలుసుకున్న ఆ సందర్శకుడు కంగుతిన్నాడు. తాను ఎక్కడి వెళ్లానో మీకెలా తెలిసిందని ఆరా తీశాడు. అతనికిచ్చిన ఐడీ కార్డు ద్వారానే ఆ విషయం బయటపడిందని తెలుసుకుని అవాక్కయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడాలేని నూతన సెన్సార్ విధానాన్ని విజయవాడలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రసాదంపాడులోని ఎక్సైజ్ కార్యాలయంలో ఐదు అంతస్తులున్నాయి. మొదటి అంతస్తులో కమిషనర్ పేషీ, ఐదో అంతస్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పేషీ ఉంటాయి. మిగిలిన అంతస్తుల్లోనూ కొందరు అధికారులు ఉంటారు. వారితో పాటు పలు విభాగాలు అక్కడ ఉంటాయి. కమిషనర్‌గా లక్ష్మీనరసింహం వచ్చాక సెన్సార్ల విధానం అమల్లోకి తెచ్చారు. కార్యాలయంలో ఉన్న ఉద్యోగులందరికీ సెన్సార్ ఐడీ కార్డులు జారీచేశారు. వాహనాలకు కూడా ప్రత్యేకమైన స్టిక్కర్లు అంటించారు. వాటి ద్వారానే ఆఫీస్ ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ క్రమంలోనే సందర్శకులకు ఆంక్షలతో కూడిన ప్రత్యేక విధానం అమల్లోకి తెచ్చారు. ఈ తరహా టెక్నాలజీ ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ లేదు. అత్యంత గోప్యత పాటించే ఇంటెలిజెన్స్ కార్యాలయానికి కూడా ఈ విధానం లేదు.

ఇబ్బందులూ ఉన్నాయి

నూతన విధానం బాగానే ఉన్నప్పటికీ దానివల్ల పలు ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఉదాహరణకు ఏదైనా పనికోసం లైసెన్సీ, డిస్టిలరీ ఎవరైనా వస్తే ఒక అధికారిని కలిసేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో అదే పని కోసం అవసరాన్ని బట్టి ఆ వ్యక్తి మరో ఫ్లోర్‌లోని అధికారులను కలవాల్సి వస్తే ఇబ్బందిగా మారుతోంది.

కథల రాజు కన్నుమూత

» సాహిత్యంలో ప్రయోగశీలి.. అన్ని ప్రక్రియల్లో రచనలు

» నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు



కాప్రా/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సాహితీ ప్రపంచంలో తనదైన ముద్రతో సాహిత్యాభిమానుల ప్రశంసలు, పలు అవార్డులను అందుకున్న ప్రముఖ సాహితీవేత్త రాజు(93) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున సైనిక్‌పురిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మునిపల్లె రాజుకు భార్య సులోచన,ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రాజు 1925 మార్చి16న గుంటూరు జిల్లా మునిపల్లెలో జన్మించారు. ప్రాథమిక విద్య అంతా పొన్నూరు, నిడుబ్రోలు, మునిపల్లెలోనే జరిగింది. తొమ్మిదో ఏటనే తండ్రి చనిపోవడంతో కుటుంబ బరువు బాధ్యతలు రాజుపై పడ్డాయి. 1949లో రక్షణ శాఖలో ఇంజనీర్‌గా చేరి, 1983లో హైదరాబాద్‌లో ఉద్యోగ విరమణ చేశారు. చిన్ననాట నుంచి సాహిత్యాభిరుచి మెండుగా ఉన్న మునిపల్లె రాజు అనేక రచనలు చేశారు. రష్యన్‌సాహిత్యం వల్ల అన్ని వాదాల కంటే మానవత్వమే గొప్పదన్న నిర్ణయానికి వచ్చారు. కవిత్వం రాసినా వచన రచనలే అధికంగా చేశారు. రెండు పద్య సంకలనాలు, నాలుగు కథా సంకలనాలు, పలు వ్యాసాలు రాశారు. ఆయన రాసిన 'పూజారి' నవలను ప్రఖ్యాత దర్శకుడు బీఎన్‌రెడ్డి 'పూజాఫలం' పేరుతో సినిమాగా తెరకెక్కించారు.

మేజికల్ రియలిజానికి కొత్త ఒరవడి

మునిపల్లెరాజు రాసిన 'అస్తిత్వనదం ఆవలి తీరాన' రచనకు 2006లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ పుస్తకంలో మొత్తం పదిహేను కథలు, ఒక మినీ నవల, కొన్ని స్వగతాలు ఉన్నాయి. గత శతాబ్ది గొప్ప కథలలో ఒకటిగా కీర్తికెక్కిన రాయలసీమ కరువు సమస్యల గాథ 'వీర కుంకుమ' కూడా ఇందులో ఉంది. మునిపల్లె రాజు రచనల్లో ప్రతిబింబించే మేజికల్ రియలిజం సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంది. మునిపల్లె భౌతికకాయానికి ఆదివారం ఉదయం తిరుమలగిరిలో అంత్యక్రియలు జరుగనున్నాయి.





యుద్ధ భూమి

ఖిల్లాపై రాయల జెండా!

గజపతుల కొండపల్లిపై ఎనిమిదినెలలు యుద్ధం

రాజమహేంద్రి మీదుగా ముట్టడి.. పాలకుడి బంది

ఆ యుద్ధానికి 500 ఏళ్లు.. తెలుగు బ్రహ్మోత్సవాలుగా నిర్వహించనున్న ప్రభుత్వం



తెలుగు భాషకు బ్రహ్మోత్సవం

"కొండపల్లిని శ్రీ కృష్ణదేవరాయలు జయించి, కోటలో అడుగుపెట్టి వచ్చే ఏప్రిల్ ఐదో తేదీ నాటికి 500 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా మూడురోజుల పాటు తెలుగుభాషా బ్రహ్మోత్సవాలు చేస్తున్నాం. సీఎం చంద్రబాబును ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తాం. సినీ రచయిత జొన్నవిత్తుల, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ఈమని శివనాగిరెడ్డి, వర్ల రామయ్యల సహకారం తీసుకొంటాం. పురావస్తు శాఖలు, సాంస్కృతిక శాఖలతో కలిసి ఈ ఉత్సవాలను విజయవంతం చేస్తాం"

- మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

నదుల వెంట నాగరికతలు విస్తరించినట్టు.. శ్రీకృష్ణదేవరాయులు ఎక్కడ నడియాడితే అక్కడ కళా సంస్కృతులు ప్రాణం పోసుకొన్నాయి. రాజ్య విస్తరణ కోసం ఆయన ఎత్తిన కత్తి, అంతిమంగా తెలుగుజాతి వైభవ, ఔన్నత్యాలను ఎత్తిపట్టింది. కొండపల్లి ఖిల్లాని ఆయన ఏ ముహూర్తానా జయించి, కాలు పెట్టారో, నాటినుంచీ కృష్ణాతీరమంతా సాహితీ జలధులు పొంగి పొర్లుతున్నాయి. ఆ ముట్టడికి 500 ఏళ్లు!

విజయనగరం రాజధానిగా దక్షిణ భారతదేశాన్ని పాలించిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు! నూనూగు మీసాల ప్రాయంలోనే ఆయన సింహాసనం అధిష్ఠించాడు. తెలుగువారి భాష, సంస్కృతి, సాహిత్యాలను ఎత్తిపడిన 'భువన విజయు'డిగా కీర్తినందుకొన్న రాయలులో మరోకోణం ఉంది. అదే రాజ్య విస్తరణ! దక్షిణాదిలోని విశాలమైన భూభాగాలకు తన సామ్రాజ్యాన్ని ఆయన విస్తరించాడు. ఈ క్రమంలో క్రీ.శ. 1515లో కొండపల్లిపై రాయలు దండెత్తాడు. నిజానికి, కొండపల్లి రాజ్యం అనేక మంది మధ్య చేతులు మారుతూ వచ్చింది. కొండవీటి రెడ్డిరాజు అనవేమారెడ్డి క్రీ.శ. 14వ శతాబ్దంలో కొండపల్లిని వశం చేసుకొన్నాడు. ఆయన కాలంలోనే ఇక్కడ కోటను నిర్మించారు. మాచారెడ్డిని తన తరపున కొండపల్లి పాలకునిగా ఆయన నియమించాడు. ప్రతాప రుద్రగజపతి ఏలుబడిలో క్రీ.శ.1431లో మరోసారి ఈ కోట ఆక్రమణకు గురయింది. అనంతరకాలంలో కపిలేశ్వర గజపతి, పురుషోత్తమ గజపతి, వీరభద్ర గజపతిల జెండా ఎగిరింది. రాయల నాటికి కొండపల్లిని ప్రతాపరుద్ర గజపతి పాలిస్తున్నాడు. తనకు లొంగిపోయి, బతికిపొమ్మని ప్రతాపరుద్రుడికి శ్రీకృష్ణదేవరాయలు వర్తమానం పంపించాడు. రాయలు అధికారాన్ని అంగీకరించేది లేదని ప్రతాపరుద్రుడు తేల్చి చెప్పాడు. దీంతో గజపతుల ఆధీనంలో ఉన్న ఈ ఖిల్లాను పట్టుకోవడానికి క్రీ.శ. 1515 జూన్ 23వ తేదీన యుద్ధం మొదలయింది. రాయలు, ఆయన ప్రధాని సాళువ తిమ్మరుసుల నాయకత్వంలో సైన్యాలు కొండపల్లిని ముట్టడించాయి. తిమ్మరుసు నాయకత్వాన సైన్యంలోని ఒక భాగం రాజమహేంద్రవరం వైపుగా చుట్టుముట్టగా, మరో ప్రధాన భాగం రాయలు నాయకత్వంలో నేరుగా ఖిల్లాను ముట్టడించింది. మరోవైపు నుంచి ఆయన సేనానులు విజృంభించారు. కొండపల్లి కోట ఎర్ర బురుజును ఆదిప్ప నాయకుడు, ఎడ్ల కొండను తిమ్మప్ప నాయకుడు, హనుమంతు బురుజును కొండమ రెడ్డి, ఒంటి మాన్యప్ప బురుజును కామానాయకుడు పట్టుకొన్నారు. యుద్ధం ఎనిమిదినెలలపాటు సాగి.. 1516 ఏప్రిల్ ఐదో తేదీన ముగిసింది. ఆ రోజున రాయలు కోటలో అడుగుపెట్టాడు. ప్రతాపరుద్రుడు, ఆయన భార్య, కుమారులు, సామంతులను సహా ఆయన కుటుంబ సభ్యులందరినీ సైన్యం సజీవంగా బందీలుగా పట్టుకొంది.




శ్రీకృష్ణదేవరాయులు

సేనల కోసం బావి తవ్వారు

కొండపల్లి యుద్ధం సందర్భంగా ఇబ్రహీంపట్నం రాచబంటు పక్కన తిమ్మరసు ఓ దిగుడు బావి తవ్వించాడు. నెలలపాటు యుద్ధం సాగడంతో రాయల సైనికులు అలసట, దప్పికతో అలమటించారు. వారి అవస్థ గమనించిన తిమ్మరసు, ఈ బావిని అప్పటికప్పుడు ఏర్పాటుచేయించినట్టు చెబుతారు. రాయల అనంతరం కొండపల్లి తిరిగి గజపతుల వశం అయింది. అనంతరం గోల్కొండ పాలకుడు కులీకుతుబ్‌షా పాలనా పరిధిలోకి వచ్చింది. అబుల్ హసన్‌తా నీషా హయాంలో గోల్కొండ దర్వాజాను కొండపల్లిలో నిర్మించడం జరిగింది. క్రీ.శ.1766లో కోట బ్రిటీషర్ల చేతుల్లోకి పోయింది. జనరల్ కెయిలాడ్ హయాంలో చివరిసారిగా ఈ కోటకు మరమ్మతులు జరిగాయి.

- విజయవాడ కల్చరల్



భావితరాలకు వారసత్వంగా..

"కొండపల్లికి ఎంతో చరిత్ర ఉంది. అందులోనూ, శ్రీ కృష్ణదేవరాయల కాలం ఎంతో ప్రధానం. తెలుగు భాషకు ఖ్యాతి తీసుకువచ్చి, సాహితీ సేవలో రాయలు కీర్తి గడించారు. చారిత్రక సంబంధమైన, సాహిత్య సంబంధమైన అనేక విశేషాలను నేటి యువతకు తెలియజెప్పేందుకు, అంతటి ఘన వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయి"

- ఈమని శివనాగిరెడ్డి

ఆ చరిత్రను ఆవిష్కరిస్తాం



"రాయల వైభవం, తెలుగు విశిష్టతలు తెలిపే కవితా సమ్మేళనం, భువన విజయం, కవుల గోష్ఠి, కూచిపూడి నృత్యరూపకాలు, సినీరచయిత జొన్నవిత్తుల కృష్ణదేవరాయ శతకం వంటి ప్రదర్శనలను ఏర్పాటం చేస్తున్నాం. రాయల నాటి చారిత్రక సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరిస్తాం"

- రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు డీ విజయభాస్కర్

గేదెల రాయితీ పక్కదారి!

» రవాణా భారం సాకుతో నిబంధనలకు తూట్లు

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పశుక్రాంతి పథకం రాయితీని ఫలహారంగా పంచుకున్నారన్న ఆరోపణలొచ్చాయి. ఆ అక్రమాల పరంపర కొనసాగకుండా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. పాడి పశువుల పంపిణీ పథకంలో గేదెలు, ఆవులకు రాయితీలు పొందాలంటే వాటిని ఏపీ, తెలంగాణల్లో కాకుండా, ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేయకతప్పదని షరతు పెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల రాయితీలతో ఒక్కో గేదెకు రూ.60వేల చొప్పున రెండు గేదె(ఒక యూనిట్)లకు రూ.లక్షా 20వేల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నాయి. అందులో 50 శాతం ప్రభుత్వం రాయితీ... మిగిలిన 50శాతం బ్యాంకు రుణం. అయితే రవాణా చార్జీల భారం సాకుతో గేదెలను కొనకుండానే రాయితీ మొత్తాన్ని డ్రా చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిబంధన కేవలం గేదెలకు మాత్రమే వర్తింపజేస్తున్నారు. ఆవులను స్థానికంగా కొనుగోలు చేస్తున్నారు. పాడి పశువుల పంపిణీ పథకంలో లబ్ధిదారులు ఇతర రాష్ట్రాలకెళ్లి గేదెలు, ఆవులను కొనుగోలు చేయడం కష్టంగా మారుతున్నందున రవాణా ఖర్చులు తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సోమశేఖరం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

6 వేల పశువులే అందించారు

రాష్ట్రవ్యాప్తంగా 2016-17లో 50వేల పాడి పశువులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అందులో 27వేలు గ్రౌండింగ్ కాగా, పెండింగ్‌లో ఉన్న 23వేలు యూనిట్లను 2017-18లో గ్రౌండింగ్ చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే ఇప్పటి వరకు 6 వేల పశువులను మాత్రమే లబ్ధిదారులకు అందించారు. మరో 17వేల పాడి పశువులను పంపిణీ చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే గేదెలు కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పర్యాటకానికి పెట్టుబడుల కిక్

విభిన్న ప్రాజెక్టులతో ముందుకొచ్చిన కంపెనీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టేందుకు పలు కంపెనీలు ఆసక్తి చూపాయి. సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూలు మార్చుకోవడానికి ముందుగా ఉదయం హోటల్ అంబికా సీగ్రీన్‌లో పెట్టుబడిదారులతో పర్యాటక శాఖ అధికారులు ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సమావేశానికి పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ జయరామిరెడ్డి, కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా హాజరయ్యారు. ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల్లో మహీంద్ర గ్రూప్‌నకు చెందిన మహీంద్ర క్లబ్‌హౌస్, ఎస్సెల్ గ్రూప్, అమెరికాలోని ఫ్లోరిడా కేంద్రంగా పనిచేస్తున్న సింపుల్ గ్రూప్ వంటి ప్రముఖ కంపెనీలు ఉన్నాయి. ఈ ఒప్పందాల్లో భాగంగా హోటళ్లు, రిసార్ట్స్, క్లబ్‌హౌస్‌లు, అమ్యూజ్‌మెంటు పార్కులు, థీమ్‌పార్కులు, బీచ్‌ఫ్రంట్‌లు, హెల్త్‌స్పా వంటివి ఏర్పాటు కానున్నాయి. సాహస క్రీడలు, అగ్రి టూరిజం, ఎకో టూరిజం, కన్వెన్షన్ సెంటర్లు తదితర ప్రాజెక్టులపై పెట్టుబడిదారులు ఆసక్తి కనబరిచారు.

■ కొవ్వూరులో రివర్‌ఫ్రంట్ హోటల్

పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో గోదావరి రివర్ ఫ్రంట్‌లో రూ.23కోట్ల పెట్టుబడితో హోటల్ ప్రారంభిస్తున్నాం. దీనిలో 130మందికి ఉపాధి లభిస్తుంది. గోదావరి అందాలు తిలకించేందుకు ఈ హోటల్ అనువుగా ఉంటుంది. మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన నాకు ఈ రంగంలో కొంత అనుభవం ఉంది. తండ్రి రామారావు కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే. పర్యాటక శాఖ ప్రోత్సాహంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మరికొద్ది నెలల్లో ఈ ప్రాజెక్టు ప్రారంభం కానుంది.

- దివ్యారాణి, మహిళా పారిశ్రామికవేత్త

■ 500కోట్లతో బీచ్‌ఫ్రంట్‌ల అభివృద్ధి

అమెరికాలో ఫ్లోరిడా కేంద్రంగా 'సింపుల్' గ్రూపు పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నాం. సాఫ్ట్‌వేర్, మౌలిక వసతుల రంగంలో అనుభవం ఉంది. గతేడాది విజయవాడ భవానీ ఐలాండ్స్‌లో వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టులు చేపట్టాం. కోస్తాలో పది చోట్ల బీచ్‌ఫ్రంట్‌లు, ఐలాండ్‌లు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. విజయవాడలో సొంతంగా బోట్లు తయారుచేస్తున్నాం. దశల వారీగా కృష్ణాజిల్లాలో పదిచోట్ల బీచ్ ఫ్రంట్‌లు, ఐలాండ్‌ల అభివృద్ధికి రూ.500కోట్లు పెట్టుబడి పెడతాం. మా ప్రాజెక్టులతో నేరుగా 1,500మందికి ఉపాధి లభిస్తుంది.

- గుమ్మడపు పాపారావు, సింపుల్ గ్రూపు

■ 500 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్, మల్టీప్లెక్స్

విజయవాడ-గుంటూరు హైవే పక్కన డీజీపీ కార్యాలయం సమీపంలో సుమారు రూ.500కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్, మల్టీప్లెక్స్, మాల్ నిర్మాణం చేపట్టనున్నాం. 8స్క్రీన్లతో మల్టీప్లెక్స్, 20లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాల్, ఫైవ్‌స్టార్ హోటల్ ఉంటాయి. ఇందులో ఐటీ స్పేస్ కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 5ఎకనామిక్ సిటీల్లో రెండింటిని (విశాఖ, విజయవాడ) మేం చేపట్టనున్నాం. ఇందులో హౌసింగ్, కమర్షియల్ కాంప్లెక్స్, ఇండస్ట్రీస్ ఉంటాయి. విజయవాడలో సుమారు రూ.10వేల కోట్లతో 300ఎకరాల్లో ఎకనామిక్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నాం.

- ఎస్‌డీవీ కృష్ణకుమార్, సీఈవో, ఎల్‌ఈపీఎల్

■ విశాఖలో 100కోట్లతో జలవిహార్

విశాఖలో జలవిహార్ ఏర్పాటు చేసేందుకు రూ.100కోట్లతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. జలవిహార్ డెస్టినీ టూరిజం ప్రాజెక్టు పేరుతో ఆనందపురం మండలంలో దీని ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నాం. 9.5 ఎకరాల్లో నిర్మాణాన్ని చేపడతాం. ఇందులో త్రీ స్టార్ హోటల్, లీజర్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆడిటోరియం, ఎగ్జిబిషన్ సెంటర్ ఉంటాయి.

- వి.మురళీమోహన్, జనరల్ మేనేజర్, జలవిహార్

■ 50ఎకరాల్లో వినోద కేంద్రం

విశాఖలోని గీతం మెడికల్ కళాశాల పక్కన సుమారు 50ఎకరాల్లో ఫైవ్‌స్టార్ హోటల్‌తో కన్వెన్షన్ సెంటర్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నాం. సుమారు రూ.500కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నాం. 5వేల సీట్ల సామర్థ్యంతో నిర్మించే దీనిని 2021నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఈదర విద్యాసాగర్, డైరెక్టర్, ఫ్రంట్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్

■ విశాఖ పరిసరాల్లో సైన్స్‌సిటీ

విశాఖ పరిసరాల్లో సైన్స్‌సిటీ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. రూ.30కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాం. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు అనువుగా సైన్స్ సిటీలో వసతులు కలిస్తాం. విదేశాల్లో అనేకచోట్ల సైన్స్‌సిటీల మోడల్ చూసి విశాఖలో ఏర్పాటుకు ప్రతిపాదించాం.

- ముదునూరు ఎంఎస్ రాజు, ముదునూరు గ్రూప్ చైర్మన్

■ రెండుచోట్ల వెల్‌నెస్ సెంటర్లు

అమరావతి, విశాఖల్లో వరల్డ్ క్లాస్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు ఒప్పందం కుదర్చుకున్నాం. విశాఖలోని బే పార్కు స్పాలో 51శాతం వాటా కొనుగోలుకు 10మిలియన్ డాలర్లు వెచ్చిస్తున్నాం. అమరావతిలో వెల్‌నెస్ సెంటర్‌కు 50మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతాం. నేచురోపతిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చాలన్నది మా ప్రణాళిక. దీనిలో అబుదాబీ రాజు పెట్టుబడులు పెడుతున్నారు.

- పి.జయప్రద, ఇన్వెస్ట్‌మెంట్ డైరెక్టర్, ప్రిన్స్ ఆఫ్ మహ్మద్ బిన్ తహనూన్ అల్

■ రాజధానిలో కళల కేంద్రం

రూ.100కోట్ల పెట్టుబడితో అమరావతి కళల కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. 200 మందికి ఉపాధి లభించనుంది. నృత్యం, సంగీతంలో శిక్షణ ఇస్తాం. డిప్లమో, డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశపెడతాం. ఈ కేంద్రం ఏర్పాటుకు 15 నుంచి 25 ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతున్నాం.

- వీవీ సుందరం, చైర్మన్, క్లీవ్‌లాండ్ త్యాగరాజు ఫెస్టివల్

■ భవానీద్వీపంలో అగ్రి టూరిజం

భవానీద్వీపం పరిసరాల్లో 70ఎకరాల్లో రూ.60కోట్లతో అగ్రిటూరిజం ప్రాజెక్టు నెలకొల్పుతాం. వ్యవసాయాన్ని పర్యాటకానికి అనుసంధానం చేస్తాం. రైతులు, గ్రామాల్లో యువతకు ఉపాధి కల్పిస్తాం. దీనికోసం మూడు గ్రామాలను దత్తత తీసుకుంటాం. నగరాలు, పట్టణాల్లోని పిల్లలకు వ్యవసాయం ప్రాధాన్యం వివరించేలా పర్యాటకాన్ని విస్తరిస్తాం.

- మాధవీబిందు, ఎండీ, సస్యవేద అగ్రి టూరిజం



ఏపీలో 'గూగుల్ స్టేషన్'

గ్రామాలన్నింటికీ వై-ఫై సదుపాయం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధ కంపెనీ గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. గూగుల్ స్టేషన్ పేరుతో ఈ ప్రాజెక్టు కింద గ్రామ పంచాయతీలతో పాటు మారుమూల గ్రామాలకు సైతం వై-ఫై సౌకర్యం కల్పిస్తారు. సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ అంజలి జోషితో ఐటీశాఖ కార్యదర్శి విజయానంద్ భాగస్వామ్య సదస్సులో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించిన సీఎం... తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం మండలంలోని బండ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ముచ్చటించారు. 2018 చివరి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు వై-ఫై సౌకర్యం కల్పిస్తామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు.

భవానీ ద్వీపంలో యానిమల్ పార్కు



విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ భవానీద్వీపంలో రూ.500కోట్లతో యానిమల్ పార్కు ఏర్పాటుకు ఎస్సెల్ గ్రూప్ పర్యాటక శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గ్రూప్ సీఈవో రాజీవ్ దుగ్గల్ మాట్లాడుతూ దేశంలో ఇటువంటి పార్కు ఇప్పటివరకూ లేదని, ఇవి జంతు ప్రదర్శనశాలలకు భిన్నంగా ఉంటాయని వివరించారు. భవానీద్వీపంలోని మూడు ఐలాండ్స్‌లో సాహస క్రీడలు, వాటర్ స్పోర్ట్స్ కోసం థీమ్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.

200 కోట్లతో కళింగపట్నంలో రిసార్ట్స్




శ్రీకాకుళం జిల్లా సముద్ర తీరప్రాంతం కళింగపట్నంలో రూ.200 కోట్లతో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తున్నట్టు 'క్లబ్ మహీంద్ర' ప్రతినిధి మోనీష్ విజ్ వెల్లడించారు. దీనికి సంబంధించి పర్యాటక శాఖతో క్లబ్ మహీంద్ర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 20ఎకరాల్లో 200 గదులతో రిసార్ట్స్‌కు త్వరలో భూమిపూజ చేస్తామన్నారు. తీరానికి సమీపంలో ప్రభుత్వం భూమి కేటాయించాల్సి ఉందన్నారు. ఇవి పూర్తయితే ప్రత్యక్షంగా 500-700 మందికి, పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

అరటి నారతో రేడియేషన్‌కు చెక్

తూర్పుగోదావరి జిల్లావాసి ప్రాజెక్టు



విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకం కింద అరటి నారతో రేడియేషన్‌ను నివారించే దుస్తులు తయారుచేసే పరిశ్రమ ఏర్పాటు చేయనునట్టు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సత్యనారాయణ వీవీఎస్ తెలిపారు. అరటిచెట్ల బోదెల నుంచి తీసిన నారతో తయారైన దుస్తులు ధరిస్తే ఆ ప్రాంతంలో ఎటువంటి రేడియేషన్ ప్రభావం ఉండదని, ఖాదీ దుస్తులు లభించే ధరకే వీటిని కూడా అందిస్తామని వివరించారు. అలాగే అరటి గుజ్జుతో వైట్ వైన్, తొక్కతో పేపరు రూపొందించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు 25హెక్టార్ల స్థలం కావాలని, రూ.100కోట్ల పెట్టుబడి పెడతామని, మహిళలకు పెద్దసంఖ్యలో ఉపాధి కల్పిస్తామని చెప్పారు. దీనిపై ఏపీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని సత్యనారాయణ తెలిపారు.



సదస్సులో చంద్రబాబుతో మంత్రుల సరదా సంభాషణ

ఒక్క కాల్ చాలు

- ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తాం
- ప్రతి ఒక్కరూ ఎంవోయూ చేసుకోండి
- విశాఖలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'నీరిస్తాం.. అవసరమైనంత భూమి ఇస్తాం.. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తాం.. నైపుణ్య సిబ్బందిని అందిస్తాం.. సింగిల్ డెస్క్ ద్వారా 21 రోజుల్లో అనుమతులిస్తాం.. ప్రతి ఒక్కరూ ఒక్క ఎంవోయూ అయినా చేసుకుని వెళ్లండి' అని పెట్టుబడిదారులను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. విశాఖలో శనివారం సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు ప్రారంభం సందర్భంగాను, సాయంత్రం 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో నిర్వహించిన సదస్సులోనూ ఆయన ప్రసంగించారు. పరిశ్రమల స్థాపనకు ఆంధ్రకు మించిన నెలవు మరొకటి లేదన్నారు. సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్నామని చెప్పారు. 'మా రాష్ట్రం గురించి దేశమంతా ఎంక్వయిరీ చేసుకోండి. అన్ని విషయాలూ తెలుసుకున్నాకే పెట్టుబడులతో ఇక్కడకు రండి. మీకు అన్ని విధాలుగా సహకరిస్తాం..' అని పిలుపిచ్చారు. రాబోయే ఐదేళ్లలో రూ.పది లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ, ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏయే రంగాల్లో ఏయే కంపెనీలు పెట్టుబడులు పెట్టాయో సమగ్రంగా వివరించారు.



వెంకయ్యను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటక రంగంలో అగ్రగామిగా ఉన్నామని చెప్పారు. అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, సహకరించాలని కోరారు. పెట్టుబడిదారులకు ఏ సమస్య ఉన్నా ఒక్క కాల్ చేస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వృద్ధి రేటులో ముందంజ..

రాష్ట్ర జీడీపీ రెండంకెల వృద్ధి సాధిస్తోందని సీఎం అన్నారు. 2017-18లో ఇప్పటివరకు 11.37 శాతం సాధించామని.. రాబోయే మూడేళ్లలో అన్ని రాష్ట్రాల కన్నా అత్యధిక వృద్ధి రేటు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'గతంలో రూ.1,35,400 కోట్ల పెట్టుబడులు, 31 లక్షల ఉద్యోగాలకు 1946 ఎంవోయూలు చేసుకున్నాం. 1143 ప్రాజెక్టులు చేపట్టాం. పెట్టుబడుల సాధనలో ఏపీని నంబర్‌వన్‌గా నిలబెడతాం. రాష్ట్రాన్ని ప్రపంచ దేశాల్లో టాప్-10లో నిలబెట్టాలని ఆశిస్తున్నాం. కేంద్రం ప్రోత్సహిస్తే టాప్-5లో స్థానం సంపాదించగలం' అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో భారత్‌కు చెందిన వాళ్లు ప్రతి ఐదుగురిలో ఒక్కరు ఉంటారని చెప్పారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో రాష్ట్రం ముందుందని చెప్పారు. రూ.150కే ఇంటర్‌నెట్, టెలిఫోన్, కేబుల్ టీవీ అందిస్తూ రెండు డాలర్ల కన్నా తక్కువ ఖర్చుకే వేగవంతమైన ఇంటర్‌నెట్‌ను రాష్ట్ర ప్రజలకు చేరువ చేశాం. ప్రజలు తమ ఇళ్ల నుంచే నేరుగా కాన్ఫరెన్స్‌లో నాతో మాట్లాడుతున్నారు' అని పేర్కొన్నారు. ఆంధ్ర ఆవిష్కరణలతో నిండిన నేల.. అందువల్లే అద్భుతంగా పని చేయగలుగుతున్నామని తెలిపారు. 1998లో విద్యుత్ రంగంలో తాను తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా రాష్ట్రం విద్యుదుత్పత్తి, సరఫరాపరంగా మంచి స్థితిలో ఉందని సీఎం తెలిపారు. ఇప్పుడీ రంగంలో రెండో తరం సంస్కరణలు తెస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో విద్యుత్ చార్జీలు తగ్గించడమే తప్ప పెంచేది లేదన్నారు.

సంతోషకరమైన జీవన వాతావరణం..

రాష్ట్రం సాధించిన అభివృద్ధి, లక్ష్యాలను సీఎం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో నివసించే ప్రజలకు సంతోషకరమైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 'విజన్-2029తో పనిచేస్తున్నాం. 2022 నాటికి ఏపీని దేశంలో మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలుపుతాం. 2029 నాటికి నంబర్‌వన్ స్థానానికి చేర్చుతాం. 2050 నాటికి ప్రపంచంలోనే ఉత్తమ రాష్ట్రంగా మలచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని తెలిపారు. కుటుంబ వికాసం కింద సామాజిక, ఆహారం, విద్య, విద్యుత్, ఆరోగ్యం తదితర 15 అంశాలపై భద్రత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సమాజ వికాసం కింద మరో 10 అంశాలను చేర్చామని చెప్పారు. 14 పోర్టులను అభివృద్ధి చేయాలని నిర్ణయించగా.. ఇప్పటికే ఆరు పోర్టులు కార్గో రవాణాలో దూసుకెళ్తున్నాయని తెలిపారు.

రాబోయే రోజుల్లో భావనపాడు అత్యుత్తమ పోర్టుగా అభివృద్ధి చెందుతుందన్నారు. విమానయాన రంగంలో 35 శాతం అభివృద్ధి సాధించామని చెప్పారు. వంద ఆర్థిక నగరాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని హార్డ్‌వేర్ తయారీ కేంద్రంగా మారుస్తామన్నారు. 80 శాతం ప్రజలు సంతృప్తిగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. కొత్త రాజధాని నిర్మించే అవకాశం చాలా అరుదుగా లభిస్తుందని, ఆ అదృష్టం తనకు లభించినందుకు సంతోషంగా ఉందని సీఎం తెలిపారు. అమరావతిని అద్భుతంగా నిర్మిస్తామని, ప్రపంచంలోని గొప్ప ఐదు నగరాల్లో ఒకటిగా నిలుపుతామని చెప్పారు.

విశాఖ అందాలు చూసివెళ్లండి..

సదస్సులో పాలుపంచుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో ప్రతినిధులు వస్తున్నారని.. వారంతా అందమైన విశాఖ నగరాన్ని చూసి వెళ్లాలని సీఎం కోరారు. ఇక్కడి ప్రజలు, ఆహారం, వాతావరణం అన్నీ అద్భుతంగా ఉంటాయన్నారు. పరిశుభ్రత, పచ్చదనం అన్ని నిండిన నగరంగా పేర్కొన్నారు.

ఏపీలోనే అత్యధిక ల్యాండ్ బ్యాంక్

- మూడేళ్లలో సమస్యలు అధిగమించాం
- పెట్టుబడులతో తరలి రండి: లోకేశ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల కోసం దేశంలో ఏ రాష్ట్రానికీ లేనంత ల్యాండ్‌బ్యాంక్ ఆంధ్రప్రదేశ్‌కు ఉందని, పైగా ఎటువంటి వివాదాలూ లేని స్థలమని, పెట్టుబడులతో వస్తే పూర్తి సహకారం అందిస్తామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. పెట్టుబడిదారుల సదస్సులో శనివారం సాయంత్రం 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విశాఖ నగరం పరిశుభ్రతలో దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందని, అటువంటి నగరంలో పెట్టుబడిదారుల సదస్సు మూడోసారి నిర్వహించడం మరో విశేషమన్నారు. అసలు రాజధాని లేకుండానే ఈ రాష్ట్రం ఏర్పాటైందని, తలసరి ఆదాయం దక్షిణ భారత దేశంలో అత్యంత తక్కువ ఇక్కడే ఉండేదని, ఆ సమస్యలన్నింటినీ దశలవారీగా అధిగమించి, ఇపుడు రాష్ట్రాన్ని అనేక విషయాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిపామన్నారు. ఏపీని 2029 నాటికి దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రీన్‌ఫీల్డ్ రాజధానిని నిర్మిస్తున్నామని, ఇది ప్రపంచంలోని ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. అమరావతి హైటెక్ క్యాపిటల్ సిటీగా మారుతుందని వ్యాఖ్యానించారు. హెచ్‌సీఎల్ కంపెనీ అమరావతికి వస్తుందని, చిప్ డిజైనింగ్ కూడా అక్కడే జరుగుతుందన్నారు. విశాఖపట్నం కేవలం ఐటీ హబ్ మాత్రమే కాదని, దేశానికి ఫిన్‌టెక్ రాజధానిగా మారనుందన్నారు. విశాఖ ఫార్మా హబ్‌గా వర్ధిల్లుతోందని, వైద్య పరికరాల తయారీ పార్కు కూడా ఏర్పాటైందన్నారు. ఇదే రాష్ట్రంలో రాయలసీమ వంటి వెనుకబడిన జిల్లాలు కూడా ఉన్నాయని, అక్కడ కియా కార్ల కంపెనీని తీసుకువచ్చామని, 15 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించడానికి ఆ సంస్థ అంగీకరించిందని లోకేశ్ వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, భూమి లభ్యత, నీరు, విద్యుత్ సరఫరాలతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌లోనూ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. దేశంలో విద్యుత్ చార్జీలు పెంచని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఏపీయేనన్నారు. రాష్ట్రంలో 4.6 గిగావాట్స్ సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించి పెట్టుబడులతో ఏపీకి తరలి రావాలని లోకేశ్ కోరారు.

30నెలల్లో లులూ కన్వెన్షన్ సెంటర్

శంకుస్థాపన చేసిన వెంకయ్య, సీఎం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): లులూ కన్వెన్షన్ సెంటర్, హోటల్, షాపింగ్‌మాల్ పనులు 30 నెలల్లో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆ సంస్థ చైర్మన్ యూసఫ్ అలీని కోరారు. ఈ కన్వెన్షన్ సెంటర్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్యతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు.

ఏపీసీఆర్డీయేతో 'అనాస్' ఎంవోయూ

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) నిర్మాణంతో పాటు రాజధానిలోని ఇతర మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలకయ్యే వ్యయంలో రూ.7,000 కోట్లు పెట్టుబడిగా పెడతామంటూ అనాస్ ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్ ఎస్.పి.ఎ. సంస్థ భాగస్వామ్య సదస్సులో ఏపీసీఆర్డీయేతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 'అనాస్' ఉన్నతాధికారి నికోలా ఫైరా, సీఆర్డీయే కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు.

ఏపీలో ఇసుజు విస్తరణ: హయాసీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీలో ఇసుజు మోటార్స్‌ను విస్తరించేందుకు గల అవకాశాలపై చర్చించేందుకు భాగస్వామ్య సదస్సుకు వచ్చామని జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ నార్తిడా హయాసీ అన్నారు. నెల్లూరు జిల్లా శ్రీసిటీలో ఇసుజి మోటార్స్ సంస్థను 107 ఎకరాల్లో 50 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటుచేశామని, దీన్ని 120 యూనిట్లకు పెంచే ఆలోచన ఉందన్నారు.

640 కోట్లతో సినర్జీస్ ప్లాంటు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అలాయ్ వీల్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న సినర్జీస్ సంస్థ మరో రూ.640కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ఎంవోయూ కుదుర్చుకుంది. ఇప్పటికే విశాఖలోని పరిశ్రమ ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ సంస్థ మరో అలాయ్ వీల్స్ పరిశ్రమను స్థాపించాలని నిర్ణయించింది. దాన్ని కూడా విశాఖ పరిసరాల్లోనే నెలకొల్పేందుకు ఈ భాగస్వామ్య సదస్సులో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ ఎండీ ఎం.శేఖర్ తెలిపారు.

కాకినాడలో కాస్టిక్ సోడా కంపెనీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో క్లోర్ ఆల్కాలి(కాస్టిక్ సోడా) తయారీ కర్మాగారం ఏర్పాటుకు ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిమ్ కెమికల్స్ కంపెనీ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వెయ్యి కోట్ల రూపాయలతో ఏర్పాటయ్యే ఈ కంపెనీకి 150ఎకరాల స్థలం కేటాయించారు.

220 కోట్లతో 'డెనిమ్ జీన్స్'

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో రూ.220 కోట్లతో జీన్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బంగ్లాదేశ్‌కు చెందిన డెనిమ్ జీన్స్ కంపెనీ అంగీకరించింది. దీనికోసం జీఎంఆర్ సెజ్‌లో 20ఎకరాలు కేటాయించారు.

ఈఈఎస్ఎల్‌తో 3730 కోట్ల ఒప్పందాలు

విశాఖపట్నం: కేంద్ర ఇంధన సంస్థతో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటైన ఎనర్జీ ఎఫెషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)తో ఏపీ ప్రభుత్వం రూ.3,730కోట్ల విలువైన నాలుగు ఒప్పందాలు చేసుకుంది. ఈపీడీసీఎల్, ఎస్పీడీఎస్ఎల్ కంపెనీల తరఫున ఈ ఒప్పందాలు జరిగాయి. సీఎం చంద్రబాబు సమక్షంలో ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్, ఈఈఎస్ సీఎండీ సౌరభ్‌కుమార్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్, ఈపీడీసీఎల్‌సీఎండీ హెచ్‌వై దొర, ఎన్ఆర్ఈడీసీఏపీ ఎండీ కమలాకర్‌బాబు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పరిశ్రమల అనుమతులు

అన్నీ ఆన్‌లైన్‌లోనే!

- వ్యాపారానికి ఆంధ్ర అనుకూలం
- సాగులో పెట్టుబడులకు చాన్స్
- సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది
- సౌర విద్యుదుత్పత్తిలో మేటి
- ఉపరాష్ట్రపతి వెంకయ్య వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యాపారానికి ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలమైన రాష్ట్రమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఈ ప్రాంతం పెట్టుబడులకు ఇంకా అనుకూలమని చెప్పారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలోనేగాక దేశం మొత్తం మీద అపార అవకాశాలున్నాయని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం లైన్‌లో నిల్చోవాల్సిన అవసరం లేదని, సీఎం అన్నీ ఆన్‌లైన్ చేశారని తెలిపారు. శనివారం సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన కీలక ప్రసంగం చేశారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ఆనంద, ఆరోగ్యాంధ్రగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. కేంద్రంలో, రాష్ట్రంలో స్టెబిలిటీ, ఎబిలిటీ (స్థిరత్వం, సామర్థ్యం) ఉన్న ప్రభుత్వాలు ఉన్నాయని కొనియాడారు. దేశంలో వ్యవసాయంపై 53 నుంచి 60 శాతం మంది ఆధారపడి ఉన్నారని.. వేల్యూ అడిషన్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వాకల్చర్, ఫిష్ కల్చర్, డైరీ, పౌల్ట్రీలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 'దేశమెలా ఉంటుందో విశాఖను చూస్తే మీకే తెలుస్తుంది. ఇక్కడి ప్రజలు ఎంతో నిజాయితీపరులు. గతంలో ఎన్నో సదస్సులు చూశాను. ఈ కార్యక్రమం ఇందుకు భిన్నమైనది. సదస్సును ప్రోత్సహించేందుకు, పెట్టుబడిదారులకు భరోసా ఇవ్వడానికి ఉపరాష్ట్రపతిగా హాజరయ్యాను. రాష్ట్రంలో అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతున్నాయి. తెలివైన వారంతా ఇక్కడ పెట్టుబడులు పెడతారు. ఇక్కడకు వచ్చిన వారంతా తెలివైనవారే. అదానీ గ్రూప్ ఇంకా తెలివైన వారు కనుక మరింత ఎక్కువ పెట్టుబడులు పెడతారు' అని చమత్కరించారు. రాష్ట్రంలో రెండు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తోందని, ఇప్పటికే వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోందని, ఈ రంగంలోనూ పెట్టుబడులకు అవకాశం ఉందని తెలిపారు. ఇది సన్‌రైజ్ స్టేట్ అని అన్నారు. 'నేను ఈ రాష్ట్రానికే చెందినవాడిని. ఇక్కడి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకున్నాను. అత్యవసర సమయంలో జైలు శిక్ష అనుభవించాను' అని గుర్తుచేశారు. గ్లోబల్ ఎకానమీలో భారత్ దూసుకుపోతోందని ఉపరాష్ట్రపతి అన్నారు. రాబోయే ఐదు, పదేళ్లలో ఎకానమీ పరంగా భారత్ మూడో స్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి సంస్కరణల వల్ల ఆదాయ పన్ను (ఐటీ) చెల్లిస్తున్న వారి సంఖ్య 6.74 కోట్ల నుంచి నుంచి 8.27 కోట్లకు చేరుకుందన్నారు. ఆ సంఖ్య రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందన్నారు.

ఆ సొమ్ము బ్యాంకులకు చేరింది...

బాత్‌రూముల్లో, బెడ్‌రూముల్లో మూలిగిన సొమ్ము సంస్కరణల వల్ల బ్యాంకులకు చేరిందని.. అదే నోట్ల రద్దు గొప్పతనమని వెంకయ్య చెప్పారు. జీఎస్టీ విప్లవాత్మక నిర్ణయమన్నారు. రిఫార్మ్ (సంస్కరణ).. పెర్‌ఫార్మ్ (పనితీరు).. ట్రాన్స్‌ఫార్మ్ (పరివర్తన) నినాదంతో కేంద్రం దూసుకుపోతోందన్నారు. దేశంలో 65 శాతం మంది యువతేనని, వారంతా 35 ఏళ్లలోపు వయసున్న వారేనని, దానిని బట్టి దేశ భవిష్యత్ అంచనా వేయొచ్చని తెలిపారు.



సదస్సుకు వస్తున్న మహిళా ప్రతినిధి

రాష్ట్ర ప్రతినిధిగా వచ్చా!

ఏపీ తరఫున పార్లమెంటులో ప్రాతినిధ్యం గర్వకారణం: సురేశ్ ప్రభు

(విశాఖ భాగస్వామ్య సదస్సు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "మేకిన్ ఆంధ్రప్రదేశ్ కాదు.. డిజైన్ ఇన్ ఆంధ్రప్రదేశ్"గా రాష్ట్రాన్ని కేంద్రమంత్రి సురేశ్ ప్రభు అభివర్ణించారు. ప్రపంచంలోని ప్రముఖ కార్లన్నీ త్వరలోనే ఏపీలో తయారవుతాయని జోస్యం చెప్పారు. తాను కేంద్రమంత్రిగానే కాకుండా ఏపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా, రాష్ట్ర ప్రతినిధిగా విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు వచ్చానన్నారు. పార్లమెంటులో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు విజన్‌తో ఒక కొత్త ఆంధ్రప్రదేశ్‌ను సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. అనతి కాలంలోనే ఏపీ బలమైన రాష్ట్రంగా ఎదుగుతుందన్నారు. ఆటోమొబైల్ మేకర్స్, ఆటో కాంపోనెంట్స్ మేకర్స్ మధ్య జరిగిన ఒప్పందం అత్యంత ముఖ్యమైనదన్నారు. ఏపీని కేవలం పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగానే కాకుండా పూర్తిస్థాయి ఉద్యోగ కల్పనను అందించిన రాష్ట్రంగా చూడాలని ఉందన్నారు. తూర్పుతీరంలో అతిపెద్ద ఆటో కాంపొనెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని కేంద్రం భావిస్తే.. దాన్ని ఏపీలోనే నెలకొల్పాలని సీఎం సంకల్పించారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



సురేశ్ ప్రభును సత్కరిస్తున్న చంద్రబాబు

ఆటోమొబైల్‌కు ఉజ్వల భవిష్యత్

పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల్లో సానుకూలత

విశాఖపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో ఆటోమొబైల్ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఏమాత్రమూ సందేహించాల్సిన అవసరం లేదని పలువురు ఆటోమొబైల్‌రంగ సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో తొలిరోజు 'భవిష్యత్ ఆటోమొబైల్ రంగం-మార్కెటింగ్' అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మహేంద్ర ఆటోమొబైల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రహ్లాదరావు మాట్లాడుతూ భారత్ నుంచి ఆటోమొబైల్ పరికరాలు, వాహనాలను బంగ్లాదేశ్ దిగుమతి చేసుకుంటోందన్నారు. బంగ్లాదేశ్ ప్రతినిధి అబ్దుల్ తత్లూబ్ అహ్మద్ మాట్లాడుతూ 95 శాతం వాహనాలను ముఖ్యంగా కాలుష్య రహిత ఎలక్ట్రికల్, సౌరవిద్యుత్ ఆధారంగా నడిచే వాహనాలు, విడిభాగాలను భారత్ నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు.





సీఎం చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో గూగుల్ కంపెనీతో ఒప్పందం చేసుకుంటున్న ఐటీ కార్యదర్శి విజయానంద్, గూగుల్ వైస్ ప్రెసిడెంట్ అంజలి జోషి, జీరో పొల్యూషన్ వాహనాల ఒప్పంద పత్రాల మార్పిడి, పర్యాటక శాఖ ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు



మెగా ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

అధికార వర్గాలు వెల్లడించాయి. విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు..యథావిధిగా పెట్టుబడులను రాబట్టడంపై దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్నాయని, అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యధిక ఆదాయం పర్యాటక రంగం ద్వారానే వస్తోందని సీఎం పదేపదే చెబుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అపార సహజ వనరులు, చారిత్రక కట్టడాలు, ప్రఖ్యాత దేవాలయాలు..పర్యాటక ప్రేమికులను ఆకర్షిస్తాయని అంటుంటారు. ఈ నేపథ్యంలో విశాఖ సదస్సు సందర్భంగా ఆయన తొలి సమావేశం పర్యాటక రంగ అభివృద్దిపైనే జరిగింది. మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ బిజినెస్ హెడ్ మొనేశ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటకులను ఆకర్షించేలా కార్యకలాపాలు చేపట్టాలని..రిసార్ట్‌ను నిర్మించాలని సూచించారు. రాష్ట్రంలో తమ వ్యాపార వృద్ధిపై కార్యాచరణ ప్రణాళికలను మొనేశ్ వివరించారు. తర్వాత ఎస్సార్ గ్రూప్ టూరిజం బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శర్మను, హైసీ నావల్ ఆర్కిటెక్ట్స్ సహ వ్యవస్థాపకుడు ఉపేంద్ర మల్లాను సీఎం కలిశారు. జూమ్‌కార్ సీఈవో, కో-ఫౌండర్ గ్రెగ్ మోరన్‌తో చర్చలు జరిపారు. యునెస్కో ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. యూఏఈకి చెందిన సెక్రటరీ అబ్దుల్లా అహ్మద్ అల్ షాతో ప్రత్యేకంగా సమాలోచనలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను సమీక్షించి కార్యచరణను సిద్ధం చేయాలని షాను కోరారు. తర్వాత గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులతో, యూఎస్ఐబీసీ డైరెక్టర్ అమీ హరియాణీ, ఆ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ వ్యవహారాల అధిపతి మైరన్ బ్రిలియంట్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆటోమోటివ్ సెషన్, టూరిజం సెషన్‌లో బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పొదుపు పథకాల అమలులో ప్రత్యేక సహాయ సహకారాలను అందిస్తున్న కేంద్రప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అధికారులతో సమావేశమయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు ఓడరేవును నిర్మించేందుకు ముందుకు వచ్చిన అదానీ గ్రూప్ అధిపతులతో భేటీలో రాష్ట్ర ప్రాధాన్యాలను స్పష్టం చేశారు.

గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ..

పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు 'చార్టింగ్ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ'ని సీఎం ప్రారంభించారు. విశాఖలో వ్యాపార కార్యకలాపాలను విస్తృతపరచనున్న లులూ గ్రూప్‌తో సమావేశమయ్యారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్లీనరీ సెషన్‌లో పాల్గొన్నారు.



గూగుల్‌తో ఎంవోయూ

సదస్సు సందర్భంగా గూగుల్ డెమో జరిగింది. గూగుల్‌తో ఐటీ శాఖ అధికారులు అవగాహన ఒప్పందం (ఎంవో యూ) కుదుర్చుకున్నారు. రష్యాకు చెందిన రోసటామ్‌తో సీఎం సమావేశమయ్యారు. థాయ్‌లాండ్ వాణిజ్య శాఖ ఉపమంత్రి చుతిమ బున్యాప్రఫాసరాతో చర్చలు జరిపారు. పీటర్ వెస్టర్‌బక్ నేతృత్వంలోని ఫిన్‌లాండ్ ఎడ్-టెక్ కంపెనీలతో, మొరాకో సెక్రటరీ రాకియా ఎడ్డర్‌హమ్‌తో భేటీ అయ్యారు.

పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు 'చార్టింగ్ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ'ని సీఎం ఈ సందర్భంగా ప్రారంభించారు. విశాఖలో వ్యాపార కార్యకలాపాలను విస్తృతపరచనున్న లులూ గ్రూప్‌తో సమావేశమయ్యారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ ప్లీనరీ సెషన్‌లో పాల్గొన్నారు.

గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ..

ఈ దఫా ఆచితూచి..

రాష్ట్ర విభజన జరిగాక తొలిసారిగా 2016 జనవరిలో విశాఖలో పారిశ్రామిక సదస్సును నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే యత్నంలో భాగంగా.. అన్ని రంగాల్లోని వారితోనూ అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. 290 కంపెనీలతో రూ.3,44,201 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. 2017లో 586 ప్రాజెక్టులు రూ.7,65,994 కోట్ల మేర పెట్టుబడులు పెడతామంటూ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. మొదటి రెండేళ్లలో.. పారిశ్రామిక పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న కంపెనీలతో అవగాహన కుదుర్చుకునేందుకు ఉత్సాహం చూపిన పరిశ్రమల శాఖ.. మూడో ఏట మాత్రం.. ఆచితూచి వ్యవహరిస్తూ భారీ మెగా పెట్టుబడులపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించింది. సదస్సు జరిగే మూడు రోజుల్లో 18 శాఖల ద్వారా.. రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా.

77ఎంవోయూలు... 31,546కోట్ల పెట్టుబడులు

విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ సదస్సులో మొదటిరోజు రూ.31,546 కోట్ల విలువైన 77 ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఎంవోయూల ద్వారా 98,291 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. మొత్తంమ్మీద 3లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశముందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చిరునామాలు లేని కంపెనీలు వస్తున్నాయనేది అవాస్తవమని, ప్రభుత్వాలకు చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో 21 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.

తొలిరోజు 77 ఎంవోయూలు

రంగం	ఎంఓయూలు	పెట్టుబడులు	ఉద్యోగాలు
ఆటోమొబైల్	14	14124	47368
పర్యాటకం	56	7807	33123
మౌలిక సదుపాయాలు	3	6600	14000
పరిశ్రమలు	4	3015	3800
మొత్తం	77	31546	98291

విమానాశ్రయాల్లో అవమానాలు

పడుతున్నాం

కేంద్రమంత్రి వద్ద సింగపూర్ వ్యాపారవేత్త ఆవేదన

'ఎయిర్ సేవ'లో ఫిర్యాదు చేయండి: మంత్రి అశోక్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని విమానాశ్రయాల్లో కస్టమ్స్, ఎయిర్‌లైన్స్ సిబ్బంది ప్రయాణికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని, వారికి తగిన మర్యాద ఇవ్వడం లేదని సింగపూర్‌కు చెందిన వ్యాపారవేత్త చంద్ర. కె వాపోయారు. సీఐఐ సదస్సుకు వచ్చిన ఆయన కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు ముందు తన ఆవేదన వ్యక్తంచేశారు. ల్యాప్‌టాప్, క్యారీబ్యాగ్‌తో వస్తే లగేజీ ఎక్కువగా ఉందని ఆపేస్తున్నారని, హ్యాండ్ బ్యాగ్‌ను కూడా లగేజీకి పంపించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. సింగపూర్ నుంచి వచ్చిన తనకు ఇక్కడి అధికారులు తిరుపతి లడ్డు ప్రసాదంగా ఇచ్చారని, దాన్ని విమానంలో తీసుకువెళితే బరువు ఎక్కువ ఉందని అభ్యంతరం చెబుతారన్నారు. ఈ విషయంలో ఇండిగో సంస్థ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి , విమాన ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం 'ఎయిర్ సేవ' పేరుతో యాప్‌ను నిర్వహిస్తున్నామని, అందులో ఫిర్యాదులు నమోదు చేస్తే సరైన సమయంలో పరిష్కరిస్తామని వివరించారు.

రాష్ట్రంలో విమానాల

ఓవర్ హాలింగ్!

» భోగాపురంలో ఏర్పాటుకు యత్నాలు : అశోక్ గజపతిరాజు వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో విమానాల ఓవర్ హాలింగ్ సదుపాయం కల్పనకు ప్రయత్నిస్తున్నట్లు పౌర విమానయాన మంత్రి అశోక్ గజపతిరాజు వెల్లడించారు. విశాఖలో శనివారం ప్రారంభమైన సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. భారతదేశానికి చెందిన విమానాలను ఓవర్ హాలింగ్ కోసం సింగపూర్, దుబాయ్, శ్రీలంక దేశాలకు పంపుతున్నామని, వీటికి ఏటా రూ.4,867 కోట్లు (75 కోట్ల డాలర్లు) చెల్లిస్తున్నామన్నారు. భోగాపురంలో నూతనంగా ఏర్పాటుచేసే గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో మరమ్మతులు, ఓవర్ హాలింగ్ సదుపాయం కల్పించడానికి ప్రతిపాదించామని, దీనివల్ల ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని తెలిపారు. దేశంలో విమానాలను కేవలం ప్రయాణికుల కోసం వినియోగిస్తున్నామని, వీటిని కార్గో రవాణాకు కూడా వినియోగిస్తే గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో ఎయిర్‌కార్గోకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని ఈ ప్రాంత వ్యాపారులు వినియోగించుకోవాలని సూచించారు. దేశంలో 476 ఎయిర్‌స్ట్రిప్‌లను ఉపయోగించుకుంటున్నామని, బొబ్బిలి సమీపాన బాడంగి ఎయిర్ స్ట్రిప్‌ను తూర్పు నౌకాదళం శిక్షణ కోసం రాత్రివేళ వినియోగించుకుంటోందని పేర్కొన్నారు. డామన్ దయ్యూలో ప్రధాని మోదీ శనివారం హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభించారని పేర్కొన్నారు. సదస్సుల ద్వారా పెట్టుబడుల సాధనలో ఇతర రాష్ట్రాల కంటే ఏపీ అగ్రస్థానంలో ఉందని అశోక్ పేర్కొన్నారు. సీఐఐ ఉమ్మడి ఏపీలో ఆరుసార్లు పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తే నవ్యాంధ్రలో ఒక్క విశాఖలోనే మూడుసార్లు నిర్వహించడం దీనికి నిదర్శనమన్నారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక రాయితీల ప్రస్తావన కూడా బాగా తగ్గిపోయిందని తెలిపారు.

మై ఫ్రెండ్.. మై లీడర్.. మై ఇన్‌స్పిరేషన్

'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్' సదస్సులో అశోక్‌గజపతిరాజు ప్రసంగిస్తూ.. చంద్రబాబు 'మై ఫ్రెండ్.. మై లీడర్.. మై ఇన్‌స్పిరేషన్' అని ప్రకటించారు. నవ్యాంధ్ర ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. చంద్రబాబు నిరంతరం శ్రమిస్తూ రాష్ట్రాన్ని విజయపథంలోకి తీసుకొచ్చారని తెలిపారు. దేశ ప్రగతి సింగిల్ డిజిట్‌లో వుంటే.. ఏపీ రెండెంకెల వృద్ధి నమోదు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని పారదర్శకంగా ఉంటాయన్నారు.

తొలిరోజు సదస్సులో జరిగిన భారీ ఒప్పందాల్లో కొన్ని..

ఒప్పందం చేసుకున్న శాఖ	పరిశ్రమ	పెట్టుబడులు రూ.కోట్లలో	ఉపాధి	ప్రాజెక్టు ఓవర్ వ్యూ
పరిశ్రమలు	సినర్జీ కేస్టింగ్స్	7000	14000	అల్యూమినియం అల్లాయ్ వీల్స్
పరిశ్రమలు	ఎంఆర్ఐ టైర్స్	1020	2400	టైర్ల తయారీ
పరిశ్రమలు	మేగ్నమ్ పైరెక్స్ ఏజీ, జర్మనీ	350	1000	ఎలక్ట్రిక్ వాహనాలు
పరిశ్రమలు	మదర్‌సన్ (కెఐఎంఎల్)	200	3000	ఆటోమొబైల్
ఇంధనశాఖ	జేబీఎం గ్రూప్	2650	16700	ఎలక్ట్రికల్ మొబిలిటీ, సోలార్ పవర్ జనరేషన్, ఆటో కాంపోనెంట్
ఈడీబీ	సన్ మొబిలిటీ	1670	2220	ఇంట్రో ఆపరబుల్ ఈవీ చార్జింగ్/స్వాపింగ్ ఇన్‌ఫ్రా
ఇండస్ట్రీస్	గ్రాసిమ్	1000	500	క్లోర్ ఆల్కలీ కాంప్లెక్స్ కాకినాడ
ఇన్‌ఫ్రా	అదానీ పోర్ట్స్	4000	1000	భావనపాడు పోర్టు నిర్మాణం
ఇన్‌ఫ్రా	లులు షాపింగ్‌మాల్ ప్రైవేట్ లిమిటెడ్	1500	3000	విశాఖలో కన్వెన్షన్ సెంటర్

ప్రాజెక్టులకు అనుమతులు వేగవంతం: మీనా

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల అనుమతుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని పర్యాటక కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. ఒక్కో పెద్ద ప్రాజెక్టుకు ఒక లైజన్ అధికారిని నియమిస్తామని, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా 'స్ట్రాటజీస్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ ఇన్ ఎమర్జింగ్ టూరిస్ట్ డెస్టినేషన్స్ ఆఫ్ ఏపీ' అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మధురవాడ, భవానీ ఐలాండ్స్, కాకినాడ స్వదేశీ దర్శన్, రాజమండ్రి హేవలాక్ బ్రిడ్జి, గండికోట, విశాఖ ఐఎన్ఎస్ విరాట్‌పై ప్రధానంగా ఫోకస్ చేస్తున్నామని తెలిపారు.

మైనింగ్ లైసెన్సులకు కొత్తవిధానం

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ లైసెన్సుల జారీకి కొత్త విధానాన్ని తీసుకొచ్చామని గనులు-భూగర్భ వనరులశాఖ డైరెక్టర్ బి.శ్రీధర్ తెలిపారు. విశాఖలో పెట్టుబడుల సదస్సుకు హాజరైన ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ దీనిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పర్మిట్‌ను అనుసంధానం చేయాలని చూస్తున్నామని, మూడు నెలల్లో దాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. తమ శాఖ వార్షిక లక్ష్యం రూ.2,000 కోట్లని, అందులో రూ.1700 కోట్లకు చేరుకున్నామని, సమయానికి లక్ష్యం పూర్తిచేస్తామని చెప్పారు. క్వారీల పర్యవేక్షణకు విజిలెన్స్‌ను ఎంతో పటిష్టం చేశామని చెప్పారు.

చుక్కల్లో విమాన టికెట్ల ధరలు

ఎన్‌ఏడీ జంక్షన్(విశాఖపట్నం), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సీఐఐ సదస్సు నేపథ్యంలో విమాన టికెట్ చార్జీలు ఆకాశాన్నంటాయి. ఢిల్లీ నుంచి విశాఖ వచ్చేందుకు శనివారం టికెట్ ధర రూ.58వేలు ఉండగా, ఆదివారం రూ.32వేలకు చేరుకుంది. అదేవిధంగా హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చేందుకు శనివారం టికెట్ ధర రూ.25వేలు కాగా, ఆదివారం రూ.17వేలు ఉంది. ఇక విశాఖ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు శనివారం టికెట్ ధర రూ.56వేలకు చేరగా, ఆదివారం రూ.23వేలుగా ఉంది. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు శనివారం ధర రూ.16వేలు ఉండగా, ఆదివారం రూ.13వేలు ఉంది. ఇంత ధర వసూలు చేస్తున్నప్పటికీ విమానాలన్నీ ఫుల్ అయిపోవడం విశేషం.

పురోభివృద్ధి దిశగా

నవ్యాంధ్రప్రదేశ్

కేపీఎంజీ కన్సల్టెన్సీ సంస్థ నివేదిక

విడుదల చేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్య



సీఐఐ సదస్సు వేదికపై వెంకయ్య, చంద్రబాబు చిరునవ్వులు

(విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నవ్యాంధ్ర ప్రదేశ్ అత్యంత వేగంగా పురోభివృద్ధిని సాధిస్తోందని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ వెల్లడించింది. రాష్ట్ర అభివృద్ధిపై ఈ సంస్థ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు వేదికపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. గోదావరి- కృష్ణా నదుల అనుసంధానాన్ని ఏపీ ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసిందని ఈ నివేదిక ప్రశంసించింది. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు సురేశ్ ప్రభు, అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర మంత్రి ఎన్.అమర్నాథరెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- సగటున 9నుంచి 9.5ఎంయూ సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.
- మున్సిపల్ ఘనవ్యర్థాలతో 63మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు
- రోజుకు 137 ఎంయూ విద్యుత్ వినియోగం.
- ఓడరేవులద్వారా 3,50,000 టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరుగుతోంది.
- 11,962 ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు సేవలు
- ఈవోడీఈలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది.
- గ్లోబల్ లీడర్‌షిప్, సామాజిక సేవలో సీఎం చంద్రబాబుకు గ్లోబల్ పీకాక్ అవార్డు వచ్చింది
- ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నం.1.
- ఇంధన పొదుపు, సామర్థ్యం, నష్టాల తగ్గింపులోనూ మొదటి స్థానంలో ఉంది.
- రొయ్యల ఉత్పత్తి, తయారీ రంగంలో మూడో స్థానంలో ఉంది.
- మెరైన్ ఎగుమతులు, బెరైటీస్ ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉంది.
- కేంద్రం నుంచి అత్యుత్తమ పర్యాటక రంగ అవార్డును అందుకుంది.
- ప్రపంచ స్థాయి రాజధాని నగర నిర్మాణంలో ముందంజలో ఉంది.
- 13విశ్వవిద్యాలయాలు, 8 ప్రముఖ సంస్థలతో విద్యాకేంద్రంగా ఉంది.
- నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలను అందిస్తోంది.
- విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్‌లు రానున్నాయి.

ఎలక్ట్రిక్ కార్లదే భవిష్యత్

భాగస్వామ్య సదస్సు అంచనా

(విశాఖ భాగస్వామ్య సదస్సు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంప్రదాయ వాహనాలకు చెల్లుచీటీ పడనుందని.. మరో ఐదేళ్లలోనే దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లు రోడ్లపై చక్కర్లు కొడతాయని విశాఖ భాగస్వామ్య సదస్సు అంచనా వేసింది. ఆటోమొబైల్ రంగంపై జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, కార్ల తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ రంగానికి చెందిన నిషాంత్ ఆర్యా, అబ్దుల్ మత్లలబ్ అహ్మద్, సురేశ్ చెత్తయర్, విష్ణు మాథుర్, మనోహర్ భట్ తదితరులు వేదికపై నుంచి ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. కేంద్రం తీసుకురానున్న నూతన విధానాలతో ఎలక్ట్రిక్ కార్ల తయారీదార్లకు ప్రోత్సాహకాలు అందుతాయని, త్వరలోనే బ్యాటరీ చార్జింగ్, నిల్వ సామర్థ్యమూ పెరుగుతాయని వక్తలు వివరించారు.

భాగస్వామ్య సదస్సులో..

కియా కార్ల సందడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో కియా కార్లు సందడి చేశాయి. ప్రత్యేకంగా ప్రదర్శనకు ఏర్పాటు చేసిన కియా కార్లు స్వదేశీ, విదేశీ ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కొరియాకు చెందిన ఈ కంపెనీ అనంతపురంలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కంపెనీ ప్రతినిధులు భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి 3 మోడల్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. కియా నిరో హైబ్రిడ్ మోడల్ పెట్రోల్, ఎలక్ట్రికల్ వెర్షన్‌లో లభిస్తుండగా.. దీని ధర సుమారు రూ.25 లక్షలని ప్రతినిధులు తెలిపారు. సోల్ ఈవీ మోడల్ ఎలక్ట్రికల్ వెర్షన్‌లో డిజైన్ చేయగా, దీని ఖరీదు సుమారు రూ.35 లక్షలు వరకు ఉంది. ఇక స్ట్రింగర్ పెట్రోల్ వెర్షన్ ధర రూ.55 లక్షల వరకు ఉంది. ఇది ఎరుపు రంగులోనూ, మొదటి రెండు కార్లు తెలుపు రంగులోనూ మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. కియా కార్ల వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ప్రతినిధులు సందడి చేశారు.

నవ్యాంధ్రలో హైపర్‌లూప్ రవాణా!

» అమరావతి నుంచి విజయవాడ వరకు పైలట్ ప్రాజెక్టు

» 'ఆంధ్రజ్యోతి'తో హైపర్‌లూప్ చైర్మన్ బిబాప్ గ్రెస్టా



విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన హైపర్‌లూప్ రవాణా సదుపాయం నవ్యాంధ్రలో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ప్రత్యేక పిల్లర్ల ఏర్పాటు ద్వారా ఒక సొరంగ మార్గాన్ని రూపొందిస్తారు. తొలిదశలో రాజధాని అమరావతి నుంచి గుంటూరు మీదుగా విజయవాడ వరకు సుమారు 40కిలోమీటర్ల పొడవున హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ ఏర్పాటుకు యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ దేశానికి చెందిన హైపర్ లూప్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీస్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం(ఎంఓయూ) చేసుకుంది. భాగస్వామ్య సదస్సుకు హాజరైన హైపర్ లూప్ సంస్థ చైర్మన్, సహ వ్యవస్థాపకుడు బిబాప్ గ్రెస్టా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్ర: హైపర్ లూప్ అంటే...?

జ: భూమిపై ప్రత్యేకంగా పిల్లర్లు ఏర్పాటుచేయడం ద్వారా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి అత్యంత వేగంగా చేరేందుకు ఉపయోగపడే రవాణా వ్యవస్థ. ఇప్పటికే అమెరికాలో లాస్‌ఏంజిల్స్‌లో ఈ రవాణా వ్యవస్థ వినియోగంలో ఉంది. మా సంస్థకు 42 దేశాల్లో 920 మంది సాంకేతిక నిపుణులు అందుబాటులో ఉన్నారు. వీటి గరిష్ఠ వేగం గంటకు 1,225 కిలోమీటర్లు.

ప్రశ్న: ఇది విద్యుత్ ఆధారంగా నడుస్తుందా?

జ: హైపర్ లూప్ రవాణా సదుపాయం పూర్తిగా సౌరవిద్యుత్ ఆధారంగానే నడుస్తుంది. ఈ వాహనం ఆధారంగా ఉత్పత్తయ్యే సౌర విద్యుత్‌ను ఇతర అవసరాలకు వినియోగించుకొంటే రవాణాకు తక్కువ ధర నిర్ణయించే అవకాశం ఉంది.

ప్రశ్న: ఈతరహాది భారత్‌లో ఎక్కడుంది?

జ: ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ లేదు. ముంబై నుంచి పుణె మధ్య సర్వే పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ప్ర: నవ్యాంధ్రలో ఏర్పాటు ఆలోచన ఎలా వచ్చింది?

జ: ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రవాణా వ్యవస్థను కొత్త రాజధానిలో అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు భావించారు. ఇందులో భాగంగా ఇప్పటికే అమరావతి నుంచి విజయవాడ వరకు 40 కిలోమీటర్ల పొడవున పైలట్ ప్రాజెక్టు కింద హైపర్‌లూప్ రవాణా సదుపాయం కల్పించేందుకు సర్వే పూర్తిచేసి గతేడాది సెప్టెంబరులోనే ప్రభుత్వానికి డీపీఆర్ అందజేశాం. అదే నెల ఎంఓయూ కుదిరింది.

ప్ర: ప్రాజెక్టు విలువ ఎంత..?

జ: ఒక కిలోమీటరుకు 15-20 బిలియన్ డాలర్లు ఖర్చవుతుంది. దీనిలో ప్రభుత్వాలు 30శాతం భరిస్తే, మిగిలిన 70శాతం సంస్థ సమకూర్చుతుంది.

ప్ర: ఏపీ వంటి రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు సాధ్యమేనా?

జ: ఏపీ పరిధిలో దాదాపు అన్ని జిల్లాల్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాం. తెలుగు రాష్ట్రాల్లో 500 కిలోమీటర్ల పొడవున హైపర్‌లూప్ వ్యవస్థ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి.



మైదాన్
MYDAN
విజయవాడ • ఆదివారం 25 ఫిబ్రవరి 2018

భార్య అండగా.. బాడీ బిల్డింగ్‌లో అత్యుత్తమంగా!


భార్య అపర్ణతో సుధీర్ కుమార్

అది పంజాబ్ లూథియానాలో అంతర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీలు జరుగుతున్న ప్రాంతం. అనేక దేశాల నుంచి వందల సంఖ్యలో బాడీబిల్డర్స్ పోటీకి వచ్చారు. భారత్ నుంచి నలభై మంది బరిలో నిలిచారు. ఎంతో క్లిష్టమైన పోటీ ఎదురైనా తట్టుకొని నిలబడ్డ ఓ యువకుడు రజతం, కాంస్యం నెగ్గాడు. పోటీలు ముగియగానే.. తన భార్యతో కలిసి ఆనందాన్ని పంచుకున్నాడు. ఆ టోర్నీకి హాజరైన ఓ అధికారి.. ఆ ఇద్దరినీ పలుకరించగా భర్తకు పెద్దగా ఇంగ్లిష్ రాకపోవడంతో భార్య అనర్గళంగా సమాధానం చెబుతోంది. భర్త గురించి వివరిస్తూనే.. ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకోలేక ఆనందభాష్పాలు రాలుస్తోంది. ఆమెను ఓదారుస్తూ.. గతనెలలోనే తమకు పెళ్లి అయిందని ఆ బాడీబిల్డర్ అంటే... వెంటనే అతనికి ఉద్యోగం లేదన్న కారణంతో పెళ్లికి నిరాకరించిన పెద్దలను ఎదిరించి మరీ ఒక్కటయ్యామని ఆమె తెలిపింది. 'ఉద్యోగం లేకపోతేనేం.. మీ భర్తకు పతకాలు ఉన్నాయి కదా.. అది ఉద్యోగం కంటే ఎక్కువ' అని అనగానే ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోయింది. 'వండర్‌ఫుల్ కపుల్ ఫ్రమ్ ఆంధ్ర. తొలి ప్రయత్నంలోనే అతను రెండు పతకాలు సాధించాడు. ఆమె చాలా ఆనందంగా ఉంది' అంటూ ముగించాడు. ఇప్పుడీ సెల్ఫీ వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఆ వీడియోలో ఉన్న తెలుగు బాడీబిల్డర్ కె. సుధీర్ కుమార్. అతడికి అండగా నిలిచింది భార్య అపర్ణ. వాళ్లది కర్నూలు జిల్లా పాణ్యం మండలం బలపనూరు గ్రామం.

అసలు బాడీ బిల్డర్ కావాలన్నది సుధీర్ కుమార్‌కు ముందు నుంచి లక్ష్యం కాదు. నంద్యాలలో ఇంజనీరింగ్ చదువుతుండగా ఓసారి అమెరికా బాడీ బిల్డర్ రోనీ కోల్‌మన్ బాడీ బిల్డింగ్ ప్రదర్శన ఇచ్చిన ఫొటోలు సుధీర్‌ను ఎంతగానో ఆకర్షించాయి. కోల్‌మన్ శరీర సౌష్టవం చూసి అతనిలా తానూ తయారవ్వాలన్న తపన మొదలైంది. అంతే బీటెక్ మధ్యలోనే వదిలేశాడు. పుస్తకాలను అటకెక్కించి.. క్యాంపస్‌కు గుడ్‌బై చెప్పి.. జిమ్‌వైపు అడుగులు వేశాడు. సాధారణ వ్యాయామశాలల్లోనే పగలూ రేయి కష్టపడుతూ తన శరీరాన్ని ఉక్కులా మార్చుకున్నాడు. చదువు మానేసినందుకు తల్లిదండ్రులు మందలించారు. బాడీ బిల్డింగ్ అన్నం పెడుతుందా అని హెచ్చరించారు. 'వచ్చాడ్రా పెద్ద బాడీబిల్డర్' అంటూ ఇరుగుపొరుగు హేళన చేశారు. అయినా.. అతను తన సంకల్పాన్ని వీడలేదు. మరింత కసిగా కష్టపడ్డాడు. బాడీ బిల్డింగ్ అంటే చూసినంత ఈజీ కాదు. గంటల కొద్దీ జిమ్‌లో చెమటోడ్చాలి. ఎంతో శారీరక శ్రమకు ఓర్చాలి. బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. పక్కా డైట్ పాటించాలి. కానీ, సరిపడా డబ్బు లేకపోవడంతో ఉన్న దానితో అడ్జెస్ట్ అవుతూ వచ్చాడు సుధీర్. అక్కాబావ, పెదనాన్నతో పాటు గురువు కృష్ణ చైతన్య సహకారంతో కాంపిటీషన్లలో బరిలోకి దిగేలా శరీరాన్ని తీర్చిదిద్దుకున్నాడు. 2015లో జరిగిన మిస్టర్ రాయలసీమ టైటిల్ గెలిచాడు. తొలి ప్రయత్నంలో విజేతగా నిలవడం తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అక్కడినుంచి అతను వెనుదిరిగింది లేదు. నవంబర్‌లో మిస్టర్ ఆంధ్రలో రన్నరప్‌గా నిలిచి.. తర్వాతి ఏడాది టైటిల్ నెగ్గాడు. గతేడాది మార్చిలో కేరళలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో తలపడ్డాడు. పతకం రాకపోయినా.. దేశం నలుమూలల నుంచి వచ్చిన బాడీ బిల్డర్లతో పోటీ పడడం.. మంచి ప్రదర్శన చేశావన్న జడ్జీల అభినందన అతనికి దక్కింది. ఆ ఉత్సాహంతో అంతర్జాతీయ పోటీలకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడు. అలా లూథియానా పోటీల్లో బాడీబిల్డింగ్‌లో రజతం, పురుషుల ఫిజిక్‌లో కాంస్యంతో మెరిసి తన సత్తాను దేశ వ్యాప్తంగా తెలిసేలా చేశాడు.

ఆమె సహకారంతో..

ఈ టోర్నీకి వెళ్లేముందు సుధీర్ జీవితంలో కీలక పరిణామం అతణ్ణి కొన్ని రోజులు మానసిక సంఘర్షణకు గురి చేసింది. ఆ పరిణామం... ప్రేమించిన అమ్మాయితో అతని పెళ్లి. బాడీ బిల్డర్‌గా రాణిస్తున్నా ఉద్యోగం లేకపోవడంతో అతనితో పెళ్లికి అపర్ణ తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. ఎంత బతిమాలినా ఒప్పుకోలేదు. సుధీర్ భవిష్యత్‌లో కచ్చితంగా ఉన్నత స్థాయికి చేరుకుంటాడన్నది అపర్ణ నమ్మకం. అందుకోసం అతని పక్కన తాను నిలబడాలని నిశ్చయించుకుంది. ఇద్దరూ పెద్దలను ఎదిరించి మరీ పెళ్లి చేసుకున్నారు. జనవరి 19న వివాహం జరిగితే ఈ నెల పదో తేదీన హడావిడిగా లూథియానాలో సుధీర్ టోర్నీలో పాల్గొనాల్సివచ్చింది. ఇక, ఆ టోర్నీకి హాజరైన వివిధ దేశాల క్రీడాకారులు స్టార్ హోటళ్లలో బస చేశారు. ఖరీదైన వాహనాల్లో పోటీలకు వచ్చారు. ఈ ఏర్పాట్లన్నీ వారి స్పాన్సర్స్.. ఆయా దేశాల ప్రభుత్వాలు చూసుకున్నాయి. కానీ, సుధీర్‌కు ప్రభుత్వ సాయం లేదు.. స్పాన్సర్ల అండా లేదు..! అతని వెనకున్నది.. తానేంటో తెలిసి అండగా నిలిచింది.. భార్య అపర్ణ మాత్రమే. ఆమెతో కలిసే బస చేసిన లాడ్జీ నుంచి పోటీలు జరిగే స్టేడియానికి వచ్చాడు. కానీ, మిగతా పోటీదారులు.. కార్లలో దిగడం.. వారి వెనకున్న హడావిడి చూస్తుంటే సుధీర్‌లో కొంతటెన్షన్ మొదలైంది. ఈ పోటీని తట్టుకోగలమా అనే భయం మొదలైంది. "ఏం ఫర్లేదు.. ధైర్యంగా ముందుకెళ్లు.. ఆత్మవిశ్వాసంతో పోటీ పడు... విజయం నీదే" అని భార్య వెన్నుతట్టింది. అంతే.. ఆమె ప్రోత్సాహంతో ముందుకెళ్లిన సుధీర్.. రెండు పతకాలతో ధీరుడిలా తిరిగొచ్చాడు. గతంలో చదువుకోకుండా ఈ బాడీ బిల్డింగ్ ఏంటీ అని నిరుత్సాహ పరిచిన వాళ్లే ఇప్పుడు సుధీర్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. మన గ్రామం.. జిల్లాకు పేరు తెచ్చావని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. సన్మానాలు చేస్తున్నారు.

కానీ, ఇలా అంచనాలు పెరిగిపోవడంతో భవిష్యత్ టోర్నీల్లో రాణించకపోతే ఎలా అన్న ఒత్తిడి అతనిపై పెరుగుతోంది. ఎంత ప్రతిభ ఉన్నా.. అంతర్జాతీయ టోర్నీల్లో రాణించాలంటే మెరుగైన శిక్షణ కావాలి. అందుకు విదేశాల్లో శిక్షణ తీసుకోవాలన్నా, పోటీలకు వెళ్లాలన్నా డబ్బు కావాలి. కానీ, అతని వద్ద పతకాలు తప్పితే కాసులు లేవు. ఓ కళాశాలలో కోచ్‌గా ఉద్యోగంతో నెలకు 15వేల జీతం వస్తే ఖర్చులు 35వేలు అవుతున్నాయని సుధీర్ చెబుతున్నాడు. ఇప్పటికే.. ఆస్ట్రేలియా కోచ్ హరిసింధ్‌తో ఆన్‌లైన్‌లో శిక్షణకోసం ఐదునెలలకు 80వేల ఫీజు కోసం కష్టపడాల్సి వస్తోందని అంటున్నాడు. తాను అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకున్నానని.. అందుకు ప్రభుత్వం.. దాతల సహకారం కావాలని అంటున్నాడు. భార్య అండగా నిలిస్తేనే సుధీర్ తొలి అంతర్జాతీయ టోర్నీలో రెండు పతకాలు సాధించాడు. అతనికి ప్రభుత్వం అండగా ఉంటే మరింత ఎత్తుకు ఎదుగుతాడనడంలో సందేహం లేదు.

ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం

స్పిన్ మిస్సైల్

వయసు 19 ఏళ్లే. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతనో సంచలనం..! తన మణికట్టు మాయాజాలంతో సింగిల్స్ తీసినంత సులువుగా వికెట్లు పడగొడుతూ.. రికార్డులు కొల్లగొట్టేస్తున్నాడు. ఇంతితై.. అన్నట్టుగా వన్డేల్లో నెంబర్ వన్ బౌలర్‌గా ఎదిగాడు. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ బుమ్రాతో కలిసి అతను అగ్రస్థానం పంచుకున్నాడు. వన్డేల్లో నెంబర్ వన్ ర్యాంక్ అందుకున్న అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. డాన్ బ్రాడ్‌మన్, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలను సైతం అధిగమించాడు. ఆల్‌రౌండర్లలో నాలుగో స్థానంలో.. టీ-20 బౌలర్ల జాబితాలో రెండో ర్యాంక్‌లో ఉన్న అతణ్ణి తమ జట్టులో ఆడించడం కోసం ఐపీఎల్, బిగ్‌బాష్ సహా ప్రపంచ వ్యాప్తంగా అన్ని లీగ్‌లూ పోటీ పడుతున్నాయిప్పుడు..! పాక్ క్రికెటర్ షాహిద్ అఫ్రీది స్ఫూర్తితో.. గతేడాది వరకూ ఐసీసీ అనుబంధ సభ్య దేశంగా ఉన్న అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చి.. ప్రపంచ క్రికెట్‌పై చెరగని ముద్రవేయాలనుకుంటున్న ఆ స్పిన్ గన్ పేరు రషీద్ ఖాన్..! 'అఫ్ఘాన్ అఫ్రీది' అన్నది ఖాన్ ముద్దు పేరు..! కానీ, ఇప్పుడు రషీద్ అంటే రషీదే అనేలా ఉంది అతడి జోరు చూస్తే..!

గతేడాది జూన్ 9. వెస్టిండీస్ పర్యటనలో తొలి వన్డేలో అఫ్ఘాన్ 212 పరుగులకే ఆలౌటైంది. స్వల్ప ఛేదనలో విండీస్ ఓ దశలో 68/2తో సులభంగానే గెలిచేలా కనిపించింది. కానీ, 81 పరుగుల తేడాతో చివరి ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 149 రన్స్‌కే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. కారణం.. రషీద్ ఖాన్ మాయాజాలమే. ఆ 8 వికెట్లలో ఖాన్ ఏడు వికెట్లు దక్కించుకున్నాడు. రషీద్ (8.4-1-18-7) దెబ్బకు కరీబియన్ల బ్యాటింగ్ కకావికలమైంది. కీలక ఆటగాళ్లు లేకనే వెస్టిండీస్ తడబడిందని అనుకోవచ్చు. కానీ, సొంతగడ్డపై ఆ జట్టు ప్రమాదకారే. అంటే.. రషీద్ బౌలింగ్‌కు ఆ జట్టు దాసోహమైనట్టే లెక్క. రషీద్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ బౌలింగ్. అంతర్జాతీయ క్రికెట్‌లో అతని పేరు ప్రముఖంగా వినిపించడం మొదలైంది ఈ స్పెల్‌తోనే..!

మూడు నెలల ముందు గ్రేటర్ నోయిడాలో ఐర్లాండ్‌తో టీ-20 మ్యాచ్. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 11 ఓవర్లలో 111 పరుగుల లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఆరు ఓవర్లకు 68/3తో గెలుపు దిశగా వెళ్తోంది. కానీ, రషీద్ (2-1-3-5) రాకతో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. చివరకు ఆ జట్టు 93/9 స్కోరుతో ఓడిపోయింది. టీ-20ల్లో అతని కెరీర్ బెస్ట్‌గా నిలిచిన ఈ స్పెల్.. పొట్టి ఫార్మాట్‌లో టాప్-5 బౌలింగ్ ప్రదర్శనల్లో ఒకటి. పరిమిత ఓవర్లలో రషీద్ ఎంత ప్రమాదకరమో చెప్పేందుకు ఈ రెండు ఉదాహరణలు చాలు. ఇవే కాదు అంతకుముందు.. తర్వాత అతను ఇలాంటి సంచలన ప్రదర్శనలు ఎన్నో చేశాడు. గత ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ అప్పటి నెంబర్ వన్ బౌలర్ ఇమ్రాన్ తాహిర్‌ను కాదని ఖాన్‌ను నాలుగు కోట్లకు కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిస్తే.. 17 వికెట్లతో రైజర్స్ ప్లే ఆఫ్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. బీబీఎల్‌లో తన జట్టు అడిలైడ్ స్ట్రయికర్స్ విజేతగా నిలవడంలోనూ కీలక పాత్ర పోషించాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్, బంగ్లా ప్రీమియర్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్... ఇలా ప్రపంచ వ్యాప్తంగా అనేక లీగ్‌ల్లో రషీద్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడుతున్నాయి. 19 ఏళ్ల వయసులోనే ఇన్ని లీగ్‌ల్లో ఆడడం సాధారణ విషయం కాబోదు. బ్యాట్‌తోనూ రాణించే అతడు వన్డేల్లో ఐర్లాండ్‌పై రెండు అర్ధ సెంచరీలు చేశాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో అతనిప్పుడు నాలుగో స్థానంలో ఉన్నాడు. టీ-20ల్లో అతని స్ట్రయిక్ రేట్ 129.87.


అఫ్రీదిని ఆరాధించి..: రషీద్‌కు పాకిస్థాన్ దిగ్గజ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రీది అంటే పిచ్చి. అతడి బౌలింగ్ శైలి, వికెట్ తీసినప్పుడు సంబరాలు చేసుకునే తీరు.. అతని హెయిర్‌స్టయిల్.. రషీద్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. అంతే..! అప్పటినుంచి అన్నింటిలోనూ పాక్ స్పిన్నర్‌ను అనుసరించాడు. ఒకరకంగా అఫ్రీదికి ఏకలవ్య శిష్యుడిగా మారాడు. 'అఫ్రీదికి వీరాభిమానిని. పాక్-అఫ్ఘాన్ బోర్డర్‌లో మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన షాహిద్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. మైదానంలో అతను చూపే ఉత్సాహం.. బంతితో బ్యాట్స్‌మెన్‌పై దాడి చేసే విధానం నాకెంతో నచ్చేది. క్రికెటర్‌గా నేను విజయవంతం కావాలంటే అలాంటి ధోరణితోనే ఉండాలని నాకు అప్పుడే అర్థమైంద'ని రషీద్ ఒక సందర్భంలో చెప్పాడు.

షాహిద్ వేగం.. కుంబ్లే స్పిన్..: రషీద్ బౌలింగ్ యాక్షన్‌ను చూస్తుంటే కొన్నిసార్లు సొహైల్ తన్వీర్‌లా రాంగ్ ఫుట్‌పై బౌలింగ్ చేస్తున్నట్టు అనిపిస్తుంది. కానీ, ఖాన్ ఎప్పుడూ లయ తప్పడు. ఒకసారి టీమిండియా లెగ్గీ పీయూష్ చావ్లా కాస్త నెమ్మదిగా బౌలింగ్ చేయమని అతనికి సలహా ఇచ్చాడు. దానికి సరే అన్నా తన సహజసిద్ధ బౌలింగ్‌ను మార్చుకోలేకపోయాడు. మామూలుగా లెగ్ స్పిన్నర్లు వేసే బంతులకంటే వేగంగా బౌలింగ్ చేస్తూ తన గూగ్లీలతో ప్రత్యర్థులను ఏమార్చుతూనే ఉన్నాడు. అలానే నెంబర్‌వన్ బౌలర్‌గా ఎదిగాడు. బంతిని టర్న్ చేయడంలో మాజీ స్పిన్నర్ కుంబ్లేను తలపిస్తాడు. సాధారణ లెగ్ స్పిన్నర్ కంటే ఎక్కువ వేగంతో గిర్రున తిరుగుతూ దూసుకొచ్చే రషీద్ గూగ్లీలకు బ్యాట్స్‌మెన్ వద్ద సమాధానమే ఉండడం లేదు. అలాంటి బౌలింగ్‌తో న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ మెకల్లమ్‌ను కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ఒకసారి రషీద్ ముప్పుతిప్పలు పెట్టాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో ఇప్పటికీ చక్కర్లు కొడుతోంది.

ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం

యుద్ధం ఇచ్చిన స్థైర్యం..

రషీద్ ఆర్థికంగా ఉన్నత కుటుంబంలో జన్మించాడు. పది మంది సంతానంలో తనూ ఒకడు. అఫ్ఘాన్‌లో క్రికెట్‌కు బాగా క్రేజ్ ఉన్న నంగార్‌హర్ అనే ప్రాంతంలో పెరగడంతో చిన్నతనంలోనే అతనికి క్రికెట్ అలవడింది. రషీద్ సోదరులు ఆటవిడుపుగా అతణ్ణి మైదానంలోకి తీసుకెళ్లేవారు. వాళ్లతో సరదాగా మొదలెట్టిన క్రికెట్ అతణ్ణి ఇప్పుడు ఈ స్థాయిలో నిలిపింది. కెరీర్‌లో ఆర్థిక కష్టాలు ఏమీ లేకపోయినా.. అఫ్ఘాన్ యుద్ధం వల్ల రషీద్ కుటుంబం అన్నీ వదిలేసి.. కొన్నేళ్లు పాక్‌కు వెళ్లి తలదాచుకోవాల్సి వచ్చింది. తర్వాత స్వదేశానికి వచ్చి సాధారణ జీవితం కొనసాగించారు. కానీ, ఈ ఘటనతో ఎలాంటి పరిస్థితుల్లో అయినా గుండె నిబ్బరం కోల్పోకూడదని చిన్నవయసులోనే రషీద్‌లో బలంగా నాటుకుపోయింది. అందుకే మైదానంలో అతనెప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోడు. తన దేశంలో సరైన సౌకర్యాలు లేకున్నా.. ఉన్న వాటితో సరిపెట్టుకుంటూ ఒక్కో అడుగు ముందుకేశాడు.


రషీద్ ఖాన్

నెంబర్ వన్ బౌలర్..

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో మెప్పించిన బుమ్రా, జింబాబ్వేపై చెలరేగిన రషీద్ చెరో 787 ర్యాంకింగ్ పాయింట్లతో వన్డే బౌలర్లలో సంయుక్తంగా అగ్రస్థానం దక్కించుకున్నాడు. అయితే, పటిష్ఠ జట్లపైన రాణిస్తున్న బుమ్రా.. కేవలం జింబాబ్వే, ఐర్లాండ్‌లాంటి అనామక జట్లపై వికెట్లు తీసిన రషీద్ ప్రదర్శనలను ఒకే గాడిన కట్టి ర్యాంక్ ఇవ్వడం సమంజసం కాదని కొందరు వాదిస్తున్నారు. తన 35 వన్డేల్లో రషీద్.. జింబాబ్వేతో 17, ఐర్లాండ్‌తో 12, బంగ్లా, విండీస్‌పై మూడేసి మ్యాచ్‌లు ఆడాడు. అయితే, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుత, గత ప్రదర్శనలను.. ఆడుతున్న ప్రత్యర్థిస్థాయిని దృష్టిలో ఉంచుకొని ర్యాంక్‌లు ప్రకటిస్తారు. అందుకే.. బుమ్రా (64) కంటే 22 వికెట్లు ఎక్కువ తీసినా కూడా అఫ్ఘాన్ స్పిన్నర్ అతనితో సమానమైన పాయింట్లు దక్కించుకున్నాడు. కాబట్టి అతను నెంబర్‌వన్ ర్యాంక్‌కు అర్హుడే.

రెండేళ్లలోనే పైపైకి..

దేశవాళీల్లో ప్రకంపనలు సృష్టించిన రషీద్.. అఫ్ఘాన్ జాతీయ జట్టులోకి వచ్చేందుకు ఎంతో సమయం పట్టలేదు. 17వ పడిలోకి అడుగుపెట్టిన నెలరోజుల్లోపే అతను అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. జింబాబ్వేపై తన తొలి వన్డేలో రెండు వికెట్లు తీసి జట్టును గెలిపించాడు. వారం రోజుల తర్వాత అదే జింబాబ్వేపై టీ-20 అరంగేట్రం కూడా చేశాడు. అలా మొదలైన అతని హవా అప్రతిహతంగా సాగుతూ 37 వన్డేల్లో 13.27 ఎకానమీతో 86 వికెట్లు తీసి.. 545 పరుగులు సాధించాడు.

ఛీ.. చాపెల్ !





క్రికెట్ అంటే జెంటిల్మెన్ గేమ్‌గా గుర్తింపు ఉన్నా.. క్రీడాస్ఫూర్తికి తూట్లు పొడిచిన సందర్భాలు అనేకం. అయితే విజయకాంక్షతో ఓ కెప్టెన్ దిగజారుడుతనం రెండుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీయడంతోపాటు క్రికెట్ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయింది. 1981లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య వన్డే సందర్భంగా జరిగింది ఘటన. బెన్సన్ అండ్ హెడ్జెస్ వరల్డ్ సిరీస్ బెస్ట్ ఆఫ్ ఫైనల్ త్రీలో ఆసీస్, కివీస్ 1-1తో సమంగా నిలిచాయి. చివరి మ్యాచ్‌లో ఎవరు నెగ్గితే వారిదే కప్. ఆఖరిఓవర్‌లో కివీస్ విజయానికి 11 రన్స్ కావాలి. ఆసీస్ కెప్టెన్ గ్రెగ్ చాపెల్.. బంతిని తన తమ్ముడు ట్రెవర్ చాపెల్‌కు అందించాడు. మొదటి ఐదు బంతుల్లో 4 రన్స్ చేసిన కివీస్ రెండు వికెట్లు చేజార్చుకుంది. గెలవాలంటే చివరి బంతికి 7 రన్స్ అవసరం. సిక్సర్ కొడితే మ్యాచ్ టై అవుతుంది. శతక బ్యాట్స్‌మన్ బ్రూస్ ఎడ్గర్ (102 నాటౌట్) నాన్ స్ట్రయికర్ ఎండ్‌లో ఉండగా.. టెయిలెండర్ బ్రియాన్ మెకెన్నీ స్ట్రయికర్. ఈ దశలో మ్యాచ్‌ను కోల్పోవడం లేదా టైగా ముగించే అవకాశాలు స్వల్పం. కానీ గ్రెగ్ చాపెల్ తీసుకున్న నిర్ణయం అత్యంత వివాదానికి కారణమైంది. బౌలర్ వద్దకు వెళ్లిన గ్రెగ్.. అండర్ ఆర్మ్ బౌలింగ్ చేసి బ్యాట్స్‌మన్‌ను ఆశ్చర్యానికి గురిచేయమని ఆదేశించాడు. కెప్టెన్ సూచనల మేరకు ట్రెవర్ అలాగే చేశాడు. విస్తుపోయిన బ్రియాన్.. డిఫెన్స్ ఆడిన తర్వాత కోపంతో బ్యాట్‌ను విసిరేశాడు. ఈ ఘటనతో అంతా అవాక్కయ్యారు. అప్పుడు అండర్ ఆర్మ్ డెలివరీ నిబంధనలకు విరుద్ధం కాకపోయినా.. ఆసీస్ క్రీడా స్ఫూర్తికి తూట్లు పొడిచిందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. చాపెల్ చీప్ ట్రిక్స్‌ను రెండు దేశాలకు చెందిన ప్రధానమంత్రులు, అభిమానులు తీవ్రంగా ఖండించారు. ఆ తర్వాత అండర్ ఆర్మ్ బౌలింగ్‌ను ఐసీసీ నిషేధించింది. కానీ, ఆసీస్-కివీస్ క్రికెట్ సంబంధాలపై ఈ ఘటన తీవ్ర ప్రభావం చూపింది.

ఒంటెల కుస్తీ

కోడిపందేలు, ఎద్దుల పందేలు చూశాం. కానీ టర్కీలో ఒంటెల పోటీలు! ..కాదు..కాదు.. ఒంటెల రెజ్లింగ్ పోటీలు జరుగుతాయి. అందంగా ముస్తాబు చేసిన రెండు ఒంటెలను బరిలో దించుతారు. అవి రెండూ భీకరంగా తలపడి వాటిలో ఒకటి గ్రౌండ్ నుంచి పరారైతే లేదా నేలమీద పడిపోతే..రెండో ఒంటెను విజేతగా ప్రకటిస్తారు. ఈక్రమంలో ఒక్కోసారి ఒంటెలు చనిపోతాయి కూడా.



విశ్వ వేదికపై

అరుణ కాంతులు



విశ్వవేదికపై తెలుగమ్మాయి కొత్త చరిత్రను లిఖించింది. హైదరాబాద్ జిమ్నాస్ట్ బుద్దారెడ్డి అరుణా రెడ్డి జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్‌లో తళుక్కున మెరిసింది. అంచనాలే లేకుండా బరిలోకి దిగి అత్యద్భుత ప్రదర్శనతో కాంస్య కాంతులు విరజిమ్మింది. మహిళల వాల్ట్‌లో కాంస్యం నెగ్గి ఈ మెగా టోర్నీలో వ్యక్తిగత పతకం గెలిచిన భారత తొలి క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ జిమ్నాస్ట్‌లతో పోటీలో అసాధారణంగా రాణించి ఆస్ట్రేలియా గడ్డపై త్రివర్ణాన్ని రెపరెపలాడించింది. ఫ్లోర్ విభాగంలోనూ ఫైనల్‌కు అర్హత సాధించిన ఆమె.. ఆదివారం తుదిపోరులో పోటీ పడనుంది.

- వరల్డ్‌కప్‌లో పతకంతో హైదరాబాద్ జిమ్నాస్ట్ చరిత్ర
- ఈ ఘనత సాధించిన భారత తొలి ప్లేయర్‌గా రికార్డు
- నేడు ఫ్లోర్ ఫైనల్లో పోటీ పడనున్న తెలుగమ్మాయి

మెల్‌బోర్న్: హైదరాబాద్ అమ్మాయి అరుణారెడ్డి దేశం గర్వించేలా చేసింది. జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్‌లో కాంస్య పతకం నెగ్గి చరిత్ర సృష్టించింది. అసలేమాత్రం అంచనాలు లేకపోయినా.. టోర్నీ జరుగుతున్న విషయమే చాలా మందికి తెలియకపోయినా.. తన అసమాన ఆటతో అరుణ యావత్ దేశం దృష్టిని తనవైపునకు తిప్పుకుంది. శనివారం జరిగిన మహిళల వాల్ట్ విభాగంలో ఆమె కంచు పతకం నెగ్గింది. 22 ఏళ్ల అరుణ తుదిపోరులో 13.649 సగటు స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 13.666 (డిఫికల్టీ 4.600, ఎగ్జిక్యూషన్ 9.066), రెండో ప్రయత్నంలో 13.633 (డిఫికల్టీ 4.800, ఎగ్జిక్యూషన్ 8.833) స్కోరు చేయగా.. రెండింటి సగటుతో ఆమె మూడో స్థానం దక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ఆమెకు ఇదే తొలి పతకం కావడం విశేషం. స్లొవేనియాకు చెందిన జసా కైస్లెఫ్ 13.800 స్కోరుతో స్వర్ణం, ఆస్ట్రేలియా ప్లేయర్ ఎమిలీ వైట్‌హెడ్ 13.699 స్కోరుతో రజతం గెలుచుకున్నారు. ఇదే విభాగంలో పోటీ పడ్డ భారత్‌కే చెందిన ప్రణతీ నాయక్ 13.416 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. ఇక, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలోనూ అరుణ ఫైనల్‌కు అర్హత సాధించడంతో ఆ టోర్నీలో ఆమె మరో పతకం నెగ్గే అవకాశం ఉంది. ఫ్లోర్ క్వాలిఫయింగ్‌లో తెలుగు ప్లేయర్.. 11.466 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ ఈవెంట్ తుది పోరు ఆదివారం జరగనుంది. కాగా, వాల్ట్ క్వాలిఫయింగ్స్‌లో అరుణ 13.566 స్కోరుతో రెండో స్థానంతో ఫైనల్‌కు చేరుకుంది. తుదిపోరులో మరింత మెరుగైన ప్రదర్శనతో కాంస్యం నెగ్గిన ఆమె.. ఫ్లోర్ ఫైనల్లోనూ అలా చేస్తే పతకం నెగ్గేందుకు అవకాశాలు ఉన్నాయి.

రాకేశ్ చేజారిన పతకం: ఇక, పురుషుల రింగ్స్ ఈవెంట్‌లో రాకేశ్ పాత్రా తృటిలో కాంస్యం చేజార్చుకున్నాడు. ఫైనల్లో అతడు 13.733 స్కోరుతో నాలుగు స్థానంతో సంతృప్తి పడ్డాడు. అయితే, ఆదివారం జరిగే పారలెల్ బార్స్ తుదిపోరులోనూ రాకేశ్ బరిలో నిలిచాడు. ఢిల్లీ కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో కాంస్యాలు గెలిచిన ఆశీష్ కుమార్.. పురుషుల వాల్ట్ ఫైనల్లో తలపడనున్నాడు. అర్హత రౌండ్‌లో అతను ఆరో స్థానంలో నిలిచాడు. 16 దేశాలు బరిలో నిలిచిన ఈ టోర్నీకి.. వరల్డ్ చాంపియన్‌షిప్స్ తర్వాత అంతటి ప్రాధాన్యత ఉంటుంది.

కరాటే టు జిమ్నాస్టిక్స్..

జిమ్నాస్టిక్స్..! రియో ఒలింపిక్స్ వరకూ మనదేశంలో ఎవరికీ పట్టని క్రీడ. త్రిపుర సంచలనం దీపా కర్మాకర్ రియోలో అద్భుత ప్రదర్శన తర్వాత ఆమెతో పాటు జిమ్నాస్టిక్స్ ఒక్క సారిగా పాపులర్ అయింది. విశ్వక్రీడల్లో పతకం తీసుకురాలేకపోయినా.. ఆటకు ముఖచిత్రంగా మారిందామె...! కానీ, దీప కూడా అందుకోలేని వరల్డ్‌కప్ పతకం కైవసం చేసుకున్నదంటే తెలుగమ్మాయి అరుణ ఎంత ప్రతిభావంతురాలో చెప్పొచ్చు.

అయితే, జిమ్నాస్టిక్స్‌లో మెరుపులు మెరిపించడం అరుణకు కొత్తేం కాదు. ఈ క్రీడలో భారత మేటి మహిళా జిమ్నాస్ట్‌ల్లో ఆమె ముందు వరుసలో ఉంటుంది. ఎందుకంటే.. గత పుష్కర కాలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆమె ఎన్నో పతకాలు నెగ్గింది. ఎన్నో అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొన్నది. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవాంతరాలను దాటుకొని వచ్చింది.

హైదరాబాద్‌లో పుట్టిన అరుణ తొలుత జిమ్నాస్ట్ కావాలనుకోలేదు. తండ్రి సూచన మేరకు నాలుగైదేళ్ల వయసులో సరదాగా కరాటేలో శిక్షణ తీసుకుంది. అందులో బ్లాక్‌బెల్ట్ కూడా సాధించిందామె. అయితే, చిన్నారి అరుణ శరీరం చాలా ఫ్లెక్సిబిలిటీగా ఉండడంతో జిమ్నాస్టిక్స్‌లో చేర్పించమని కరాటే కోచ్ సూచించడం ఆమె జీవితాన్ని మలుపు తప్పింది. దాంతో, ఒకటో తరగతిలో జిమ్నాస్టిక్స్ వైపు అరుణ అడుగులు వేసింది. ఎల్బీ స్టేడియంలో ఆటలో ఓనమాలు దిద్దుకుంది. ఇది ఎంతో కష్టమైన క్రీడ అయినా.. శరీరాన్ని స్ట్రెచ్ చేసినప్పుడు ఎంతో బాధకలిగినా... అరుణ ఆపలేదు. కోచ్‌లు స్వర్ణలత, రవీందర్‌తో పాటు ఇప్పుడు బ్రిజ్ కిశోర్ శిక్షణలో రాటుదేలింది.



అయితే, స్కూల్ లెవెల్, స్టేట్ లెవెల్ పోటీల్లో పాల్గొని పతకాలు తెస్తున్నా 2005 వరకూ తన లక్ష్యం ఏమిటో అరుణకు స్పష్టంగా తెలియలేదు. ఆ ఏడాది జాతీయ సబ్ జూనియర్ స్వర్ణం నెగ్గిన తర్వాత ఇక జిమ్నాస్టిక్సే తన కెరీర్ అనుకుంది. 2007 జాతీయ క్రీడల్లో రజతం ఆమె ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. అక్క డి నుంచి ఇక వెనుదిరిగి చూసింది లేదు. ఎల్బీ స్టేడియంలో సాధారణ ఇక్విప్‌మెంట్‌తోనే శిక్షణ కొనసాగిస్తూ.. జూనియర్ నుంచి సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటింది. జాతీయ స్థాయిలోనే ఆమె వంద వరకూ పతకాలు కొల్లగొట్టిందంటే ఆశ్చర్యం కలగక మానదు.

శారీరకంగా ఎంత కష్టం ఎదురైనా తట్టుకొనే అరుణ.. సున్నిత మనస్కురాలు. కెరీర్ పుంజుకుంటున్న సమయంలో 2010లో తండ్రి మరణించడం అరుణను తీవ్రంగా కలిచి వేసింది. అప్పటిదాకా తనకు వెన్నుగా నిలిచిన తండ్రి హఠాత్తుగా లోకాన్ని విడిచి వెళ్లడాన్ని తట్టుకోలేకపోయింది. కానీ, అక్క పావనితో పాటు బావ ఆమెను మామూలు మనిషిని చేసి.. 'ఇది నీ తండ్రి కల' అని ఆటను కొనసాగించేలా చూశారు. ఈ ఘటన తర్వాత మానసికంగానూ దృఢంగా మారిన అరుణ మరింత మెరుగైన ఆటతీరును కనబరుస్తూ మేటి జిమ్నాస్ట్‌గా ఎదిగింది. జాతీయ స్థాయిలో పతకాల పరంపర కొనసాగిస్తూనే.. కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడల్లో, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించింది. ఇప్పుడు వరల్డ్‌కప్ పతకంతో ఆమె సత్తా దేశాన్ని దాటి ప్రపంచానికి తెలిసింది. దీపా కర్మాకర్.. ఆసియా చాంపియన్‌షిప్స్, కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యాలు నెగ్గినా.. వరల్డ్‌కప్‌లో మాత్రం పతకం సాధించలేదు. తెలుగమ్మాయి అరుణ ఇలాంటి అద్భుత ప్రదర్శన చేయడం గర్వించదగ్గ విషయం. ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించడం అరుణ సమీప లక్ష్యాలు. ఇప్పటికే కామన్వెల్త్‌కు అర్హత సాధించింది కూడా. ఆ ఈవెంట్‌లో పతకంపై కన్నేసిన అరుణ.. రెండు నెలల నుంచి ఉజ్బెకిస్థాన్‌లో శిక్షణ తీసుకుంటోంది. ప్రాక్టీస్‌కు ఆటంకం కలగకుండా ఉండేందుకు మెల్‌బోర్న్ నుంచి నేరుగా ఉజ్బెక్‌కు వెళ్లాలని అరుణ భావిస్తోంది. అంతటి పట్టుదల ఉండబట్టే అరుణ దేశంలో ఎవరూ సాధించని ఘనతను అందుకోగలిగింది.

(హైదరాబాద్ ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

డబుల్ ధమాకా!



సఫారీ పర్యటనకు టీమిండియా అదిరిపోయే ఫినిషింగ్ ఇచ్చింది. టెస్టుల్లో ఓటమికి ఏకంగా డబుల్ సిరీస్‌లతో బదులిచ్చింది. తద్వారా తమ 51 రోజుల పర్యటనను చక్కటి విజయంతో ముగించుకుంది. శిఖర్ ధవన్ (40 బంతుల్లో 3 ఫోర్లతో 47), సురేశ్ రైనా (27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) మెరుగ్గా రాణించి సమయోచిత ఇన్నింగ్స్‌తో భారత్‌ను ఆదుకోగా ఆ తర్వాత పేసర్లు కలిసికట్టుగా దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు ముకుతాడు వేశాడు. ఆఖర్లో జోంకర్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49) వణికించినా భువనేశ్వర్ సూపర్ బౌలింగ్‌తో కాపాడాడు. దీంతో టీ-20 సిరీస్ 2-1తో భారత్ వశమైంది.

- భారత మహిళలదే టీ20 సిరీస్
- ఆఖరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై విజయం
- మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, సిరీస్‌గా మిథాలీ

భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. వన్డే సిరీస్‌లో దుమ్మురేపిన అమ్మాయిలు ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌నూ అదేరీతిన ముగించారు. మిథాలీ రాజ్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 62) మెరుపులకు తోడు భారత బౌలర్లు సమష్టిగా కుమ్మేయడంతో 3-1తో టీ-20 సిరీస్‌ను గెలుచుకుంది. ఇంతకుముందే వన్డే సిరీస్‌ను గెలుచుకున్న భారత్ ఇప్పుడు 'డబుల్' సాధించినట్టయ్యింది.

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాపై భారత మహిళల జట్టు ఆధిప త్యం చివరి మ్యాచ్‌లోనూ కొనసాగింది. శనివారం ఇరుజట్ల మధ్య జరిగిన ఐదో టీ-20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 54 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఇది భారత మహిళలకు విదేశీ గడ్డపై వరుసగా రెండో టీ-20 సిరీస్ విజయం కావడం విశేషం. 2015-16లో ఆసీస్‌పై 2-1తో సిరీస్ గెలుచుకుంది. అంతేకాకుండా దక్షిణాఫ్రికా నేలపై ఒక పర్యటనలో రెండు సిరీస్‌లు గెలుచుకున్న తొలి మహిళల జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మం.దాన (13) ఐదో ఓవర్‌లోనే వెనుదిరిగినా మిథాలీకి జతగా జెమీమా రోడ్రిగ్స్ (34 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 44) కీలక ఇన్నింగ్స్ ఆడింది. 46 బంతుల్లో మిథాలీ అర్ధసెంచరీ పూర్తి చేసింది. 16వ ఓవర్‌లో జెమీమా సిక్స్ కొట్టగా మిథాలీ వరుసగా రెండుఫోర్లు బాది జోరు చూపించింది. అయితే అదే ఓవర్ ఐదోబంతికి మిథాలీ వెనుదిరగడంతో రెండో వికెట్‌కు 98పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఇక 17వ ఓవర్‌లో రోడ్రిగ్స్ కూడా అవుటైనా కెప్టెన్ హర్మత్ ప్రీత్ (17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27) బౌండరీలతో ధాటిని కొనసాగించడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరును సాధించగలిగింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా.. భారత బౌలర్ల ధాటికి 18 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. వరుస విరామాల్లో శిఖా పాండే, రుమేలి, రాజేశ్వరి తలా మూడేసి వికెట్లు తీయడంతో ప్రత్యర్థి ఏమాత్రం కుదురుకోలేకపోయింది. చివర్లో ధాటిగా ఆడుతున్న కాప్ (21 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27) మిడాన్‌లో ఆడిన భారీ షాట్‌ను బౌండరీలైన్ దగ్గర జెమీమా అమాంతం గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో అందుకున్న క్యాచ్ హైలైట్‌గా నిలిచింది. ఆ తర్వాత 12 పరుగుల వ్యవధిలో ఆఖరి 4 వికెట్లు కోల్పోవడంతో భారత్ సిరీస్ నెగ్గింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ మిథాలీ రాజ్ దక్కించుకుంది.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 166/4 (మిథాలీ 62, రోడ్రిగ్స్ 44). దక్షిణాఫ్రికా: 18 ఓవర్లలో 112 ఆలౌట్ (కాప్ 27, ట్రయాన్ 25, శిఖా పాండే 3/16, రుమేలి ధర్ 3/26, రాజేశ్వరి 3/26).

- భారత్‌దే చివరి టీ-20
- సఫారీలపై థ్రిల్లింగ్ విన్
- అదరగొట్టిన భువీ
- 2-1తో సిరీస్ కైవసం



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనను భారత క్రికెట్ జట్టు అద్భుతంగా ముగించింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠ రేగినా ఒత్తిడిని జయిస్తూ కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమిండియా సమష్టిగా పోరాడింది. 173 పరుగుల లక్ష్యం తక్కువేమో అని మొదట ఆందోళనపడినా భారత బౌలర్ల ధాటికి సఫారీలు తోకముడిచారు. ఫలితంగా ఏడు పరుగుల తేడాతో నెగ్గిన భారత్ 2-1తో సిరీస్‌ను దక్కించుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 172 పరుగులు చేసింది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 165 పరుగులు చేసి ఓడింది. డుమిని (41 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) రాణించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సురేశ్ రైనాకు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ భువనేశ్వర్‌కు దక్కాయి. రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లీ వెన్నునొప్పితో ఈ మ్యాచ్‌కు దూరమవడంతో రోహిత్ శర్మ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు.

ధవన్, రైనా ఇద్దరే..: తొలి ఓవర్‌లో వరుగా రెండు ఫోర్లు బాదిన రోహిత్ (11)ఆ మరుసటి ఓవర్‌లోనే డాలా బౌలింగ్‌లో ఎల్బీ అయ్యాడు. ఇక 16 ఓవర్లపాటు క్రీజులో ఉన్నా ధవన్ ఇన్నింగ్స్‌లో మెరుపులు కనిపించలేదు. కానీ రైనా వచ్చీ రావడంతోనే స్క్వేర్ లెగ్‌వైపు సిక్స్‌తో తన రాకను ఘనంగా చాటాడు. ఐదో ఓవర్‌లోనూ అతడు వరుసగా రెండు ఫోర్లు బాదాడు. అయితే ఆ తర్వాతి ఓవర్‌లో రైనా ఇచ్చిన క్యాచ్‌ను షంసి మిస్ చేశాడు. ఈ జోరుతో పవర్‌ప్లేలో 57 పరుగులు వచ్చాయి. కానీ స్పిన్నర్ల రాకతో ఏడో ఓవర్ నుంచి దూకుడు తగ్గింది. దీనికి తోడు ఊపు మీదున్న రైనాను పదో ఓవర్‌లో షంసి అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 12వ ఓవర్‌లో పాండే సిక్స్, ధవన్ బౌండరీ సాధించడంతో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. 13వ ఓవర్‌లో షంసి ఈసారి ధవన్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను వదిలేశాడు. మరోవైపు స్వల్ప వ్యవధిలోనే పాండే (13), ధవన్ నిష్క్రమించడంతో చివర్లో ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో పాండ్యా (21) కొద్ది మేర క్రీజులో నిలిచినా మిగతా వారంతా హడావిడిగా ఆడి పెవిలియన్‌కు చేరారు.


ఆఖర్లో డ్రామా: లక్ష్యం కోసం బరిలోకి దిగిన సఫారీల ఇన్నింగ్స్ తడబాటుతో సాగింది. మూడో ఓవర్‌లోనే భువనేశ్వర్ తన నకుల్ బంతితో వారికి గట్టి షాక్ ఇచ్చాడు. ఫామ్‌లో ఉన్న హెన్‌డ్రిక్స్ (7)ను తను పెవిలియన్‌కు పంపాడు. ఆతర్వాత బౌలర్లు చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు విసరడంతో పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 30 పరుగులు మాత్రమే చేసింది. తొమ్మిదో ఓవర్‌లో మరో ఓపెనర్ మిల్లర్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 24) ఓ సిక్సర్ బాదినా ఆ తర్వాత ఓవర్‌లో రైనా బౌలింగ్‌లో అవుటయ్యాడు. 13వ ఓవర్‌లో ప్రమాదకర క్లాసెన్ (7)ను పాండ్యా అవుట్ చేసి భారత శిబిరంలో ఆనందం నింపాడు. ఈ దశలో డుమిని తన మార్క్ షాట్లతో చెలరేగుతూ 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసినా శార్దూల్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 18వ ఓవర్‌లో జోంకర్(49) ఓ సిక్స్, మూడు ఫోర్లు బాదడంతో 18 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్‌కు 19 పరుగులు కావాల్సి ఉండగా 11 పరుగులే ఇచ్చిన భువీ.. జోంకర్ వికెట్ కూడా తీశాడు.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (ఎల్బీ) డాలా 11; ధవన్ (రనౌట్) 47; రైనా (సి) బెహర్డీన్ (బి) షంసి 43; పాండే (సి) మిల్లర్ (బి) డాలా 13; పాండ్యా (సి) క్లాసెన్ (బి) మోరిస్ 21; ధోనీ (సి) మిల్లర్ (బి) డాలా 12; దినేశ్ కార్తీక్ (ఎల్బీ) మోరిస్ 13; అక్షర్ నాటౌట్ 1; భువనేశ్వర్ నాటౌట్ 3; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 172/7. వికెట్ల పతనం:** 1-14, 2-79, 3-111, 4-126, 5-151, 6-163, 7-168. **బౌలింగ్:** మోరిస్ 4-0-43-2; డాలా 4-0-35-3; డుమిని 3-0-22-0; పెహ్లుక్వాయో 3-0-26-0; షంసి 4-0-31-1; ఫంగిసో 2-0-13-0.

సౌతాఫ్రికా: హెన్‌డ్రిక్స్ (సి) ధవన్ (బి) భువనేశ్వర్ 7, మిల్లర్ (సి) అక్షర్ (బి) రైనా 24, డుమిని (సి) రోహిత్ (బి) ఠాకూర్ 55, క్లాసెన్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 7, జాంకర్ (సి) రోహిత్ (బి) భువనేశ్వర్ 49, మోరిస్ (బి) బుమ్రా 4, బెహర్డీన్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 165/6; వికెట్ల పతనం:** 1-10, 2-45, 3-79, 4-109, 5-114, 6-165; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-24-2, బుమ్రా 4-0-39-1, శార్దూల్ 4-0-35-1, హార్దిక్ 4-0-22-1, రైనా 3-0-27-1, అక్షర్ 1-0-16-0.


హుస్సాముద్దీన్‌కు కాంస్యం



సోఫియా (బల్గేరియా): స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో తెలంగాణకు చెందిన మహ్మద్ హుస్సా ముద్దీన్‌కు కాంస్య పతకం దక్కింది. హుస్సాముద్దీన్ సెమీస్‌లో రష్యా బాక్సర్ షక్రీర్ అహ్మెదోవ్ చేతిలో ఓడి కాంస్యంతో సరి పెట్టుకున్నాడు. మిగతా భారత బాక్సర్లలో వికాస్ క్రిషన్ (75 కి), అమిత్ ఫాంగాల్ (49 కి.), సీమా పూనియా (+81 కి.) ఫైనల్స్‌లో ప్రవేశించారు. సెమీస్‌లో తుహెచాబికె (చైనా)పై వికాస్, సొయన్ ఆర్తిష్ (రష్యా)పై అమిత్ నెగ్గగా, మహిళల సెమీస్‌లో సీమకు బై లభించింది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

కశ్యప్‌కు ఆస్ట్రియా టైటిల్



న్యూఢిల్లీ: భారత సీనియర్ షట్లర్ పారుపల్లి కశ్యప్ చానాళ్ల తర్వత ఓ అంతర్జాతీయ టైటిల్ గెలిచాడు. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరిగిన వియన్నా ఓపెన్ సింగిల్స్ ఫైనల్లో కశ్యప్ 23-21, 21-14తో జనే వీ చీమ్ (మలేసియా)పై విజయం సాధించి విజేతగా నిలిచాడు. స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరుగుతున్న స్విస్ ఓపెన్‌లో సమీర్ వర్మ సెమీస్ నెగ్గి ఫైనల్ చేరాడు.

హజారే ఫైనల్లో కర్ణాటక

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక ఫైనల్‌కు చేరుకుంది. శనివారం జరిగిన సెమీస్‌లో కర్ణాటక 9 వికెట్ల తేడాతో మహారాష్ట్రను చిత్తు చేసింది. తొలుత మహారాష్ట్ర 44.3 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. మయాంక్ అగర్వాల్ (81)తోపాటు కెప్టెన్ కరుణ్ నాయర్ (70) సత్తా చాటడంతో కర్ణాటక 30.3 ఓవర్లలో వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



జాబిల్లిపై జలం

మంచు రూపంలో విస్తరించిన నీళ్లు: నాసా

చంద్రయాన్-1, ఎల్ఆర్ఓ చూపుతున్న ఆధారాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: వెండి వెలుగులతో ప్రకాశిస్తూ భూవాసులను అలరిస్తున్న అద్భుత రూపం.. జాబిల్లి. చంద్రుడిని చూసిన ప్రతీసారి అక్కడ ఏముంది? దుమ్ము, ధూళియేనా? నీళ్లున్నాయా? మనిషి బతికే అవకాశాలున్నాయా? అనే బోలెడు సందేహాలు. ఎంత త్వరగా చంద్రుడిపై గృహ ప్రవేశం చేద్దామా! అని భూవాసి ఆరాటం. మరి అక్కడ జీవించడానికి అత్యావసరమైన నీళ్ల సంగతేంటి? అంటే చంద్రుడిపై నీళ్లు ఉన్నాయని, దానికి తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని చెబుతోంది నాసా. చందమామపై నీళ్లు ఉండవని చాలాకాలంగా శాస్త్రవేత్తలు భావించినా.. తర్వాత పరిశోధనల ద్వారా నీళ్ల జాడ ఉందని చెబుతూ వచ్చారు. కానీ, కచ్చితంగా చెప్పలేకపోయారు. అయితే, ఇస్రో పంపిన చంద్రయాన్-1, నాసా ప్రయోగించిన ల్యూనార్ రికానిసెన్స్ ఆర్బిటార్(ఎల్ఆర్ఓ) అందించిన డేటాను విశ్లేషించగా నీళ్లు కచ్చితంగా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. చంద్రుడిపై ఒక్క ప్రదేశంలోనే కాకుండా ఉపరితలం అంతటా మంచు రూపంలో విస్తరించి ఉందని వెల్లడించారు. పలు అక్షాంశాల్లో నీటి జాడలు కనబడ్డాయని, అయితే, ఆ నీటిని సేకరించడం అంత సులువు కాదని చెబుతున్నారు. ఆ నీళ్లు 'ఓ, హెచ్(హైడ్రాక్సిల్)' రూపంలో ఉన్నట్లు అంచనా వేస్తున్నామని, అవి తాగడానికి వీలవుతుందా? లేదా హైడ్రోజన్, ఆక్సిజన్‌గా మార్చుకోవచ్చా? అన్న కోణంలోనూ పరిశోధనలు చేస్తున్నామని తెలిపారు.

చంద్రయాన్-1దే ఘనత?

చంద్రుడిపై నీటి జాడను కనుక్కోవడంలో ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-1 మిషన్‌ది కీలకపాత్ర. నీళ్లు ఎక్కడ ఉన్నాయి.. ఎంత మేరకు ఉన్నాయి.. దాని రసాయనిక బంధం ఏంటి.. అన్న అంశాలకు చంద్రయాన్-1 దారి చూపింది. మిషన్‌తో పాటు వెళ్లిన మూన్ మినరాలజీ మ్యాపర్ డేటా ఆధారంగా పై అంశాలతో కూడిన మ్యాప్‌ను రూపొందించారు. దాని ఆధారంగా నీళ్లున్న ప్రాంతాలను గుర్తించారు. ఒక్క ధ్రువప్రాంతాల్లోనే కాకుండా చంద్రుడి ఉపరితలం అంతటా జలం విస్తరించి ఉందని శాస్త్రవేత్తలు చెప్పగలుగుతున్నారు.

చిన్నారులను చిదిమేసిన కారు

బిహార్‌లో 9 మంది విద్యార్థుల మృతి.. 24 మందికి తీవ్ర గాయాలు



ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న బంధువులు

పట్నా, ఫిబ్రవరి 24: ఆ చిన్నారులంతా బడిగంట మోగగానే స్కూల్ నుంచి బయటకు పరుగులు పెట్టారు. ఇంటికెళ్లి.. ఆటల్లో మునిగిపోవాలనే తొందరలో ఉన్నారు. ఆ క్రమంలో రోడ్డు దాటేందుకు సన్నద్ధమవుతుండగా.. మృత్యువు రూపంలో దూసుకొచ్చిన ఓ ఎస్‌యూవీ కారు వారిని ఢీకొంది. తొమ్మిది మందిని పొట్టన పెట్టుకుంది. మరో 24 మందిని రోడ్డుపై ఈడ్చుకుపోతూ తీవ్రంగా గాయపరిచింది. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోడ్డుపై చిన్నారుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి.. ఆ ప్రాంతంలో బీభత్స వాతావరణం నెలకొంది. ఈ ఘటన బిహార్‌లోని ముజఫర్‌పూర్ శివార్లలో ఉన్న ఝుంజా గ్రామంలో చోటుచేసుకుంది. సీనియర్ ఎస్పీ వివేక్ కుమార్ కథనం ప్రకారం.. ఈ ప్రమాదం మధ్యాహ్నం 1.30కు చోటుచేసుకుంది. 'తొమ్మిది మంది విద్యార్థులు ఘటనాస్థలిలోనే మృతిచెందారు. మిగతా 24 మంది క్షతగాత్రులను శ్రీకృష్ణ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. కారు డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. అతణ్ని అరెస్టు చేసేందుకు బృందాలను నియమించాం' అని వివరించారు. విషయం తెలుసుకుని.. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్జేడీ ఎమ్మెల్యే మున్నా యాదవ్.. ఆ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడిపాడని చెప్పారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. అటు శ్రీకృష్ణ మెడికల్ కాలేజీలో క్షతగాత్రుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తీవ్రగాయాలపాలైన చిన్నారులు.. నొప్పులను తట్టుకోలేక మెలికలు తిరిగిపోతుండడం అక్కడివారిని కలిచివేసింది. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని, వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు.

అంతకు ముందు ప్రమాదం కారణంగా..

విద్యార్థులు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు అంటుండగా.. ప్రత్యక్ష సాక్షి అయిన జిల్లా బోర్డు సభ్యుడు మిథిలేశ్ యాదవ్ మరో కథనం చెబుతున్నారు. 'ఈ ఘటనకు కొన్ని నిమిషాల ముందు ఓ ట్రక్కు ఢీకొని.. అటుగా వెళ్తున్న ఓ మహిళ తీవ్రగాయాలపాలైంది. ఆ సమయంలో.. దాదాపు 35 మంది విద్యార్థులు ఒక పక్కన నిలబడి, రోడ్డు దాటేందుకు సిద్ధమయ్యారు. గాయపడ్డ మహిళను తప్పించబోయి.. మిగతా వాహనాలు రోడ్డుకు కుడివైపు నుంచి వెళ్లాయి. ఇదే క్రమంలో వేగంగా వచ్చిన ఎస్‌యూవీ కారు వీరిని ఢీకొంది' అని మీడియాకు తెలిపారు.

నెలరోజులుగా వరుస ప్రమాదాలు

నెల రోజులుగా రైలు, రోడ్డు ప్రమాదాలు బిహార్‌ను అట్టుడికిస్తున్నాయి. జనవరి 30 నుంచి శనివారం వరకు జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పాతిక మందికి పైగా మృతిచెందారని పోలీసులు చెబుతున్నారు.

- జనవరి 30న రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు.
- మూడు వారాల క్రితం సివాన్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో.. పట్టాలు దాటుతున్న నలుగురు మృతిచెందగా.. ఒకరు తీవ్ర గాయాలపాలయ్యారు.
- ఈ నెల 19న పట్నా శివార్లలో జరిగిన బస్సు ప్రమాదంలో 10 మంది మృతి చెందగా.. 35 మంది గాయాలపాలయ్యారు.



ఐదు రోజుల బిడ్డతో భర్త అంత్యక్రియలకు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఈ ఫొటోను చూశారా? ఓ ఆర్మీ అధికారిణి చిన్నారిని ఎత్తుకుని నడుస్తున్నట్లు ఉంది కాదూ! కానీ ఈ ఫొటో వెనక దాగి ఉన్న నిజం ప్రతి ఒక్కరి గుండెను పిండేస్తోంది. జీవితాంతం తోడుంటాడనుకున్న వ్యక్తి ఊహించని ప్రమాదంలో దూరమయ్యాడు. అంతటి బాధలోనూ చేతిలో బిడ్డను ఎత్తుకుని ఆ తల్లి వృత్తి ధర్మాన్ని మరువలేదు. విమానం కూలిన ఘటనలో మరణించిన భర్త అంత్యక్రియలకు తన ఐదు రోజుల కూతురుని ఎత్తుకొని వచ్చి విధుల్లో పాల్గొంది. ఆమే మేజర్ కుముద్ దోగ్రా. ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకొని మార్చ్‌లో పాల్గొని తన భర్తకు నివాళులర్పించింది. ఈ దృశ్యం అక్కడున్న ప్రతి ఒక్కరి కంట కన్నీరు తెప్పించింది. ఈ నెల 15న అసోంలో భారత వాయుసేన ఎయిర్‌క్రాఫ్ట్ కూలి ఇద్దరు పైలెట్లు మరణించారు. వారిలో కుముద్ దోగ్రా భర్త వింగ్ కమాండర్ డి. వాట్స్ ఉన్నారు. ఆయన మరణించిన రెండు రోజులకు కుముద్ కూతురికి జన్మనిచ్చింది. బుధవారం వాట్స్ అంత్యక్రియలు నిర్వహించారు. అక్కడికి ఆయన భార్య కుముద్ ఆర్మీ దుస్తుల్లో వచ్చి నివాళులర్పించారు. బిడ్డతో పాటే మార్చ్‌లో పాల్గొన్నారు. అంత బాధలోనూ వృత్తి పట్ల ఆమె చూపించిన నిబద్ధతను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ఆమె మార్చ్‌లో పాల్గొన్న ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



బహుమతి 'బాంబో'య్

గిఫ్ట్ పేలడంతో వరుడు మృతి

భువనేశ్వర్, ఫిబ్రవరి 24: బహుమతి.. సంబురానికి ప్రతీక! ఆ కుటుంబానికి మాత్రం పెను విషాద గీతికే అయింది. వివాహ విందు సందర్భంగా ఇచ్చిన బహుమతి పేలడంతో వరుడు మృత్యువాతపడ్డాడు. వధువు తీవ్ర గాయాలపాలై ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఒడిసాలోని బొలాంగిర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. వివాహ విందు తర్వాత కొన్నాళ్లకు వంటింట్లో ఒక్కొక్కటిగా బహుమతులను తెరిచి చూస్తుండగా.. ఓ గిఫ్ట్ పేలింది. ఆ ధాటికి ఇల్లే ధ్వంసమైంది. ఈ ఘటనలో ఓ వృద్ధురాలు, ఆమె మనుమడు కూడా ప్రాణాలు కోల్పోయారు. గిట్టని వారు ఎవరో ఆ ఘాతుకానికి పాల్పడివుంటారని పోలీసులు భావిస్తున్నారు.



కొడుకునివ్వని దేవుడు దేవుడా!

తమిళనాడులో విగ్రహాలు ధ్వంసం చేసిన వ్యక్తి

చెన్నై, ఫిబ్రవరి 24: పున్నామనరకం నుంచి కాపాడేది పుత్రుడే! ఈ మాటను గట్టిగా నమ్మినట్టున్నాడతను. లక్ష్మీదేవిలాంటి కూతురు ఉన్నా.. కొడుకు పుట్టాలని కోరుతూ గుళ్లో దేవుడికి మొక్కుకున్నాడు. భగవంతుడు తన కోరిక ఈడేర్చుతాడని గంపెడాశ పెట్టుకున్నాడు. తీరా రెండో సంతానంగా మళ్లీ కూతురే పుట్టడంతో కలత చెందాడు. కొడుకునివ్వని దేవుడు ఎందుకని.. ప్రార్థించిన చేతులతోనే గుడిలోని దేవతామూర్తులను ధ్వంసం చేశాడు. తమిళనాడులోని గోవిందరెడ్డిపాళయంలో ఉలగనాథన్ (32) అనే వ్యక్తి ఉన్మాదమిది! అదే ఊర్లోని మునీశ్వరన్ ఆలయంలో నవగ్రహ మూర్తులు, నాగత్తమ్మాల్, నంది విగ్రహాలను ఉలగనాథన్ ధ్వంసం చేశాడు. పోలీసులు అతడికి అరదండాలు తగిలించారు.



బడుల్లో గాయత్రి మంత్రం

త్వరలో అమలుకు హరియాణా యోచన

హరియాణా, ఫిబ్రవరి 24: హరియాణాలోని పాఠశాలలో ఆధ్యాత్మిక గుబాళింపులు మరింతగా! అక్కడ ఉదయం ప్రార్థనలో విద్యార్థులు 'భారత దేశము నా మాతృభూమి'తో పాటు 'ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం' అంటూ గాయత్రి మంత్రాన్ని కూడా పఠించనున్నారు. ఇప్పటికే ఆ రాష్ట్రంలోని బడుల్లో భగవద్గీత శ్లోకాలను పాఠ్యాంశాల్లో చేర్చారు. త్వరలోనే ఉదయం ప్రార్థనలో గాయత్రి మంత్రాన్ని చేర్చాలని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది.. దీనివల్ల పరమ పవిత్రమైన గాయత్రి మంత్రం అర్థం విద్యార్థులకు అవగతమవుతుందని అంటున్నారు.



ఎఫ్‌బీ మిత్రుడు దోచేశాడు

ముంబైలో యువతిని హత్యచేసిన మరొకరు

ముంబై, చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అపరిచితులతో 'ఫేస్‌బుక్ స్నేహం'వల్ల ఎన్ని చిక్కులో కదా! ఆమె ఫేస్‌బుక్ మిత్రుడు.. ఇంట్లోకి చొరబడి ఉన్నదంతా ఊడ్చుకెళ్లాడు! చెన్నైలోని రెడ్‌హిల్స్‌కు చెందిన నిత్య అనే మహిళకు ఈ చేదు అనుభవం ఎదురైంది. మనోజ్ కుమార్ (22) అనే యువకుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం కావడంతో ఇంటికి ఆహ్వానించింది. రాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక మనోజ్.. బీరువాలోని నిత్య నగలను తీసుకొని పరారయ్యాడు. మహారాష్ట్రకు చెందిన అంకితా హేగ్డే (20) అనే యువతి ఫేస్‌బుక్ స్నేహంతో ప్రాణాలే పోగొట్టుకుంది. హరిదాస్ నిర్హుడే (25) అనే యువకుడి ఆహ్వానం మేరకు అతడి గదికి వెళ్లింది. శృంగారానికి సహకరించాలని అతడు డిమాండ్ చేయడంతో కాదంది. దీంతో.. షూ లేస్‌తో ఆమెను గొంతు నులిమి చంపే.




ఆప్తులకన్నా స్మార్ట్‌ఫోనే మిన్న

47 శాతం భారతీయులది ఇదే మాట!


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఫోన్‌ను మించి నేస్తమున్నదా? చాటింగ్ కంటే వ్యాపకమున్నదా? స్మార్ట్‌ఫోన్ల విషయంలో భారతీయుల తీరు ఇలానే ఉంద ట! ఈ రోజుల్లో అందరికీ స్మార్ట్‌ఫోన్ చక్కటి నేస్తంగా మారినా.. మనదేశంలో అది 'మరోస్థాయి'కి చేరుకుందట! అది ఎంతలా అంటే.. ప్రాణంగా ప్రేమించే ఆప్తులకన్నా.. స్మార్ట్‌ఫోన్‌నే ఇష్టపడుతున్నారట! స్మార్ట్‌ఫోన్ వినియోగంపై.. మోటరోలా.. హార్వర్డ్ విశ్వవిద్యాలయ నిపుణులతో నిర్వహించిన సర్వేలో ఇది వెల్లడైంది. దేశంలో 65శాతం మంది స్మార్ట్‌ఫోన్‌నే తమ ప్రియ నేస్తంగా భావిస్తున్నారట! విశ్వవ్యాప్తంగా 33 శాతం తాము ప్రేమించేవారికన్నా కూడా స్మార్ట్‌ఫోన్ విషయంలోనే ఎక్కువ మక్కువ ప్రదర్శిస్తుంటారని, భారత్ విషయంలో ఇది 47% అని సర్వే తేల్చింది.

పాఠాలు సగానికి కుదింపు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు శుభవార్త! ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రస్తుతం భారీగా ఉన్న ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ సగానికి తగ్గనుంది! ఇది 2019 విద్యా సంవత్సరం నుంచే అమలవనుంది. ప్రస్తుతం పాఠశాల విద్యలోని పాఠ్యాంశాలు బీఏ, బీకాం కోర్సులతో సమానంగా ఉన్నాయని, వాటిని సగానికి తగ్గిస్తేనే విద్యార్థులకు ఊరట లభిస్తుందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ పేర్కొన్నారు. సిలబస్ తగ్గిస్తే విద్యార్థులు ఇతర కార్యకలాపాలపై దృష్టి సారించడానికి సమయం దొరుకుతుందని.. ఫలితంగా వారి సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పాఠశాల విద్యలో నాణ్యతను పెంచడానికి భారీ సంస్కరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో పాఠ్యాంశాల తగ్గింపు, పరీక్షల విధానంలో మార్పులు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటివి ఉంటాయని స్పష్టం చేశారు. పాఠశాల విద్యలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై రాజ్యసభ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) పాఠ్యాంశాలను తగ్గిస్తుందని వెల్లడించారు. "మేధోవికాస నైపుణ్యాలు అభివృద్ధి చెందే దశలో పిల్లలకు పూర్తి స్వేచ్ఛనివ్వాల్సిన అవసరం ఉంటుంది. కాబట్టి పాఠ్యాంశాలను సగానికి తగ్గించాలని ఎన్‌సీఈఆర్‌టీని ఆదేశించాం" అని జావడేకర్ పేర్కొన్నారు. ఇది 2019 విద్యాసంవత్సరం నుంచి అమలవుతుందని, సంస్కరణల్లో భాగంగా పాఠశాల విద్యలో పరీక్షలు, పై తరగతికి వెళ్లకుండా అడ్డుకోవడం(డిటెన్షన్)ను అమలు చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించి రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెడతామని, దాదాపు అన్ని రాష్ట్రాలు ఈ విధానానికి మొగ్గుచూపుతున్న క్రమంలో బిల్లు ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "పరీక్షలు లేకుండా పోటీతత్వం ఉండదు, లక్ష్యం ఉండదు. మెరుగైన ఫలితాల కోసం పోటీ ఉండాలి. మార్చిలో జరిగే పరీక్షల్లో విద్యార్థి ఫెయిల్ అయితే మేలో మరో అవకాశం ఇవ్వాలి. రెండు సార్లూ తప్పితేనే డిటెన్షన్‌కు గురవుతారు. ఐదు నుంచి పదో తరగతి వరకు దీన్ని అమలు చేస్తాం" అని స్పష్టం చేశారు. టీచర్ల బోధనలో నాణ్యత లేకపోవడం కూడా మంచి ఫలితాలు రాకపోవడానికి ఓ కారణమని జావడేకర్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి దానికి అనుగుణంగా బోధించడం ఉపాధ్యాయుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2015 నాటికి 20 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. కేవలం 5 లక్షల మందే శిక్షణ పొందారని వివరించారు. ప్రస్తుతం 14 లక్షల మంది శిక్షణలో ఉన్నారని తెలిపారు. నూతన విద్యా విధానంపై మార్చిలో కమిటీ నివేదిక ఇస్తుందని, ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



మేఘాలయలో కరడుగట్టిన తీవ్రవాది కాల్చివేత



షిల్లాంగ్, ఫిబ్రవరి, 24 : మేఘాలయలో కరడుగట్టిన తీవ్రవాది, గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీ (జీఎన్ఎల్ఏ) చీఫ్ సోహన్ డి శిరను భద్రతా బలగాలు శనివారం మట్టుబెట్టాయి. అతని తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. ఎన్సీపీ అభ్యర్థి జొనాథన్ ఎన్ సంగ్మాను ఈనెల 18న ఐఈడీతో హతమార్చడం వెనక జీఎన్ఎల్ఏ హస్తం ఉందని భావిస్తున్నారు.



ఏప్రిల్ నుంచి ఈ-వేబిల్లుల అమలు

- 50వేలకు మించే సరుకు రవాణాకు తప్పనిసరి
- తొలి దశలో అంతర్రాష్ట్ర వాహనాలకు వర్తింపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: వస్తు, సేవాపన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చి ఆర్నెళ్లు దాటినా.. ఈ-వేబిల్లుల వ్యవస్థ ఏర్పాటు ఇంకా బాలారిష్టాలను దాటలేదు. ఈ నెల ఒకటో తేదీ నుంచే ఈ-వేబిల్లులు తప్పనిసరి అని ప్రకటించిన కేంద్రం.. సాంకేతికపరమైన వనరుల లేమి, వెబ్‌సైట్ నిర్వహణలో లోపాలతో.. ఆ నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. తాజాగా.. ఏప్రిల్ 1 నుంచి ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర మంత్రివర్గ ఉపసంఘం శనివారం నిర్ణయించింది. ఈ సమావేశంలోని ముఖ్యాంశాలను ఉపసంఘం కన్వీనర్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ మీడియాకు తెలిపారు. మార్చి 10న మంత్రివర్గ ఉపసంఘంతో జీఎస్టీ కౌన్సిల్ భేటీ కానుందని, ఆ తర్వాత అమలు తీరు, రిటర్న్స్ క్లెయిమ్‌పై స్పష్టత వస్తుందని తెలిపారు. 'ఈ-వేబిల్లులతో గూడ్స్ వాహనాల గమనాన్ని గుర్తించవచ్చు. దీనిద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. పన్ను ఎగవేతదారులకు కళ్లెం పడుతుంది. ఈ వ్యవస్థ అమలుకు సంబంధించి వనరుల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. డిమాండ్‌కు తగ్గ వేగాన్ని ఈ-వేబిల్ వెబ్‌సైట్ అందుకోవడం లేదు. ఈ కారణంగా ఫిబ్రవరి 1న ఈ వ్యవస్థ అమలవ్వలేదు. వెబ్‌సైట్ లోపాలను ఎన్ఐసీ సిబ్బంది సవరిస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు వెబ్‌సైట్‌పై పడే భారానికి సంబంధించి పరీక్షలు జరిపారు. మూడో పరీక్ష త్వరలో జరుగనుంది' అని సుశీల్ మోదీ వివరించారు. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే.. కేంద్రానికి రోజుకు రూ. 26 లక్షల నుంచి రూ. 50 లక్షల దాకా ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నామని, భవిష్యత్‌లో ఇది రూ. 75 లక్షలకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

2011 సర్వే ప్రకారం మోదీ కేర్

లబ్ధిదారుల ఎంపికకదే ప్రామాణికం

- రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ లేఖ
- పథకానికి ఖర్చయ్యేది 10 వేల కోట్లే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త ఆరోగ్య పథకానికి లబ్ధిదారులను 2011లో చేపట్టిన సామాజిక ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) వివరాల ప్రకారం ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశవ్యాప్తంగా మొత్తం 10 కోట్ల కుటుంబాలకు జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం(మోదీ కేర్) అమలు చేస్తామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే. ఈ పథకానికి లబ్ధిదారులను ఏడేళ్ల కిందటి గణనలోని ఆర్థిక వెనుకబాటు, వృత్తి వివరాల ఆధారంగా ఎంపిక చేయనున్నారు. దీనిపై అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతీ సూడాన్ లేఖ రాశారు. లబ్ధిదారులను ఆధార్ కార్డుతో ధృవీకరించాలని తెలిపారు. అయితే, ఆధార్ లేదన్న కారణంతో నిరాకరించవద్దని సూచించారు. ఖర్చులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు భరిస్తాయి. 'మోదీ కేర్'లో ప్రతి కుటుంబానికి ఏటా రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణ ఉంటుంది. కుటుంబానికి అయిదుగురు చొప్పున లెక్క వేస్తే 50 కోట్ల మంది పథకం పరిధిలో ఉంటారు. ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుంది. మోదీ కేర్ అమలుకు ఏటా కేవలం రూ.10,000 కోట్లు ఖర్చవుతాయని భావిస్తున్నారు. ఖజానాపై లక్ష కోట్ల రూపాయల భారం పడుతుందని మొదట్లో భావించారు. ఆరోగ్య శాఖతో చర్చల అనంతరం ఖర్చు రూ.10,000 కోట్లు మాత్రమే అవుతుందని అంచనాకు వచ్చినట్లు ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు. రాష్ట్రాల వాటా తీసివేస్తే కేంద్రానికి ఖర్చయ్యేది రూ.6,000 కోట్లలోపే ఉంటుంది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.